
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 6

శనివారం 29-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 6

శనివారం 29-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆర్‌సీబీ ఘన విజయం

ఐపీఎల్ మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో ఓడిన చెన్నై సూపర్ కింగ్స్ -17లో



'టాప్'లో జ్యోతి, నిత్య

నేషనల్ గ్రాండ్ ప్రి 100 మీ. హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీకి మొదటి స్థానం -17లో



డీఏ/డీఆర్ 2 శాతం పెంపు

కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు తీపికబురు.. ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ మరో 2 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

వివరాలు 6లో ▸



జేఈఈ మెయిన్స్ తేదీల్లో మార్పులు?

జేఈఈ మెయిన్స్-2 పరీక్ష తేదీలు మారే అవకాశం కన్పిస్తోంది. దీనిపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయం వెల్లడించాల్సి ఉంది.

వివరాలు 2లో ▸

న్యూస్‌రీల్

కొత్త తరానికి చెబుదాం.. పండుగ 'రుచి' చూపాలి



కొత్త తరానికి పండుగల అర్థం తెలుస్తోందా? అంటే.. 'పెద్దవాళ్లు చెబితేనే తెలుస్తుంది' అంటున్నారు ప్రముఖ రచయితలు రామ జోగయ్యశాస్త్రి, అనంత శ్రీరామ్. ఉగాది సందర్భంగా ఈ ఇద్దరూ చెప్పిన విశేషాలు..

- వివరాలు 15లో▶

రెవెన్యూ 'మాసం'



వచ్చే నెల..రాష్ట్ర రెవెన్యూ శాఖలో కీలక మార్పులకు వేదిక కాబోతోంది. రాష్ట్రంలో అధికార మార్పిడికి కారణమైందని భావిస్తున్న ధరణి చట్టం ఏప్రిల్‌లోనే చరిత్రగా మిగిలిపోనుంది.

- వివరాలు 8లో▶

ఇది కదా అసలు నిజం!



అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న 'హత్య' సినిమా ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇది కల్పిత కథ అని మేకర్స్ ప్రకటించినప్పటికీ... ఈ సినిమాలోని పాత్రలు, స్థలాలు, హత్య ఘటన, కేసు దర్యాప్తు ప్రక్రియ అన్నీ కూడా సంచలనం సృష్టించిన ప్రముఖ రాజకీయ నాయకుడు వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును పోలి ఉన్నాయి.

-వివరాలు 16లో▶



భూకంపం ధాటికి బ్యాంకాక్‌లో కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం. సహాయక చర్యలు చేపడుతున్న రెస్క్యూ సిబ్బంది

7.7 తీవ్రతతో కంపించిన భూమి

రెండు దేశాల్లో భారీగా ఆస్తి నష్టం

ప్రాణ నష్టం కూడా అపారమే!

1,000 పడకల ఆస్పత్రి నేలమట్టం

200 దాటిన మృతులు

మయన్మార్‌లోనే **180** మంది మృత్యువాత

భారత్‌లోనూ ప్రకంపనలు

అన్నివిధాలా సాయం: మోదీ

పేక మేడల్లా కుప్పకూలాయి

థాయ్‌లాండ్, మయన్మార్‌లో భారీ భూకంపం నేలమట్టమైన భవనాలు

భారీ భూకంపం థాయ్‌లాండ్, మయన్మార్‌లను అతలాకుతలం చేసింది. 7.7 తీవ్రతతో మయన్మార్‌లో సంభవించిన ప్రకంపనల ధాటికి ఇరు దేశాల్లో అపార ఆస్తి నష్టం సంభవించింది. భారీ భవనాలు కుప్పకూలాయి. మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. విధ్వంస తీవ్రత దృష్ట్యా ప్రాణ నష్టమూ భారీగానే ఉంటుందని అనుమానిస్తున్నారు. మయన్మార్‌లో 180 మందికి పైగా మరణించగా 750 మందికి పైగా గాయపడ్డారు. బ్యాంకాక్‌లో 10 మందికిపైగా మృతిచెందారు. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న మయన్మార్‌లో సహాయక, పునరావాస చర్యలు సవాలుగా మారాయి.

- వివరాలు 6లో▶


సగాయింగ్ 'ఫాల్ట్' వల్లే.. భూకంపం

6లో

నోట్లో నురగలతో ముగ్గురు చిన్నారుల మృతి


సాయికృష్ణ


మధుప్రియ


గౌతమ్

- కడుపు నొప్పి వస్తోందంటూ నిద్రలేచిన తల్లి.. నిర్జీవంగా కనిపించిన పిల్లలు.. తాము విషంలాంటిదేమీ తీసుకోలేదని పోలీసులకు చెప్పిన తల్లి
- రాత్రి షాపులో తెచ్చిన పెరుగుతో అన్నం తిన్నామని.. భర్త మాత్రం పప్పుతో తిన్నాడని వెల్లడి..
- పోస్టుమార్టం రిపోర్టు వస్తేనే ఏం జరిగిందో తెలుస్తుంది: ఎస్పీ
- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చిన్నారుల రక్త నమూనాలు

7 లో



పుట్టినరోజు నాడే ప్రాణం తీశారు

- యువకుడిని గొడ్డలితో నరికి చంపిన యువతి తండ్రి
- పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరి తోటలో పరువు హత్య

7లో



బేస్‌మెంట్ పూర్తయితే వెంటనే రూ.లక్ష

- ఇందిరమ్మ ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన గ్రామాల్లో.. ఇళ్ల గ్రౌండింగ్ పనులు వేగవంతం చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణాలు ప్రారంభించి.. బేస్‌మెంట్ వరకు పూర్తయిన వారికి రూ.లక్ష తక్షణమే ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు.

- వివరాలు 8లో



సమ్మర్‌లో సర్కారు స్పెషల్ టాస్క్

టీచర్లకు ప్రవేశ పరీక్ష

- బడుల్లో విద్యార్థులను చేర్పించేలా ప్రతి టీచర్‌కూ టార్గెట్
- ఎక్కువ మందిని చేర్పించిన వారికి పాయింట్స్
- సర్వీసు రికార్డులో చేర్చి పదోన్నతులు, బదిలీల్లో ప్రాధాన్యత
- శిక్షణ కోసం విద్యాశాఖ వేసవి శిబిరాలు
- కార్యాచరణ సిద్ధం.. జిల్లా అధికారులకు ఆదేశాలు

2 లో

1,200 ఎకరాలు.. 10 లక్షల జనం

ఏప్రిల్ 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ



- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వేదికగా భారీసభ
- సభాస్థలి, మైదానం, పార్కింగ్‌లను సందర్శించిన నేతలు
- సభ నిర్వహణకు భూములివ్వడానికి రైతుల అంగీకారం
- నేడు కేసీఆర్‌తో ఉమ్మడి వరంగల్ నేతల భేటీ

8లో

ఇదండీ వరస



ఈవీఎంలు లేకపోతే ఇదే పరిస్థితి.. లాభం లేదు వచ్చే ఎన్నికలను ఉపగ్రహం నుండి మేనేజ్ చేద్దాం సార్

ఆ పెన్ను, పేపర్ నాటితే మొక్క



నాటితే మొక్కగా మారే కాగితంతో రూపొందించిన మిస్‌వరల్డ్ నోట్‌ప్యాడ్, పెన్ను

మిస్ వరల్డ్ పోటీల్లో పర్యావరణ హిత పద్ధతులు

ఆ పెన్నును వాడేసిన తర్వాత మట్టిలో కప్పి నీళ్లు పోస్తే టమాటా మొక్క చిగురిస్తుంది.. ఆ కాగితాలు రాసేసిన తర్వాత తడిపి ముద్దచేసి మట్టిలో కలిపేస్తే బంతివనం వికసిస్తుంది.

భారీ వేడుకల్లో పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలన్న ఐక్యరాజ్య సమితి సూచనల నేపథ్యంలో హైదరాబాద్‌లో జరగబోయే మిస్ వరల్డ్ పోటీల్లో దీనిని అవలంభించబోతున్నారు.

మే నెలలో ప్రపంచ సుందరి పోటీలకు ఆతిథ్యమిస్తున్న హైదరాబాద్ కూడా ఆ పోటీల్లో అవకాశమున్న చోట్ల పర్యావరణ అనుకూల విధానాలను అవలంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా.. వినియోగించే నోట్ ప్యాడ్స్ కాగితాలు, పెన్నులను పునర్వినియోగ పద్ధతిలో రూపొందించి వాటిని వాడబోతున్నారు. కేవలం పునర్వినియోగ తయారీకే పరిమితం కాకుండా, వాడిన తర్వాత వాటిని చెత్తబుట్టలో పడేయకుండా మట్టిలో కలిపితే మొక్క పెరిగే పద్ధతితో తయారు చేస్తున్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ నగరం కేంద్రంగా కొంతకాలంగా ఇలాంటి కాగితాలు, పెన్నులు రూపొందిస్తున్న 'స్విచ్ ఎకో'సంస్థ సాయం తీసుకుంటోంది.

- సాక్షి, హైదరాబాద్

ప్రపంచస్థాయి కార్యక్రమం కావటంతో ప్రత్యేక శ్రద్ధ

టీ-హబ్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థకు వాటి సరఫరా బాధ్యత

పరిచయ కార్యక్రమంతో అంకురార్పణ

కొద్దిరోజుల క్రితం నగరంలో ప్రపంచ సుందరి పోటీల పరిచయ కార్యక్రమం జరిగింది. మిస్ వరల్డ్ సంస్థ చైర్మన్, సీఈఓ జూలియా మోర్లేతోపాటు 2024 ప్రపంచ సుందరి క్రిస్టీనా పిస్కోవాల బృందం నగరానికి వచ్చింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల పరిచయ కార్యక్రమంలో పర్యావరణ అనుకూల, మట్టిలో నాటే నోట్ ప్యాడ్, పెన్నులు అందించారు.

ఇలా నాటాలి..

- నోట్ ప్యాడ్ అట్ట భాగాల్లో బంతి గింజలు చేర్చారు. వాడేసిన తర్వాత ఆ కాగితాన్ని నీటిలో తడిపి ముద్ద చేసి మట్టిలో కప్పేయాలి. నీళ్లు పోస్తుంటే ఆ ప్రాంతంలో బంతి మొక్కలు పెరుగుతాయి.
- పెన్ను చివరి భాగంలో మొక్కజొన్న గుజ్జుతో రూపొందించిన ప్లాస్టిక్ భాగం ఉంటుంది. అందులో టమాటా, బెండ, వంగ, పాలకూర, ఆవాలు లాంటి గింజలు ఉంచుతారు. పెన్ను భాగాన్ని రీసైకిల్డ్ పేపర్ కార్డ్‌తో తయారు చేస్తారు. వినియోగించిన తర్వాత రీఫిల్ తొలగించి పెన్నును మట్టిలో కలిపేస్తే మొక్క చిగురిస్తుంది. మొక్కజొన్న వ్యర్థాలతో రూపొందించిన ప్లాస్టిక్ కావటంతో అది నిమిషాల్లోనే తడి మట్టిలో కరుగుతుందని తయారీ దారులు పేర్కొంటున్నారు.





పర్యావరణానికి ఎంతో మేలు

కాగితం, పెన్నుల తయారీలో పర్యావరణ అనుకూల విధానాలను మేం అలవంభిస్తున్నాం. ఇప్పుడు పర్యాటక శాఖకు అలాంటివి మిస్ వరల్డ్ కోసం సరఫరా చేస్తున్నాం. వినియోగించిన కాగితాలను రీసైక్లింగ్‌తో తిరిగి తయారు చేస్తున్నందున, చెట్లను రక్షించినట్టు కావటంతోపాటు, కెమికల్స్ వాడటం, నీళ్లు, విద్యుత్ వినియోగాన్ని నియంత్రించటం సాధ్యమవుతుంది. 8 వేల కాగితాల తయారీకి ఒక చెట్టు కలపను వాడాల్సి వస్తుంది. పునర్వినియోగంలో చెట్టుతో పనిలేదు. విద్యార్థి ఓ విద్యాసంవత్సరంలో సగటున 80 పెన్నులు వాడతాడు. పర్యావరణ అనుకూల పెన్నుల వినియోగంతో అంతమేర ప్లాస్టిక్‌ను నియంత్రించొచ్చు. ఇక రీసైక్లింగ్‌లో కెమికల్స్ అసవరం ఉండదు. నీళ్లు, కరెంటు వినియోగం బాగా తగ్గుతుంది. టీ-హబ్ కేంద్రంగా మా పరిశోధనలు సాగుతున్నాయి.

– అక్షయ్ దేశ్‌పాండే, స్విచ్ ఎకో సంస్థ

ప్రపంచస్థాయి వేడుక ద్వారా మంచి సందేశం

ప్రపంచస్థాయి పోటీలను వీలైనంతమేర పర్యావరణ అనుకూల పద్ధతుల్లో నిర్వహించాలన్నది ప్రభుత్వ ఆలోచన. అందుకే పర్యాటక శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్ ఈ తరహా పేపర్, పెన్నుల వినియోగానికి ప్లాన్ చేశారు. దీని ద్వారా ప్రజల్లోకి పర్యావరణ హిత సందేశం చేరుతుందని భావిస్తున్నాం.

– మామిడి హరికృష్ణ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్

క్లుప్తంగా...

సీఎం రేవంత్‌రెడ్డి @ 28

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అత్యంత శక్తిమంతుల జాబితాలో స్థానం



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక 2025 సంవత్సరానికి విడుదల చేసిన దేశంలోనే అత్యంత శక్తిమంతుల జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి స్థానం లభించింది. ఈ జాబితాలో ఆయన 28వ స్థానంలో నిలిచారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు అమిత్‌షా, రాహుల్‌గాంధీ, రాజ్‌నాథ్ సింగ్ లాంటి రాజకీయ ప్రముఖులు, పలువురు సీఎంలు, వ్యాపార దిగ్గజాలు, క్రీడాకారులు, సినీనటులు ఈ జాబితాలో ఉన్నారని శుక్రవారం సీఎంవో వెల్లడించింది. 2024 జాబితాలో 39వ స్థానంలో ఉన్న సీఎం ఈసారి 28వ స్థానానికి చేరుకున్నారు. పారదర్శక పాలనతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న కారణంగానే ఈ జాబితాలో రేవంత్‌రెడ్డికి తగిన ప్రాధాన్యం లభించిందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఈ గుర్తింపు తెలంగాణతో పాటు దేశ ప్రజల పట్ల సీఎం బాధ్యతను మరింత పెంచిందని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన అభిప్రాయపడ్డారు.

ఢిల్లీలో ఏఐసీసీ డ్రాఫ్టింగ్ కమిటీ తొలి సమావేశం

హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న భట్టి విక్రమార్క

సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా కన్వీనర్‌గా ఏర్పాటైన ఏఐసీసీ డ్రాఫ్టింగ్ కమిటీ సమావేశానికి తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. డ్రాఫ్టింగ్ కమిటీ మొదటి సమావేశం శుక్రవారం ఢిల్లీలోని అక్బర్ రోడ్‌లో ఉన్న ఏఐసీసీ కార్యాలయంలో జరిగింది. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, విధానాలు, రాజకీయ నిర్ణయాలు రూపొందించడంలో డ్రాఫ్టింగ్ కమిటీ కీలకపాత్ర పోషించనుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఏఐసీసీ కీలక సమావేశాలు జరగనున్నాయి. 8న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశాలు గతేడాది డిసెంబర్‌లో కర్ణాటకలోని బెలగావిలో జరిగిన 'నవ సత్యాగ్రహం'సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఉంటాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. కాగా, 15 మంది సభ్యులతో కూడిన డ్రాఫ్టింగ్ కమిటీని ఈనెల 24న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

సిమెంట్ కార్పొరేషన్ ప్లాంటును పునరుద్ధరించండి

కేంద్రమంత్రి కుమారస్వామికి ఎంపీ వద్దిరాజు వినతి



సాక్షి, న్యూఢిల్లీ: ఆదిలాబాద్‌లో దీర్ఘకాలికంగా మూతబడి ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్ (సీసీఐ)ను పునరుద్ధరించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈమేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖమంత్రి డి.కుమారస్వామితో భేటీ అయ్యారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేయడంలో భాగంగా నెలకొల్పిన ఈ పరిశ్రమ కొన్నేళ్లుగా మూతపడటంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వంలో కార్మిక నాయకులతో కూడిన ఒక ప్రతినిధి బృందం ఏప్రిల్ 2న ఢిల్లీ వస్తుందన్నారు. ఆ ప్రతినిధి బృందం మిమ్మల్ని కలిసేలా సమయం ఇవ్వాలని కుమారస్వామిని కోరారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి.. ప్లాంటు పునరుద్ధరణపై సమీక్షిస్తామని హామీఇచ్చారు.

టీచర్లకు 'ప్రవేశ' పరీక్ష

సమ్మర్‌లో సర్కారు స్పెషల్ టాస్క్

- బడుల్లో విద్యార్థులను చేర్పించేలా ప్రతి టీచర్‌కూ టార్గెట్
- ఎక్కువ మందిని చేర్పించిన వారికి పాయింట్స్
- సర్వీసు రికార్డులో చేర్చి పదోన్నతులు, బదిలీల్లో ప్రాధాన్యత
- శిక్షణ కోసం విద్యాశాఖ వేసవి శిబిరాలు
- కార్యాచరణ సిద్ధం.. జిల్లా అధికారులకు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: సమ్మర్‌లో సర్కారీ టీచర్లకు సరికొత్త పరీక్ష ఉండనుంది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించే పోటీని ప్రభుత్వం పెట్టబోతోంది. ఇందుకు సంబంధించి విధానపరమైన నిర్ణయం ఇప్పటికే జరిగింది. ఇందులో భాగంగా ప్రతి టీచర్‌కూ విద్యార్థులను చేర్పించేందుకు టార్గెట్ పెడతారు. ఈ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ సాధించి తీరాల్సి ఉంటుంది. ఎక్కువ మందిని చేర్పించిన వారికి పాయింట్స్ ఇస్తారు. ఇవి వారి సర్వీస్ రికార్డులోకి ఎక్కుతాయి. పదోన్నతులు, బదిలీల సమయంలో వీటిని ఒక ప్రామాణికంగా తీసుకుంటారు. ఇక విద్యార్థుల కోసం క్షేత్రస్థాయికి వెళ్ళే టీచర్లకు వివిధ స్థాయిల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. వేసవి శిబిరాలు కూడా నిర్వహించనున్నారు. ఊరూరా ప్రచారం చేపట్టాలని కూడా నిర్ణయించారు. వీటన్నింటికీ సిద్ధమవ్వాలని జిల్లా అధికారులకు విద్యాశాఖ స్పష్టం చేసింది. ఏటా వేసవిలో బడిబాట కార్యక్రమం చేపడుతున్నా..మొక్కుబడిగానే సాగుతోంది. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల చేరికలు పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

ఎందుకు తగ్గుతున్నారు?

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల చేరికలు రానురాను తగ్గుతున్నాయి. 2022–23లో 28.80 లక్షలు చేరితే, 2024–25 నాటికి ఈ సంఖ్య 25.13 లక్షలకు తగ్గింది. అంటే 3.5 లక్షలకు పైగా విద్యార్థులు తగ్గిపోయారన్న మాట. మరోవైపు ప్రైవేటు స్కూళ్ళలో ప్రవేశాలు పెరుగుతున్నాయి. 22–23లో 30.17 లక్షల మంది ఉంటే, 24–25లో ఈ సంఖ్య 37 లక్షలకు చేరింది. అంటే దాదాపుగా 7 లక్షలు పెరిగారు. ఈ పరిస్థితిపై విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీనిపై ముఖ్యమంత్రి అధికారులతో ఇటీవల సమీక్షించారు. మరోవైపు రాష్ట్ర విద్యా కమిషన్ కూడా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ప్రభుత్వ బడులపై విశ్వాసం పెంచేలా చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. ఇందులో టీచర్లూ కీలక పాత్ర పోషించేలా చూడాలని సూచించింది. ఇంకోవైపు 'ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ.80 వేలు ఖర్చు చేస్తోంది. మౌలిక వసతులూ కల్పిస్తున్నాం. ప్రైవేటు కన్నా, ప్రభుత్వ స్కూళ్ళలోనే అర్హత గల టీచర్లున్నారు. అయినా పిల్లలెందుకు చేరడం లేదు?'అని సీఎం అనేకసార్లు విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల చేరికలను విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరంలో పిల్లల చేరికలు పెరిగేలా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించింది.

ప్రభుత్వ స్కూళ్లతో లాభాలను టీచర్లు వివరిస్తారు

ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించే కార్యక్రమాన్ని ఈసారి పెద్ద ఎత్తున చేపట్టనున్నాం. సర్కారు పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం కల్పించాలన్నదే లక్ష్యం. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ళకు మధ్య ఉన్న తేడా, నాణ్యమైన టీచర్లతో బోధన వల్ల కలిగే లాభాలను ప్రతి ఊర్లోనూ టీచర్లు అర్థమయ్యేలా వివరిస్తారు. ఈ మేరకు ప్రణాళిక రూపొందిస్తున్నాం.

- ఈవీ నర్సింహారెడ్డి
(పాఠశాల విద్య డైరెక్టర్)

ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ళలో విద్యార్థుల చేరికలు ఇలా...

పాఠశాల కేటగిరీ	2022-23 ప్రభుత్వ	2022-23 ప్రైవేటు	2022-23 మొత్తం	2023-24 ప్రభుత్వ	2023-24 ప్రైవేటు	2023-24 మొత్తం	2024-2025 ప్రభుత్వ	2024-2025 ప్రైవేటు	2024-2025 మొత్తం
ప్రాథమిక	9,64,128	53,529	1,07,657	8,15,505	59,143	8,74,648	7,39,433	63,283	8,02,716
ప్రాథమికోన్నత	2,80,236	4,92,995	7,73,231	2,33,312	5,35,347	7,68,659	2,06,923	5,96,349	8,03,272
ఉన్నత	16,36,445	24,71,353	41,07,798	15,87,813	28,10,940	43,98,753	15,67,079	30,42,182	46,09,261
మొత్తం	28,80,809	30,17,877	58,98,686	26,36,630	34,05,430	60,42,060	25,13,435	37,01,814	62,15,249



నాలుగో కియో నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-25 పోటీలు గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు కరాటే దుస్తులు ధరించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

ఆస్థాన న్యాయవాది లూథ్రాకు ఫీజుల సంతర్పణం

- వైఎస్సార్‌సీపీ నేతలపై నమోదైన 4 కేసుల్లో వాదించినందుకు పెద్ద మొత్తంలో ఫీజు
- రూ.2.86 కోట్లు చెల్లించిన చంద్రబాబు ప్రభుత్వం



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు తమ ఆస్థాన న్యాయవాది సిద్దార్థ లూథ్రాకు పెద్ద మొత్తంలో ఫీజుల సంతర్పణ చేశారు. వ్యక్తిగతంగా, పార్టీపరంగా కష్టకాలంలో తనకు అండగా నిలిచినందుకు సొంత సొమ్ము కాకుండా.. ప్రజల సొమ్మును గురుదక్షిణగా చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై నమోదు చేసిన నాలుగు వేర్వేరు కేసుల్లో వాదనలు వినిపించినందుకు ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.86 కోట్లను ఫీజు రూపంలో చెల్లించింది. అందులో ఆయనకు రూ. 2.60 కోట్లు చెల్లించగా దానికి అదనంగా క్లర్కేజ్ (క్లర్కుకు చెల్లించాలంటూ) కింద 10 శాతం అంటే రూ.26 లక్షలు కలిపి మొత్తం రూ.2.86 కోట్లు చెల్లించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

ఏఐ కోర్సుల బోధనలో మార్పులు

సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌ల ఫ్యాకల్టీకి అవకాశం

- యూనివర్సిటీలకు ఏఐసీటీఈ ఆదేశం.. అవసరమైతే శిక్షణ ఇవ్వాలని సూచన

సాక్షి, హైదరాబాద్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుల బోధనలో మార్పులు తేవాలని అఖిలభారత సాంకేతిక విద్యామండలి పేర్కొంది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లు బోధించే వారికి అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని గతంలోనూ ఏఐసీటీఈ చెప్పింది. కానీ యూనివర్సిటీలు ఆచరించలేదు. దీంతో ఈసారి ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించింది. హైదరాబాద్ జేఎన్‌టీయూహెచ్‌తోపాటు అన్ని వర్సిటీలకూ ఇటీవల ఈ ఆదేశాలు అందాయి. అయితే, దీనిని ప్రభుత్వం దృష్టిలో పెట్టామని, నిర్ణయం వెలువడాల్సి ఉందని వీసీలు అంటున్నారు. బీటెక్ క్లాసులు మొదలయ్యేలోగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే డీమ్డ్ వర్సిటీలు, కొన్ని ప్రైవేట్ యూనివర్సిటీలు ఇదే బాటలో ఉన్నాయి. విశ్వవిద్యాలయాలు, అనుబంధ గుర్తింపు ఉన్న కాలేజీల్లో మాత్రం దీనిని అందుబాటులోకి తేలేదు.

ఫ్యాకల్టీ కొరత తీర్చేందుకే

రాష్ట్రంలో ఏఐ, డేటాసైన్స్, ఏఐ ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సుల్లో సీట్లు పెరుగుతున్నాయి. మరోవైపు కోర్ గ్రూపుల్లో సీట్లు తగ్గుతున్నాయి. దాదాపు వంద కాలేజీలు సివిల్, మెకానికల్, ట్రిపుల్ ఈ బ్రాంచ్‌ల్లో సీట్ల తగ్గింపునకు దరఖాస్తు చేసుకున్నాయి. కోర్ గ్రూపులకన్నా ఎమర్జ్ కోర్సుల్లోనే విద్యార్థుల చేరికలు ఎక్కువగా ఉంటున్నాయి. ప్రతీ ఏటా 68 శాతం సీఎస్‌ఈ, ఇతర కంప్యూటర్ కోర్సుల్లోనే చేరుతున్నారు. అయితే, డేటాసైన్స్, ఏఐపై బోధన చేసేందుకు ఫ్యాకల్టీ కొరత ఉంది. కొత్తగా కోర్సులు రావడం, వీటిల్లో మాస్టర్ డిగ్రీ చేసినవారు లేకపోవడంతో సమస్యగా మారింది. సీఎస్‌ఈ బోధించే వారితోనే పాఠాలు చెప్పిస్తున్నారు. అయినా, ఫ్యాకల్టీ కొరత తీరడం లేదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే నిష్ణాతులతో పాఠాలు చెప్పించేందుకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది. కానీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ముందుకు రావడం లేదు. దీంతో ఉన్న అధ్యాపకులనే ఎమర్జింగ్ కోర్సుల కోసం సిద్ధం చేయాలని భావిస్తున్నారు. వీరికి అవసరమైన ముందస్తు శిక్షణ ఇవ్వాలని ఏఐసీటీఈ సూచించింది.



ఇప్పటికైనా అనుమతించాలి

కోర్ గ్రూపులు బోధించే వారికి ఎమర్జింగ్ కోర్సులు బోధించే సామర్థ్యం ఉంటుంది. ఈ విషయాన్ని ఏఐసీటీఈ అధ్యయనం చేసి మరీ గుర్తించింది. అయినా మన రాష్ట్రంలోని యూనివర్సిటీలు అవకాశం కల్పించడం లేదు. అసలు బోధకులే లేకుండా ఎమర్జింగ్ కోర్సులు నెట్టుకొస్తున్నారు. కోర్ బ్రాంచ్‌లు తగ్గుతున్న నేపథ్యంలో అధ్యాపకులను శిక్షణ ఇచ్చి వాడుకోవాలి.

- అయినేని సంతోశ్‌కుమార్
సాంకేతిక విద్య కాలేజీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

జేఈఈ మెయిన్స్ తేదీల్లో మార్పులు?

- ఏప్రిల్ 2 నుంచి జరగాల్సిన పరీక్ష.. అదే రోజు సీబీఎస్‌ఈ పరీక్ష
- రెండూ ఎలా రాస్తామంటున్న విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్–2 పరీక్ష తేదీలు మారే అవకాశం కన్పిస్తోంది. దీనిపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయం వెల్లడించాల్సి ఉంది. వాస్తవానికి ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో రెండో విడత జేఈఈ మెయిన్స్ జరగాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన అడ్మిట్ కార్డులను శనివారం విడుదల చేస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది. అయితే ఇదే రోజు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) పరీక్ష ఉంటుంది. సీబీఎస్‌ఈ ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం ఏప్రిల్ 2న లాంగ్వేజెస్, 3న హోం సైన్స్, 4న ఫిజియాలజీ ఉంటుంది. సీబీఎస్‌ఈ పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగుతుంది. జేఈఈ మెయిన్స్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరో షిఫ్ట్ సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు ఉంటుంది. దీంతో సీబీఎస్‌ఈ పరీక్ష రాసే విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌కు హాజరయ్యే అవకాశం లేకుండా పోతుంది. లేదా మెయిన్స్ రాసే విద్యార్థులు సీబీఎస్‌ఈ పరీక్షను వదిలేయాల్సి ఉంటుంది. పలువురు విద్యార్థులు ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ అధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పరీక్ష మార్పు లేదా ప్రత్యామ్నాయాలపై నిర్ణయం ప్రకటించాలని కేంద్రం ఎన్‌టీఏకి సూచించింది.

ఉగాది తర్వాత ఏఐ సిటీకి శంకుస్థాపన

పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

- క్లియర్‌టెల్లిజెన్స్ ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ సెంటర్ ప్రారంభం



'క్లియర్ టెల్లిజెన్స్' సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, కంపెనీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఉగాది తర్వాత ఏఐ సిటీ నిర్మాణానికి మహేశ్వరంలో భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. మాదాపూర్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శుక్రవారం క్లియర్‌టెల్లిజెన్స్ ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాల అవసరాలకు అనుగుణంగా, సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలోనే 200 ఎకరాల్లో ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ సిటీ నిర్మితం అవుతుందని.. ఈ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయని మంత్రి తెలిపారు. ఏఐ, డేటా ఇంజనీరింగ్, బిజినెస్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో సేవలు అందించే క్లియర్ టెల్లిజెన్స్ సంస్థ తమ భారత శాఖను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంపై శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లియర్ టెల్లిజెన్స్ సీఈఓ ఓవెన్ ఫ్రివోడ్, మేనేజింగ్ పార్ట్‌నర్ అనిల్ భరద్వా, డైరెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పరస్పర బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు ప్రభుత్వ ఉపాధ్యాయుల పరస్పర బదిలీలకు మోక్షం లభించింది. మొత్తం 626 మందిని పరస్పర బదిలీలు చేస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెలాఖరుకు రిటైర్ అయ్యే వారికి వెంటనే బదిలీ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి వాళ్లు 15 మంది వరకు ఉంటారు. మిగిలిన వారిని ఏప్రిల్ 23వ తేదీ స్కూల్ చివరి పని దినం రోజున రిలీవ్ చేయాలని డీఈవోలను ఆదేశించారు. టెన్త్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. టీచర్లు పరస్పర బదిలీల కోసం చాలాకాలం నుంచి నిరీక్షిస్తున్నారు. టీచర్ల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం కూడా సమీక్షించింది. ఆర్థిక సంబంధం లేని అంశాలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా బదిలీలు చేపట్టారు.

మరీ ఇంత బద్ధకమా?

- ఉపకార దరఖాస్తుల్లో కొందరు విద్యార్థుల తీవ్ర నిర్లక్ష్యం
- ఏడు నెలలు గడువిచ్చినా ఇప్పటికీ దరఖాస్తుకు దూరంగా 1.7లక్షల మంది
- మే 31వరకు దరఖాస్తు గడువు పొడిగించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు ప్రక్రియలో పోస్టుమెట్రిక్ విద్యార్థులు బద్ధకం వీడడం లేదు. దరఖాస్తు కోసం నెలల తరబడి గడువు ఇచ్చినా, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా గడువు తేదీని పలుమార్లు పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల దరఖాస్తు ప్రక్రియ గతేడాది సెప్టెంబర్ 1వ తేదీన ప్రారంభమైంది. ఇంటర్ మొదలు, డిగ్రీ, పీజీ, వృత్తివిద్య, సాంకేతిక విద్య కోర్సులు చదువుతున్న విద్యార్థులు డిసెంబర్ 31లోపు ఈపాస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి. పోస్టుమెట్రిక్ విద్యార్థులు దాదాపు12 లక్షల మంది ఉంటారని సంక్షేమ శాఖలు అంచనా వేశాయి. నాలుగు నెలల పాటు అవకాశం కల్పించినా, సగం మంది విద్యార్థులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేదు. దీంతో దరఖాస్తు గడువును మార్చి 31వరకు పొడిగిస్తూ ఎస్సీ అభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తంగా ఏడు నెలల పాటు అవకాశం కల్పించినా, 10.3 లక్షల మంది మాత్రమే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా 1.7లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేదని సంక్షేమశాఖలు గుర్తించాయి. కాలేజీ యాజమాన్యాల నుంచి సేకరించిన సమాచారం అధారంగా ఆయా విద్యార్థులకు దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు నెలలు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మే 31వరకు దరఖాస్తు గడువును పొడిగిస్తూ ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

కళాశాల యాజమాన్యాల ఉదాసీనత

పోస్టుమెట్రిక్ విద్యార్థులు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు దరఖాస్తు చేసుకోవడంలో కళాశాల యాజమాన్యాల బాధ్యత కీలకం. విద్యార్థుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రత్యేకంగా కాలేజీలో ఒక వ్యక్తిని నియమించి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయించాలి. ఈ మేరకు సంక్షేమ శాఖలు కాలేజీలకు ఆదేశాలు జారీ చేశాయి. ప్రభుత్వ కాలేజీల్లో ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నా, ప్రైవేట్ కాలేజీలు మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. విద్యార్థులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి వారంతా దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సంక్షేమశాఖ అధికారులు తాజాగా కాలేజీ యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తు ప్రక్రియలో జాప్యం జరుగుతుండడంతో వాటి పరిశీలన సైతం ఆలస్యమవుతోందని సంక్షేమ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేగంగా దరఖాస్తు ప్రక్రియ పూర్తయితే కాలేజీల వారీగా పరిశీలన ప్రారంభించి వేగవంతంగా మంజూరు చేయవచ్చని సంక్షేమ శాఖ అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ ప్రక్రియలో నెలకొన్న జాప్యంతో ముందుకు సాగని పరిస్థితి నెలకొందని క్షేత్రస్థాయి అధికారులు చెబుతున్నారు. మరోవైపు వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో వారికోసమైనా గడువును పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.

నిమ్స్‌లో పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు



లక్డీకాపూల్ (హైదరాబాద్): నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహించనుంది. మిలీనియం బ్లాక్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పీడియాట్రిక్ కార్డియాక్ ఐసీయూలో ఉచితంగా పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ సేవలు అందిస్తారు. తెలంగాణ, ఏపీకి చెందిన చిన్నారులకు తల్లిదండ్రుల ఆధార్ కార్డు కానీ రోగి జనన ధ్రువీకరణ పత్రం లేదా రేషన్ కార్డు, లేదా ఆహార భద్రతా కార్డు ఆధారంగా కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మాలెంపాటి అమరేశ్ రావు మార్గదర్శకత్వంలో ఈ శస్త్రచికిత్సలు నిర్వహిస్తారు. మరింత సమాచారం కోసం కార్డియోథొరాసిక్ నిపుణుడు డాక్టర్ అమరేశ్‌రావుతో పాటు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్‌లను నిమ్స్ పాత భవనం, మొదటి అంతస్తులోని వార్డు 6లో సంప్రదించవచ్చు. గుండె ఆపరేషన్ అవసరమైన పిల్లల తల్లిదండ్రులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు నేరుగా కానీ, 7893337836 నంబర్‌లో ఫోన్ ద్వారా కానీ సంప్రదించవచ్చు. నిమ్స్ సంచాలకుడు డాక్టర్ బీరప్ప ఈ చికిత్సలను పర్యవేక్షిస్తారని శుక్రవారం నిమ్స్ మీడియా ఇన్‌చార్జి సత్యాగౌడ్ తెలిపారు.

ఆ మూడేళ్ల పన్ను.. 31లోపు చెల్లిస్తే నో పెనాల్టీ

జరిమానా, వడ్డీలను మినహాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తొలి మూడేళ్ల కాలంలో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగా పన్ను చెల్లించలేకపోయిన డీలర్లకు ప్రభుత్వం తాజాగా వెసులుబాటు కల్పించింది. 2017–18, 2018–19, 2019–20 సంవత్సరాలకు గాను పన్ను చెల్లించలేకపోయిన డీలర్లు.. ఈనెల 31లోపు ఆ పన్ను చెల్లిస్తే జరిమానా, వడ్డీలను మినహాయించనుంది. ఈ మేరకు ఈనెల 30వ తేదీ వరకు జీఎస్టీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని, 31లోపు పన్ను చెల్లించాల్సి ఉంటుందని, అలా చెల్లించిన పన్నుకు వడ్డీ, జరిమానా మినహాయింపు ఇస్తామని కేంద్ర జీఎస్టీ, కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ హరితలు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పన్ను చెల్లింపునకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు డీలర్లు తమ పరిధిలోని జీఎస్టీ అధికారులను సంప్రదించాలని, అప్పిలేట్ అథారిటీతో పాటు కోర్టులు మదింపు చేసి విధించిన పన్నుకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుందని ఆ ప్రకటనలో సందీప్ ప్రకాశ్, హరితలు వెల్లడించారు.



తాగునీటిపై మండలం యూనిట్‌గా కమిటీలు

అధికారులకు పీఆర్ మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: తాగునీటి సమస్యలు లేకుండా పర్యవేక్షించేందుకు మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఎంపీడీవో, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఏఈలతో కలిపి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ కమిటీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. 'వరుసగా పండగలు వస్తున్నాయి. ప్రజలంతా ఊర్లలోనే ఉంటారు. మూడు రోజులపాటు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రావొద్దు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునే విధంగా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నాం' అని తెలిపారు. శుక్రవారం మిషన్‌భగీరథ కార్యాలయంలో జిల్లాల వారీగా తాగునీటి సరఫరాపై సీఈ, ఎస్ఈ, ఈఈ, డీఈలతో మంత్రి సీతక్క సమీక్షించారు. అంతకుముందు మిషన్ భగీరథ కార్యాలయంలో మంత్రి సీతక్క అధ్యక్షతన మిషన్‌భగీరథ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌ను పునర్‌వ్యవస్థీకరిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఈ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ బోర్డుకు పీఆర్ మంత్రి సీతక్క చైర్మన్ కమ్ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. వీసీ అండ్ ఎండీగా పీఆర్ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్లుగా స్పెషల్ సీఎస్ కె.రామకృష్ణారావు, టీకే శ్రీదేవి, డా.జి సృజన, ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, జి.అనిల్‌కుమార్ తదితరులను నియమితులయ్యారు. మండలకేంద్రాలు, పల్లెల్లో 4818 చలివేంద్రాలను ఏర్పాటు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ నిర్ణయం తీసుకుంది.

ఏప్రిల్ 5లోపు టీజీసెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఐదో తరగతి ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న నిర్వహించిన టీజీసెట్–2025 ఫలితాలు వచ్చేనెల 5వ తేదీలోపు విడుదల చేయనున్నట్లు సెట్ కన్వీనర్ అలగు వర్షిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు ఈ అర్హత పరీక్ష ఫలితాలే ప్రామాణికమని స్పష్టం చేశారు.

పేదల జీవితాల్లో ఉగాది నుంచి విప్లవాత్మక మార్పు

ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయనున్న సర్కారు

- రేపు హుజూర్‌నగర్‌లో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- రాష్ట్రంలో 85 శాతం జనాభాకు అందనున్న సన్న బియ్యం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఉగాది నుంచి రాష్ట్రంలోని పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రాబోతుందని, ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించనుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారని, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అన్ని రేషన్ దుకాణాల ద్వారా ఆహార భద్రతా కార్డులున్న అందరికీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

రూ.2,800 కోట్ల అదనపు భారం

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు ఇస్తున్న రేషన్ బియ్యం దొడ్డు రకం కొందరు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో పేదలు, మధ్యతరగతి వర్గాలు సహా ప్రతీఒక్కరు తినేందుకు వీలుగా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నాం. రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్న బియ్యం అందబోతున్నాయి. ఎక్కడ రేషన్ కార్డు ఉన్నా, ఏ దుకాణం నుంచైనా రేషన్ తీసుకోవచ్చు. కొత్తగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేరు జాబితాలో ఉంటే కార్డు లేకపోయినా సన్నబియ్యం అందజేస్తాం. కొత్తగా క్యూఆర్ కోడ్‌తో కూడిన రేషన్ కార్డులు ఇవ్వబోతున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో 90 లక్షల కార్డులు ఉండగా, 2.85 కోట్ల లబ్ధిదారులు ఉన్నారు. వీరికి బియ్యం పంపిణీ చేసేందుకు అవుతున్న రూ.10,665 కోట్ల వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భరిస్తున్నాయి. అయి తే ప్రస్తుతం సన్నరకం బియ్యం పంపిణీ చేయడం వల్ల రూ.13,523 కోట్లు వెచ్చించాల్సి వస్తుంది. ఇందులో కేంద్రం రూ.5,489 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.8,033 కోట్లు భరిస్తాయి. రాష్ట్రంపై అదనంగా రూ.2,800 కోట్ల భారం పడుతుంది. దీనిని భరించాల్సిందిగా కేంద్రాన్ని సీఎం కోరారు.' అని మంత్రి చెప్పారు.

కొత్తగా 30 లక్షల మంది లబ్ధిదారులు

'రాష్ట్రం ఏర్పాటైనప్పుడు 89,73,708 కార్డులు ఉంటే పదేళ్లలో కొత్తగా ఇచ్చిన కార్డులు, తొలగించిన కార్డులు లెక్కిస్తే ప్రస్తుతం అదనంగా 49,479 కార్డులు మాత్రమే ఉన్నాయి. అంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప ఎన్నికలు వచ్చినప్పుడు ఇచ్చిన కార్డులన్నీ కలిపినా 50 వేలు దాటలేదని అర్థమవుతోంది. మా ప్రభుత్వం కొత్తగా 30 లక్షల మందిని లబ్ధిదారులుగా చేర్చి కార్డులు జారీ చేయనుంది. త్వరలోనే బియ్యంతో పాటు పప్పు, ఉప్పు లాంటి నిత్యావసర వస్తువులు కూడా రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తాం. కొత్తగా ఇచ్చే రేషన్ కార్డుపై ప్రధాని ఫొటో ముద్రించడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కానీ అవసరమైతే పెట్టేందుకు మాకేమీ అభ్యంతరం లేదు..' అని ఉత్తమ్ చెప్పారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం రూ. 1,074 కోట్లు

- 3.14 లక్షల దరఖాస్తులు... శుక్రవారం ఒక్కరోజునే రూ.100 కోట్ల రాబడి
- ఈ నెల 31న ముగియనున్న ఎల్‌ఆర్‌ఎస్ గడువు... మరోసారి పొడిగించే యోచనలో ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: అనధికార లేఅవుట్‌లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటి వరకు రూ.1,074 కోట్ల ఆదాయం సమకూరింది. శుక్రవారం ఒక్కరోజునే రూ.100 కోట్ల ఆదాయం వచ్చినట్టు అధికారవర్గాల సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25 లక్షల దరఖాస్తులు గతంలో వస్తే.. ప్రభుత్వ స్థలాల్లోని, నాలాలు, చెరువులు, కుంటలకు ఆనుకొని ఉన్న వాటిని ఎల్‌ఆర్‌ఎస్ నుంచి మినహాయించారు. ఆ తర్వాత ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హమైనవి 18 లక్షలుగా తేల్చి, వారికి ముందస్తు సమాచారం ఇచ్చారు. ప్లాటు విస్తీర్ణం ఆధారంగా వారికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును నిర్ణయిస్తూ 18 లక్షల మందికి ముందస్తు నోటీసులు జారీ చేశారు. అందులో ఇప్పటివరకు 3.14 లక్షల మంది నోటీసులకు స్పందించి డబ్బు చెల్లించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. మార్చి 31వ తేదీలోగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం చెల్లించే ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. 2020–2024 మధ్య కాలంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఫీజులు చెల్లించినవారు కేవలం 14 వేల మంది మాత్రమే కాగా.. గడిచిన 28 రోజుల్లో సుమారు 2.98 లక్షల మంది ఫీజులు చెల్లించారు. సుమారు మరో 15 లక్షల మంది దరఖాస్తులు ఇంకా ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఫీజు చెల్లించకుండా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా పెద్దఎత్తున ఆదాయం లభిస్తుందని ఆశించినా.. రూ.1,074 కోట్ల ఆదాయం మాత్రమే రావడంతో ఈ గడువును మరోసారి పొడిగించే యోచన చేస్తున్నట్టు సమాచారం. ఈ మధ్య రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతానికి పొడిగింపు యోచన లేదని చెప్పినా, ఆశించిన మేరకు ఆదాయం రాని కారణంగా పొడిగింపు ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవైపు ఆస్తిపన్ను వసూళ్ల నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై మునిసిపాలిటీల్లో ఎక్కువ దృష్టి పెట్టడం లేదని, మరో 15 రోజులు లేదా నెలరోజులు పొడిగించే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.





బావి నిండుగవున్న నీరు ఏ విధంగా నిత్యము తాగుటకు ఉపయోగపడుచున్నదో, ఆ విధంగానే సర్వ వేదముల నుండి కూడా మనకు నిత్య ఉపయోగం కలదని బ్రహ్మజ్ఞానియైన వానికి తెలియును.

– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 29 మార్చి 2025

పెను ఉత్పాతం

భూమిని గురించి చెబుతూ ప్రఖ్యాత కవి దేవిప్రియ అది 'మధ్యమధ్యలో మతిభ్రమించే/ మమతానురాగాల మాతృమూర్తి' అంటారు. సకల సంపదలకూ పుట్టిల్లయిన నేలతల్లి ఎందుకనో ఆగ్రహించింది. శుక్రవారం మధ్యాహ్నం రిక్టర్ స్కేల్‌పై 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపాల పరంపర మయన్మార్, థాయ్‌లాండ్‌లను తీవ్రంగా దెబ్బతీయగా... మయన్మార్ ఇరుగు పొరుగున్న భారత్, చైనాలను భూప్రకంపనలు వణికించాయి. ఈశాన్య భారత్, బెంగాల్, ఢిల్లీ తదితర చోట్ల ప్రకంపనలు కనబడగా, చైనాలో యునాన్, సిచువాన్ ప్రాంతాలు దీని బారినపడ్డాయి. ఈ భూప్రళయం ఒక్కసారిగా జనజీవనాన్ని తలకిందులు చేసింది. మృతులెందరన్న లెక్క వెంటనే తేలడం కష్టం. ఎందుకంటే కోటి 70 లక్షల జనాభాగల థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఆకాశాన్నంటే భవనాలు చాలా వున్నాయి. వాటిల్లో అనేకం నేలమట్టమయ్యాయి. వేలాదిమంది ఇరుక్కుపోయారు. వర్తక, వాణిజ్య, ఉత్పాదక కార్యకలాపాలు ముమ్మరంగా సాగే వేళ భూకంపం రావటం ప్రాణనష్టాన్ని పెంచివుండొచ్చన్న అంచనాలున్నాయి. మయన్మార్‌లో సైనిక పాలనవల్ల పరిస్థితి తీవ్రత తెలియటం లేదంటున్నారు. అయితే భూకంప కేంద్రం ఆ దేశంలోని రెండో పెద్ద నగరమైన మాండలేకు సమీపంలో వుండటం, భూగర్భంలో 20– 30 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించటాన్నిబట్టి నష్టం ఎక్కువుంటుందన్నది భూభౌతిక శాస్త్రవేత్తల అంచనా. నిరంతర ఘర్షణలతో అట్టుడుకుతున్న ఆ దేశంలో ఇప్పటికే 30 లక్షలమంది కొంపా గోడూ వదిలి అత్యంత దుర్భరమైన స్థితిలో బతుకీడుస్తున్నారు. ఒక్కో పట్టణం ఒక్కో సాయుధ ముఠా గుప్పిట్లో వుంది. ఇవిగాక సైన్యం అడపా దడపా వైమానిక దాడులు చేస్తోంది. ఈ భూకంపం ఆ దేశ జనాభాలో మూడోవంతు మందిని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం వున్నదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించింది.

మిగిలిన వైపరీత్యాలు విరుచుకుపడే ముందు ఏదో రకమైన సూచనలందిస్తాయి. జాగ్రత్త పడటానికి కాస్తయినా వ్యవధినిస్తాయి. కానీ భూకంపాలు చెప్పా పెట్టకుండా విరుచుకుపడతాయి. రెప్పపాటులో సర్వం శిథిలాల కుప్పగా మారుతుంది. అపార ప్రాణనష్టం వుంటుంది. తప్పించుకున్నవారిని సైతం తీవ్ర భయోత్పాతం వెన్నాడుతుంది. భూమి లోలోతు పొరల్లో అనునిత్యం మార్పులు సంభవిస్తూనే వుంటాయి. భూభౌతిక శాస్త్రవేత్తలు చెబుతున్నదాన్నిబట్టి భూగర్భం ఏడు పలకలుగా విడివడి వుంటుంది. వీటిల్లో వచ్చే కదలికలూ, అవి తీసుకొచ్చే రాపిడులూ పర్యవసానంగా ఆకస్మికంగా శక్తి విడుదలవుతుంటుంది. ఆ శక్తి తరంగాల రూపంలో భూ ఉపరితలానికి చేరుతుంది. అది భూకంపం రూపంలో వ్యక్తమవుతుంది.

భూకంపం మనిషి జ్ఞానాన్ని పరిహసించే ప్రకృతి విపత్తు. ఖగోళంలో మానవుడు సాధించిన ప్రగతి అంతా ఇంతా కాదు. అక్కడ జరిగే పరిశోధనలు అన్నీ ఇన్నీ కాదు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా 2018లో ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్ నిరుడు డిసెంబర్ 24న సూర్యుడి ఉపరితలానికి 60 లక్షల కిలోమీటర్ల దూరంలో పరిభ్రమించింది. ఇది అత్యంత సమీపం వరకూ వెళ్లినట్టు లెక్క. కానీ కాళ్లకింద పరుచుకున్న భూమి లోలోతు పొరల్లో ఏం జరుగుతున్నదో ఆరా తీయటంలో వైఫల్యాలే ఎదురవుతున్నాయి. భూకంపాలపై సాగుతున్న పరిశోధనలు గతంతో పోలిస్తే ఎంతో కొంత ప్రగతి సాధించాయనే చెప్పాలి. ఫలానాచోట భూకంపం రావొచ్చని చెప్పగలిగే స్థాయి వచ్చింది. కానీ అది నిర్దిష్టంగా ఎప్పుడు, ఎక్కడ వస్తుందో చెప్పటం మటుకు సాధ్యం కావటం లేదు. ఏడెనిమిదేళ్ల క్రితం దక్షిణ కాలిఫోర్నియా, దక్షిణమధ్య అలస్కా ప్రాంతాల్లో చాలా తక్కువస్థాయి ప్రకంపనలు నమోదైనప్పుడు భూ పొరల్లో ఏదో జరుగుతున్నదని, భూకంపం వచ్చే ప్రమాదమున్నదని శాస్త్రవేత్తలు ఊహించారు. ఆ తర్వాత ఉత్పాతం చోటుచేసుకుంది. అయితే సంభావ్యతను 85 శాతం వరకూ ఊహించవచ్చని, నిర్దిష్ట సమయాన్ని చెప్పటం అసాధ్యమని అంటున్నారు. ఇందులో చిక్కేమంటే... ముందే చెబితే జనం భయాందోళనల్లో కాలం వెళ్లదీస్తారు. ఆర్థిక కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఆ తర్వాత అంచనాలు తప్పితే అనవసర భయాందోళనలు సృష్టించారని శాస్త్రవేత్తలను తప్పుబడతారు.

ప్రకృతిని గౌరవించటం నేర్చుకోనంతవరకూ ఇలాంటి వైపరీత్యాలు తప్పవు. వాతావరణ కాలుష్యం, నానాటికీ పెరుగుతున్న భూతాపం, అడవుల విధ్వంసం, అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా కొండలు తొలిచి రైలు, రోడ్డు మార్గాలు నిర్మించటం, జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణం వంటివి ప్రకృతిని నాశనం చేస్తున్నాయి. ఇవన్నీ సముద్ర మట్టాలు పెరగటానికీ, వరదలకూ దారితీసి భూమి లోలోపలి పొరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముప్పును వేగవంతం చేస్తున్నాయి. ఎంఐటీ శాస్త్రవేత్తలు జపాన్‌లోని నోటో ద్వీపకల్పంలో సాగించిన పరిశోధనల ఫలితాలు దీన్నే చాటుతున్నాయి. 2020కి ముందు అక్కడ ఒకటీ అరా వచ్చే భూకంపాలు స్వల్పస్థాయిలోవుంటే... ఆ తర్వాతి కాలంలో వాటి సంఖ్య పెరగటంతోపాటు తీవ్రత ఎక్కువ కావటాన్ని వారు గమనించారు. ఇదంతా అక్కడి వాతావరణ మార్పులవల్లేనని అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిశోధనలు ప్రభుత్వాల కళ్లు తెరిపించాలి. అభివృద్ధి పేరుతో అమలవుతున్న నమూనాలను మార్చుకోవాలి. అలాగే భూకంపాలు వాటికవే ప్రాణాలు తీయవు. బలహీనమైన కట్టడాలు, బహుళ అంతస్తుల భవనాలు ముప్పునుంచి బయటపడే మార్గాలను మూసేస్తున్నాయి. ఇలాంటి నిర్మాణాలకు అనుమతులిచ్చేటపుడు ప్రభుత్వాలు ఈ అంశాలను గమనంలోకి తీసుకోవటం అవసరం.

భాషా రాజకీయాల ఆట

విశ్లేషణ



నిరుపమా సుబ్రమణియన్

తమిళనాడు తన బడ్జెట్ ప్రమోషనల్ లోగోలో భారత కరెన్సీ సింబల్‌కు బదులుగా తమిళ అక్షరం 'రూ' వాడి దేశవ్యాప్తంగా దుమారం లేవనెత్తింది. ఈ చర్య కేవలం సింబల్ వివాదం కాదనీ, ఇది భారత సమైక్యతను బలహీనపరుస్తుందనీ, ప్రాంతీయ అభిమానం మాటున వేర్పాటువాద సెంటిమెంటును రెచ్చగొడుతుందనీ విమర్శిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే మాజీ చట్టసభ్యుడి తనయుడు, గువాహటి ఐఐటీలో డిజైనర్ అయిన ఒక తమిళ వ్యక్తి రూపకల్పన చేసిన సింబల్‌ను తిరస్కరించడం డీఎంకే 'మందబుద్ధి'ని బయటపెడుతోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కె.అన్నామలై అభివర్ణించారు.

తమిళంలో రూపాయి గుర్తుకు తమిళ అక్షరం 'రూ' వాడటం సహజమే. మూడు భాషలను ప్రతిపాదించిన ఎన్‌ఈపీ 2020 పట్ల అసమ్మతిని ప్రజల్లోకి తీసుకువెళ్లడమే బడ్జెట్ పత్రాల్లో రూపాయి సింబల్‌కు బదులుగా తమిళ 'రూ' అక్షరం వాడటం వెనుక డీఎంకే ఉద్దేశం. ఏడాదిలో రాష్ట్ర ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ముఖ్యమంత్రి స్టాలిన్ భాషాదురహంకారాన్ని రెచ్చగొడుతున్నారని బీజేపీ విమర్శిస్తోంది.

తమిళ సెంటిమెంట్ ఆందోళన

హిందూ అహంకారం పతాకస్థాయికి చేరిన తరుణంలో అస్తిత్వ పోరుకు నడుం బిగించిన రాజకీయ నాయకుడు నిజానికి డీఎంకే అధినేత ఒక్కరే కాదు. అయితే ఒక్క డీఎంకే మీద మాత్రమే బీజేపీ నేతలు శ్రుతి మించిన ఆగ్రహావేశాలు ప్రదర్శించడం చూస్తే, ఆ పార్టీని టార్గెట్ చేస్తున్నారని అనుకోవాలి. మతం ప్రాతిపదికగా వ్యక్తులను అవమానించడం, ద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం దేశ సమైక్యతకు ముప్పుగా భావించే రోజు ఎప్పుడు వస్తుంది?

రెండోసారి అధికారం చేజిక్కించుకోవడానికి స్టాలిన్ సన్నద్ధం అవుతున్నారు, వాస్తవమే! ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వాన్ని మార్చేయడం తమిళనాడు అలవాటు. ఈ సింగిల్ టర్మ్ ఆనవాయితీని భగ్నం చేసింది జయలలిత ఒక్కరే! 2016లో ఆమె ఏఐఏడీఎంకేను రెండో టర్మ్ అధికారంలోకి తెచ్చారు. ఈ సెంటిమెంటుతో పాటు నటుడు విజయ్ నాయకత్వంలో ఏర్పడిన తమిళగ వెట్రి కళగం పార్టీ సైతం డీఎంకేకు ఆందోళన కలిగిస్తోంది.

బీజేపీ లేదా మరో ఇతర పార్టీ రానున్న ఎన్నికలకు అజెండా సెట్ చేసేవరకూ డీఎంకే వేచి చూడదలచుకోలేదు. భాష, నియోజకవర్గాల పునర్విభజన అస్త్రాలను బయటకు తీసింది. రాష్ట్రంలో ఏ మూలైనా ఈ అంశాల మీదే మాట్లాడుకుంటున్నారు. ప్రతిపక్ష ఏఐఏడీఎంకే, విజయ్‌లు... ఈ రెండు అంశాల మీద డీఎంకే పార్టీకి మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. గ్రహస్థితులు అనుకూలిస్తే, రానున్న ఎన్నికల్లో బీజేపీతో మళ్లీ కూటమి కట్టే అవకాశాలున్న ఏఐఏడీఎంకే ఇప్పుడు పులుసులో పడింది. 2020లో అధికారంలో ఉన్నప్పుడు ఎన్‌ఈపీకి వ్యతిరేకంగా తొలి శంఖం పూరించిన పార్టీ ఇదే.

హిందీని నిర్దేశించకపోయినా...

హిందీ వ్యతిరేక రాజకీయాల్లో తమిళనాడుకు వందేళ్ల చరిత్ర ఉంది. మూడు భాషల సూత్రానికి అంగీకరిస్తేనే రాష్ట్రానికి కేంద్ర విద్యానిధులు విడుదల చేస్తామని ప్రకటించి, నిద్రాణంగా పడి ఉన్న ఒక జటిల సమస్యకు బీజేపీ ఎందుకు తిరిగి ప్రాణం పోసింది? ఇది అంతుచిక్కని విషయం. 'హిందీకరణ' ఇండియా పట్ల తన మక్కువను వెల్లడిస్తూ ఆ పార్టీ సంకేతాలపై సంకేతాలు ఇస్తోంది. వలసవాద అవశేషాలు తుడిచిపెట్టాలన్న మిషతో ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ పేర్లను హిందీలోకి మార్చడం ఇందుకు ఉదాహరణ. ఇంతా చేసి ఇప్పుడు వెనకడుగు వేస్తే రాజకీయ బలహీనత అవుతుందేమో అన్నది బీజేపీ డైలమా.

మూడో భాష హిందీయే అవ్వాలని ఎన్‌ఈపీ ఆంక్ష పెట్టని మాట నిజమే. ఆచరణలో మాత్రం మూడో భాష హిందీనే అవుతుంది. లెక్కలేనన్ని మూడో భాషలను బోధించే టీచర్లను నియమించడం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థికంగా తలకు మించిన భారం. పైగా ఎక్కడెక్కడి నుంచో వారిని తీసుకురావడం మరీ కష్టం. స్కూళ్లలో హిందీ బోధించడం తప్ప గత్యంతరం లేదు. ఇదో దుఃస్థితి. తమిళనాడులో కూడా మలయాళం, కన్నడం, తెలుగు టీచర్ల కంటే హిందీ బోధించేవారిని నియమించుకోవడం సులభం.

సరికొత్త ప్రచారకర్త

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'వాళ్లు ఆర్థిక లాభాలు ఆశించి ఎందుకు తమిళ చిత్రాలను హిందీలోకి డబ్ చేస్తున్నారు?' అంటూ ఒక తప్పు ప్రశ్న వేస్తున్నారు. దక్షిణాదిన హిందీకి, హిందుత్వకు సరికొత్త ప్రచారకర్తగా మారిన ఈయన డీఎంకేది 'హిపోక్రసీ' అని కూడా నిందిస్తున్నారు. ఒక్కమాటలో ఈ ప్రశ్నకు సమాధానం చెప్పవచ్చు. తమిళనాడు హిందీకి వ్యతిరేకం కాదు. దాని వ్యతిరేకత అంతా హిందీని బలవంతంగా రుద్దడం మీదే!

ఆశ్చర్యం ఏమిటంటే, తమిళనాడులో లక్షల మంది స్వచ్ఛందంగా హిందీ నేర్చుకుంటారు. ఏ రాజకీయ పార్టీ నాయకుడూ వారిని అడ్డుకోడు. హిందీ తప్ప మరో భాష మాట్లాడని లక్షల మంది ఉత్తర భారతీయులు ఉపాధి కోసం తమిళనాడు రావడం నాణానికి రెండో పార్శ్వం. ఉత్తరప్రదేశ్ లేదా బిహార్ స్కూళ్లలో తమిళం నేర్చుకోరు. తమిళనాడులో ఉపాధి కోసం తమిళం నేర్చుకోవాలని వారిని ఎవరూ ఒత్తిడి చేయరు. హిందీ మాట్లాడటానికి వ్యతిరేకంగా ఎలాంటి ఆంక్షా లేదు. అందరూ వారికి అర్థమయ్యేలా చెప్పడానికి వచ్చీరాని హిందీలో ప్రయత్నించి సహకరిస్తారు.



స్టాలిన్ (డీఎంకే), విజయ్ (టీవీకే), అన్నామలై (బీజేపీ)

- ఏడాదిలో రాష్ట్ర ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ భాషాదురహంకారాన్ని రెచ్చగొడుతున్నారని బీజేపీ విమర్శిస్తోంది.
- భాష, నియోజక వర్గాల పునర్విభజన... ఈ రెండు అంశాల మీద ప్రతిపక్ష ఏఐఏడీఎంకే, విజయ్ 'టీవీకే'... డీఎంకేకు మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది.
- మూడో భాష హిందీయే అవ్వాలని జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ) ఆంక్ష పెట్టని మాట నిజమే. ఆచరణలో మాత్రం మూడో భాష హిందీనే అవుతుంది.

చెన్నైలో ఏ రెస్టారెంటుకి వెళ్లినా మీకో దృశ్యం కనబడుతుంది. ఉత్తరాది వెయిటర్, తమిళ కస్టమర్ పరస్పరం ఎదుటి వారి భాషలో మాట్లాడుతారు. ఆ సంభాషణ ఎలా ఉన్నా ఆర్డర్ చేసిన ఆహారం రాకుండా పోదు. అదే తరహాలో హిందీ, తమిళ సినిమా పరిశ్రమల నడుమ విలసిల్లుతున్న చిరకాల సహకారం పవన్ పేర్కొంటున్నట్లు హిపోక్రసీ కాదు. ఆర్థికం కావచ్చు, సామాజిక కారణాలు కావచ్చు... ప్రజలు స్వచ్ఛందంగా చేరువ అవుతారనడానికి ఇదో ఉదాహరణ.

దొడ్డిదారినో మరో అడ్డదారినో ఒక భాషను బలవంతంగా రుద్దడం ఎప్పుడూ, ఎక్కడా సుఖాంతం కాలేదు. తమిళనాడు హిందీ వ్యతిరేక ఉద్యమాలు ఈ విషయంలో తగినంత గుణపాఠం నేర్పలేదు. పొరుగు దేశాల పరిణామాలు దీన్ని రుజువు చేస్తాయి. ఒకే భాష ద్వారా జాతీయ సమైక్యత సాధించాలన్న రాజకీయాలు చావు దెబ్బ తిన్నాయి. పాకిస్తాన్ ఇందుకు చక్కటి ఉదాహరణ. 1947లో ఏర్పాటై సంబరాలు జరుపుకొన్న కొద్ది నెలల్లోనే ఉర్దూను జాతీయ భాషగా ప్రకటించింది. ఆనాడే వాస్తవంగా ఆ దేశం తన తూర్పు ప్రాంతాన్ని కోల్పోయింది. ఉర్దూకి వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం 1971లో, ఇండియా తోడ్పాటు లభించి, దేశవిభజనతో సమసింది. 'సింహళ ఒక్కటే' శాసనంతో... సింహళీయులకు తమిళులకు నడుమ ఉన్న విభేదాలు ఒక్కసారిగా పతాకస్థాయికి చేరాయి. అదే 30 ఏళ్ల సుదీర్ఘ అంతర్యుద్ధానికి దారితీసింది.

డీఎంకే అన్ని అంశాల్లోనూ, ఎన్‌ఈపీతో సహా, కేంద్రంతో సంప్రదింపుల ధోరణితోనే వ్యవహరిస్తోంది. 'రూ' తమిళ అక్షరం వాడిందన్న సాకుతో ఆ పార్టీని 'వేర్పాటువాది'గా అభివర్ణించడంతో బీజేపీ నైజం వెల్లడైంది. సర్వం కేంద్రం అధీనంలోకి తెచ్చుకోవాలన్న వీరావేశం, తనను వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీల పట్ల దాని వైఖరి బట్టబయలు అయ్యాయి. చరిత్ర పట్ల ఆ పార్టీ నిర్లక్ష్య భావం కూడా బయటపడింది. ఇదే అన్నిటి కంటే ప్రమాదకరం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

దారుణ కంపనం



థాయిలాండ్, మయన్మార్ భూప్రకంపనలు ఈశాన్య భారతాన్ని కూడా తాకాయి. ఇలాంటి భూకంపాన్ని నేను ఎప్పుడూ చూడలేదు, అనుభవించలేదు.

– రామి నిరంజన్ దేశాయి, ఆంత్రోపాలజిస్ట్

చెప్పుకోవాలంతే!



ఇండియా జీడీపీ 2014–24 మధ్య 7.2 వృద్ధి రేటుతో 2.1 ట్రిలియన్ డాలర్ల నుంచి 4.2 ట్రిలియన్ డాలర్లకు ఎలా రెట్టింపు అయ్యిందో చెబుతూ చాలామంది బీజేపీ మద్దతుదారులు సంబరం చేసుకుంటున్నారు. కానీ నేనొకటి చెబుతాను: 2004–14 మధ్య ఇండియా జీడీపీ 11.6 శాతం వృద్ధి రేటుతో 0.7 ట్రిలియన్ డాలర్ల నుంచి 2.1 ట్రిలియన్ డాలర్లకు మూడు రెట్లు పెరిగింది. మోదీ మార్కెటింగ్ నైపుణ్యంలో మన్మోహన్‌కు కొంచెమైనా ఉంటేనా!

– డి. ముత్తుకృష్ణన్, ఫైనాన్షియల్ ప్లానర్

మహా కథ



క్వాంటమ్ సైన్స్, మార్మికవాదాన్ని ఎంత చదివితే అంత అర్థమయ్యేది ఏమంటే, ఏదీ ప్రారంభం కాలేదు, ఏదీ అంతం కాలేదు. కాలం అనేది మనిషి కల్పన. అందుకే ఉత్తమ కథలు ఒక అంతాన్ని సూచిస్తాయి. అదేసమయంలో అవి ఇచ్చే జవాబుల కంటే ఎన్నో ప్రశ్నల్ని రేకెత్తిస్తాయి. క్వాంటమ్ కథా పద్ధతికి మహాభారతం గొప్ప ఉదాహరణ.

– శేఖర్ కపూర్, దర్శకుడు

వాళ్ల కోణంలో...



మీడియా దేన్నయినా 'తప్పుడు సమాచారం' అని చెబుతున్నదంటే, సాధారణంగా వామపక్షీయులకు ఆ సమాచారం నచ్చదని అర్థం.

– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

ఆలోచనతో ముడివడి...




జీవితంలో వచ్చే చాలా సమస్యలకు రెండు కారణాలు ఉంటాయి: మనం ఆలోచించకుండా పనులు చేస్తాం లేదా ఆలోచిస్తాం కానీ పనికి పూనుకోం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

పెన్షనర్లకు తీరని అన్యాయం

అభిప్రాయం



తారానాథ్ మురాల

ఆర్థిక బిల్లులో భాగంగా లోక్‌సభలో కేంద్ర పెన్షనర్ల రూల్స్‌లో కీలకమైన మార్పును కేంద్రం మార్చి 25న ఆమోదింపచేసుకుంది. రాజ్యసభలో ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టం అవుతుంది. పెన్షనర్లను పాత, కొత్త పెన్షనర్లుగా విడదీయటం ఈ బిల్లులోని ముఖ్య విషయం. సాధారణంగా ఒక వేతన సంఘం ఏర్పాటు జరిగితే ఉద్యోగులు, పెన్షనర్లు తమ తమ జీతభత్యాలు, పెన్షన్ పెరుగుతుందని ఆశించడం సహజం. అయితే ఇప్పుడు కేంద్రం చేసిన పెన్షన్ రూల్సు లోని ప్రధాన మార్పు ఏమిటంటే, వేతన సంఘం ఏర్పాటు, దాని సిఫార్సులు అమలు లోకి వచ్చే తేదీ తరువాత రిటైరయ్యే ఉద్యోగికి మాత్రమే పెన్షన్ చెల్లింపులో వేతన సంఘం చేసిన సిఫార్సులు వర్తిస్తాయనీ, వేతన సంఘం సిఫార్సులు అమలు కావాల్సిన తేదీకి ముందు రిటైరయిన పెన్షనర్లకు ఈ పెన్షన్ పెరుగుదల వర్తించదనీ ఈ చట్టం చెబుతోంది.



కేంద్ర ప్రభుత్వ 'కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా' నుండి పెన్షన్ పొందుతున్న అందరు పెన్షనర్లకూ ఈ మార్పు వర్తిస్తుందని ఈ బిల్లులో పేర్కొన్నారు. అంటే దాదాపు 70 లక్షల మంది కేంద్ర పెన్షనర్లు, బీఎస్ఎన్ఎల్‌లో విలీనమై కేంద్రం నుండి పెన్షన్ పొందుతున్న పాత పెన్షనర్లకు ఇకపై డీఏ తప్ప పెన్షన్ పెరుగుదల ఉండదు. కొంత మంది ఈ చట్టం న్యాయపరంగా చెల్లదని, సీనియర్ పెన్షనర్లకు తక్కువ పెన్షన్, జూనియర్లకు ఎక్కువ పెన్షన్ వచ్చే అవకాశం ఉండటం వల్ల పెన్షన్ అనామలీలు ఏర్పడుతాయనీ అనుకుంటున్నారు. కానీ కేంద్రం ఈ బిల్లులో ఈ అంశాన్ని కూడా ప్రస్తావించింది. గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన కొన్ని తీర్పులను ఉటంకిస్తూ పెన్షన్ చెల్లింపు అనేది డిఫర్డ్ వేజ్‌గా గుర్తిస్తున్నామనీ, అందుకే పెన్షన్ చెల్లింపు ఉందని పేర్కొంటూనే, 1950, 1960, 1970లలో పనిచేసిన ఉద్యోగికి 1986లో పెన్షన్ పెంచాల్సిన అవసరం ఏమిటని, ఉద్యోగి పనిచేసిన కాలపు డిఫర్డ్ వేజ్‌ని పెన్షన్‌గా ఇప్పటికే ఆ పెన్షనర్‌కు చెల్లిస్తున్నాము కనుక పెన్షన్ పెంపుదల అవసరం లేదని బిల్లులో స్పష్టంగా పేర్కొన్నారు.

ప్రభుత్వం పెన్షన్ పెరుగుదల అంశాన్ని మరింతగా విశదీకరిస్తూ... మూడవ వేతన సంఘం నుండి ఇప్పటి ఏడవ వేతన సంఘం దాకా పెన్షన్ పెరుగుదలపై విస్తృత చర్చ జరగాలని అన్ని వేతన సంఘాలు చెప్పాయనీ, కనుక ఇకపై వేతన సంఘం ఏర్పాటు తరువాత ఆ యా రికమెండేషన్లను అమలు చేయాల్సిన తేదీ తరువాత ఉద్యోగ విరమణ చేసిన వారికి మాత్రమే వేతన సంఘం సిఫార్సులు వర్తిస్తాయనీ... అంతకు ముందు రిటైరైన వారికి కాదనీ పేర్కొన్నారు.

సీసీఎస్ పెన్షన్ రూల్స్ – 1972, ఆ తరువాత వచ్చిన సీసీఎస్ పెన్షన్ రూల్స్ – 2021, అలాగే అసాధారణ పెన్షన్ రూల్స్ – 2023లలోని రూల్స్ ప్రకారం చేసిన ఈ మార్పులను ఫైనాన్స్ బిల్లులో భాగంగా చేర్చి బిల్లును ఆమోదింప చేయడం విశేషం. ఫైనాన్స్ బిల్లుపై సంపూర్ణ అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉండటం, న్యాయ పరిధిలో ఛాలెంజ్‌కి నిలబడే అవకాశాలు తక్కువ ఉండటం ఈ సందర్భంగా గమనార్హం.

వ్యాసకర్త టెలికాం రంగ విశ్లేషకులు

ఉత్తర – దక్షిణాల పేరుతో విభజిస్తారా?

అభిప్రాయం



డా॥ పి. భాస్కర యోగి

కులం, ప్రాంతం, మతం, భాష వంటివన్నీ నిన్న, నేడు, రేపు ఎప్పుడూ రాజకీయాలకు నిచ్చెనమెట్లేనన్న సంగతిని ప్రజలు మరువకుండా చేస్తున్నారు రాజకీయ నాయకులు. ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎమ్‌కే స్టాలిన్ ఇటీవల 'ఉత్తర–దక్షిణ భాగాలు'గా విభజించి దేశాన్ని అభివర్ణిస్తున్నారు. 'ఉత్తరాది పెత్తనం' అంటూ ఉరిమి చూస్తున్నారు. ఆయన ఓ సభలో మాట్లాడుతూ– 'దక్షిణాది రాష్ట్రాలు బానిసలుగా ఉండాలి. ఉత్తరాది రాష్ట్రాలు యజమానులా? ఉత్తరాది వారు మా దక్షిణాది ప్రజలను వంచన చేస్తున్నారు, మేం పిల్లల్ని కనడం తగ్గించిన పాపానికి (జనాభా నియంత్రణ) మా పార్లమెంట్ సీట్లు తగ్గిస్తున్నారు' అంటూ ఉద్వేగంగా ఉత్తరాది వారిపై విరుచుకుపడ్డారు. స్టాలిన్ యథాలాపంగానే ఇలా అన్నాడని భావించనక్కర్లేదు. ఆయన వెనుక చేరిన 'స్క్రిప్ట్ రైటర్స్' రాసిన సిద్ధాంతంలో ఇది ఓ భాగం.

డా॥ రామ్ మనోహర్ లోహియా మాటల్లో చెప్పాలంటే ఉత్తర – దక్షిణాలను కలిపింది శ్రీరాముడు. దేశీయ భాషల్లో వచ్చిన మొదటి ప్రామాణిక రామాయణం 'కంబన్ రామాయణం'. తమిళంలో వాడే ప్రాచీన వ్యాకరణం 'అగట్టీయం'. ఇది అగస్త్యుడి రచన. ఋషి అగస్త్యుడు ఉత్తరాది నుండి రాలేదా? తమిళంలో మురుగన్ అని పిలువబడే సుబ్రహ్మణ్యస్వామి శివపార్వతుల కుమారుడు కాదా? వైష్ణోదేవి ముందు ఏ సంకల్పం చెబుతారో మదురై మీనాక్షి, కన్యకల దగ్గర అదే చెబుతారు. రామేశ్వరం ఇసుకను వారణాసికి తీసుకెళ్ళి శివుడి దగ్గర పోస్తారు. కాశీ నుండి గంగాజలం తెచ్చి రామేశ్వరం శివుడికి అభిషేకం చేస్తారు. దక్షిణాదికి చెందిన శంకర, రామానుజ, మధ్వాచార్యులను ఈ దేశం ఎప్పుడైనా విస్మరించిందా? ఇంత సారూప్యత దేశంలో పెట్టుకుని రాజకీయాలు చేయవచ్చా? రోజు రోజుకూ రంగులు మార్చే అలవాటున్న రాజకీయం – ఏదో ఒక దానిని ఊతంగా చేసుకొని ముందుకు సాగడమే పనిగా పెట్టుకున్న మాటను మనం మరువరాదు.

మెకాలే విషపూరిత విద్యా విధానంలో భాగంగా ఒకప్పుడు మన దేశం ఆర్య–ద్రావిడ సిద్ధాంతంతో విభజించబడింది. 'ఆర్యులు భారత దేశంపై దాడి చేసి జయించారన్నది అభూతకల్పన. ఆర్యులు భారతదేశంపై దండెత్తి వచ్చి, అక్కడి స్థానికులను జయించారు అని చెబితేనే కానీ ఆర్యజాతి ఆధిక్యం రుజువు కాదు కనుక పాశ్చాత్య



రచయితలు ఒక కథ అల్లి ఆర్యులు భారతదేశంపై దండెత్తారనీ, అక్కడి దాసులనూ, దస్యులనూ పరాజితులను చేశారని చెప్పసాగారు'– అని అంబేడ్కర్ (బాబా సాహెబ్ అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు పు–73, 74) పేర్కొన్నారు. ఇటీవల కేంబ్రిడ్జి, యూస్టన్ విశ్వవిద్యాలయాల్లో ఆర్య–ద్రావిడ సిద్ధాంతాలపై శాస్త్రీయమైన పరిశోధనలు చేశారు. వివిధ ప్రాంతాల్లోని భారతీయుల డీఎన్ఏను పరీక్షించి అందరిదీ ఒకే రకమైన డీఎన్ఏగా తేల్చేశారు. జన్యు శాస్త్రజ్ఞులు డీఎన్ఏ ఆధారంగా జాతి విభజనను శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఇందులో 'పస'లేదని తేల్చేశారు.

ఇక, ద్రావిడ ఉద్యమం అంతా హిందీ భాషకు, ఉత్తరాదివారికి వ్యతిరేకంగా తమిళ ప్రాంతంలో జరిగింది. ద్రావిడ శబ్దానికి 'మూడు సముద్రాల మధ్య ప్రాంతం' అని అర్థం. దీనిని మొదట ఆదిశంకరులు ప్రయోగించినట్లు ప్రముఖ పరిశోధకులు డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి తెలిపారు. మొత్తానికి ఆర్య–ద్రావిడ సిద్ధాంతం రాజకీయంగా ఓ పెద్ద రాద్ధాంతంగా మారిపోయి పెరియార్ రామస్వామి 1944లో 'ద్రవిడస్తాన్' డిమాండ్‌తో బ్రిటిష్ వారికి విన్నవించడానికి నాటి జస్టిస్ పార్టీ వృద్ధ నేత పన్నీర్ సెల్వంను ఇంగ్లాండ్ పంపించారు. రహస్యంగా వెళ్తున్న సెల్వం విమాన ప్రమాదంలో మరణించడంతో అది విఫలమైందని కమ్యూనిస్టు నేత మోహన కుమార మంగళం తన రచనల్లో పేర్కొన్నారు.

ఆ తర్వాత పెరియార్ – 1947లో బ్రిటిష్ వాళ్ళు దేశమంతా వదిలిపెట్టినా, తమ తమిళ నాడును వదిలిపోవద్దన్నారు. 1955లో హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని పెరియార్ రామస్వామి జాతి వ్యతిరేక ఉద్యమంగా మలచారు. 1957లో 10 వేల మంది పెరియార్ అనుచరులు భారత రాజ్యాంగ ప్రతులను తగులబెట్టారు. పెరియార్ 1960లో భారతదేశ చిత్రపటాన్ని కాల్చేశారు. ఇదంతా ద్రావిడ ఉద్యమం పేరుతో జరిగిన దుష్పరిణామం. ఇటీవలి కాలంలో కేంద్రంలో జాతీయవాద ప్రభుత్వం ఏర్పడ్డాక దానిని బలహీనపరచడానికి, అపఖ్యాతిపాలు చేయడానికి కొన్ని కుట్రలు మొదలయ్యాయి. గంపెడు అవినీతితో కొట్టుమిట్టాడుతున్న స్టాలిన్ కుటుంబం ఉద్వేగాలను రెచ్చగొట్టాలని చూస్తున్నది. ప్రపంచమే ఓ 'గ్లోబల్ కుగ్రామం'గా మారుతున్న ఈ సందర్భంలో ఉత్తరాది – దక్షిణాది పేరుతో విడదీయడం రాజకీయ ప్రస్థానంలో మరో 'అపరిపక్వ సిద్ధాంతం' వండి వార్చడమే తప్ప మరెలాంటి ప్రయోజనమూ లేదు!


వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

భగవంతుని ఉనికి

ఒక ఆశ్రమంలో గురువుగారు శిష్యులకు ఆధ్యాత్మిక విషయాలను చక్కగా సులభ శైలిలో బోధిస్తూ ఉండేవారు. తన బోధలో భగవంతుడు సర్వవ్యాపి అనే సత్యాన్ని ఉదాహరణలతో ఎక్కువగా చెబుతూ ఉండేవారు.

కొంతకాలం తర్వాత తన బోధ శిష్యులకు ఎంత వరకు అర్థమైందో తెలుసుకోవటానికి గురువుగారు పరీక్ష పెట్టాలనుకుంటారు. శిష్యులను పిలిచి ఒక్కొక్కరికి ఒక్కొక్క అరటి పండు ఇచ్చి, 'మీకు నేను చెప్పిన భగవంతుని సర్వ వ్యాపకత్వ సిద్ధాంతం ఎంతవరకు అర్థం అయిందో తెలుసుకోవాలనుకుంటున్నాను. మీకు ఇచ్చిన అరటిపండును ఎవరూ చూడకుండా తిని, నా దగ్గరికి రండి' అని చెప్పారు.

శిష్యులందరూ తలో దిక్కుకు వెళ్లారు. ఒకరు ఇంట్లో దూరి తలుపులు వేసుకుని తింటే, ఒకడు నీటిలో మునిగి తిన్నాడు. ఇలా తొమ్మిది మంది శిష్యులూ అరటిపండు తిని గురువుగారి దగ్గరకు వచ్చి తాము ఎలా తిన్నదీ చెబుతారు. పదవ శిష్యుడు మాత్రం అరటిపండు తినకుండా దానిని గురువు దగ్గరకు తీసుకుని వచ్చాడు.



గురువు 'నువ్వెందుకు తినలేదు?' అని ప్రశ్నిస్తే, 'గురుదేవా! తాము ఇన్నాళ్ల నుంచి భగవంతుడు అణువణువునా నిండి ఉన్నాడనీ, అతడు లేని చోటే లేదని చెబుతున్నారు కదా! మరి, ఆ భగవంతుడు నా పక్కనే ఉండి చూస్తూ ఉంటే నేనెలా అరటిపండు తినగలను? అందుకే నేను తినకుండా తెచ్చేశాను' అన్నాడు.

గురువు తన బోధను పరిపూర్ణంగా అర్థం చేసుకున్న శిష్యుడు ఇతడే అని ప్రకటించి, మిగతా వారితో 'ఇకపైన అయినా నేను చెప్పేది జాగ్రత్తగా అర్థం చేసుకుని ఆచరణలో పెట్టండి' అని చెప్పాడు.

ఎవరూ చూడటం లేదు కదా అని తప్పు పనులు, చెడు పనులు చేసేవారు, భౌతికంగా తమ పక్కన ఎవరూ లేకపోయినా, భగవంతుడు తమ మంచి చెడు పనులకు ఎప్పుడూ సాక్షిగా ఉంటాడు, చూస్తూనే ఉంటాడు అని గ్రహించటం అవసరం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** అమావాస్య సా.5.04 వరకు, తదుపరి చైత్ర శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.8.21 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.6.49 నుండి 8.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.26 నుండి 7.37 వరకు, **అమృతఘడియలు:** ప.3.48 నుండి 5.16 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 6.08.

థాయ్‌లాండ్, మయన్మార్‌ల్లో...
భారీ భూకంపం

ఇరు దేశాల్లో భారీగా ఆస్తి నష్టం • 200 దాటిన మృతులు

బ్యాంకాక్/కోల్‌కతా: ప్రకృతి ప్రకోపానికి థాయ్‌లాండ్, మయన్మార్ చిగురుటాకుల్లా వణికిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం మయన్మార్‌లో 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపం ఇరు దేశాల్లోనూ భారీ విధ్వంసం మిగిల్చింది. కాసేపటికే 6.4 తీవ్రతతో మరోసారి భూమి కంపించగా తర్వాత కూడా మరో నాలుగైదు ప్రకంపనాలు వణికించాయి. భారీ భవనాలు కళ్లముందే పేకమేడల్లా కుప్పకూలాయి. పురాతన బ్రిడ్జిలు నేలమట్టమయ్యాయి. మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. చాలాచోట్ల విద్యుత్ సరఫరా లైన్లు తదితరాలు దెబ్బతిన్నాయి. ఇరుదేశాల్లో ఇప్పటిదాకా 200 మందికి పైగా మరణించారు. మయన్మార్‌లోనే 180 మందికి పైగా మరణించారు. 750 మందికి పైగా గాయపడ్డారని సైనిక ప్రభుత్వం ప్రకటించింది. అంతర్జాతీయ సమాజం తక్షణం ఆదుకోవాలని కోరింది. భవనాల శిథిలాల కింద చాలామంది చిక్కుకోవడంతో మృతుల సంఖ్య భారీగా పెరిగేలా ఉంది. మయన్మార్ రాజధాని నేపిడాలో వెయ్యి పడకల ఆస్పత్రి కుప్పకూలింది. అందులో అత్యధికులు మరణించి ఉంటారంటున్నారు. భూకంప కేంద్రాన్ని సెంట్రల్ మయన్మార్‌లో రెండో అతి పెద్ద నగరమైన మాండలేకు సమీపంలో మొన్య్వా సిటీకి 50 కిలోమీటర్ల దూరంలో గుర్తించారు. కేవలం 10 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించడంతో ప్రమాద తీవ్రత చాలా పెరిగింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో భారీ భవనాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. చటూచాక్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న 33 అంతస్తుల భారీ భవంతి నేలమట్టమైంది. దానికింద కనీసం 90 మందికి పైగా చిక్కుకున్నట్టు తెలుస్తోంది. భూకంప తీవ్రతకు భవనాలు అటూ ఇటూ ఊగిపోతున్న దృశ్యాలు, అత్యంత ఎత్తైన ఓ భవనం తాలూకు పై అంతస్తులోని స్విమింగ్‌పూల్ నుంచి నీళ్లన్నీ కిందకు పడుతున్న వీడియోలు వైరల్‌గా మారాయి. ఒకట్రెండు రోజుల్లో మరిన్ని భూకంపాలు తప్పకపోవచ్చన్న హెచ్చరికలు వణికిస్తున్నాయి. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న మయన్మార్‌లో సహాయక, పునరావాస చర్యలు సవాలుగా మారాయి. ఆరు రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ విధించారు. బ్యాంకాక్‌లోనూ ఎమర్జెన్సీ ప్రకటించారు. రెండేళ్ల క్రితం తుర్కియేలో 50 వేల మందికి పైగా భూకంపానికి బలవడం తెలిసిందే. ఆ తర్వాత అతి తీవ్ర భూకంపం ఇదే.

మయన్మార్‌లో...

సైనిక పాలనలో మగ్గుతున్న మయన్మార్‌లో 1946 తర్వాత ఇదే అతి తీవ్రమైన భూకంపం. నేపిడాలో రాజప్రసాదాలు, భవనాలు దెబ్బ తిన్నాయి. ఎక్కడ చూసినా రోడ్లు చీలిపోయి కన్పిస్తున్నాయి. ఐకానిక్ వంతెన, ఆలయాలు తదితరాలు కుప్పకూలాయి. ఇప్పటిదాకా 90 మందికి పైగా మృతదేహాలను వెలికితీశారు. క్షతగాత్రుల సంఖ్య క్షణక్షణానికీ పెరుగుతోంది. చాలామందికి తీవ్ర గాయాలు కావడంతో రక్తానికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మాండలేలో మసీదు కూలి 20 మంది మరణించారు. నగరానికి ఆగ్నేయాన సగాయింగ్ ప్రాంతంలో 90 ఏళ్ల నాటి బ్రిడ్జి కుప్పకూలింది. మా సో యానే బౌద్ధారామం కూడా నేలమట్టమైంది. మృతులు భారీగా పెరగవచ్చని సైనిక నియంత జనరల్ మిన్ ఆంగ్ లయాంగ్ చెప్పారు.

థాయ్‌లాండ్‌లో...

భూకంపం ధాటికి ఇళ్లు, కార్యాలయాల నుంచి జనం ఉన్నపళంగా పరిగెత్తుకొచ్చారు. భవనాలు కళ్లముందే కుప్పకూలుతుంటే నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు. బ్యాంకాక్‌లోని 1.7 కోట్ల జనాభాలో అత్యధికులు భారీ అపార్ట్‌మెంట్లలోనే నివసిస్తారు. భూకంపం దెబ్బకు భయాందోళనలకు లోనై కార్లు, ఇతర వాహనాల్లో రోడ్డెక్కడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ చోటుచేసుకుంది. ర్యాపిడ్ ట్రాన్సిట్, సబ్‌వే వ్యవస్థలను తాత్కాలికంగా మూసేయడంతో భారీ జననష్టం తప్పింది. నగరం మొత్తాన్నీ ప్రమాద ప్రాంతంగా పేర్కొన్నారు. కుప్పకూలిన నిర్మాణంలోని భవన శిథిలాలు ఏ క్షణమైనా పూర్తిగా పడిపోయేలా కన్పిస్తున్నాయి. దాంతో శిథిలాల కింద చిక్కిన వారికోసం పోలీసు శునకాలతో వెదుకుతున్నారు. ఆ ప్రాంతాన్ని ప్రధాని షినవత్రా సందర్శించారు. భద్రత దృష్ట్యా ప్రతి భవనాన్నీ క్షుణ్నంగా తనిఖీ చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. అత్యవసర కేబినెట్ సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు. బ్యాంకాక్‌లో 10 మందికి పైగా మరణించినట్టు ధ్రువీకరించారు. చాలా భవనాలకు పగుళ్లు రావడంతో లోనికి వెళ్లేందుకు జనం జంకుతున్నారు.

హృదయ విదారకం

మయన్మార్, థాయ్‌లాండ్‌ల్లో భూకంప దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. పలుచోట్ల కుప్పకూలిన భవనాలు, నిర్మాణాల కింద చిక్కినవారు హాహాకారాలు చేస్తున్నారు. శిథిలాల నడుమ తమవారి కోసం కన్నీటి మధ్యే జనం వెదుక్కుంటున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి.





భూకంపం ధాటికి శుక్రవారం బ్యాంకాక్‌లో కుప్పకూలుతున్న 33 అంతస్తుల భారీ భవనం. దీనికింద కనీసం 90 మందికి పైగా చిక్కుకున్నారంటున్నారు

అన్నివిధాలా సాయం: మోదీ

న్యూఢిల్లీ: భూకంప విపత్తుపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ''జరిగిన ఘోరం చూసి చలించిపోయా. బాధితుల క్షేమం కోసం ప్రార్థిస్తున్నా. థాయ్‌లాండ్, మయన్మార్‌లకు అన్నివిధాలా సాయం అందించేందుకు భారత్ పూర్తిగా సిద్ధంగా ఉంది'' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రెండు దేశాలకూ భారత్ సహాయ తదితర సామగ్రి పంపుతోంది. థాయ్‌లాండ్‌లోని భారతీయుల కోసం బ్యాంకాక్‌లో భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ (+66 618819218) ఏర్పాటు చేసింది. భూకంప మృతుల్లో భారతీయులెవరూ లేరని పేర్కొంది. బ్యాంకాక్‌లో ఏప్రిల్ 4న బిమ్స్‌టెక్ ప్రాంతీయ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు భూటాన్, నేపాల్, మయన్మార్, బంగ్లాదేశ్ అధినేతలు భేటీలో పాల్గొంటారు.

సగాయింగ్ 'ఫాల్ట్' వల్లే...

టిబెట్ పీఠభూమి ప్రాంతంలో సంక్లిష్టమైన టెక్టానిక్ ఫలకాలపై ఉన్నందున మయన్మార్‌కు భూకంప ముప్పు ఎక్కువే. ఇక్కడ హెచ్చు తీవ్రతతో కూడిన భూకంపాలు పరిపాటి. భూమి పై పొరలోని ఇండో, బర్మా టెక్టానిక్ ఫలకాలు సమాంతరంగా కదలడమే తాజా భూకంపానికి కారణమని సైంటిస్టులు తేల్చారు. భూ ఫలకాల అంచులను ఫాల్ట్‌గా పిలుస్తారు. లక్షలాది ఏళ్ల కింద భారత ఉపఖండం ఆసియాను ఢీకొట్టడం వల్ల ఏర్పడ్డ సాగయింగ్ ఫాల్ట్‌గా పిలిచే పగుళ్ల వెంబడే తాజా భూకంపం చోటుచేసుకుంది. ఇక్కడ టెక్టానిక్ ఫలకాలు ఏటా 0.7 అంగుళాల చొప్పున పరస్పర వ్యతిరేక దిశలో కదులుతున్నాయి. ఫలితంగా పుట్టుకొచ్చే ఒత్తిడి భూకంపాలుగా మారుతుంటుంది. ఇక్కడ దశాబ్దానికి ఒక్క భారీ భూంకంపమన్నా నమోదవుతుంటుంది. మయన్మార్‌లో గత వందేళ్లలో 6కు మించిన తీవ్రతతో 14కు పైగా భూకంపాలు నమోదయ్యాయి. 1946లో 7.7, 1956లో 7.1 తీవ్రతతో భూకంపాలు వచ్చాయి. 1988 నాటి భూకంపానికి వేలాది మంది బలయ్యారు. 2011, 2016ల్లో కూడా 6.9 తీవ్రతతో భూకంపాలొచ్చాయి. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న మయన్మార్ పాలిట ఈ విపత్తు గోరుచుట్టుపై రోకటిపోటుగా మారింది.

కోల్‌కతా నుంచి ఈశాన్యం దాకా...

భూకంపం తాలూకు ప్రకంపనలు భారత్‌లోనూ కన్పించాయి. కోల్‌కతాతో పాటు పలు ఈశాన్య రాష్ట్రాల్లో శుక్రవారం మధ్యాహ్నం భూమి 2.5 తీవ్రతతో స్వల్పంగా కంపించింది. ఎక్కడా ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదు. వాయవ్య చైనాలోని యునాన్, సీచుయాన్ ప్రావిన్సుల్లో కూడా భారీ ప్రకంపనలు నమోదయ్యాయి. మాంగ్షీ తదితర నగరాల్లో భూకంప తీవ్రత హెచ్చుగా ఉంది. ఇల్లు, నిర్మాణాలు బాగా దెబ్బతిన్నాయి.



మయన్మార్‌లో మాండలే సమీపంలో కుప్పకూలిన బ్రిడ్జి



నేపిడాలో శిథిలాల్లోంచి తల్లీకూతుళ్లను బయటికి తీస్తున్న సిబ్బంది



మయన్మార్ రాజధాని నేపిడాలో భారీగా పగుళ్లిచ్చిన రోడ్డు

బతుకుతామనుకోలేదు

భూకంపం నుంచి ప్రాణాలతో బయట పడతామనుకోలేదు. మేమంతా ఆఫీసులో ఉండగా అలజడి రేగింది. భూకంపమంటూ అరుపులు విన్పించడంతో వెంటనే బయటికి పరుగెత్తుకెళ్లాం. నిర్మాణంలోని భారీ భవనాలు కూలిపోయాయి. ఇళ్లు పగుళ్లివ్వడంతో వాటిని ఖాళీ చేయించి జనాన్ని పార్కులు, ఖాళీ స్థలాల్లోకి పంపుతున్నారు. మేం యూనివర్సిటీ క్యాంపస్‌లో తలదాచుకున్నాం.

\- 'సాక్షి'తో ఫోన్‌లో బ్యాంకాక్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి రమేశ్

చాలామంది చనిపోయారు

బ్యాంకాక్‌లో ఇంతటి భూకంపం ఎన్నడూ చూడలేదు. 40, 50 అంతస్తులున్న నాలుగైదు భవనాలు కూలిపోయాయి. వాటిలోని చాలామంది చనిపోయే ఉంటారు. భారత పర్యాటకులు బస చేసే ప్రాంతాల్లో విధ్వంస తీవ్రత ఎక్కువగా ఉంది. తెలుగు వారందరినీ గ్రూపుల్లో అప్రమత్తం చేస్తున్నాం.

\- వెంకటేశ్ యాదవ్, బ్యాంకాక్‌లోని ఆంధ్రా రెస్టారెంట్ ఎండీ

ఆస్ట్రేలియాలో మే 3న ఎన్నికలు

ఆల్బనీస్‌కు ఎదురీతే! • పీటర్ డట్టన్ నుంచి గట్టిపోటీ



కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాలో మే 3న సార్వత్రిక ఎన్నికలు జరగను న్నాయి. ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ (62) శుక్రవారం ఉదయం గవర్నర్ జనరల్ శామ్ మోస్టిన్‌ను కలిసి ఎన్నికలకు అనుమతి కోరారు. అనంతరం మీడియా ముందు ఆ మేరకు ప్రకటన చేశారు. ప్రజల జీవన వ్యయాన్ని తగ్గించేందుకు కృషిని కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యర్థి పీటర్ డట్టన్ (54)ను ఎన్నుకుంటే దేశం వెనక్కు పోతుందన్నారు. ''ప్రపంచం కొన్నేళ్లుగా ఆస్ట్రేలియాపై విమర్శలు గుప్పిస్తోంది. అనిశ్చిత సమయాల్లో మనం ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవాలన్నది మన చేతుల్లో లేదు. కానీ వాటికి ఎలా స్పందించాలన్నది మన చేతుల్లోనే ఉంది. మా ప్రభుత్వం ఎన్నో అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొంది. ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. వారికి అందమైన భవిష్యత్తు అందించేందుకు కృషిని కొనసాగిస్తాం'' అన్నారు. దశాబ్దం పాటు అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీని ఓడించి ఆల్బనీస్‌కు చెందిన సెంట్రల్ లెఫ్ట్ లేబర్ పార్టీ 2022 మేలో అధికారం చేపట్టింది. అప్పటికి ఎనిమిదేళ్లలో ఏకంగా ఆరుసార్లు ప్రధానులు మారారు! సుదీర్ఘ రాజకీయ అస్థిరత తర్వాత ఎక్కువ కాలం ప్రధానిగా చేసిన నేతగా ఆల్బనీస్ నిలిచారు. కానీ ఆయన పాలనపై కూడా కొంతకాలంగా జనం పెదవి విరుస్తున్నారు.

సమస్యలతో సావాసం

ఆస్ట్రేలియా పార్లమెంటులో 150 స్థానాలున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 76 సీట్లు అవసరం. వామపక్ష భావజాలమున్న లేబర్ పార్టీ, మితవాద లిబరల్ నేషనల్ పార్టీలదే ఆస్ట్రేలియా రాజకీయాల్లో చాలాకాలంగా ఆధిపత్యం. ప్రధాన అభ్యర్థులుగా ఆల్బనీస్, లిబరల్ పార్టీ సారథి డట్టన్ బరిలో ఉన్నారు. వారితో పాటు పలువురు స్వతంత్రులు కూడా పోటీ చేస్తున్నారు. వ్యయం, ఆర్థిక అవ్యవస్థ, చైనా ఆధిపత్యం ఎన్నికల్లో ప్రధానాంశాలు కానున్నాయి. చౌక గృహాల కొరత, అధిక వడ్డీ రేట్లతో ప్రజలు సతమతం అవుతున్నారు. ద్రవ్యోల్బణం ఆందోళన కలిగిస్తోంది. అద్దె, విద్యుత్ బిల్లులపై పన్ను కోతలు, సబ్సిడీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. రికార్డు స్థాయి వలసలు, నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ప్రభుత్వం మారితేనే!

ఉక్రెయిన్‌తో శాంతి చర్చలపై పుతిన్ స్పష్టీకరణ



మాస్కో: ఉక్రెయిన్‌లో ప్రభుత్వం మారితేనే శాంతి నెలకొంటుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. అక్కడ తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత శాంతి చర్చలు జరపాలన్నారు. చర్చల్లో అమెరికాతో పాటు బ్రిక్స్ దేశాలు, ఉత్తర కొరియా కూడా పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. ఉత్తర రష్యాలోని ఓడరేవు పట్టణం ముర్మాన్‌స్క్‌లో సైనికుల బృందంతో పుతిన్ శుక్రవారం మాట్లాడారు. మూడేళ్ల యుద్ధానికి ముగింపు పలకడానికి సిద్ధమేనన్నారు. అయితే శాంతి ప్రక్రియ కోసం పలు షరతులు విధించినట్టు రష్యా అధికార వార్తా సంస్థ టాస్ తెలిపింది. ఉక్రెయిన్‌లో ఎన్నికలు జరగాలి. ఆ దేశం అంతర్జాతీయ పాలనలోకి రావాలి. ఆలోపు అక్కడ తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరాలి. కీలక ఒప్పందాలపై సంతకాల వంటివన్నీ ఆ తర్వాతే'' అని పుతిన్ పేర్కొన్నట్టు వెల్లడించింది. ''శాంతియుత పరిష్కారమే మా అభిమతం కూడా. కానీ ముందుగా ఉక్రెయిన్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాలి. ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వం రావాలి. యూరప్‌తో కలిసి పనిచేయడానికీ నేను సిద్ధం. కానీ యూరప్ అస్థిరంగా వ్యవహరిస్తూ మమ్మల్ని మభ్యపెట్టజూస్తోంది'' అని పుతిన్ ఆరోపించారు. యుద్ధం ముగియాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారంటూ కొనియాడారు. తాత్కాలిక కాల్పుల విరమణ కోసం సౌదీ అరేబియాలో ఈ వారం రష్యా, ఉక్రెయిన్, అమెరికా చర్చలు జరపడం తెలిసిందే. వాటి తీరుపై అమెరికా పెదవి విరిచింది. ''నల్ల సముద్రంలో నౌకలపై సైనిక దాడులను నిలిపేయడానికి రష్యా, ఉక్రెయిన్ అంగీకరించాయి. కానీ ఆ తర్వాత శాంతి చర్చలను అవి సీరియస్‌గా తీసుకోవడం లేదు'' అని పేర్కొంది. ఏప్రిల్లో రెండో విడత శాంతి చర్చలు జరగనున్నాయి.

ఇకపై అమెరికాతో కటీఫ్

పాత బంధం ముగిసినట్టే • తీవ్ర వాణిజ్య చర్యలు తప్పవు: కార్నీ



ఒట్టావా: అమెరికాతో పాత బంధం ఇక ముగిసిన అధ్యాయమేనని కెనడా ప్రధాని మార్క్ కార్నీ వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య ఉన్న లోతైన ఆర్థిక, భద్రతా, సైనిక సంబంధాల శకం ముగిసినట్టేనని స్పష్టం చేశారు. అమెరికాలోకి వాహన దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్నీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల ప్రచారానికి విరామమిచ్చిన ఆయన, హుటాహుటిన ఒట్టావా తిరిగొచ్చి కేబినెట్ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వాహన టారిఫ్‌లు సమర్థనీయం కాదని, ప్రస్తుత వాణిజ్య ఒప్పందాలను అవి ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. అమెరికాతో సంబంధాలను ట్రంప్ శాశ్వతంగా మార్చేశారని ఆక్షేపించారు. ఆ దేశంతో ఎలాంటి వాణిజ్య ఒప్పందాలపైనా వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ''అమెరికా తాజా సుంకాలు కెనడాపై చూపే ప్రభావం తక్కువే. కానీ అందుకు ప్రతీకారంగా అమెరికాపై తీవ్ర ప్రభావం చూపే వాణిజ్య చర్యలకు దిగుతాం'' అని ప్రకటించారు. అమెరికాతో భద్రత, వాణిజ్య సంబంధాలపై విస్తృతంగా పునరాలోచన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ''ట్రంప్ ప్రభుత్వం తదుపరి చర్యలపై మాకైతే స్పష్టత లేదు. మా ఇంటికి మేమే యజమానులం. మా భవిష్యత్తును మేమే నిర్ణయించుకుంటాం. నియంత్రించుకుంటాం. అమెరికాతో సహా ఏ విదేశీ ప్రభుత్వమూ మాపై అజమాయిషీ చేయలేదు! తాజా టారిఫ్‌లు మాపై ప్రత్యక్ష దాడే. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ మా ప్రజలను, కంపెనీలను, దేశాన్ని కాపాడుకుంటాం. పోరాటం, రక్షణ, నిర్మాణం... తాజా టారిఫ్‌లకు ఇదే మా ప్రతిస్పందన'' అని స్పష్టం చేశారు. ట్రంప్ వాహన టారిఫ్ నిర్ణయం కెనడా ఆటో పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ట్రంప్‌తో ఢీ అంటే ఢీ!

జస్టిన్ ట్రూడో స్థానంలో మార్చి 14న కార్నీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. కెనడాకు ప్రధాని ఎవరైనా పదవి చేపట్టగానే అమెరికా అధ్యక్షుడికి ఫోన్ చేయడం ఆనవాయితీ. కానీ కార్నీ మాత్రం ట్రంప్‌తో మాట్లాడలేదు. దీనిపై వైట్‌హౌస్ స్పందించిందని, ఒకట్రెండు రోజుల్లో ట్రంప్‌తో మాట్లాడతానని గురువారం ఆయన చెప్పారు. ''ట్రంప్‌తో మాట్లాడేందుకు నేను సిద్ధం. కానీ కెనడా పట్ల గౌరవంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అప్పటిదాకా అమెరికాతో వాణిజ్య చర్చల్లో పాల్గొనబోను'' అంటూ కుండబద్దలు కొట్టారు. ''కెనడా సార్వభౌమత్వాన్ని గౌరవించడం ముఖ్యం. అది జరిగినప్పుడే ముందుకు సాగుతాం'' అన్నారు.

రూ.62,500 కోట్లతో 156 ప్రచండ్ హెలికాప్టర్లు

హెచ్ఏఎల్ నుంచి కొనుగోలుకు సీసీఎస్ ఆమోదం

న్యూఢిల్లీ: రూ.62,500 కోట్లతో 156 ప్రచండ్ హెలికాప్టర్ల కొనుగోలుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భద్రతపై కేబినెట్ కమిటీ(సీసీఎస్) శుక్రవారం ఆమోదముద్రవేసింది. ఈ తేలికపాటి కాంబాట్ హెలికాప్టర్లను హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) నుంచి కొనుగోలు చేయనున్నారు. దేశంలో సైనిక సామర్థ్యాన్ని పెంచడంలో ఇదొక ముందడుగు అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో డిజైన్ చేసి, అభివృద్ధి చేసిన యుద్ధ హెలికాప్టర్లు ఇవే కావడం విశేషం. ప్రచండ్ హెలికాప్టర్లు 5 వేల మీటర్ల ఎత్తు వరకు ప్రయాణించగలవు. సీసీఎస్ ఆమోదం తెలపడంతో హెలికాప్టర్ల కొనుగోలుకు సంబంధించిన రెండు ఒప్పందాలపై రక్షణ శాఖ ప్రతినిధులు సంతకాలు చేశారు. ఇందులో 66 హెలికాప్టర్లను భారత వాయుసేనకు, మరో 90 హెలికాప్టర్లను భారత నావికాదళానికి హెచ్ఏఎల్ సరఫరా చేయాల్సి ఉంటుంది. 'మేక్ ఇన్ ఇండియా'కు ఇదొక గొప్ప ప్రోత్సాహకమని, ఈ రెండు ఒప్పందాల వల్ల 8,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

జస్టిస్ వర్మ బదిలీకి ఆమోదం

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుకు కేంద్రం ఓకే

న్యూఢిల్లీ/ప్రయాగ్‌రాజ్: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సును కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆయనను బదిలీ చేస్తూ కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఢిల్లీలో యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీగా నోట్ల కట్టలు లభ్యమైనట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆయనపై అంతర్గత విచారణ కోసం సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఆయనను విధులకు దూరంగా ఉంచకుండా అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా, జస్టిస్ యశ్వంత్ వర్మకు న్యాయ సంబంధిత విధులేవీ అప్పగించకూడదని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సూచించినట్లు సుప్రీంకోర్టు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. మరోవైపు యశ్వంత్ వర్మ బదిలీ వ్యవహారం న్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భారత న్యాయ వ్యవస్థలో ఇదొక చీకటి రోజు అని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ పేర్కొన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ప్రమాణ స్వీకారాన్ని తాము బహిష్కరిస్తామని చెప్పారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న యశ్వంత్ వర్మను తమ కోర్టుకు బదిలీ చేయడాన్ని అలహాబాద్ హైకోర్టు న్యాయవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. తాను ఎలాంటి తప్పు చేయలేదని, తనకు వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని యశ్వంత్ వర్మ ఆరోపిస్తున్నారు.

అది తొందరపాటే అవుతుంది: సుప్రీంకోర్టు

యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఢిల్లీ పోలీసులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఇప్పుడు అలాంటి ఆదేశాలు ఇవ్వడం తొందరపాటే అవుతుందని స్పష్టంచేసింది. న్యాయవాది మాథ్యూస్ జె.నెడుంపారాతోపాటు మరో ముగ్గురు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. నోట్ల కట్టలు దొరికిన ఘటనపై సుప్రీంకోర్టు నియమించిన త్రిసభ్య కమిటీ దర్యాప్తు నిర్వహిస్తోందని వెల్లడించింది. కేసు నమోదు చేయాలంటూ పోలీసులను ఆదేశించాల్సిన అవసరం ప్రస్తుతానికి లేదని స్పష్టంచేసింది. విచారణ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

కొనసాగుతున్న కశ్మీర్ ఎన్‌కౌంటర్

మరో పోలీసు వీరమరణం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో ఉగ్రవాదులతో ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్న ప్రాంతంలో శుక్రవారం ఉదయం వీరమరణం పొందిన మరో పోలీసు అధికారి మృతదేహం దొరికింది. గల్లంతైన పోలీసుల కోసం దట్టమైన అటవీ ప్రాంతంలో డ్రోన్లతో గాలింపు చేపట్టామని అధికారులు తెలిపారు. దీంతో, ఈ ఘటనలో నలుగురు పోలీసులు అమరులయ్యారని తెలిపారు. ఘటనలో ముగ్గురు ఉగ్రవాదులు చనిపోవడం తెలిసిందే. గురువారం మొదలైన తుపాకీ కాల్పులు, బాంబు పేలుళ్ల శబ్దాలు శుక్రవారం కూడా కొనసాగాయి. గురువారం ఎన్‌కౌంటర్ సమయంలో డీఎస్పీ సహా ఐదుగురు పోలీసుల బృందం దట్టమైన అటవీ ప్రాంతంలోని లోయలో చిక్కుకుపోయింది. వీరిలో గాయపడిన స్థితిలో ఉన్న డీఎస్పీని ఎలాగోలా సాయంత్రానికి క్షేమంగా బయటకు తీసుకురా గలిగారు. గాయపడిన మొత్తం ఏడుగురిలో డీఎస్పీ, ముగ్గురు పోలీసులు, ఇద్దరు ఆర్మీ సిబ్బందిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందంటున్నారు. కాగా, సఫియాన్ ప్రాంతంలో నేలకొరిగిన పోలీసుల మృతదేహాలను తరలించడంతోపాటు, మిగతా ఉగ్రవాదుల పీచమణచే లక్ష్యంతో ఆర్మీ, సీఆర్పీఎఫ్ బలగాలు శుక్రవారం ఉదయం నుంచే అన్ని వైపుల నుంచి చుట్టుముట్టాయి. ఆ ప్రాంతంలో మరో ఇద్దరు ముష్కరులు ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు
డీఏ 2 శాతం పెంపు

- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం
- 53 శాతం నుంచి 55 శాతానికి చేరిన డీఏ/డీఆర్
- ఈ ఏడాది జనవరి 1 నుంచే అమలు
- ఖరీఫ్‌లో పీఅండ్‌కే ఎరువులపై రూ.37,216 కోట్ల రాయితీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం తీపి కబురు అందించింది. ఉద్యోగులకు కరువు భత్యాన్ని(డీఏ), పెన్షనర్లకు కరువు సహాయాన్ని(డీఆర్) మరో 2 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇది ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచే అమలుకానుంది. 1.15 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. ప్రస్తుతం డీఏ/డీఆర్ 53 శాతం ఉండగా, తాజా పెంపుతో 55 శాతానికి చేరుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ శుక్రవారం సమావేశమైంది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ భేటీ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. దేశంలో నిత్యావసరాల ధరలు పెరగడంతో ఏడో కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ/డీఆర్ 2 శాతం పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాపై ప్రతిఏటా రూ.6,614.04 కోట్ల చొప్పున అదనపు భారం పడుతుందని అన్నారు.

మరిన్ని నిర్ణయాలు

- ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఫాస్ఫాటిక్ అండ్ పొటాసిక్(పీఅండ్‌కే) ఎరువులపై రూ.37,216 కోట్ల రాయితీ. డీఏపీ(డై అమ్మోనియం ఫాస్ఫేట్) ధరల్లో ఎలాంటి మార్పు ఉండదు.
- ఆరేళ్లలో రూ.22,919 కోట్లతో నాన్-సెమికండక్టర్ ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ స్కీమ్ అమలు చేయాలన్న ప్రతిపాదనకు ఆమోదం. ఈ పథకంతో మరో రూ.59,350 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా.
- బిహార్‌లో రూ.3,712.40 కోట్లతో 120 కిలోమీటర్ల మేర పాట్నా-ససారం కారిడార్ ప్రాజెక్టు. నాలుగు లేన్లతో ఈ రహదారి నిర్మాణం.
- బిహార్‌లో సాగునీటి సదుపాయం కల్పించడానికి, వరదల నియంత్రణకు ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన-యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రామ్(పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ) కింద రూ.6,282.32 కోట్లతో కోషి మెకీ ఇన్‌ట్రా-స్టేట్ లింక్ ప్రాజెక్టు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో ర్యాగింగ్

- ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో ఓ విద్యార్థిని సీనియర్లు ర్యాగింగ్ చేసిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన దీపక్ శర్మ అనే విద్యార్థి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 25న హాస్టల్‌లో సీనియర్ విద్యార్థులు హర్షవర్ధన్, హిమవర్ధన్, లోకేశ్‌లు దీపక్ శర్మను ర్యాగింగ్ చేయడంతో అతను ఈ నెల 26న కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరిపిన పోలీసులు.. సీనియర్ విద్యార్థులపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవిని వివరణ కోరగా సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడిన ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేశాడని.. సీనియర్ల తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సబ్‌కలెక్టర్ దూషించాడంటూ మహిళ ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పున్నమ్మ

మిర్యాలగూడ అర్బన్: సబ్‌కలెక్టర్ దూషించాడంటూ ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. మాడుగులపల్లి మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన పొంతటి రాములమ్మ, కోటిరెడ్డి దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు కాగా ఇద్దరు కుమారులు మృతిచెందారు. ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఆ వృద్ధ తల్లిదండ్రులను కుమారుడు, కూతురు చూడ టం లేదని గతంలో గ్రామపెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. అప్పటి నుంచి తల్లిదండ్రులను బాగానే చూసుకుంటున్నా.. ఇంటి స్థలం విషయంలో గొడవ రావడంతో తిరిగి తమను చూడటం లేదని వారు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సబ్‌కలెక్టర్.. శుక్రవారం కుటుంబ సభ్యులను పిలిపించారు. కుమారుడు దామోదర్‌రెడ్డి ఆయన భార్య పున్నమ్మలతో వృద్ధుల సమస్యపై మాట్లాడారు. ఈ క్రమంలో సబ్‌కలెక్టర్ తనను దూషించాడని, మెడపట్టి బయటకు గెంటివేశాడని పున్నమ్మ ఆరోపించింది. ఆపై ఇంటికి వెళ్లి పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. దీనిపై సబ్ కలెక్టర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

నోట్లో నురగలతో ముగ్గురు చిన్నారుల మృతి

- కడుపు నొప్పి వస్తోందంటూ నిద్రలేచిన తల్లి.. నిర్జీవంగా కనిపించిన పిల్లలు.. తాము విషం లాంటిదేమీ తీసుకోలేదని పోలీసులకు చెప్పిన తల్లి
- రాత్రి షాపులో తెచ్చిన పెరుగుతో అన్నం తిన్నామని.. భర్త మాత్రం పప్పుతో తిన్నాడని వెల్లడి..

పటాన్‌చెరు టౌన్: రాత్రి భోజనం చేసి పడుకున్నారు. తెల్లవారుజామున నోట్లో నురగలతో విగతజీవులై కన్పించారు. ముగ్గురు చిన్నారులు అనుమానాస్పద స్థితిలో మరణించిన విషాద సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ఆస్పత్రిలో చేరిన వారి తల్లి చికిత్స పొందుతోంది. సీఐ నరేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెదకపల్లి గ్రామానికి చెందిన చెన్నయ్యకు 2008లో వివాహం జరిగింది. 2010లో భార్య అనారోగ్యంతో మరణించడంతో 2012లో నల్లగొండ జిల్లా మందాపూర్ గ్రామానికి చెందిన రజిత అలియాస్ లావణ్యను రెండో వివాహం చేసుకున్నాడు. ఏడేళ్ల క్రితం బతుకుతెరువు కోసం రాఘవేంద్ర కాలనీకి వచ్చి ఉంటున్నాడు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, రజిత స్కూల్ టీచర్‌గా పనిచేస్తోంది. వీరికి ఐదో తరగతి చదువుతున్న సాయికృష్ణ (12), నాలుగో తరగతి చదువుతున్న మధుప్రియ (10), మూడు చదువుతున్న గౌతమ్ (8) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు.


ఘటన స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

అంతా కలిసే భోజనం చేశారు

గురువారం రాత్రి 9 గంటల సమయంలో అంతా కలిసి భోజనం చేశారు. పిల్లలు, రజిత పప్పుతో పాటు షాపు నుంచి తెచ్చుకున్న పెరుగుతో అన్నం తిన్నారు. చెన్నయ్య మాత్రం వట్టి పప్పుతో తిని, ట్యాంకర్ తీసుకుని చందానగర్‌కు వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగిరాగా, రజిత తలుపులు తీసింది. అయితే శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో రజిత తీవ్రంగా కడుపు నొప్పి వస్తోందని భర్తకు చెప్పింది. చెన్నయ్య వెంటనే పిల్లలను నిద్రలేపేందుకు వెళ్లగా ముగ్గురు పిల్లలు నోటి నుండి నురగలు కక్కుతూ చలనం లేకుండా కనిపించారు. దీంతో వెంటనే బయటకు వెళ్లిన ఆయన 'కాపాడండి..' అంటూ అరిచాడు. స్థానికులు రావడంతో పిల్లలు చనిపోయారని, భార్యకు సీరియస్‌గా ఉందని చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చిన స్థానికులు రజితను బీరంగూడలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ పారితోష్ పంకజ్, సీఐ నరేష్, క్లూస్ టీం ఇంటి ముందు, వెనుక, భవనంపైన పరిశీలించారు. ఘటనపై స్థానికుల్ని ఆరా తీశారు. పిల్లల్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రజితతో అమీన్‌పూర్ పోలీసులు మాట్లాడారు. తాము విషం లాంటిదేమీ తీసుకోలేదని, పప్పు, పెరుగన్నం తిన్నామని, భర్త పప్పుతో అన్నం తిన్నాడని వివరించింది. దీంతో వీరు తిన్న పెరుగులో ఏదైనా కలిసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమానాస్పద మరణాలుగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపడతామని తెలిపారు.


ఆస్పత్రిలో రజిత

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చిన్నారుల బ్లడ్ శాంపిల్స్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అమీన్‌పూర్ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి అసలేం జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు. మరణించిన చిన్నారులు తీసుకున్న ఆహారంలో ఎవరైనా ఉద్దేశపూర్వంగా విషం కలిపారా? లేక ఫుడ్ పాయిజన్ జరిగిందా? అనేది పరిశీలిస్తున్నారు. చిన్నారుల బ్లడ్ శాంపిళ్లతో పాటు, ఇతర శాంపిల్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.

ఇప్పుడే ఏమీ చెప్పలేం: ఎస్పీ పరితోష్ పంకజ్



'క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించాం. స్థానికంగా ఆరా తీశాం. కానీ ఏం జరిగింది అన్న విషయం ఇంకా పూర్తిస్థాయిలో తెలియరాలేదు. పోస్టుమార్టం రిపోర్టు వస్తేనే ఎలా మృతి చెందారన్న విషయం తెలుస్తుంది. ఇప్పుడే ఏమీ చెప్పలేం..'అని ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు.

గతంలో భార్యాభర్తల మధ్య గొడవలున్నాయి: రజిత తల్లి



'గత ఏడాది వరకు నా కూతురుకి, అల్లుడికి గొడవలు ఉన్నాయి. అప్పట్లో వచ్చి సర్ది చెప్పి వెళ్లాం. అప్పుడే నా కూతురు.. మళ్లీ గొడవ జరిగితే నేను, నా పిల్లలు మందు తాగి చనిపోతామని, మందు దొరకకపోతే ఎక్కడైనా నదిలో పడి చనిపోతామని చెప్పింది..'అని రజిత తల్లి పార్వతమ్మ మీడియాకు చెప్పింది.

కారు ఇచ్చి ఆస్పత్రికి పంపా..



'చెన్నయ్య ఏడేళ్లుగా రాఘవేంద్ర కాలనీలో ఉంటున్నాడు. అర్ధరాత్రి రెండున్నర సమయంలో పిల్లలు చనిపోయారని, భార్య ప్రాణాపాయ స్థితిలో ఉందంటూ చెన్నయ్య అరవడంతో బయటకు వచ్చాం. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు నేనే కారు ఇచ్చా. డయల్ 100కు, పోలీసులకు సమాచారం ఇచ్చా'అని కాలనీ వాసి ప్రభాకర్ చారి చెప్పారు.

పుట్టినరోజు నాడే ప్రాణం తీశారు

పెద్దపల్లి జిల్లాలో పరువు హత్య

- రెండేళ్లుగా యువతితో ప్రేమలో సాయికుమార్.. కులాలు వేరు కావడంతో ఒప్పుకోని యువతి తండ్రి
- తన కుమార్తెతో మాట్లాడొద్దని హెచ్చరిక.. అయినా ఆమెతో కలిసి బర్త్‌డే జరుపుకోవడంతో ఆగ్రహం
- రాత్రికి స్నేహితులతో కలిసి పార్టీ చేసుకుంటుండగా వెంటాడి హతమార్చిన వైనం

సాక్షి, పెద్దపల్లి: కుమార్తెను ప్రేమిస్తున్నాడనే కోపంతో ఓ యువకుడిని యువతి తండ్రి కిరాతకంగా హతమార్చిన దారుణ ఘటన గురువారం రాత్రి పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో కలకలం సృష్టించింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూరెల్ల సాయికుమార్ (20), అదే గ్రామానికి చెందిన ఓ యువతి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరుకావడంతో వారి ప్రేమకు యువతి తండ్రి ముత్యం సదయ్య అడ్డుచెప్పాడు. తొమ్మిదో తరగతిలోనే చదువు మానేసిన సాయికుమర్‌ను ఇకపై తన కూతురితో మాట్లాడొద్దని పలుమార్లు హెచ్చరించాడు. అయినా యువతీయువకులు తరచూ మాట్లాడుకోవడంతోపాటు గురువారం ఉదయం కలిసే సాయికుమార్ బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారు. ఈ సమాచారం తెలియడంతో రగిలిపోయిన యువతి తండ్రి ముత్యం సదయ్య గురువారం రాత్రి 10 గంటలకు సాయికుమార్‌ను గొడ్డలితో నరికి చంపాడు.

పుట్టినరోజు వేడుకల్లోనే..

పెద్దపల్లిలోని హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ సెకండియర్ చదువుతున్న యువతిని సాయికుమార్ గురువారం కలిశాడు. ఆమెతో కలిసి బర్త్‌డే వేడుకలు చేసుకున్నాడు. రాత్రికి గ్రామంలో నలుగురు స్నేహితులు పూరెల్ల అఖిల్, చిలుమల హన్సిక్, కామెర అభిషేక్, చెవుల రాకేశ్‌తో కలిసి కేక్ కట్ చేశాడు. ఆపై స్నేహితులంతా మద్యం తాగేందుకు సిద్ధమయ్యారు. స్నాక్స్ కోసం రాకేశ్, అభిషేక్ కిరాణా దుకాణానికి వెళ్లగా.. అదే సమయంలో అక్కడికి చేరుకున్న యువతి తండ్రి వెంట తెచ్చుకున్న గొడ్డలితో సాయికుమార్‌పై దాడి చేశాడు. సాయికుమార్ ప్రాణభయంతో పరుగులు తీసినా సుమారు 200 మీటర్లు వెంటాడి గొడ్డలితో వేటు వేశాడు. ఈ క్రమంలో స్నేహితుడు అఖిల్ సదయ్యను అడ్డుకొని అతన్నుంచి గొడ్డలిని లాక్కున్నాడు. రక్తపుమడుగులో సాయికుమార్ కొట్టుమిట్టాడుతుండటంతో సదయ్య అక్కడి నుంచి నుంచి పారిపోయాడు. దాడి విషయాన్ని స్నేహితులు సాయికుమార్ తండ్రి పర్శరాములుకు తెలియజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి సాయికుమార్‌ను సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం ముప్పిరితోటలో అంత్యక్రియలు నిర్వహించారు. పర్శరాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సదయ్య కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. అయితే నిందితుడు జూలిపల్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడని సమాచారం. సదయ్యగా భావిస్తున్న వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు ఓ వీడియో క్లిప్ వైరల్‌గా మారింది.


రోదిస్తున్న తల్లి జ్యోత్స్న

వెంటాడిన మృత్యువు..

గురువారం తెల్లవారుజామున బాబాయ్ భరత్‌కు కిడ్నీలో నొప్పి వస్తోందని చెప్పడంతో సాయికుమార్ ఆయన్ను తీసుకొని కారులో కరీంనగర్ ఆస్పత్రికి బయల్దేరాడు. మార్గమధ్యలో దుబ్బపల్లి వద్ద కారు బోల్తాపడి రెండు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో భరత్‌కు స్వల్ప గాయాలవగా సాయికుమార్ సురక్షితంగా బయటపడ్డాడు. కానీ రాత్రికి మాత్రం దారుణ హత్యకు గురయ్యాడు. సాయికుమార్ చెల్లెలు 2016లో డెంగీతో మరణించగా ప్రస్తుతం కొడుకు సైతం మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పథకం ప్రకారమే హత్య..



నా కొడుకు, ఆ యువతి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. దీంతో మాకు టుంబాల మధ్య గొడవలయ్యాయి. నా కొడుకును చంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసి గతేడాది ఆగస్టు 23న పోలీసులకు ఫిర్యాదు చేశా. యువతి తల్లితో హరీశ్ అనే వ్యక్తి వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటాన్ని నా కొడుకు చూశాడు. ఇది అందరికీ చెబుతా డనే భయంతో హరీశ్, యువతి తల్లిదండ్రులతో కలిసి చంపినట్లు అనుమానంగా ఉంది. – పర్శరాములు, మృతుడి తండ్రి

ఏసీబీకి చిక్కిన వైద్యశాఖ ఉద్యోగి

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని మాస్ మీడియా అధికారి రవిశంకర్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఇటీవల గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడు ఓ మహిళకు గర్భస్రావం కోసం మాత్రలు ఇవ్వడంతో అబార్షన్ అయ్యింది. తగిన ప్రిస్క్రిప్షన్ లేకుండానే ఈ మాత్రలను పక్కన ఉన్న మెడికల్ షాపు నుంచి ఇచ్చినట్లు విచారణలో పేరు చేర్చుతానని మెడికల్ షాపు యజమానిని రవిశంకర్ భయభ్రాంతులకు గురిచేశాడు. రూ.30 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు గురువారం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా రవిశంకర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయనను కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్లు చెప్పారు. కాగా, రవిశంకర్ నల్లగొండలో పని చేసిన రోజుల్లోనూ అనేక ఆరోపణలు వచ్చాయి. స్కానింగ్ సెంటర్ల విషయంలోనూ తగిన అర్హతలు లేవంటూ రూ.లక్షల్లో డిమాండ్ చేశాడని ప్రచారం జరిగింది. నెలనెలా ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో తనిఖీ పేరిట వసూళ్లకు పాల్పడే వాడని వి మర్శలు ఉన్నాయి. ఇతని ఆగడాలు భరించలేక నల్లగొండలోని గైనకాలజిస్టులు అప్పటి కలెక్టర్ కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎంహెచ్‌వోతో విచారణ జరిపి డీహెచ్‌కు సరెండర్ చేశారు. తర్వాత పనిష్మెంటుపై ఆదిలాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

కగార్ దాడులపై మావోయిస్టుల బంద్ 4న

చర్ల: కేంద్రంతో పాటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి సంయుక్తంగా కగార్ దాడుల పేరిట మావోయిస్టులు, ఆదివాసీలను హతమారుస్తోందని మావోయిస్టు పార్టీ పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ అధికార ప్రతినిధి మోహన్ ఆరోపించారు. ఇందుకు నిరసనగా ఏప్రిల్ 4న బీజాపూర్ జిల్లా బంద్‌ను పాటించాలని ఆయన శుక్రవారం ఒక లేఖలో కోరారు.

మూడు కాదు.. ఆరు ముళ్లు


పెళ్లి మండపంలో ఇద్దరు వధువులతో వరుడు

లింగాపూర్: పెళ్లి చేసుకునేందుకు కొందరు యువకులకు అమ్మాయిలే దొరకని రోజులివి. ఎదురు కట్నం ఇచ్చి పెళ్లి చేసుకుంటున్న వారూ ఉన్నారు. కానీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఒక గిరిజన యువకుడు ఇద్దరు యువతులతో ప్రే మాయణం నడిపించడమే కా దు.. వారిద్దరినీ పెళ్లి చేసుకుని ఏడడుగులూ నడిచాడు. ఆరు ముళ్లు వేశాడు. ఈ పెళ్లి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం గుమ్నూర్ (కే)కు చెందిన సిడాం రూపబాయి, శ్రీమారుతి దంపతుల కుమారుడు సూర్యదేవ్.. హైదరాబాద్‌లో సినిమారంగంలో పని చేస్తున్నాడు. సిర్పూర్(యూ) మండలం షెట్టిహద్పనూరు రాజులగూడకు చెందిన కనక లాల్‌దేవితో మూడేళ్లుగా ప్రేమాయణం నడిపాడు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమెను దూరం పెట్టి.. ఇదే మండలం పుల్లార గ్రామానికి చెందిన ఆత్రం జలకర్ దేవితో ప్రేమ వ్యవహారం నడిపాడు. ఇంతలో ముందు ప్రేమించిన అమ్మాయి కనక లాల్‌దేవి.. తననే పెళ్లి చేసుకోవాలని పట్టుబట్టి పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించింది. దీంతో సూర్యదేవ్ జలకర్ దేవిని తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లిపోగా.. వారిని బంధువులు వెతికి పట్టుకొచ్చి మళ్లీ పంచాయితీ నిర్వహించారు. పెద్దల ముందు తాను ఇద్దరినీ చేసుకునేందుకు సూర్యదేవ్ అంగీకారం తెలిపాడు. తల్లిదండ్రులు, గ్రామస్తులు యువతుల అభి ప్రాయాన్ని కోరగా.. వారూ సరే అన్నారు. పెళ్లి కార్డులు కొట్టించారు.. ఫ్లెక్సీలూ వేయించారు. ఈ నెల 27న గురువారం గుమ్నూర్‌లో ఇద్దరు అమ్మాయిలతో ఒకే వేదికపై ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం సూర్యదేవ్ పెళ్లి జరిపించారు. ఇద్దరినీ బాగా చూసుకుంటానని గ్రామ పటేల్, మాజీ సర్పంచ్ ఆత్రం తెలంగ్‌రావు సమక్షంలో పెళ్లి కొడుకు ఒక బాండ్ పేపర్ రాసి పెళ్లికూతుళ్లకు ఇచ్చాడు. మూడు గ్రామాల నుంచి వెయ్యి మంది హాజరై పెళ్లిని తిలకించారు.

ధాన్యం కొనుగోళ్లలో ఆంక్షలు వద్దు


రాస్తారోకో చేస్తున్న రైతులు

తిప్పర్తి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి కొత్త ఆంక్షలు పెట్టకుండా గతంలో మాదిరిగానే ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ నల్లగొండ జిల్లా తిప్పర్తిలో రైతులు నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసేవారని, ఇప్పుడు మాత్రం తాలు, చెత్తను తూర్పార పట్టిన తర్వాతే కొనుగోలు చేస్తామని చెప్పి కాంటాలు వేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న నల్లగొండ ఆర్డీఓ అశోక్ రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. గతంలో మాదిరిగా ధాన్యం కొనుగోలు చేస్తే.. మిల్లర్లు తాలు, చెత్త ధాన్యంలో కోత విధిస్తున్నారని, మిల్లర్లు కోత విధించే అవకాశం లేకుండా తాలు, చెత్త లేకుండా ధాన్యం పంపితే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

షాపింగ్‌లో ఆ 'క్లిక్కే' వేరు!

దేశవ్యాప్తంగా 28 కోట్లకు ఆన్‌లైన్ షాపర్స్
అంతర్జాతీయంగా రెండవ స్థానం కైవసం
సంఖ్యలో అమెరికాను దాటిన భారత్



సాక్షి, స్పెషల్ డెస్క్: మనతోని అట్లుంటది.. అవును ఆటైనా, పాటైనా.. ఆఖరుకు రిటైల్ అయినా రికార్డులు సృష్టించడంలో ఆ 'క్లిక్కే' వేరు. ప్రపంచ ఆన్‌లైన్ రిటైల్ రంగంలో కస్టమర్ల సంఖ్య పరంగా అమెరికాను దాటి రెండవ అతిపెద్ద మార్కెట్‌గా భారత్ అవతరించింది. 28 కోట్ల మంది ఆన్‌లైన్ షాపర్స్‌తో రిటైల్ మార్కెట్‌ను మన దేశం షేక్ చేస్తోందని ఫ్లిప్‌కార్ట్ సహకారంతో బెయిన్ అండ్ కంపెనీ రూపొందించిన నివేదిక వెల్లడించింది. 92 కోట్ల మంది ఈ–రిటైల్ షాపర్స్‌తో చైనా తొలి స్థానంలో కొనసాగుతోంది. 27 కోట్ల ఆన్‌లైన్ షాపర్లతో అమెరికా మూడో స్థానంలో నిలిచింది. క్విక్ కామర్స్, ట్రెండ్–ఫస్ట్ కామర్స్, హైపర్–వాల్యూ కామర్స్ భారత్‌లో తదుపరి ఆన్‌లైన్ కొనుగోళ్ల వృద్ధి అధ్యాయాన్ని నిర్వచించనున్నాయి.

ఐదు మించి ప్లాట్‌ఫామ్స్..

ఈ–రిటైల్ షాపర్స్‌లో జెన్–జీ తరం (1997–2012 మధ్య పుట్టినవారు) సంఖ్య దాదాపు 40% ఉంది. ప్రత్యేక షాపింగ్ అలవాట్లు వారి సొంతం. వారిలో సగం మంది ఏటా ఐదు, అంతకంటే ఎక్కువ ప్లాట్‌ఫామ్‌ల నుంచి కొనుగోళ్లు చేస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న ఫ్యాషన్ బ్రాండ్‌లపై ఇతర కస్టమర్లతో పోలిస్తే జెన్–జీ తరం మూడు రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తోంది. హైపర్ వాల్యూ కామర్స్ (అతితక్కువ ధరగల ఉత్పత్తులు) సామాన్యులను ఆకర్షిస్తోంది. ఈ–రిటైల్‌లో 2021లో 5% వాటా కలిగి ఉన్న ఈ విభాగం ఇప్పుడు 12% మించిపోయింది. కిరాణా, జీవనశైలి, సాధారణ వస్తువులు ఈ–రిటైల్ మార్కెట్‌లో 55% వాటా కలిగి ఉన్నాయి. ఇవి 2030 నాటికి మూడింట రెండు వంతులకు చేరనున్నాయి.

తోడైన క్విక్ కామర్స్..

భారత్‌లో తలసరి జీడీపీ రూ. 2,99,950 కంటే ఎక్కువగా ఉన్న కేరళ, కర్ణాటక, గుజరాత్, ఢిల్లీ, చండీగఢ్, తమిళనాడు ఇప్పటికే ఈ–రిటైల్‌లో ఇతర ప్రాంతాలతో పోలిస్తే 1.2 రెట్లు అధికంగా వ్యాప్తి చెందాయి. దేశంలోని ఈ–రిటైల్ రంగంలో ప్రధానంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో వంటి సంస్థలు ఆధిపత్యం చెలాయిస్తూ గ్రామాల వరకు వ్యాపారాన్ని విస్తరించాయి. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ తదితర క్విక్ కామర్స్ కంపెనీలు మొత్తం ఈ–కామర్స్ జోరుకు సహాయపడుతున్నాయి. క్విక్ కామర్స్ యాక్టివ్ కస్టమర్ల సంఖ్య 2 కోట్లు దాటింది. స్వల్పకాలిక స్థూల ఆర్థిక ఎదురుగాలులు ఉన్నప్పటికీ భారత ఈ–రిటైల్ మార్కెట్‌లో దీర్ఘకాలిక అవకాశాలు బలంగా ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. ట్రెండ్–ఫస్ట్ ఫ్యాషన్ (సరసమైన ధరలకు ట్రెండీ కలెక్షన్) ఒక్కటే నాలుగు రెట్లు పెరిగి 2028 నాటికి సుమారు రూ. 68,560–85,700 కోట్లకు చేరుకోనుంది. ట్రెండ్–ఫస్ట్ ఫ్యాషన్ ఆదాయంలో సగానికిపైగా ఆన్‌లైన్ అమ్మకాల ద్వారానే రానుంది.

పెద్ద నగరాలతో సమానంగా..

ఈ–రిటైల్‌లో 2020 నుంచి ఇప్పటివరకు నమోదైన కొత్త కస్టమర్లలో దాదాపు 60% మంది తృతీయ శ్రేణి పట్టణాలు, చిన్న నగరాలకు చెందినవారే. అలాగే 2021 నుంచి ఈ–రిటైల్ ప్లాట్‌ఫామ్‌లలో చేరిన నూతన విక్రేతలలో 60% కంటే ఎక్కువ మంది ద్వితీయ శ్రేణి, చిన్న నగరాల నుంచి ఉన్నారు. మొత్తం ఆర్డర్స్‌లో తృతీయ, ఆ తర్వాతి స్థాయి పట్టణాల వాటా 45% పైగా ఉంది. ద్వితీయ శ్రేణి, చిన్న నగరాల్లో వినియోగదార్ల ఈ–రిటైల్ ఖర్చు మెట్రో, ప్రథమ శ్రేణి నగరాలతో సమానంగా ఉంది. అంతేగాక వివిధ వస్తు విభాగాలలో సగటు అమ్మకపు ధరలు సమానంగా లేదా కొంచెం తక్కువగా ఉన్నాయి.

పదింటిలో ఒకటి ఈ–రిటైల్‌కు..

ఈ–రిటైల్ (ఆన్‌లైన్ కొనుగోళ్లు) విపణి భారత్‌లో 2019– 2024 మధ్య ఏటా 20% వార్షిక వృద్ధి రేటు నమోదు చేసింది. 2024లో ఈ రంగంలో రూ. 5,14,200 కోట్ల వ్యాపా రం జరిగింది. ఏటా 18% వృద్ధితో 2030 నాటికి ఇది రూ. 14,56,900–16,28,300 కోట్లకు చేరుకుంటుందని అంచనా. స్థూల ఆర్థిక కారకాలు, వినియోగం క్షీణించిన కారణంగా దేశీయ ఈ–రిటైల్ వృద్ధి గతేడాదిలో 10–12 శాతానికి మందగించినప్పటికీ తాజాగా రికార్డు సృష్టించడం విశేషం. ఒకానొక దశలో ఈ రంగం 20% పైగా వృద్ధి సాధించింది. 2030 నాటికి దేశంలో తలసరి స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) రూ. 2,99,950– 3,42,800లకు చేరనున్న నేపథ్యంలో కస్టమర్లు రిటైల్‌లో 10 డాలర్లు (రూ. 857) వెచ్చిస్తే ఒకటి ఈ–రిటైల్ కోసం ఖర్చు చేస్తారట. అనవసర ఖర్చుల పెరుగుదల అందుకు ఆజ్యం పోయనుందని నివేదిక వివరించింది.



భారత్‌లో ఈ–రిటైల్ వ్యాపారం
2024
రూ.5,14,200 కోట్లు..
2030
రూ.16,28,300 కోట్లకు..

క్విక్ కామర్స్ యాక్టివ్ కస్టమర్ల సంఖ్య 2 కోట్లు..
ఈ–రిటైల్ షాపర్స్‌లో జెన్–జీ వాటా 40%
మూడు రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తున్న జెన్–జీ
ట్రెండ్–ఫస్ట్ ఫ్యాషన్ 2028 నాటికి రూ.85,700 కోట్లకు

క్లుప్తంగా...

ఆ రంగాలకు కేటాయింపులు లేకపోతే ఎలా?

'ఎక్స్'వేదికగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం తన ప్రాథమ్యాలను పునర్ నిర్వచించుకుని విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ తదితర రంగాలకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రజలకు సమ్మిళిత అభివృద్ధి ఫలాలు అందించేందుకు, దీర్ఘకాలిక ప్రయోజనాల సాధనకు సమతుల్య, మెరుగైన ప్రణాళికలతో కూడిన బడ్జెట్ అనేది కీలకమని శుక్రవారం 'ఎక్స్'వేదికగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా.. వైద్యారోగ్యం, విద్య, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు.

ఎస్సీ వర్గీకరణతో బుడగ జంగాలకు మేలు: దామోదర



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ ద్వారా బుడగ జంగాలకు మేలు జరిగిందని, అత్యంత వెనుకబాటుతనంతో ఉన్న ఈ వర్గాలు విద్యా, ఉద్యోగాల్లో ముందుకు వెళ్లేందుకు వర్గీకరణ ఉపయోగపడుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఆకాంక్షను నెరవేర్చినందుకు రాష్ట్రంలోని బుడగ జంగాల కుల ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపిన రాజనర్సింహ మాట్లాడుతూ.. మొత్తం షెడ్యూల్డ్ కులాల్లో బుడగ జంగాల అక్షరాస్యత చాలా తక్కువగా ఉందని, ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనకబడి ఉన్నారని అన్నారు. అందుకే ఈ కులాన్ని అత్యంత వెనుకబడిన గ్రూప్ 1లో చేర్చడం జరిగిందని చెప్పారు.

కాంగ్రెస్ సర్కారు మోసాలను ఎండగడుతూనే ఉంటాం: కవిత



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇటీవల ముగిసిన శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడంతో పాటు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై గళమెత్తామన్నారు. పార్టీ ఎమ్మెల్సీలతో కలసి శుక్రవారం ఆమె అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుల ఆమోదం వెనుక బీఆర్ఎస్ కృషి ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు రూ.4.42 లక్షల కోట్లు కాగా, సీఎం రేవంత్ మాత్రం రూ.8 లక్షల కోట్లు అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మోసానికి చిరునామాగా మారిందని ఎమ్మెల్సీ మధుసూదనాచారి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేర్ల మార్పుపై ఉన్న శ్రద్ధ పాలనపై లేదని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం పారిపోయేందుకు ప్రాధాన్యం ఇచ్చిందని ఎమ్మెల్సీ ఎల్.రమణ విమర్శించారు.

పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహం ఏర్పాటు చేయడానికి సహకరించాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్‌కు ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ, ఏపీలో ఉపాధి కూలీ వేతనం రూ.307

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తెలంగాణ, ఏపీలకు సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి కూలీలకు రూ.307 వేతనాన్ని నిర్ధారించింది. ఇప్పటివరకు ఈ వేతనం రూ.300 ఉండగా తాజాగా ఏడు రూపాయలను పెంచారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 2025 ఏప్రిల్ 1 నుంచి కొత్త వేతనాల చెల్లింపు అమల్లోకి రానుంది.

రెవెన్యూ 'మాసం'

ఏప్రిల్ నెలలోనే రెవెన్యూశాఖలో కీలక మార్పులు



ధరణి స్థానంలో అమల్లోకి రానున్న భూభారతి
- రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణలకు ఈ నెలలోనే శ్రీకారం
- ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తేనున్న ప్రభుత్వం
- హైదరాబాద్ పరిసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తొలుత పైలట్ పద్ధతిలో అమలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల.. రాష్ట్ర రెవెన్యూ శాఖలో కీలక మార్పులకు వేదిక కాబోతోంది. రాష్ట్రంలో అధికార మార్పిడికి కారణమైందని భావిస్తున్న ధరణి చట్టం ఏప్రిల్‌లోనే చరిత్రగా మిగిలిపోనుంది. వ్యవసాయ భూముల లావాదేవీల కోసం ధరణి స్థానంలో 'భూభారతి'చట్టం అమల్లోకి రానుంది. ఉగాది నుంచే భూభారతి చట్టాన్ని అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావించినా, ఏప్రిల్ రెండో వారం తర్వాత అమల్లోకి రానుందని సమాచారం. ఇప్పటికే న్యాయశాఖ నుంచి కూడా భూభారతి మార్గదర్శకాలకు క్లియరెన్స్ వచ్చిందని, సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలన అనంతరం ఈసారి జరగబోయే కేబినెట్‌లో ఆమోదం తీసుకొని అమల్లోకి తెస్తామని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

భూభారతి పైలట్ ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లా

భూభారతి చట్టంలో పొందుపరిచే మార్గదర్శకాలకు అనుగుణంగా జరగాల్సిన అన్ని కార్యకలాపాలను నిజామాబాద్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పైలట్‌గా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలో చేపట్టిన భూభారతి ప్రాజెక్టు ద్వారా ఆ జిల్లాలోని 922 గ్రామాల్లో ఉన్న దాదాపు 14 లక్షల ఎకరాల భూమి వివరాలను డిజిటలైజ్ చేసే ప్రయత్నం జరిగింది. జిల్లాలోని 914 గ్రామాల్లో భూముల సర్వే కూడా పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో కొత్తగా అమల్లోకి రానున్న భూభారతి చట్టం మార్గదర్శకాలను కూడా పూర్తిస్థాయిలో ఈ జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో పైలట్ పద్ధతిలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాపింగ్, అవసరమైన మేరకు సర్వేయర్ల నియామకం లాంటి కీలక చర్యలు కూడా ఈ పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయాలని రెవెన్యూ శాఖ యోచిస్తోంది. అయితే, కేబినెట్ ఆమోదం పొందిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా చట్టం అమల్లోకి వస్తుందని, చట్టం మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేసే ప్రక్రియ మాత్రం పైలట్ పద్ధతిలో నిజామాబాద్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో చేపడతామని, అక్కడి అనుభవాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా భూభారతిని పకడ్బందీగా అమలు చేసేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

రిజిస్ట్రేషన్లు ఇక ఈజీ

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలోనూ ఏప్రిల్ నెలలోనే కీలక మార్పులు జరగనున్నాయి. వ్యవసాయేతర భూముల క్రయవిక్రయ లావాదేవీల కోసం ఇప్పటికే ఆన్‌లైన్ విధానం అమల్లో ఉన్నా, ఎక్కువగా మాన్యువల్ పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకుగాను ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని విస్తృతంగా అమల్లోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ఈజీ రిజిస్ట్రేషన్లు జరిగేలా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో సంస్కరణలకు ఆయన శ్రీకారం చుడుతున్నారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ నెలలో హైదరాబాద్ పరిసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని పైలట్ ప్రాజెక్టు కింద అమల్లోకి తెచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా 90 శాతం లావాదేవీలు ఆన్‌లైన్ స్లాట్స్ ద్వారా, 10 శాతం మాత్రమే మాన్యువల్ పద్ధతిలో జరగనున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా 10 నిమిషాల్లో పూర్తయ్యేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ మార్పులు కూడా జరుగుతున్నాయి. ఇక, వీలును బట్టి ఈ నెలలో రాష్ట్రంలో భూముల విలువల సవరణ ప్రక్రియ కూడా చేపట్టే అవకాశాలున్నాయని, ధరణి పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిటింగ్ చేయడం కూడా ఈ నెలలోనే ప్రారంభమవుతుందని, ఇందుకోసం పలు ఐటీ కంపెనీలతో రెవెన్యూ వర్గాలు సంప్రదింపులు జరుపుతున్నాయని తెలుస్తోంది.

బేస్‌మెంట్ పూర్తయితే వెంటనే రూ.1,00,000

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి..
ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన గ్రామాల్లో.. ఇళ్ల గ్రౌండింగ్ పనులు వేగవంతం చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 516 గ్రామా ల్లో ఒకేసారి మంజూరు చేసిన ఇళ్లను వెంటనే పనులు ప్రారంభించాలని, ఇదివరకే ఒకవేళ నిర్మాణాలు ప్రారంభించి..బేస్‌మెంట్ వరకు పూర్తయిన వారికి రూ.లక్ష తక్షణమే ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సహచర మంత్రులు సీతక్క, కొండా సురేఖలతో పాటు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వానికి ప్రాధాన్యత అంశమని, దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నాలుగు విడతల్లో డబ్బు చెల్లిస్తుందని, మొదటి విడతలో బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన తర్వాత రూ.లక్ష ఇస్తుందని ఆ వివరాలను వెంటనే పంపించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇళ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని చెప్పారు. నిర్మాణం పూర్తికాక, కేవ లం గోడలు నిర్మించి కాంట్రాక్టర్ వెళ్లిపోతే. అలాంటి ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకునేలా అవసరమైన ఆర్థిక సహాయం ప్రభుత్వం చేస్తుందని మంత్రి చెప్పారు.

తాగునీటి సమస్య లేకుండా...

వేసవిలో ఏ గ్రామంలో లేదా పట్టణాల్లోగాని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమని, ప్రజలు తాగునీరు రావడం లేదన్న విమర్శ రాకుండా పనిచేయాలని సలహా ఇచ్చారు. నీటికొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్‌లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

జూన్‌లోగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి..జూన్ చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి, ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్, డైరెక్టర్ శ్రీదేవి అక్కడ పర్యటించాలని మంత్రి సూచించారు. డంపింగ్ యార్డుకు 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్రనాయక్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఉన్నతాధికారులు దానకిశోర్, హరిచందన, కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడుల కోసం టెక్నాలజీ వాడండి

ఏఐ, మెషీన్ లెర్నింగ్ సాయంతో మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయండి
శాస్త్రవేత్తలు, పరిశోధకులకు ఇక్రిశాట్ డీజీ డాక్టర్ హిమాన్షు పాఠక్ పిలుపు



భారతీయ బీజ్ సహకార సమితి లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంటున్న ఇక్రిశాట్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని మెట్ట ప్రాంతాల్లో ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటల కోసం శాస్త్రవేత్తలు, పరిశోధకులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాంశు పాఠక్ సూచించారు. ఇక్రిశాట్ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, అనంతరం జరిగిన సంస్థ 54వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్ మొదలైన నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించుకొని మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మెట్ట ప్రాంతాల్లో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పాఠక్ ఆందోళన వ్యక్తం చేశారు. మెట్ట ప్రాంతాల్లో ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగితే 20 శాతం పంట తగ్గుతుందని.. ఇది ఆందోళన కలిగించే అంశమన్నారు. మీడియా సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్టాండర్డ్ బ్లేడ్, డైరెక్టర్ రామన్ కె.పీచే పాల్గొన్నారు.

కొత్త పంట రకాల పరిచయం..

వార్షికోత్సవంలో ట్రాన్స్‌ఫార్మింగ్ డ్రైలాండ్ అగ్రికల్చర్: ఓవర్ 50 ఇయర్స్ ఆఫ్ ఇంపాక్ట్ అనే వీడియోను ఆవిష్కరించారు. 2024లో ఐదు దేశాల్లో విడుదలైన 23 కొత్త పంట రకాలను పరిచయం చేశారు. సీడ్‌పల్స్ పేరుతో సీడ్ సిస్టమ్స్‌పై పాలసీ బ్రీఫ్, మిల్లెట్ మెయిన్ స్ట్రీమింగ్‌పై కొత్త పాలసీ బ్రీఫ్‌ను విడుదల చేశారు. సౌరశక్తితో నడిచే వాటర్ హైసింత్ హార్వెస్టర్‌ను రూపొందించిన సిబ్బందికి పేటెంట్ గుర్తింపు సర్టిఫికెట్లు అందజేశారు. ప్లాంట్ హెల్త్ డిటెక్టర్ యాప్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం చిన్నరైతులకు నాణ్యమైన విత్తన రకాలు అందించేలా భారతీయ బీజ్ సహకార సమితి లిమిటెడ్ తో ఇక్రిశాట్ ఒప్పందం కుదుర్చుకుంది.

1.06 లక్షల మంది సైనికులకు ఉద్యోగాలు

ఏపీలో 77,912 మంది, తెలంగాణలో 28,200 మందికి అవకాశం
లోక్‌సభలో వెల్లడించిన రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేఠ్

సాక్షి, న్యూఢిల్లీ: పలు రంగాల్లో దేశానికి సేవ చేసి ఉద్యోగ విరమణ చేసిన మాజీ సైనికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు కేంద్ర రక్షణ శాఖ తెలిపింది. దేశంలో సైన్యం, నేవీ, వైమానిక దళంలో పనిచేసి పదవీ విరమణ పొందిన 27,78,951 మంది ఉద్యోగాలు చేస్తున్నట్లు ఆ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేఠ్ శుక్రవారం లోక్‌సభలో రాతపూర్వకంగా వెల్లడించారు. తెలంగాణలో 2023, డిసెంబర్ 31 నాటికి సైన్యం నుంచి పదవీ విరమణ పొందిన 19,455 మంది, నేవీ నుంచి పదవీ విరమణ పొందిన 1,532 మంది, వైమానిక దళం నుంచి పదవీ విరమణ పొందిన 7,213 మంది.. మొత్తం 28,200 మంది ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మాజీ సైనికులకు గ్రూప్–సీలో 14.5%, గ్రూప్–డీ పోస్టుల్లో 24.5% ఖాళీలను భర్తీ చేసినట్లు వెల్లడించారు. అలాగే వీరందరికీ వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకం కింద పెన్షన్ కూడా అందిస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

1,200 ఎకరాలు.. 10 లక్షల జనం



ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ
- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వేదికగా భారీసభ
- సభాస్థలిని సందర్శించిన నేతలు
- సభ నిర్వహణకు భూములివ్వడానికి రైతుల అంగీకారం
- నేడు కేసీఆర్‌తో ఉమ్మడి వరంగల్ నేతల భేటీ

సాక్షి ప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు వేదికగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఖరారైంది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉమ్మడి వరంగల్ నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అధికారికంగా ప్రకటించారు. ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగసభకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, సతీష్ బాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డితదితరులు శుక్రవారం పరిశీలించారు. సభ నిర్వహణకు సంబంధించి భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర అనుమతుల కోసం కాజీపేట ఏసీపీ తిరుమల్‌ను వరంగల్ ముఖ్య నాయకులు కలిసి దరఖాస్తు ఇచ్చారు.

భారీగా జన సమీకరణ

ఎల్కతుర్తి మండల కేంద్రంలో లక్షలాది మందితో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 1,200 ఎకరాలకు సంబంధించిన రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. మొత్తం 1,200 ఎకరాల్లో పార్కింగ్, సభా వేదికలు ఏర్పాటు చేయనున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కేసీఆర్ సూచించిన నేపథ్యంలో 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి జాతీయ రహదారిలో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచేవిధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ, ఇతర వాహనాలు కలిపి 40 నుంచి 50 వేల వరకు రావొచ్చని అంచనా వేస్తున్న నాయకులు ఆ మేరకు పార్కింగ్ ఏర్పాట్లు చూస్తున్నారు. వలంటీర్లను ఎంపిక చేసి రిటైర్డ్ పోలీసులతో శిక్షణ ఇప్పిస్తున్నారు.

రెండు రోజుల్లో సభ నిర్వహణ కమిటీలు..

ఎల్కతుర్తి రజతోత్సవ సభపై శనివారం ఉమ్మడి వరంగల్ నేతలతో కేసీఆర్ భేటీ కానున్నారు. ఈ మేరకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలతో చర్చించనున్నారు. అనంతరం సభ సక్సెస్ కోసం రెండు రోజుల్లో సుమారు 20 రకాల సన్నాహక కమిటీలు ఖరారు చేయనున్నట్టు పార్టీవర్గాల సమాచారం.

వివేచన లేని విధ్వంసాన్ని నిలిపివేయండి: కేటీఆర్

కంచె గచ్చిబౌలి భూముల విక్రయంతో పర్యావరణానికి హాని



సాక్షి, హైదరాబాద్: 'రంగారెడ్డి జిల్లా కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలు విక్రయించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం.. హైదరాబాద్ నగర పర్యావరణాన్ని దెబ్బతీస్తుంది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం అమ్మకానికి సిద్ధమవుతున్న భూముల్లో ఎలాంటి జంతుజాలం లేదని సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం అసెంబ్లీలో ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విద్యార్థులు, అధ్యాపకులు చెబుతున్న వివరాల ప్రకారం.. సదరు భూమిలో 700 రకాల పుష్పించే మొక్క లు, 10 రకాల క్షీరదాలు, 15 రకాల సరీసృపాలు, 200 రకాల పక్షులతోపాటు లక్షలాది సంవత్స రా ల క్రితం ఏర్పడిన అరుదైన శిలాసంపద ఉందన్నారు. పర్యావరణానికి భంగం కలిగిస్తూ బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య కేంద్రాలు నిర్మించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం దురదృష్టకరమన్నారు. వివేచన లేకుండా చేస్తున్న విధ్వంసాన్ని ప్రభుత్వం నిలిపివేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

ఆఫీసు లీజింగ్‌లో అథఃపాతాళానికి

హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట జరిగిన విధ్వంసంతో హైదరాబాద్‌లో ఇళ్ల కొనుగోలు తగ్గిందన్నారు. గడిచిన త్రైమాసికంలో హైదరాబాద్‌లో 49 శాతం ఇళ్ల విక్రయాలు తగ్గగా, ఆఫీస్ లీజింగ్ అథఃపాతాళానికి చేరుకొని.. ఈ ఏడాది జనవరి నుంచి 41 శాతం తగ్గుదల నమోదైందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి వల్లే తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహన దిగ్గజ కంపెనీ బీవైడీ పెట్టుబడులకు ముందుకు వచ్చిందన్నారు. ప్రభుత్వాలు మంచి విధానాలను ప్రవేశపెడితే, నీచమైన రాజకీయాలను అధిగమించి గొప్ప ఫలితాలను ఇస్తాయనిం బీవైడీ పెట్టుబడుల నిర్ణయం రుజువు చేసిందన్నారు.

కేటీఆర్‌కు బ్రిడ్జ్ ఇండియా ఆహ్వానం

బ్రిటన్‌లో ఈ ఏడాది మే 30న జరిగే 'ఐడియాస్ ఫర్ ఇండియా'సదస్సుకు రావాలంటూ బ్రిడ్జ్ ఇండియా సంస్థ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించింది. లండన్‌లోని రాయల్ లాంకాస్టర్ హోటల్‌లో జరిగే సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొనాలని బ్రిడ్జ్ ఇండియా వ్యవస్థాపకుడు ప్రతీక్ దత్తాని ఆహ్వాన లేఖ పంపారు. 2023లో ఇదే కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న కేటీఆర్ ప్రసంగం, ఆలోచనలు అందరినీ ఆకట్టుకున్నాయని ప్రతీక్ తెలిపారు. ఈసారి కూడా లండన్ వ్యాపారవర్గాలు, ఇండో–యూకే కారిడార్లోని ముఖ్య వ్యక్తులు, తెలుగు ప్రవాసులు కేటీఆర్‌ను కలవడానికి ఆసక్తి చూపిస్తున్నారన్నారు.

నా వ్యాఖ్యలను చంద్రబాబు వక్రీకరించారు

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని
కమ్యూనిస్టులు టూరిజం అభివృద్ధికి వ్యతిరేకం కాదు



సాక్షి, హైదరాబాద్: పర్యాటక రంగ అభివృద్ధి విష యంలో తాను అసెంబ్లీలో మాట్లాడిన మాటలను ఏపీ సీఎం చంద్రబాబునాయుడు వక్రీకరించారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. టూరిజం అభివృద్ధి ద్వారా ప్రభుత్వానికి నిధులు సమకూరుతాయని మాత్రమే తాను సూచించానని అన్నారు. కానీ తాను అన్న మాటలను వక్రీకరించి.. 30 ఏళ్ల క్రితం చెప్పిన మాటలను ఇప్పుడు కమ్యూనిస్టులు కూడా ఒప్పుకుంటున్నారని, వారు టూరిజం గురించి అర్థం చేసుకునేందుకు 30 ఏళ్లు పట్టిందని చంద్రబాబు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. శుక్రవారం మఖ్దూం భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ ఇజం లేదని, టూరిజం మాత్రమే ఉందని చంద్రబాబు చెప్పినప్పుడు కమ్యూనిస్టులకు కోపం వచ్చేదన్నారు. కమ్యూనిస్టులు టూరిజం అభివృద్ధికి వ్యతిరేకం కాదని, చైనాలో కూడా పర్యాటక రంగం అభివృద్ధి జరుగుతోందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు అనుకూలమైంది కాదని అన్నారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 29 । మార్చి । 2025




కాంతి మంత్రం
ముఖం, చేతులు సూర్య కిరణాలు నేరుగా తగిలే ఇతర ప్రదేశాల్లో చర్మం నిర్జీవంగా మారిపోతోంది. పరిస్థితిని అధిగమించాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. - సిటీప్లస్‌లో



థింగ్యాన్.. ఓ బర్మా కథ..
బర్మా దేశం నూతన సంవత్సరాది నేపథ్యంలో నగరంలో బర్మా ఫుడ్ ఫెస్టివల్ 'థింగ్యాన్' ప్రారంభం కానుంది. ఇరు దేశాల సంస్కృతికి నిదర్శనంగా దీనిని నిర్వహిస్తున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
39.0/25.0
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 39, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



దివ్యాంగ రోగులకు యూనిక్ ఐడీ కార్డులు

లక్డీకాపూల్: దివ్యాంగ, మానసిక రోగులకు ఇకపై యూనిక్ డిజబిలిటీ ఐడీ కార్డులు (యూడీఐడీ) కార్డులు అందచేయనున్నట్టు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం ఎర్రగడ్డ మానసిక వైద్యశాలను డీఆర్ఓ వెంకటాచారితో కలసి ఆయన సందర్శించారు. ముందుగా ఆస్పత్రిలోని సదరం కేంద్రాన్ని పరిశీలించి కేంద్రంలో సత్వరమే మౌలిక వసతులు కల్పించి అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రం ఇకపై యూడీఐడీ కేంద్రంగా పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్.. మాట్లాడుతూ యూడీఐడీ సర్టిఫికెట్లు జారీ చేయడానికి ఉస్మానియా ఆస్పత్రి (ఆర్థోపెడిక్), సరోజినీ ఆస్పత్రి (అంధులు), కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రి (చెవిటి, మూగ), నిలోఫర్ ఆస్పత్రి (పిల్లలకు), మానసిక రోగులకు ఎర్రగడ్డ ఆస్పత్రులను ఎంపిక చేశామన్నారు. సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారికి అర్హత మేరకు సర్టిఫికెట్లు, కార్డులు జారీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆర్.అనిత, తహసీల్దార్ పద్మ సుందరి, వివిధ విభాగాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జుమ్మాతుల్ విదా ప్రార్థనలు

బందోబస్తును పర్యవేక్షించిన నగర సీపీ సీవీ ఆనంద్



పాతబస్తీలో పర్యటిస్తున్న సీపీ

చార్మినార్: జుమ్మాతుల్ విదా సందర్భంగా మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. రంజాన్ మాసంలోని శుక్రవారం సందర్భంగా నిర్వహించిన జుమ్మాతుల్ విదా సామూహిక ప్రార్థనలను పురస్కరించుకొని ఆయన దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, ఇతర ఐపీఎస్ అధికారులతో కలిసి మక్కా మసీదు, చార్మినార్ పరిసర ప్రాంతాలను సందర్శించారు. జుమ్మాతుల్ విదా సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. అలాగే జగ్నేకీ రాత్ సందర్భంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు సీపీ పాతబస్తీలో పర్యటించి షబ్బే ఖదర్ వేడుకలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట నగర అదనపు పోలీసు కమిషనర్ (ఎల్‌అండ్‌ఓ) విక్రంసింగ్ మాన్, నగర ట్రాఫిక్ డీసీపీ–3 ఆర్.వెంకటేశ్వర్లు, డీసీపీ హెడ్ క్వార్టర్స్ రక్షిత మూర్తి తదితరులున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

అనుదీప్ దురిశెట్టి

లక్డీకాపూల్: ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య విధాన పరిషత్ పరిధిలోని వివిధ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్యాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ కాన్పులకు ప్రాధాన్యమివ్వాలని, వైద్యాధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. జిల్లాలోని వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, ఖాళీల వివరాలు, వైద్యుల కొరత, చేపట్టాల్సిన అంశాలపై ఆయన దిశా నిర్దేశం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యాధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లల విభాగాల్లో ఎక్కువగా ఓపీ శాతం పెరగాలని, ఆదిశగా చికిత్సలు అందించాలన్నారు. మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. ఆస్పత్రులకు అవసరమైన వైద్య పరికరాలు కొనుగోలుకు ప్రతిపాదనలు పంపాలని, కాంట్రాక్ట్ వైద్యాధికారుల ఖాళీల వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ రాజేంద్రనాథ్, వివిధ ప్రభుత్వాస్పత్రుల సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనుదీప్



కరాటే పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



క్రీడాకారులతో పొన్నం, ప్రసాద్‌కుమార్, మహేష్‌కుమార్ గౌడ్



క్రీడాకారుల విన్యాసాలు..

క్రీడలకు మరింత ప్రోత్సాహం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్
- 2027లో నగరంలో ఆసియా కరాటే చాంపియన్‌షిప్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన '4వ నేషనల్ కరాటే చాంపియన్ షిప్' పోటీలు

బడ్జెట్‌లో రూ.465 కోట్లు కేటాయింపు

గచ్చిబౌలి: క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 4వ కరాటే నేషనల్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో క్రీడల కోసం రూ.465 కోట్లు తమ ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. 10 ఏళ్ల క్రీడలను నిర్వీర్యం చేశారని, సీఎం రేవంత్ రెడ్డి స్పోర్ట్స్‌పై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 2027లో హైదరాబాద్‌లో ఆసియా కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. సెవెన్త్ డాన్ బ్లాక్ బెల్ట్ సాధించిన తాను ఇప్పటికీ కరాటే సాధన చేస్తున్నట్లు ఆయన వివరించారు. కాగా.. 1,500 మంది క్రీడాకారులు పోటీలలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, వైస్ చైర్మన్, ఎండీ సోనీ బాల, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజహరుద్దీన్, బాక్సర్ నిఖత్ జరీన్, ఇండియన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ శర్మ, ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, ఓబీసీ డెవలప్‌మెంట్ చైర్మన్ జెరిపాటి జైపాల్, కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గం చెరువులో దూకి ఐటీ ఉద్యోగిని ఆత్మహత్యా యత్నం

కాపాడిన బోటింగ్ సిబ్బంది, పోలీసులు



కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకిన రోజాను కాపాడిన బోటింగ్ సిబ్బంది, పోలీసులు

మాదాపూర్: మానసిక ఒత్తిడి తట్టుకోలేని ఓ ఐటీ ఉద్యోగిని కేబుల్ బ్రిడ్జిపై నుంచి దుర్గం చెరువులోకి ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించగా.. వెంటనే స్పందించిన బోటింగ్ డ్రైవర్లు, పోలీసులు ఆమెను కాపాడిన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్ నగర్‌కు చెందిన రోజా (27) ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై నుంచి దుర్గం చెరువు మధ్యభాగంలో దూకడంతో 24 గంటలు అందుబాటులో ఉన్న పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది, బోటింగ్ డ్రైవర్లు ఆమె రక్షించారు. బోటింగ్ సూపర్‌వైజర్ మనోహర్, డ్రైవర్ విష్ణు సమయానికి చేరుకుని రోజాను కాపాడారు. ఉద్యోగంలో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు సమాచారం. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బెదిరింపులకు చెక్!



క్షేత్ర స్థాయి పర్యటనలో రంగనాథ్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా పేరు చెప్పే అక్రమార్కులు, కబ్జాకారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జల వనరులతో పాటు నాలాలు, పార్కులు, కామన్ ఏరియాలు, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఆక్రమణలపై ఈ విభాగం ఉక్కుపాదం మోపుతోంది. దీన్నీ క్యాష్ చేసుకోవడానికి కొందరు బయలుదేరారు. హైడ్రాకు ఫిర్యాదు చేస్తామనో, చేసి నోటీసులు జారీ అయిన తర్వాతో బెదిరింపు దందాలకు దిగుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ వద్దకు వచ్చే ఫిర్యాదుల్లో ప్రాథమిక విచారణ పూర్తి చేశాకే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే అంశాన్ని హైకోర్టుకు విన్నవించారు.

కొన్ని ప్రాంతాల్లోనే సమస్యలు..
'గ్రేటర్' వ్యాప్తంగా ఉన్న భూముల విషయంలో ఇబ్బందులు లేకపోయినా.. కొన్ని ప్రాంతాలకు సంబంధించిన లేఔట్లలో మాత్రం సమస్యలు ఉంటున్నాయి. అక్కడ ఉన్న ప్లాట్లలో కొందరు యజమానులు తమ భూమికి సంబంధించి మీమాంసలో ఉంటున్నారు. తమ పేరుతో రిజిస్టర్ అయి ఉన్నప్పటికీ... జలవనరా? ప్రభుత్వ స్థలమా? ప్రైవేట్ స్థలమా? అనే సందేహాలు వారిని వెంటాడుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం వారికి స్పష్టత ఇవ్వడంలో విఫలం అవుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన లేదా ఇలాంటి విషయాలపై సమాచారం ఉన్న వ్యక్తులు రంగంలోకి దిగుతున్నారు. మీ ప్లాట్ లేదా భూమిపై వివాదం ఉందని, హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తున్నారు. కొందరైతే ముందే ఫిర్యాదు చేసి అధికారులు నోటీసులు జారీ చేసిన తర్వాత దందాకు దిగుతున్నారు.

హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ పలువురి దందాలు
- అధికారిక నోటీసులు ఇప్పించి భయపెట్టాలని యత్నం
- ఇది గమనించి కీలక నిర్ణయం తీసుకున్న ఏవీ రంగనాథ్
- ఇక ప్రాథమిక విచారణ తర్వాతే నోటీసు జారీ ప్రక్రియ
- న్యాయస్థానానికి సైతం విన్నవించిన హైడ్రా అధికారులు

వ్యక్తిగత ఫిర్యాదులకు తక్కువ ప్రాధాన్యం..
ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఏవీ రంగనాథ్ ఎలాంటి ఫిర్యాదు అందినప్పటికీ విచారణ లేకుండా నోటీసులు జారీ చేయవద్దని స్పష్టం చేశారు. తొలుత ఫిర్యాదుదారుడి నుంచే వీలున్నన్ని డాక్యుమెంట్లు సేకరించాలని అధికారులకు సూచించారు. వాళ్లు అందించినా, అందించకున్నా సంబంధిత శాఖల్ని సంప్రదించి ఖరారు చేసుకోవాలని ఆదేశించారు. వీలున్నంత వరకు ఫిర్యాదు దారుల ముందే గూగుల్ మ్యాప్స్, శాటిలైట్ ఇమేజెస్, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్స్ తదితర శాస్త్రీయ ఆధారాలను బట్టి విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఆయా ఫిర్యాదుల్లో కీలకమైన వాటిని కమిషనర్ రంగనాథ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించడంతో పాటు వారంలో రెండు రోజులు సమీక్షిస్తున్నారు. అవసరమైతే ఆయనే స్వయంగా రంగంలోకి దిగిన క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య, వ్యక్తిగత అంశాలకు సంబంధించి ఉన్న వివాదాల ఫిర్యాదులకు తక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. జలవనరులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన వాటికే కీలక ప్రాధాన్యం ఇస్తున్నారు.

10 వేలు దాటిన ఫిర్యాదులు..
హైడ్రా ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి జరుగుతోంది. దీంతో పాటు మిగిలిన రోజుల్లోనూ కొందరు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలా ఈ రెండు రకాలుగానూ ఇప్పటి వరకు హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల సంఖ్య 10 వేలు దాటింది. ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, సాంకేతికంగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కారణంగానే కొన్ని సమస్యలు పరిష్కారానికి సమయం తీసుకుంటోందని అధికారులు చెబుతున్నారు. ఫిర్యాదుదారులు ఫోన్, వాట్సాప్ ద్వారా కాకుండా వీలున్నంత వరకు నేరుగా రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఫిర్యాదుతో పాటు అందుబాటులో ఉన్న సపోర్టింగ్ డాక్యుమెంట్లు జత చేయాలని స్పష్టం చేస్తున్నారు.

బైక్ నడిపేస్తా.. ఇఫ్తార్‌కు వచ్చేస్తా!





సికింద్రాబాద్‌లోని బౌద్ధనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు గౌడ్‌లు పాల్గొన్నారు. అంతకుముందు సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి కేటీఆర్ ద్విచక్ర వాహనం నడపగా.. వెనక సీట్లో పద్మారావు గౌడ్ కూర్చున్నారు. వారాసిగూడ చౌరస్తాలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, రాసూరి సునీత, నాయకులు రామేశ్వర్ గౌడ్, ఇఫ్తార్ విందు నిర్వాహకులు బషీర్, అబ్దుల్, మునావర్ తదితరులు పాల్గొన్నారు.
- బౌద్ధనగర్

ఓపెన్‌టాప్ జీపులో ఎయిర్ రైఫిల్‌తో...



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1లోని సర్వి హోటల్ సమీపంలో ఓపెన్‌టాప్ జీపులో వెళ్తూ ఎయిర్ రైఫిల్‌ను చూపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన యువకుడితో పాటు డ్రైవర్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..సనత్‌నగర్‌కు చెందిన అఫీజుద్దీన్ వృత్తిరీత్యా వీడియోగ్రాఫర్. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తుంటాడు. ఈ క్రమంలోనే ఎయిర్ రైఫిల్‌ను ఉపయోగిస్తుంటాడు. అదే ఎయిర్‌రైఫిల్‌ను ఓపెన్ టాప్ జీపులో చేతితో తిప్పుతూ వెళ్తున్నట్లుగా చేసిన రీల్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. చట్టానికి విరుద్ధంగా రైఫిల్‌ను తిప్పుతూ స్థానికులకు భయభ్రాంతులకు గురిచేయడంపై అఫీజుద్దీన్‌తో పాటు డ్రైవర్ మహ్మద్ అంజాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఓ జ్యూస్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారి

రసాలతో నీరసమే!

జ్యూస్ సెంటర్లలో బొద్దింకలు, ఎలుకలు

- కాలం చెల్లిన పదార్థాలు.. అస్తవ్యస్తంగా పరిస్థితులు
- నగరంలోని ఏ ప్రాంతంలోనైనా అంతే!
- పాతబస్తీ అయినా.. ఐటీ కారిడార్ అయినా.. ఒకటే
- ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: బయట ఏదైనా తినాలంటేనే కాదు.. తాగాలన్నా జడుసుకోవాల్సిన దుస్థితి నగరంలో నెలకొంది. ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ విభాగం కొంతకాలంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో స్టార్ హోటళ్ల నుంచి చిరుతిళ్ల దుకాణాల దాకా, బిర్యానీ సెంటర్ల నుంచి హోమ్‌ఫుడ్స్ దాకా, చికెన్ సెంటర్ల నుంచి స్వీట్ దుకాణాల దాకా.. ఇలా అంతటా అధ్వానపు పరిస్థితులే దర్శనమివ్వడం తెలిసిందే. తాజాగా గచ్చిబౌలి ప్రాంతంలోని డీఎల్ఎఫ్ సంస్థ దగ్గర జ్యూస్ సెంటర్లలో నిర్వహించిన తనిఖీల్లోనూ అవే దృశ్యాలు కనిపించాయి. అంతటా దర్శనమిచ్చినట్లే ముసురుకున్న ఈగలు, తిరుగుతున్న బొద్దింకలు, ఒకచోట ఎలుకలు సైతం కనిపించాయి.

జడుసుకోవాల్సిందే..
వేసవి ఎండలు ముదరడంతో ప్రజలు కూల్‌డ్రింక్స్, జ్యూస్ సెంటర్లను ఆశ్రయించడం తెలిసిందే. చల్లగా వాటిని తాగి ఉపశమనం పొందాలనుకునేవారు జడుసుకోవాల్సిన పరిస్థితులు కనిపించాయి. ఫుడ్ సేఫ్టీ అథారిటీ నుంచి లైసెన్సులు లేకపోవడం, సిబ్బందికి అప్రాన్లు, గ్లవ్స్, తలకు క్యాప్స్ లేకపోవడం చాలా చోట్లా మాదిరే అక్కడా లేవు. యాపిల్, నల్లద్రాక్ష, సపోటా, మామిడి, నారింజ, తదితర పండ్లు చెడిపోయినవి కనిపించాయి. స్ట్రాబెర్రీ ఫ్లేవర్ సిరప్, ప్యాషన్ ఫ్రూట్ సిరప్ తదితరాలు గడువు ముగిసిన తేదీలవే ఉన్నాయి.

అంతా అస్తవ్యస్తం..
- ఇక ఫ్రిజ్‌లలో ఆహార పదార్థాలకు లేబుళ్లు లేవు. వ్యర్థ పదార్థాలు సైతం ఫ్రిజ్‌లో, బయట చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. డస్ట్‌బిన్లకు మూతల్లేవు. పెస్ట్ కంట్రోల్ చర్యలు, వాటర్ అనాలిసిస్ రికార్డులు, సిబ్బంది ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన రికార్డులు కూడా లేవు. డీఎల్ఎఫ్ గేట్ నెంబర్ 3 లోని సిప్ అండ్ స్నాక్ సెంటర్‌లో, గేట్ నెబర్ 2లోని బిస్మీ మ్యాగీ అండ్ జ్యూస్ సెంటర్, మిలన్ జ్యూస్ సెంటర్‌లలో తనిఖీలు చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఒక్కోచోట ఒక్కో రకమైన దుస్థితి, కొన్ని అంశాల్లో మాత్రం మూడు చోట్లా ఒకే రకమైన పరిస్థితులు కనిపించాయి.
- ఒక సెంటర్‌లో చట్నీలో సైతం బొద్దింక కనిపించింది. గురువారం ఈ తనిఖీలు నిర్వహించగా, శుక్రవారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. స్పందించిన ప్రజలు 'అందుకేనా అక్కడ టేస్ట్ అంత బాగుంటాది' అనే వ్యంగ్య వ్యాఖ్యానాలతో పాటు, ఇలాంటి పరిస్థితులు లేకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



అపరిశుభ్ర ప్రదేశంలో పాలు..

నిబంధనలు అలా ఉన్నాయి..
తనిఖీల సందర్భంగా పలు లోపాలు వెల్లడైనా, ప్రజల ఆరోగ్య రక్షణ లేకపోయినా, నిర్వాహకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకునేలా చట్టం, నిబంధనలు లేకపోవడమే ఇందుకు కారణమని జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి. దానికి తోడు ల్యాబ్ పరీక్షల ఫలితాలు రావడానికీ ఎంతో సమయం పడుతోంది. ప్రస్తుతం శాంపిల్స్ పరీక్షలకు ఒకే ఒక్క ల్యాబ్ ఉంది. అది కేవలం నగరానికే కాక రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన శాంపిల్స్ అక్కడికే వస్తాయి. ఈ నేపథ్యంలో నగరంలో జోన్‌కు ఒకటి చొప్పున ఆరు ల్యాబ్‌లు ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. చర్యలు వేగిరం తీసుకునేందుకు సైతం అవసరమైతే నిబంధనలు మార్చాలనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

బార్ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్ గౌడ్

పంజగుట్ట: మద్యం దుకాణాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న పర్మిట్ రూమ్‌లను తొలగించాలని, మద్యం విక్రయాల సమయాన్ని తగ్గించాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్ మాట్లాడుతూ .. వైన్‌షాపుల్లో పర్మిట్ రూంల వల్ల బార్ల వ్యాపారం నడవడంలేదన్నారు. నిబంధనల ప్రకారం 100 స్క్వేర్ మీటర్లలో ఎలాంటి కుర్చీలు, టేబుల్స్ లేకుండా, ఎలాంటి తినుబండారాలు విక్రయాలు లేకుండా ఉండాల్సిన పర్మిట్ రూంల విషయంలో వైన్ షాపుల నిర్వాహకులు ఇవేవీ పాటించడం లేదన్నారు. బార్ల చుట్టుపక్కల బెల్ట్‌షాపులు ఉన్నాయని బెల్ట్‌షాపుల వల్ల బస్తీల్లో ప్రజలకు ఇబ్బందులు పడడమే కాకుండా తమ వ్యాపారానికి కూడా ఎంతో నష్టం వాటిల్లుతుందని, వెంటనే బెల్ట్ షాపులు లేకుండా చెయ్యాలని కోరారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వైన్‌షాపులు ఉదయం 10 నుండి రాత్రి 10 వరకే ఉంటాయని, కేవలం జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రమే ఉదయం 10 నుండి రాత్రి 11 వరకు కొనసాగుతున్నాయని, ఇక్కడ కూడా రాత్రి 10 గంటలకు వైన్‌షాపులు మూ సేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యలపై ఇప్పటికే ఎక్సైజ్ శాఖామంత్రి, కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు విజయ్ కుమార్ గౌడ్, రామకృష్ణ, శ్రీనివాస్ గుప్త, సంజీవరావ్, నరసింహ గౌడ్, వెంకన్న గౌడ్‌లు పాల్గొన్నారు.

ఓటుకు నోటు కేసులో విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

సిటీ కోర్టులు: ఓటుకు నోటు కేసు విచారణ శుక్రవారం నాంపల్లిలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో జరిగింది. ఈ విచారణకు సీఎం రేవంత్ రెడ్డి, సెబాస్టియన్, వేం కృష్ణ కీర్తన్, ఉదయ్ సింహ, సండ్ర వెంకటవీరయ్య గైర్హాజరయ్యారు. జెరూసలేం మత్తయ్య హాజరయ్యారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు నిందితులను ఎగ్జామినేషన్ చేయాల్సి ఉందని, వచ్చే విచారణకు అందరూ హాజరు కావాలని సూచిస్తూ..ఏప్రిల్ 28కి వాయిదా వేసింది.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికకు తొలిరోజు ఒక నామినేషన్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల తొలిరోజైన శుక్రవారం ఇండిపెండెంట్ అభ్యర్థిగా చాలిక చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలుకు ఏప్రిల్ 4వ తేదీ వరకు గడువుంది.

నీసాలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్

జవహర్‌నగర్: హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నీసా) దీక్షత్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం శిక్షణ పొందిన 37వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండోలు 69 మంది పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐఎస్ఎఫ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్ హాజరై మాట్లాడుతూ..ప్రస్తుత ఆధునిక యుగంలో టెక్నాలజీతో పోటీపడుతూ ముందుకు సాగితేనే విజయాలు సాధిస్తామన్నారు. వీఐపీల భద్రత, ప్రభుత్వ ఆస్తుల రక్షణ, విపత్తుల నిర్వహణలో సీఐఎస్ఎఫ్ కమాండోల సేవలు వెలకట్టలేనివన్నారు. శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరుతున్నందున పట్టుదల, కార్యదీక్షతో దేశ భద్రతకు ఆఫీసర్లు అంకితభావంతో కృషి చేయాలన్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కమాండోలు సర్వీర్‌కు ఆల్‌రౌండ్ బెస్ట్ ట్రోఫీ, మహేంద్ర జైస్వాల్‌కు ఫైరింగ్ బెస్ట్ ట్రోఫీ, ప్రేమ్ ప్రంజన్, చెంచల్‌కుమార్‌లకు అవుట్ డోర్ బెస్ట్ ట్రోఫీలను అందించారు. ఈ కార్యక్రమంలో నీసా డైరెక్టర్ ఎస్ఆర్.శరవనన్, ఐపీఎస్, అధికారులు, కమాండోల తల్లిదండ్రులు, నీసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కమాండోలకు ట్రోఫీ అందజేస్తున్న సీఐఎస్ఎఫ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్

'డెయిరీ ఫాం పేరిట దండుకున్నారు...'

పంజగుట్ట: డెయిరీ ఫాంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఇస్తామని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి సుమారు రూ.20 కోట్ల వరకు మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు మధు, వెంకటేశ్వరరావు, కె.వి.సాంబశివరావు, సురేందర్‌లు మాట్లాడుతూ కోకాపేటకు చెందిన వేముల సుబ్బారావు, ఆయన భార్య వేముల కుమారి తమకు మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్, నాగిరెడ్డి గూడలో కొండపల్లి డెయిరీ ఫాం ఉందని, 500 గేదెలతో ఫాం నడుపుతున్నామని, తమ ఫాంలో పెట్టుబడులు పెడితే లాభంలో వాటా ఇస్తామని చెప్పడంతో వందలాది మంది దాదాపు రూ.20 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టారని తెలిపారు. ఆరంభంలో కొంతమందికి కొద్ది మొత్తంలో చెల్లించినా..గత రెండు నెలల నుండి ఎవ్వరికీ ఒక్కరూపాయి చెల్లించడంలేదని, ఫోన్ చేస్తే కూడా స్పందన లేదని తెలిపారు. దీంతో తాము డెయిరీ ఫాంకు వెళ్లి పరిశీలించగా అక్కడ ఒక్క గేదె కూడా లేదని తెలిపారు. సమీపంలో ఉన్న వారిని అడిగితే రాత్రికి రాత్రే గేదెలు, సుబ్బారావు మాయమయ్యారని చెప్పడంతో తాము మోసపోయామని తెలుసుకుని మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

ఈఎన్‌టీ ఆసుపత్రికి ఆధునిక పరికరాలు

సాక్షి, సిటీబ్యూరో: పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు తమవంతుగా సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈడీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఐటీసీ, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా శుక్రవారం కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రికి రూ.55 లక్షల విలువైన అత్యాధునిక యంత్ర పరికరాలు అందించారు. దీనికి సంబంధించి ఎంఓఏపై ఐటీసీ, హెచ్‌హెచ్ఎఫ్, ఈఎన్‌టీ సిబ్బంది సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడే పేదల ఆరోగ్య సంరక్షణా ప్రమాణాలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఖచ్చితమైన రోగ నిర్ధారణ, శస్త్ర చికిత్సలకు అనువైన బ్రెయిన్ స్టెమ్ ఎవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ, ఎల్ఈఐసీఏ ఎం320 మైక్రోస్కోప్, ఫ్లెక్సిబుల్ నాసోఫారింగో లారింగో స్కోప్ విత్ ఛానల్ పరికరాలు సమకూర్చారు.

యువతకు ఉపాధి, మహిళా సాధికారత కోసం కృషి

హిమాయత్‌నగర్: యువతకు ఉపాధితో పాటు మహిళా సాధికారత కోసం అఖిల భారత యాదవ మహాసభ పనిచేస్తుందని మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను నియమించారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ అఖిల భారత రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఉగాది నుండి శిక్షణ తరగతులు, అలాగే యాదవ పిల్లలకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. యాదవ యువతకు స్టార్టప్ కింద రూ.25 లక్షలు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. యాదవ పిల్లలకు హైందవ స్కూల్స్, కాలేజీలలో ఉచిత భోజన అందించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 21న అఖిల భారత యాదవ మహాసభలను మధ్య ప్రదేశ్‌లోని ఓర్చాలో, జూన్ నెలలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఎంపవర్‌మెంట్ కింద ప్రత్యేక స్కీములు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో మహాసభ నాయకులు మేకల లలిత, నీలం శ్రీనివాస్, సురేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరణ



మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు క్రీడల్లో పాల్గొంటూ మరింత ఉత్సాహంగా ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ మండల జర్నలిస్ట్స్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) టోర్నమెంట్ లోగోను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏప్రిల్ 7న శివరాంపల్లిలోని విజయ్ ఆనంద్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న టోర్నమెంట్‌కు సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో భీమయ్య, దామోదర్‌రెడ్డి, అంజయ్య, ఏపీ చారి, బాలసుబ్రహ్మణ్యం, బాబురావు, ప్రేమ్, చందు, గడ్డె యాదగిరి, వినోద్ పాల్గొన్నారు.

ప్రజాభవన్‌లో రైతుల బైఠాయింపు

- పెబ్బేరుకు సాగునీరందించాలని డిమాండ్
- పంట ఎండిపోతోందని ఆందోళన

లక్డీకాపూల్: పెబ్బేరుకు సాగునీటిని అందించాలంటూ పెద్ద ఎత్తున రైతులు ప్రజావాణి బాట పట్టారు. వ్యవసాయానికి నీటి సరఫరా లేక పెబ్బేరు మండల రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన పెబ్బేరు ప్రాంత రైతులు..తమకు సాగునీరందించాలంటూ బైఠాయించారు. సాగునీరు లేక వేసిన పంట ఎండిపోతోందని, ఇప్పటికైనా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యను అడిగి తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి.. సాగునీటి సరఫరా అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా ప్రజావాణిలో 298 దరఖాస్తులు అందాయి. వాటిలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 83 అర్జీలు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు 64, విద్యుత్ శాఖకు 20, రెవెన్యూ సమస్యలపై 67, మున్సిపల్ శాఖకు 14, ప్రవాసి ప్రజావాణికి 1, ఇతర శాఖలకు 49 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కో–ఆర్డినేటర్ రాకేశ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చిన్నారెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలు విని అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

స్టేటస్‌కో ఉత్తర్వులను సమీక్షించలేం

బతుకమ్మ కుంటపై హైడ్రాకు హైకోర్టు స్పష్టం

సాక్షి, హైదరాబాద్: నగరంలోని అంబర్‌పేట్‌లో ఉన్న బతుకమ్మ కుంట పునరుద్ధరణపై గతంలో ఇచ్చిన స్టేటస్‌కో ఉత్తర్వులపై ఎలాంటి పునః సమీక్ష చేయలేమని హైడ్రాకు హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)ను కొట్టివేసింది. అంబర్‌పేట మండలం బాగ్‌అంబర్‌పేట సర్వే నంబర్ 563/1లోని 7 ఎకరాల భూ వివాదంపై ఎడ్ల సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. సిటీ సివిల్ కోర్టులో టైటిల్ వివాదం పెండింగ్‌లో ఉన్నందున ఉన్నత న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను పునః సమీక్షించాలని కోరుతూ హైడ్రా ఐఏ దాఖలు చేసింది. ఈ ఐఏపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. స్టేటస్‌కో ఆదేశాల ఎత్తివేతకు నిరాకరించింది.

ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి తేల్చిచెప్పిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి హైకోర్టు తేల్చిచెప్పింది. కేసు దర్యాప్తును నిలుపుదల చేయడంగానీ, అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 10కి వాయిదా వేశారు. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని సుజాతకు నోటీసులు జారీ చేశారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనకు సంబంధించి నెల కొన్న వివాదంలో భాగంగా సుధీర్‌రెడ్డి తనను దూషించారని ఎల్బీనగర్ పీఎస్‌లో సుజాత ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు ఎమ్మెల్యేపై గత వారం ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. రాజకీయ కక్షతో తనపై తప్పుడు కేసు పెట్టారని, కేసును కొట్టివేయాలని కోరుతూ సుధీర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసులో అరెస్టు సహా తదుపరి విచారణ నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. తాను ఎవరినీ కించపరిచేలా వ్యాఖ్యలు చేయలేదని, కావాలనే ఎలాంటి ఆధారాలు లేకున్నా కేసు పెట్టారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్‌కు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వకూడదని, పిటిషన్‌ను కొట్టివేయాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణను నిలిపివేయలేమని తేల్చిచెబుతూ, విచారణ వాయిదా వేశారు.

చారుసిన్హాకు ఘనంగా వీడ్కోలు



బంజారాహిల్స్: గడిచిన ఏడు సంవత్సరాలుగా సీఆర్‌పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారిణి చారు సిన్హా డిప్యూటేషన్ పూర్తి చేసుకుని తెలంగాణ కేడర్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో ఉన్న సదరన్ సెక్టార్ కార్యాలయంలో ఆమెకు వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. 1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా గత 7 సంవత్సరాలుగా సీఆర్‌పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీగా సమర్థవంతమైన సేవలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె ఇన్నాళ్లుగా తనకు సహకరించిన ఉద్యోగులు, అధికారులతో తన సంతోషాన్ని పంచుకున్నారు. ముఖ్యంగా ఉద్యోగుల పిల్లలతో కలిసి గ్రూపు ఫోటో దిగి ఆనందాన్ని పంచుకున్నారు. తెలంగాణ కేడర్‌కు ఆమె వెళ్లిపోవడంతో ఖాళీ అయిన ఈ పోస్టుకు మరొకరిని నియమించనున్నారు.

పాస్టర్ ప్రవీణ్ మరణంపై అనుమానాలున్నాయి

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

సనత్‌నగర్: పాస్టర్ ప్రవీణ్ మరణంపై చాలా అనుమానాలు ఉన్నాయని, పోస్టుమార్టం నివేదిక రాకముందే యాక్సిడెంట్‌గా ఎలా నిర్ధారిస్తారని ప్రజాశాంతిపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా అమీర్‌పేటలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై పలు ప్రశ్నలను ఆయన సంధించారు. పోస్టుమార్టం నివేదికను ఇంతవరకు ఎందుకు రిలీజ్ చేయలేదు. ప్రశ్నలు అడుగుతున్న పాస్టర్లపై రాజమండ్రిలో ఎందుకు లాఠీఛార్జీ చేశారు, తనతో పోస్టుమార్టం రిపోర్ట్ విషయమై సూపరింటెండెంట్‌తో కలిపిస్తానని చెప్పి ఎందుకు తనను కలపలేదని ప్రశ్నించారు. రాధామోహన్‌ను అనుమానిస్తుండగా ఆయనను ఇంతవరకు అరెస్టు చేశారా..రిమాండ్‌కు తీసుకున్నారా లేదా వెల్లడించాలన్నారు. పాస్టర్ ప్రవీణ్‌పై ఉన్న గాయాలు యాక్సిడెంట్‌లో తగిలినవా? లేక మరేయితర కారణాలతో జరిగినట్లు ఉన్నాయా? అని ఇంతవరకు ప్రకటించలేదు. పోలీసులు హత్య కోణంలో పరిశీలన జరిపారా?. ఘటనా స్థలంలో ఎలాంటి సాక్ష్యాలు లభించాయి. శరీరంలో ఏదైనా విష పదార్థం కనుగొనబడిందా? ఆయన చనిపోవడానికి ముందుగా ఎవరైనా ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు పంపించారా? లేక ఆయన ఎవరికైనా పంపించారా? ఆ వివరాలను ఎందుకు రిలీజ్ చేయలేదని కేఏ పాల్ ప్రశ్నించారు. ఇది సీఎం చంద్రబాబు, హోంమినిస్టర్ ఫెయిల్యూర్ కారణంగానే జరిగిందని, దీనిపై సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నానని కేఏ పాల్ స్పష్టం చేశారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన శిల్పాల ఎగ్జిబిషన్ ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత సిల్క్ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హైలైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణాలో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కోవె తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఎఫ్‌టీసీసీఐలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు యంగ్ కోవె థింక్ టాంక్ ఈవెంట్ జరుగుతుంది.
- అగ్రి క్లినిక్స్ అండ్ అగ్రి బిజినెస్ సెంటర్స్ స్కీమ్ ఈవెంట్ కొండాపూర్ ఇజ్జత్‌నగర్‌లోని ఎన్ఏసీ గ్రౌండ్స్ మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఎఫ్ఎల్ఓ, వైఎఫ్ఎల్ఓకు కొత్త సారథులు



ప్రతిభ పల్లవి

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) చైర్‌పర్సన్‌గా ప్రతిభ కుండ, యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ఎల్ఓ)కు పల్లవి జైన్‌లు నూతన సారథులుగా నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఫిక్కీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించిన కీర్తిశేషులు పొట్టి శ్రీరాములు మనవరాలు ప్రతిభ కుండ అనీ, అంతేకాక ఆమె దేశపు మొట్టమొదటి పౌరాణిక థీమ్ పార్క్ సురేంద్రపురికి మేనేజింగ్ డైరెక్టర్, సియారా రిట్రీట్ ప్రధాన్ కన్వెన్షన్స్ వ్యవస్థాపకురాలు కూడా అని వివరించారు. అలాగే పోకర్ణ ఫ్యాబ్రిక్స్‌లో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న పల్లవి జైన్ మాలిక్యులర్ మెడిసిన్‌లో డాక్టరేట్ పొందారని తెలియజేశారు.

24.10 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం

నాంపల్లి: ముంబై నుంచి హైదరాబాద్‌కు రైలులో డ్రగ్స్‌ను తీసుకుచ్చిన ఓ వ్యక్తితో పాటుగా డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తున్న మరో ఇద్దరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 24.10 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ముంబై అంధేరి ప్రాంతం నుంచి రంజాన్ షేక్ అనే వ్యక్తి డ్రగ్స్‌ను రైలులో నగరానికి తీసుకువచ్చాడు. ఇలా తీసుకువచ్చిన డ్రగ్స్‌ను నాంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఇర్ఫాన్, అన్వర్‌కు అందజేస్తుండగా..నాంపల్లి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌టీఎఫ్ బృందాలు సంయుక్తంగా శుక్రవారం దాడి చేసి పట్టుకున్నాయి.

బస్సు కోసం వేచి ఉన్న వృద్ధురాలిని నమ్మించి..

బంగారు పుస్తెల తాడు అపహరణ సినీ ఫక్కీలో ఘటన..

శామీర్‌పేట్: బస్సు కోసం ఎదురు చూస్తున్న ఓ వృద్ధురాలిని ఇంటి వద్ద దిగబెడుతానని నమ్మించాడు ఓ దుండగుడు. నమ్మిన ఆ వృద్ధురాలు బైక్ ఎక్కగా కొంత దూరం వెళ్లాక మెడలో ఉన్న పుస్తెల తాడును అపహరించుకుపోయాడు. ఈ ఘటన శుక్రవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు, శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన వరలక్ష్మి(80), తూంకుంట మున్సిపాలిటీ, దేవరయాంజాల్‌లో తన పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి వెళ్లి తిరుగు ప్రయాణమైంది. దొంగల మైసమ్మ చౌరస్తా వద్ద బస్సు కోసం ఎదురు చూస్తుంది. గుర్తుతెలియని దుండగుడు ఇంటి వద్ద దిగబెడుతానని వృద్ధురాలిని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొద్ది దూరం వెళ్లాక మార్గమధ్యలో నిర్మానుష్య ప్రదేశం వద్దకు రాగానే బైక్‌ని ఆపి.. ఒక వ్యక్తి తనకు డబ్బులు ఇచ్చేందుకు వస్తున్నాడని చెప్పాడు. దీంతో వృద్ధురాలికి అనుమానం వచ్చి నడుచుకుంటూ వెళ్లసాగింది. ఈ క్రమంలో ఆ దుండగుడు వెనకాల నుండి వచ్చి మెడలో ఉన్న 16 గ్రాముల బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం మూడు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు.

రేపటి నుంచి ఉగాది నాటకోత్సవాలు

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ రామానాయుడు కళామండపంలో ఆదివారం నుంచి 5 రోజుల పాటు ఉగాది నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు పొత్తూరి వెంకట సుబ్బారావు తెలిపారు. చుక్కపల్లి శంకర్‌రావు శత జయంతి సందర్భంగా నిర్వహించే ఈ ఉగాది నాటకోత్సవాల్లో భాగంగా ఈ సారి 30వ తేదీన శ్రీకృష్ణ తులాభారం భక్తి రస పౌరాణిక నాటకం, 31న బాల నాగమ్మ జానపద నాటకం, మార్చి 1వ తేదీన సత్య హరిశ్చంద్ర నాటకం, 2వ తేదీన భక్త చింతామణి నాటకం, 3వ తేదీన కురుక్షేత్రం నాటకాలను కళాకారులు ప్రదర్శిస్తారని పొత్తూరి వెంకట సుబ్బారావు తెలిపారు. నేటి తరానికి రంగ స్థల నాటకాల గురించి తెలియజేయడంతో పాటు రంగ స్థల కళాకారులను ఆదుకునే ఉద్దేశంతో అయిదు రోజుల పాటు ఈ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు కళాకారులు ఆయా నాటకాలను ప్రదర్శిస్తారని తెలిపారు. సినీ ప్రేమికులు, నాటక ప్రేమికులు ఆయా కార్యక్రమాలను వీక్షించాలని వారు కోరారు.

ట్రిబ్యునల్ తీర్పును ఎక్సైజ్ అధికారులు అమలు చేయాలి

బంజారాహిల్స్: చింతల్ బస్తీ కల్లు గీత సహకార సొసైటీ ఎన్నికలను రద్దుచేస్తూ సహకార శాఖ ట్రిబ్యునల్ తీర్పును వెల్లడించి మూడు నెలలు కావస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని చింతల్ బస్తీ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పి.వేణుగోపాల్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సంబంధిత తీర్పు ప్రతులను, ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్వాకాన్ని, అక్రమాలను ఎండగడుతూ మాట్లాడారు. తక్షణమే ఆ తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. చింతల్ బస్తీ కల్లుగీత సహకార సొసైటీకి చెందిన అర్హులైన ఓటర్లను గల్లంతు చేసి బోగస్ ఓట్లతో 2022 జూన్ 6 నిర్వహించిన ఎన్నికను కొట్టివేయాలంటూ, అది చెల్లదంటూ తాను సహకార శాఖ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించానన్నారు. శాస్త్రీయ ఆధారాలు సమర్పించడంతో మూడు నెలల క్రితం చీఫ్ ప్రమోటర్ కె.సుగుణమ్మతో పాటు ఇతర పాలక మండలిని రద్దు చేస్తూ ట్రిబ్యునల్ తీర్పునిచ్చిందన్నారు. నిజమైన కల్లు గీత కార్మికులకు న్యాయం జరిగేవరకు తన పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. ఇకనైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి అసలైన గీత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'పది' పరీక్ష కేంద్రాల వద్ద...
పటిష్ట నిఘా



- మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పరిసర ప్రాంతాల్లో అనుమానితుల కదలికలపై నిఘా
- ఉదయం 7 నుంచే పోలీసుల బందోబస్తు
- కిటికీల వద్ద బందోబస్తు ఏర్పాటుచేసిన స్థానిక పోలీసులు

బంజారాహిల్స్: పదో తరగతి పరీక్షల్లో కొన్ని జిల్లాల్లో మాల్ ప్రాక్టీసింగ్‌తో పాటు ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు ఎదుర్కొంటుండగా హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తం అయ్యారు. ముఖ్యంగా విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఏర్పాటు చేసిన 35 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తుతో పాటు పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, ఇతర పాఠశాలల ఉద్యోగులెవరూ పరీక్ష జరుగుతున్న సమయంలో సెల్‌ఫోన్లు తీసుకువెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ప్రతి పరీక్ష కేంద్రం వద్ద గేటు ముందు సెక్యూరిటీ గార్డులు లోనికి వెళ్లేవారి నుంచి సెల్‌ఫోన్లను తీసుకుని సంచుల్లో భద్రపరుస్తున్నారు. ప్రతి ఒక్కరూ లోనికి వెళ్లేముందు తప్పనిసరిగా ఇక్కడ ఏర్పాటు చేసిన సంచిలో తమ సెల్‌ఫోన్లతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వేసే విధంగా అలర్ట్ చేశారు.



బంజారాహిల్స్‌లోని పరీక్ష కేంద్రంలో సెల్ ఫోన్లను సంచిలో వేస్తున్న ఇన్విజిలేటర్లు

- ఖైరతాబాద్ జోన్ పరిధిలో మొత్తం 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా 7851 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. రోజూ పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచే పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అనుమానితుల కదలికలపై దృష్టిపెడుతున్నారు. పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు, పాన్ డబ్బాలు, కిరాణా షాపులు, మీ-సేవా కేంద్రాలు తదితర చోట్ల నిఘా ఏర్పాటు చేస్తున్నారు.
- పరీక్ష కేంద్రం కిటికీల వద్ద కూడా ఎవరూ వెళ్లకుండా, లోనికి తొంగిచూడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రంలోనూ విద్యార్థుల కదలికలతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర పాఠశాలల సిబ్బందిపై ఓ కన్నేసి ఉంచుతున్నారు.
- అక్రమాలకు తావులేకుండా మాల్ ప్రాక్టీసింగ్‌కు తావు లేకుండా తగిన జాగ్రత్తలతో ఇప్పటివరకు పరీక్షలు సజావుగా సాగాయి. ప్రతి పరీక్ష కేంద్రాన్ని ఇన్విజిలేటర్లు వడబోస్తున్నారు. ఏ చిన్న అనుమానం వచ్చినా విద్యార్థులను తనిఖీలు చేస్తున్నారు. ఇన్విజిలేటర్లపై కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. 35 పరీక్ష కేంద్రాల్లో 600 మందికి పైగా ఇన్విజిలేటర్లు పనిచేస్తున్నారు. ఇంకో వైపు ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలను చీఫ్ సూపరింటెండెట్లు పరిశీలిస్తున్నారు. అనుమతి లేకుండా పరీక్ష కేంద్రంలోకి ఎవరైనా వస్తున్నారా? అన్న దానిపై కూడా దృష్టిపెట్టారు. అనుమానితులు ఉంటే అక్కడే ఉండే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యారు.

పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

శ్రీనగర్‌కాలనీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వైకల్యం ఉన్న వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ ద్వారా వైకల్యం కలిగిన వ్యక్తులకు జాతీయ రిజిస్టర్‌ను నిర్వహిస్తుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ జిల్లాకు సంబంధించి ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి మానసిక వైకల్యం కలిగిన వ్యక్తుల కోసం ప్రత్యేక యూడీఐడీ శిబిరాలను నిర్వహించడానికి కేంద్రంగా నియమించబడింది. ఈ శిబిరాల ద్వారా మానసిక రోగులకు జాతీయ రిజిస్టర్‌ను రూపొందించి వారికి హక్కులు, ప్రయోజనాలు, సేవలను అందించడానికి కార్డులను అందించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి మానసిక రోగులకు నిర్వహిస్తున్న శిబిరాల వివరాలను ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అనితను అడిగి తెలుసుకొని అక్కడి వసతులు, సౌకర్యాలు, ఏర్పాట్లను పర్యవేక్షించి పలు సలహాలు సూచనలు అందించారు. డీఆర్ఓ వెంకటాచారి, ఎంఆర్ఓ సునీత, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ రమేష్, డాక్టర్ వివాస్వాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కలెక్టర్ అనుదీప్‌కు వివరాలను వెల్లడిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అనిత

పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు



పంజగుట్ట సెంట్రల్ ముందు వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు ఎక్కడికక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. శుక్రవారం పంజగుట్ట చౌరస్తాలోని సెంట్రల్ మాల్ ముందున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జీ పరిసర ప్రాంతాల్లో నెలలుగా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంతో పాటు ఈ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటనున్నామని సర్కిల్-17 ఏఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కూడళ్ల సుందరీకరణలో భాగంగా ఇప్పటికే ఈ పంజగుట్ట చౌరస్తాలో సెంట్రల్ మీడియన్లలో స్తంభాలకు ఆకర్షణీయమైన బొమ్మలు గీసి, మొక్కలు నాటిన అధికారులు ఇంకా మెరుగులు దిద్దే పనిలో ఉన్నారు.

ఆస్తి పన్ను చెల్లించని భవనానికి నోటీసు

బంజారాహిల్స్: ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 అధికారులు దృష్టిపెట్టి మొండి బకాయిదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. బకాయిదారుల ఆస్తులను జప్తు చేయడమే కాకుండా భవనాలను సీజ్ చేస్తున్నారు. శుక్రవారం సర్కిల్-18 వారెంట్ ఆఫీసర్ ఉప్పలయ్య, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సాయిశ్రీనివాస్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు సిబ్బందితో కలిసి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని సుధా మంత్రి అనే బిల్డింగ్‌కు నోటీసులు అంటించడమే కాకుండా ఇక్కడ ఉన్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌ను సీజ్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో భవన యజమాని కొంత మొత్తాన్ని చెల్లిస్తానని, మిగతాది ఈ నెల 31లోపు చెల్లిస్తానని వెల్లడించారు. 2013 నుంచి ఈ భవన యజమాని ఆస్తి పన్ను చెల్లించకుండా రూ. 68 లక్షల మేర బకాయి పడ్డారు. సంబంధిత అధికారులు పలుమార్లు రెడ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు, వారెంట్ జారీ చేసినా భవన యజమాని బేఖాతరు చేశారు. దీంతో ఆస్తుల జప్తుతో పాటు భవనాన్ని సీజ్ చేసేందుకు యత్నించగా బకాయిదారు దిగిరాక తప్పలేదు.



ఆస్తి పన్ను చెల్లించని బిల్డింగ్‌కు నోటీసు అంటిస్తున్న అధికారులు

నిమ్స్ ఆర్ఎంఓకు గోల్డ్‌మెడల్

లక్డీకాపూల్: నిమ్స్ ఆర్ఎంఓను గోల్డ్‌మెడల్ వరించింది. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పీజీ పూర్తి చేసిన డాక్టర్ కె.పూజితకు బెస్ట్ అవుట్ గోయింగ్ పీజీగా గుర్తింపు లభించింది. ఇటీవల నిమ్స్‌లో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం తొలిసారిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించింది. నిమ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య సంరక్షణ పరిపాలన విద్యలో 35 సంవత్సరాల అత్యుత్తమ ప్రతిభను గుర్తు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ రంగంలో కీలక పరిపాలనా పదవులను నిర్వహిస్తున్న 100 మందికి పైగా ప్రముఖ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్ మాజీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పులిజాల సత్యనారాయణ ప్రతిపాదిత గోల్డ్‌మెడల్‌ను డాక్టర్ పూజితకు ప్రదానం చేశారు.

ఫిర్యాదు చేసినా చర్యలేవీ?

బంజారాహిల్స్: ఫిలింనగర్ సొసైటీ కాలనీలో ఉన్న ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) జీహెచ్ఎంసీ పార్కు స్థలం రాక్ గార్డెన్‌లో నిర్మించారని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ ఇటీవల ప్రజావాణిలో హైడ్రా అధికారులకు జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ ఫిర్యాదు చేశారు. అయితే ఇంతవరకు ఈ స్థలంపై హైడ్రా అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదు. కనీసం ఫిలింనగర్ రోడ్డు నెంబర్-1 ప్రధాన రహదారి వైపు రాజరాజేశ్వరి గుడి ఎదురుగా ఎఫ్ఎన్‌సీసీ కింద ఉన్న ఖాళీ స్థలాన్ని వెంటనే స్వాధీనం చేసుకుని ఉద్యానవనంగా అభివృద్ధి చేయాలని కూడా బాధితుడు అధికారులకు మొరపెట్టుకున్నాడు. ఈ స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకోకపోతే ఇక్కడ కూడా అక్రమ కట్టడాలు నిర్మించేందుకు ఆస్కారం ఉందని కూడా ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తాము ఫిర్యాదు చేసి ఉపయోగం ఏమిటంటూ బాధితులు వాపోతున్నారు. ఫిలింనగర్‌లో ఓ భవన యజమాని రోడ్డు స్థలాన్ని ఆక్రమించి హోటల్ నిర్మించి అద్దెకు ఇచ్చారని, చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సదరు హోటల్ యజమానికి హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇంతవరకు అక్రమ నిర్మాణాలు కూల్చకపోగా సదరు హోటల్ దర్జాగా కొనసాగుతుంది. ఫిలింనగర్ కొత్త చెరువు చుట్టూ అక్రమణలు పెరిగిపోతున్నాయని, వీటిపై కూడా చర్యలు తీసుకోకపోతే శాశ్వత కట్టడాలు వస్తాయంటూ స్థానికులు ఆరోపించారు. వీటన్నింటిపై హైడ్రా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బావను కత్తితో పొడిచిన బావమరిది

వెంగళరావునగర్: బావను బావమరిది కత్తితో పొడిచిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... కిరణ్ రాథోడ్ దంపతులు కొంతకాలంగా రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. పెళ్లయిన నాటి నుంచి భార్య భర్తల మధ్య గొడవ జరుగుతూనే ఉంది. ఈ క్రమంలో ఇటీవల భార్య తన పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం ఇదే విషయంపై కిరణ్ రాథోడ్, అతని భావమరిది ముఖేష్ నాయక్‌లు గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో ముఖేష్ నాయక్ కత్తితో తన బావ కిరణ్ రాథోడ్‌ను పొడిచాడు. చుట్టుపక్కల వారు ఈ సంఘటనను పోలీసులకు తెలియజేశారు. తీవ్ర గాయాలతో ఉన్న కిరణ్ రాథోడ్‌ను చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ముఖేష్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గిల్టు నగలతో రుణం తీసుకున్నారంటూ బెదిరింపులు

పంజగుట్ట: నగలు కుదువపెట్టి ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రుణం పొందితే అవి గిల్టు నగలంటూ సదరు సంస్థ ఉద్యోగులు బెదిరింపులకు పాల్పడుతూ, తన కారును కూడా తీసుకెళ్లారని ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్‌లో నివాసం ఉండే నిఖిల్ కోఠారి వ్యాపారవేత్త. తనకు రుణం కావాలంటూ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ మేనేజర్ రవీందర్‌ను సంప్రదించాడు. అతను బంగారం తాకట్టు పెడితే రుణం ఇస్తామని వాయిదాల రూపంలో రుణం చెల్లించుకోవచ్చు అని సలహా ఇచ్చాడు. దీంతో నిఖిల్ బంగారం కుదువపెట్టి రూ. 24 లక్షల రుణం పొందాడు. నిఖిల్ స్నేహితులు అజయ్ కుమార్, సిద్దార్థ్ జైన్, మోహిజ్ ఖాన్‌లు తమకు కూడా రుణం కావాలని అడగడంతో వారికి రవీందర్‌ను పరిచయం చేశాడు. రవీందర్ అమీర్‌పేటలో తమ సంస్థ బ్రాంచ్ ఉందని అక్కడకు వెళ్లి బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకోవాలని సూచించి అక్కడకు పంపాడు. వారు అక్కడ బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. వాయిదాలు కూడా సక్రమంగా చెల్లిస్తున్నారు. కొద్ది నెలల క్రితం అమీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ శ్రీలత రుణం పొందిన అజయ్, సిద్దార్థ్, మోహిజ్‌లకు ఫోన్ చేసి మీరు గిల్టు నగలు పెట్టి రుణం పొందారు. తమ రుణ బకాయిలు మొత్తం చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. తాము తనఖా పెట్టినవి ఒరిజినల్ నగలే అని ఎంత చెప్పినా వినిపించుకోవడంలేదు. అంతే కాకుండా నిఖిల్ కొఠారీకి సంబంధించిన జాగ్వార్ కారును కూడా ఫైనాన్స్ సంస్థ వారు తీసుకెళ్లిపోయారు. వారు తీసుకున్న రుణానికి తాను పూచీకత్తు లేను, హామీ దారుడిని కాను అని చెప్పినా వినకుండా తన కారును తీసుకెళ్లడం సరికాదని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. దీంతో నిఖిల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో మొదట మారెడ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి తరువాత పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అమీర్‌పేట బ్రాంచ్ ఉద్యోగులపై కేసు నమోదు చేశారు.



ఫిలిం అండ్ టీవీ డైరెక్టరీ ఆవిష్కరణ

ఫిలింనగర్: సినీ, టీవీ రంగంలో ఉన్న పాత నటులతో పాటు కొత్తగా వస్తున్న నటుల కోసం, నిర్మాతల కోసం ఫిలిం అండ్ టీవీ డైరెక్టరీని రూపొందించి ప్రతి ఏటా విడుదల చేయడం అభినందనీయమని సినీ నిర్మాత అంబికా కృష్ణ అన్నారు. ఫిలించాంబర్‌లో శుక్రవారం ఆయన వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో రూపొందించిన ఫిలిం, టీవీ డైరెక్టరీని ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ ఫిలిం, టీవీ డైరెక్టర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఇండస్ట్రీలో ఉన్న అన్ని ప్రొడక్షన్ యూనిట్లతో పాటు పలువురు నిర్మాతలు, దర్శకులు, నటీ నటులు, సాంకేతిక నిపుణుల వివరాలు అన్నింటిని పొందుపర్చడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత విష్ణు బొప్పన తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న నిర్మాత అంబికా కృష్ణ

చెరువుల్లో డ్రోన్‌తో దోమల మందు స్ప్రే

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1 లోని తాజ్ బంజారా లేక్‌లో శుక్రవారం ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది డ్రోన్ సహాయంతో దోమల మందును స్ప్రే చేశారు. నిల్వ ఉండే నీళ్లలో దోమలు గుడ్లు పెట్టి దోమల వృద్ధిని అధికం చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో చెరువుల్లో మనుషులతో సాధ్యం కాని దోమల మందు స్ప్రేను డ్రోన్ సహాయంతో చేస్తున్నట్లు జూబ్లీహిల్స్ సర్కిల్-18 ఎంటమాలజి అసిస్టెంట్ రజిత తెలిపారు. నెలలో రెండు సార్లకుపైగా ఒక్కో చెరువులో దోమల మందును పిచికారీ చేయడంతో పాటు , పెరుగుతున్న గుర్రపుడెక్కను తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు.

మైనార్టీల గౌరవాన్ని పెంచింది కేసీఆరే...

మాజీ మంత్రి హరీష్‌రావు

బంజారాహిల్స్: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల కోసం రూ. 3300 కోట్లు కేటాయించి ఇప్పటి వరకు రూ. 1000 కోట్ల లోపే ఖర్చు చేసిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాజీ హోం మంత్రి మహమూద్ అలీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వంలో మైనార్టీ మంత్రి ఇచ్చారని, నీళ్లకు కూడా లేక హైదరాబాద్ బస్తీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మైనార్టీల గౌరవాన్ని పెంచింది కేసీఆర్ అని కేసీఆర్ రంజాన్ పండుగకు ప్రభుత్వపరంగా రంజాన్ తోఫా తో పాటు ఇఫ్తార్ విందులు సైతం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇఫ్తార్ విందులను అధికారికంగా నిర్వహించని కాంగ్రెస్ ప్రభుత్వం, రంజాన్ తోఫా కూడా ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు

క్రైం కార్నర్..

ఇంటర్వ్యూలో పరిచయం.. ఇంటికొచ్చి వేధింపులు...

వివాహితను వేధిస్తున్న స్పా యజమానిపై కేసు నమోదు

ఫిలింనగర్: ఇంటర్వ్యూకు వెళ్లిన ఓ వివాహితను పరిచయం చేసుకున్న స్పా యజమాని ప్రేమ పేరుతో వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తుండటంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మల్కాజగిరిలోని హనీ స్పా యజమాని విక్కీ విక్రమ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..ఫిలింనగర్‌లోని దీన్‌దయాళ్‌నగర్ బస్తీకి చెందిన వివాహిత (35) మాదాపూర్‌లోని ఓ స్పాలో బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నది. ఇటీవల మరింత మెరుగైన ఉద్యోగం కోసం మల్కాజిగిరిలోని హనీ స్పాలో ఇంటర్వ్యూకు వెళ్లగా స్పా యజమాని విక్కీ విక్రమ్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య తరచూ ఫోన్ సంభాషణ జరుగుతుంది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, తన భర్తకు ఈ విషయం తెలియదని ఆమె చెప్పగా అదంతా తాను చూసుకుంటానని, నాతో ఉంటే నీకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని నమ్మబలికాడు. దీంతో ఆమె విక్కీ విక్రమ్‌తో మరింత సన్నిహితంగా మెలిగింది. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె దూరంగా ఉండసాగింది. ఇది భరించలేని విక్రమ్ గురువారం అర్ధరాత్రి ఆమె ఇంటికి వచ్చి బయట నుంచి డోర్ లాక్ చేశాడు. దీంతో ఆమె భయంతో అరవడంతో చుట్టుపక్కల వారు గమనించారు. దీంతో విక్రమ్ అక్కడి నుంచి ఉడాయించాడు. తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న నిందితుడిపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 75, 78 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడి డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు హత్యాయత్నం

ఫిలింనగర్: వ్యాపార భాగస్వామ్యంలో భాగంగా తాను ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరినందుకు తన గ్రామానికే చెందిన వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడంటూ బాధితుడు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే... ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ ఖలీల్ అహ్మద్ ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి లంగర్‌హౌస్‌లో నివాసం ఉంటూ టోలిచౌకి సమీపంలోని జానకినగర్ మీర్జాకాలనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల తన గ్రామానికి చెందిన ఖమిల్, ఆయన సోదరుడు సులేమాన్‌తో పరిచయం ఏర్పడింది. ముగ్గురూ కలిసి వ్యాపారం చేయాలని నిర్ణయించుకోగా, ఇందుకోసం ఖలీల్ అహ్మద్ రూ.20 లక్షలు ఖమిల్‌కు ఇచ్చాడు. అయితే వ్యాపారం ప్రారంభించకపోగా, తన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఖలీల్ ఇటీవల ఒత్తిడి తీసుకువచ్చాడు. ఈ నేపథ్యంలోనే రాత్రి విధులు ముగించుకుని లంగర్‌హౌస్‌కు వెళ్తున్న ఖలీల్‌ను ఖమిల్‌తో పాటు ఆయన సోదరుడు సులేమాన్ రౌండప్ చేసి డబ్బులు అడిగితే చంపేస్తామంటూ బెదిరించారు. ఈ దాడిలో బాధితుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమిల్, సులేమాన్‌లపై పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాలెట్ డ్రైవర్ నిర్లక్ష్యంపై ఫిర్యాదు

బంజారాహిల్స్: వ్యాలెట్ డ్రైవర్ నిర్లక్ష్యంతో తన కారు దెబ్బతిన్నదని, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని మిథిలానగర్‌లో నివసించే రుచిక అగర్వాల్ వ్యాపారం చేస్తుంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని చికా కాఫీ షాప్‌కు తన జీపులో వచ్చి వ్యాలెట్ డ్రైవర్‌కు తాళం చెవులు అందించి కాఫీ షాపులోకి వెళ్లింది. తిరిగి బయటకు వచ్చి చూడగా తన జీపు ఓ ప్రహరీగోడకు ఢీకొట్టి ఉన్నదని, ముందుభాగం పూర్తిగా దెబ్బతిందని, ప్రహరీగోడ కూడా కూలిపోయిందని, వ్యాలెట్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సదరు యాజమాన్యం దెబ్బతిన్న తన కారుకు నష్టపరిహారం చెల్లిస్తానని చెప్పిందని, ఈ విషయంలో విఫలమైందని, చర్యలు తీసుకోవాలంటూ కోరింది. ఈ మేరకు పోలీసులు చికా కాఫీ షాపు యాజమాన్యంపై, వ్యాలెట్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పనిమనిషి చేతివాటం..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో నివసించే వ్యాపారి ఇంట్లో పని మనిషి చేతివాటం ప్రదర్శించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నగలు, నగదు తస్కరించడంతో బాధితుడు ప్రశాంత్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇటీవల తాను కుటుంబ సభ్యులతో కలిసి బంధువు అంత్యక్రియలకు వెళ్లడం జరిగిందని, ఆ సమయంలోనే 32 గ్రాముల బంగారం, నగదు చోరీకి గురయ్యాయన్నారు. ఇంట్లో పనిచేస్తున్న సత్య అనే మహిళపై అనుమానం వ్యక్తంచేస్తూ ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోడ దూకి ఇంట్లోకి వచ్చి.. బీరు బాటిల్‌తో దాడి

ఫిలింనగర్: గోడ దూకి ఇంట్లోకి వచ్చిన యువకుడిని ఎందుకు వచ్చావని ప్రశ్నించినందుకు బీరు బాటిల్‌తో ఇంటి యజమానిని గాయపర్చిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్‌లోని దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో నివసించే బత్తుల శ్రీనివాస్ ఇంట్లోకి గురువారం అర్ధరాత్రి ఓ యువకుడు గోడ దూకి లోనికి ప్రవేశించాడు. అదే సమయంలో శ్రీనివాస్ కూతురు చూసి ఎవరు మీరు అంటూ ప్రశ్నించింది. అలజడితో బయటకు వచ్చిన శ్రీనివాస్ బయటకు వెళ్లిపోవాలంటూ సదరు యువకుడికి చెప్పాడు. ఆగ్రహించిన యువకుడు అక్కడే ఉన్న బీరు బాటిల్‌తో శ్రీనివాస్ తలపై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం జరుగుతుండగా శ్రీనివాస్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. ఇంట్లోకి ప్రవేశించిన వ్యక్తి లోకనాథంగా గుర్తించారు. ఎందుకు వచ్చాడు.. అన్న కోణంలో ఫిలింనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.నిందితుడు ఎక్కడి నుంచి వచ్చాడు..ఎవరు..అదే ఇంట్లోకి ఎందుకు వచ్చాడు అన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్, శనివారం, 29, మార్చి, 2025

విభిన్న సంస్కృతుల సంగమం హైదరాబాద్. విభిన్న సంప్రదాయాలు, సంస్కృతులు, భాషలు, బంధుత్వాల సమ్మేళనం. ఇందులో భాగంగానే మన భాగ్యనగరాన్ని ఎప్పటి నుంచో కలినరీ హెరిటేజ్ ఆఫ్ ఇండియా అని పిలుచుకుంటున్నారు. స్థానిక సంప్రదాయ రుచులు మొదలు దేశీ, విదేశీ ప్రముఖ రుచుల గమ్యస్థానంగా నగరానికి గుర్తింపు ఉంది. ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ.. బర్మా దేశం నూతన సంవత్సరాది నేపథ్యంలో నగరంలో బర్మా ఫుడ్ ఫెస్టివల్ 'థింగ్యాన్' ప్రారంభం కానుంది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతాతో పాటు నగరంలోనూ ఈ థింగ్యాన్ సందడి చేయనుంది. ఇరు దేశాల సంస్కృతికి నిదర్శనంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో



థింగ్యాన్..

ఓ బర్మా కథ..

- నగరంలో బర్మా సాంస్కృతిక సంబరాల సందడి
- నూతన సంవత్సరాది నేపథ్యంలో నాలెడ్జ్ సిటీ వేదికగా వేడుక
- సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా నగరంలో నిర్వహణ

బర్మా సంస్కృతికి ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది.. ఆధునిక–సంప్రదాయ రుచుల సమ్మేళనంతో అక్కడి వంటకాలు విశ్వవ్యాప్తంగా ఆహార ప్రియులను అలరిస్తున్నాయి. ఇందులో భాగంగా నగరంలోని నాలెడ్జ్ సిటీలోని బర్మా వేదికగా ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఏప్రిల్ 30 వరకూ నిర్వహించే థింగ్యాన్ నగరంలోని ఆహార ప్రియులకు వినూత్న వంటకాలను, బర్మా రుచులను అందించనుంది. లక్క పూతతో కూడిన ఎనామిల్ టిఫిన్లు బర్మా సంస్కృతిలో ప్రధానమైంది. ఆహారాన్ని పంచుకునే ఈ ఆచారాన్ని 'టిఫిన్ మీల్' పేరుతో థింగ్యాన్ మెనూను అందించనున్నారు. ఈ సందర్భంగా బర్మాకు చెందిన ప్రధాన చెఫ్ అన్సాబ్ ఖాన్ మాట్లాడుతూ.. తాము ఫుడ్ ప్యారడైస్‌గా పిలుచుకునే హైదరాబాద్‌లో లైవ్ హాకర్–స్టైల్ నూడిల్ సలాడ్ మొదలు శాండ్‌విచ్ క్రంచీ హ్యాండ్–టాస్డ్, బ్రాడ్ బీన్స్, ఫ్లేకీ పలాటా, సువాసనగల సుగంధ ద్రవ్యాలతో మాక్ మీట్‌బాల్ కర్రీ వంటి అద్భుత రుచులను ప్రత్యేక ఎనామెల్ మల్టీ–టైర్డ్ టిఫిన్‌లో వడ్డిస్తున్నామని తెలిపారు.




రుచుల స్వర్గధామం..

బాటిల్ గార్డ్ కర్రీ, సుగంధ జాస్మిన్ రైస్, స్పైసీ స్టైర్–ఫ్రైడ్ సోయాబీన్ వంటి బర్మా రుచులు ఆసియా అంతటా ప్రత్యేక ఆదరణ పొందుతున్నాయి. అయితే ఇలాంటి అద్భుతమైన విందులను బర్మాలో ప్రజలు కలిసి తినడానికి ఇష్టపడతారు. ఈ సంస్కృతికి కొనసాగింపుగా నిర్వహిస్తున్న థింగ్యాన్‌లో సంప్రదాయ బనానా సాన్విన్ మాకిన్, సెమోలినాతో స్వీట్ బనానా పుడ్డింగ్, కొబ్బరి పాలతో తయారు చేసిన క్రీమీ, చల్లబడిన బ్లాక్ రైస్ కస్టర్డ్, కొబ్బరి కస్టర్డ్, టాపియోకా పుడ్డింగ్‌తో నోస్టాల్జిక్ రుచులను ఆరగించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. థింగ్యాన్‌లో పడాక్ ఫ్లవర్స్‌తో 'ఆహ్–తార్–ఓహ్' సెరిమోనియల్ పూల అమరికలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.

30 వరకూ చిత్రకళా ప్రదర్శన



సాక్షి, సిటీబ్యూరో: యువ కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో, నిధుల సమీకరణకు బన్యాన్ హార్ట్ స్టూడియో 'బర్డ్స్ ఐ వ్యూ' పేరిట చిత్ర కళా ప్రదర్శన నిర్వహిస్తోంది. మాదాపూర్ సేబెట్ ఆర్ట్ గ్యాలరీలో ఈ నెల 30 వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుంది. 40 మంది కళాకారులు, వందకుగాపై కళా కృతులను ప్రదర్శిస్తున్నారు.





అందంగా కనబడాలని అందరూ కోరుకుంటారు. అయితే ప్రస్తుతం భానుడు భగభగలతో చర్మానికి రక్షణ లేకుండా పోతోంది. గడప దాటిన వెంటనే వేడి, ఉక్కబోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యే పరిస్థితులు. వివిధ పనులపై బయటకు వెళ్లే వారు ఈ సమయంలో చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడంపై తప్పనిసరిగా దృష్టిపెట్టాల్సిన పరిస్థితి. ప్రధానంగా ముఖం, చేతులు సూర్య కిరణాలు నేరుగా తగిలే ఇతర ప్రదేశాల్లో చర్మం నిర్జీవంగా మారిపోతోంది. దీంతో చర్మ కాంతి తగ్గిపోతుంది. ఈ పరిస్థితులను అధిగమించాలంటే కొన్ని చిట్కాలు పాటించక తప్పదంటున్నారు సౌందర్య నిపుణులు. - సాక్షి, సిటీబ్యూరో

కాంతి మంత్రం

ఎండ నుంచి చర్మానికి రక్షణగా

- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న నిపుణులు
- సన్ స్క్రీన్, గొడుగుతో కొంత వరకూ ఉపశమనం
- తినే ఆహారం, వేసుకునే బట్టలూ కీలకమే
- చర్మ సౌందర్యానికి చిట్కాలు చెబుతున్న బ్యుటీషియన్లు

వేసవిలో చర్మానికి చెమటలు పట్టడం, జిడ్డుగా మారడం, పొడిబారి పోవడం, నల్లని మచ్చలు రావడం, ముఖంపై మొటిమలు, ఇలా ఇబ్బంది పెట్టే సమస్యలెన్నో ఉత్పన్నమవుతాయి. వీటన్నింటి నుంచి విముక్తి పొందడానికి చాలామంది వారికి తెలిసిన వివిధ రకాల చిట్కాలు పాటిస్తున్నారు. అయితే చర్మ సౌందర్యం దెబ్బతినడానికి మృత కణాలు కూడా ఒక కారణం. అయితే వీటి వల్ల చర్మం నిగారింపు కోల్పోతుంది. చెమట గ్రంథుల్ని మూసివేడయం వల్ల మొటిమలు, మచ్చలు వంటివి ఏర్పడతాయి. వీటి నుంచి అధిగమించాలంటే ఈ చిక్కాలు పాటించాల్సిందే..

సన్ స్క్రీన్‌తో మేలు..

సూర్యకిరణాల నుంచి విడుదలయ్యే అధిక యూవీ ఎక్స్‌పోజర్ చర్మానికి హాని కలిగిస్తుంది. ఫలితంగా చర్మం ముడతలు పడటం, వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో సూర్యకిరణాలు తాకే ప్రదేశాల్లో సన్ స్క్రీన్ అప్లై చేయడం మంచిది. నిమ్మకాయలో ఉండే విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు, సిట్రస్ యాసిడ్, యాంటీ బ్యాక్టీరియల్ మొటిమలు, మచ్చలను నియంత్రించి చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. ముఖం మృదువుగా చేస్తుంది.

పళ్లు, పళ్ల రసాలు తీసుకోవడం మంచిది..

వేసవి తాపానికి శరీరం తేమ కోల్పోతుంది. ఫలితంగా చర్మం ఎర్రగా కందిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో పళ్లు, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్ల ఎక్కువగా తీసుకోవడం వల్ల చర్మానికి అవసరమైన విటమిన్లతో పాటు, శరీరానికి అవసరమైన నీటి స్థాయిలను పునరుద్ధరిస్తాయి. చర్మం కాంతిమంతంగా మెరుస్తుంది. నిమ్మ, జామ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, వాటర్ మెలాన్, బ్లూబెర్రీ, కివీ, యాపిల్ వంటి పండ్లు తీసుకోవడం మంచిది. జామపండులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సీ ఎండ నుంచి చర్మాన్ని రక్షిస్తుంది.



మేకప్ తక్కువగా వేసుకోవాలి..

"సూర్య కిరణాల నుంచి వెలువడే యూవీ ఎక్స్‌పోజర్ చర్మానికి హానికలిగిస్తుంది. దీనిని నుంచి రక్షణ కోసం ఎస్‌పీఎఫ్ 50 ఉన్న యూవీ స్పెక్ట్రమ్ సన్ బ్లాక్, సన్ స్క్రీన్ ఉపయోగించాలి. కాలంతో సంబంధం లేకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సి వస్తే సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. వేసవిలో ఇది మరింత అవసరం. ఇంటికి చేరుకున్న తర్వాత చల్లటి నీటితో ముఖం కడగడం, స్నానం చేయడం వంటి జాగ్రత్తలు పాటించాలి. ఎండ తీవ్రతకు చర్మం పొడిబారిపోకుండా తేమగా ఉండటానికి నిపుణుల సూచనల మేరకు మాయిశ్చరైజర్లు అప్లై చేసుకోవాలి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండలో తిరగకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటి నుంచి బయటకు రావాల్సి వస్తే ఎండ నుంచి ఉపశమనం కోసం బ్లాక్ గాగుల్స్, ఎండ తగలకుండా స్కార్ఫ్స్, గొడుగు వెంట తీసుకెళ్లడం మంచిది. వేసుకునే దుస్తులు కాటన్ మెటీరియల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. లూజుగా ఉన్న కాటన్ బట్టలు ధరించాలి." - ఆలపాటి శిరీష, కాస్మటాలజిస్టు, సికారా క్లినిక్స్, బంజారాహిల్స్



వేసవికి.. ఒకినావా

ద్వీప రుచులు..

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా విశిష్టత కలిగిన జపనీస్ ద్వీపమైన ఒకినావాకు చెందిన పాకశాస్త్ర వైభవం నగరవాసులకు చేరువ కానుంది. ఒకినావా నైట్స్‌తో పేరుతో హైదరాబాద్ విమానాశ్రయం నోవోటెల్ వేదికగా ఏప్రిల్ 5 నుంచి 26 వరకూ ప్రతి శనివారం ఈ రుచులను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఒకినావా ద్వీప వంటకాలు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తాయని, ఇది శతాబ్దాల వాణిజ్యం, సంప్రదాయం, ప్రకృతితో లోతైన సంబంధాన్ని ప్రదర్శిస్తాయని హైదరాబాద్ విమానాశ్రయం నోవోటెల్ జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ తెలిపారు. ముఖ్యంగా జపనీస్, చైనీస్, ఆగ్నేయాసియా సమ్మేళనంతో పాటు దీర్ఘాయువును ప్రోత్సహించే పదార్థాలకు ప్రసిద్ధి చెందిన ఈ వంటకాలు సరికొత్త రుచులను ఆస్వాదించే నగరవాసులకు మంచి అనుభూతిని అందిస్తాయని అన్నారు. ఈ వేదికలో లైవ్ సుషీ కౌంటర్, జపనీస్ రుచికరమైన పాన్‌కేక్ ఒకోనోమియాకి తయారీ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుందని అన్నారు.





అమ్మ చెక్కిన బొమ్మ..

అభిమానుల ప్రశంసలు పొందిన నాటిక

సాక్షి, సిటీ బ్యూరో: మానవజాతిలో స్త్రీ, పురుషులే కాకుండా దాదాపు 20 రకాల శరీరతత్వాలు కలిగిన మనుషులు ఉన్నారని ఎంతమందికి తెలుసు?! సామాన్య మానవుల్లానే వారికి కూడా సరైన గౌరవం, సమానత్వాన్ని అందించాలని 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక ద్వారా తెలియజేశారు కళాకారులు. గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో జ్యోతిరాజ్ రచనలో డా. వెంకట్ గోవాడ దర్శకత్వం వహించిన అమ్మ చెక్కిన బొమ్మ నాటిక వీక్షకులను అలరించింది. నగరంలోని రంగభూమి వేదికగా విభిన్న శరీర తత్వాలున్న (క్వీర్స్) వారి గురించి అవగాహన కల్పించడానికి నిర్వహించిన ఈ నాటిక అభిమానుల ప్రశంసలు అందుకుంది.

బాధ్యతగా.. బాసటగా..



వేసవిలో మూగ జీవాలకు మన వంతు సాయం అవసరం

- నీరు, ఆహారం లభించక అవస్థలు
- పలు స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికుల స్పెషల్ డ్రైవ్
- నగరంలో పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు



ఎప్పటిలానే ఎండలు మండిపోతున్నాయి.. వేడి నుంచి రక్షణకు ప్రత్యామ్నాయ మార్గలను మొదలుపెట్టేశాం. వేసవి తాపానికి ఇప్పటికే ఇళ్లకు కూలర్లు, ఏసీలు ఇతర జాగ్రత్తలు సమకూర్చుకుంటున్నాం. మరి మనతోపాటే, మనతో భాగంగా సామాజిక జీవనం సాగిస్తున్న మూగజీవాల పరిస్థితి ఏంటి..? జీవవైవిధ్యంలో భాగంగా సాటి జీవుల సామాజిక బాధ్యత కూడా మనపైనే ఆధారపడి ఉంది. వాటి సంరక్షణకు తోడ్పాటునందించాల్సిన నైతిక బాధ్యత మనపై ఉందంటున్నారు జంతుప్రేమికులు. 'మనిషికింత సాయం, పశువుకింత గ్రాసం, పిట్టకింత ధాన్యం' అనే మానవీయ కోణాన్ని గుర్తించాల్సిన అవసరాన్ని జంతు ప్రేమికులు ప్రచారం చేస్తున్నారు. -సాక్షి, సిటీబ్యూరో

నగరం వేదికగా ప్రతి వేసవిలో చిన్నారులపై కుక్కల దాడులు పెరుగుతుండటం మనం గమనిస్తూనే ఉన్నాం. దీనికి కారణం సెలవుల వల్ల పిల్లలు ఇంటి దగ్గర ఉండటం కాదు. వేసవిలో కుక్కలకు కనీసం తాగడానికి నీరందక, నీరసించిపోయి.. ఆ చిరాకు, ఇతర సమస్యలతో మనుషులపై దాడి చేస్తుంటాయని వెటర్నరీ డాక్టర్లు వెల్లడిస్తున్నారు. మన సంరక్షణ అటుంచితే.. ఆ మూగ జీవాల పరిస్థితి దారుణం. వడదెబ్బతో పాటు నీరు, ఆహారం అందక ప్రాణాలు కోల్పోతుంటాయి. ప్రతి యేటా ఎండల తీవ్రతతో నగరంలో వేల సంఖ్యలో పక్షిజాతులు మృత్యువాత పడుతున్నాయని యానిమల్ వెల్ఫేర్ సంస్థల సభ్యులు చెబుతున్నారు. ప్రధానంగా నగరంలోని వీధి కుక్కలు, పక్షులు, నగరంతో పాటు నగర శివార్లలోని పలు అడవుల్లోని జంతువులు ప్రాణాలు వదిలేస్తున్నాయి.



ఇవి చేస్తే సరి..

- వీధుల్లో ఇంటి ముందు చిన్న చిన్న బౌల్స్‌లో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం నీరుపోసి ఉంచితే మూగజీవాలు దాహం తీర్చుకుంటాయి.
- ఇంటిపైన, బాల్కనీ, వరండాల్లో తొట్టెల్లో, కుండల్లో నీరుపోయాలి. నీటితో పాటు చిరుధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచితే ఆరగిస్తాయి.
- నగరంలోని పలు ఎన్‌జీఓలు ఇప్పటికే పలు వీధుల్లో వాటర్ బౌల్స్ ఏర్పాటు చేశాయి. వాటిలో నీరు పోసినా జంతువులకు బాసటగా నిలిచినట్లే..
- నగర వాతావరణంలో పిచ్చుకల సంఖ్య భారీగా తగ్గిపోతుందని పలు సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో చిన్న చిన్న గూళ్లు ఏర్పాటు చేస్తే వాటిని పిచ్చుకలు ఆవాసంగా మార్చుకుంటాయి.
- రాత్రి సమయంలో ఇంట్లో మిగిలిపోయిన అన్నం, ఇతర ఆహార పదార్థాలు ఇంటి పరిసరాల్లోని కుక్కలకు పెడితే వాటి ఆకలి తీరడంతో పాటు దాడులు తగ్గిపోతాయి.



వాటర్ బౌల్స్ ఏర్పాటు చేస్తున్నాం..

మా ఫర్రీ ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని జంతువుల సంరక్షణకు విభిన్న ప్రాజెక్టులు చేపడుతున్నాం. ఇందులో భాగంగా వారాంతాల్లో కేబీఆర్ పార్క్, డాగ్ పార్క్‌వంటి ప్రదేశాల్లో వీధి కుక్కల దత్తత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. వేసవి నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో వాటర్ బౌల్స్ తయారు చేయించాం. కామినేని కుటుంబం, జిందా తిలిస్మాత్ వంటి వారు మా ప్రయత్నానికి సహకారం అందిస్తున్నారు. వీటిని పంపిణీ చేయనున్నాం. ఆసక్తి గల వారు వాటిని పొందవచ్చు. ఎండాకాలంలో జంతువులకు ముఖ్యమైన నీరును అందించి వాటి ప్రాణాలను కాపాడాలని మనవి. - విజయా కామినేని, ఫర్రీ ఫ్రెండ్స్ ఫర్ ఎవర్

- పలు ఎన్‌జీవోలు జంతు సంరక్షణ కోసం వాటర్ బౌల్స్ ప్రాజెక్ట్, ఫుడ్ ఫర్ యానిమల్స్ ప్రాజెక్టులు చేపడుతున్నాయి. వ్యక్తిగతంగా సమయం కేటాయించలేని వారు ఈ సంస్థలకు సహకరిస్తే.. పరోక్షంగా భాగస్వాములు కావచ్చు.

చెరువుకు కొత్త రూపు..

చేతులు కలిపిన అమెజాన్, సే ట్రీస్..

సాక్షి, సిటీబ్యూరో: డంపింగ్ సైట్‌గా ఉపయోగిస్తుండడం వల్ల బంజరు భూమిగా మారిన కొత్తూరులోని సాయి రెడ్డి లేక్‌ను పునరుద్ధరించేందుకు అమెజాన్ ఇండియా, సే ట్రీస్ సంస్థలు చేతులు కలిపాయి. ఈ విషయాన్ని, వివరాలను అమెజాన్ ఇండియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ అభినవ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరానికి సమీపంలో ఉన్న సాయి రెడ్డి చెరువుకు సంబంధించి అమెజాన్ ఇండియా చేపట్టిన పునరుద్ధరణ ప్రాజెక్టు పూర్తయితే చెరువు నీటి పరిమాణం ఇప్పటితో పోలిస్తే కనీసం మూడు రెట్లు పెరుగుతుంది. దీని కోసం ప్రస్తుతం ఉన్న 10 ఎకరాల నుంచి 33 ఎకరాలకు నీటి వనరులను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ చెరువు పునరుద్ధరణ పనుల ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, సే ట్రీస్ ట్రస్టీ డియోకాంత్ పయాసి పాల్గొన్నారు.





గ్రేటర్‌లో.. రియల్టీ పల్టీ!

హైదరాబాద్‌లో స్థిరాస్తి రంగం పతనం

ఇళ్ల లాంచింగ్స్, అమ్మకాల్లో భారీ తగ్గుదల

3 నెలల్లో విక్రయాలు 49 శాతం, ప్రారంభాలు 55 శాతం క్షీణత


దేశంలోనే అత్యధిక తగ్గుదల భాగ్యనగరంలోనే..

అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడి

❖ రాజకీయ అనిశ్చితి, ప్రభుత్వ ప్రతికూల విధానాలు, ఆకాశాన్నంటిన ప్రాపర్టీ ధరలు.. కారణాలేవైనా.. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పల్టీలు కొడుతూ పతనమైపోతోంది. రెండేళ్ల క్రితం ఎన్నికలతో మొదలైన స్థిరాస్తి రంగం మందగమనం.. కొత్త ప్రభుత్వం కొలువు దీరి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ కోలుకోలేదు. ఈ ఏడాది తొలి మూడు నెలల కాలంలో గ్రేటర్‌లో గృహ విక్రయాలు, లాంచింగ్స్ భారీగా తగ్గాయి. దేశంలోనే ఇళ్ల అమ్మకాలు, లాంచింగ్స్‌లో అత్యధిక క్షీణత మన నగరంలోనే ఉండటం గమనార్హం.

❖ హైదరాబాద్‌లో ఈ ఏడాది తొలి మూడు నెలల్లో (క్యూ1) 10,100 ఇళ్లు అమ్ముడుపోయాయి. 2024 క్యూ1లో 19,660 సేల్ అయ్యాయి. ఏడాది కాలంలో విక్రయాలలో 49 శాతం తగ్గుదల నమోదయిందని అనరాక్ గ్రూప్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. అలాగే నగరంలో 2025 క్యూ1లో కొత్తగా 10,275 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. అదే 2024 క్యూ1లో 22,960 యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఏడాదిలో లాంచింగ్స్ 55 శాతం తగ్గాయని పేర్కొంది.

అయితే ఆశ్చర్యకరంగా నగరంలో కొత్తగా ప్రారంభమైన ఇళ్లలో లగ్జరీ గృహాలదే ఆధిపత్యం. గ్రేటర్‌లో కొత్త ఇళ్ల నిర్మాణాలలో రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉండే లగ్జరీ ఇళ్ల వాటా 70 శాతం కంటే ఎక్కువగా ఉంది. - సాక్షి, సిటీబ్యూరో



నగరాల వారీగా గృహాల విక్రయాలు, లాంచింగ్స్

	విక్రయాలు		లాంచింగ్స్	
నగరం	2025 క్యూ1	2024 క్యూ1	2025 క్యూ1	2024 క్యూ1
ఎన్‌సీఆర్	12,520	15,650	11,120	7,270
ముంబై	31,610	42,920	30,755	33,800
బెంగళూరు	15,000	17,790	20,855	16,485
పుణే	16,100	22,990	16,860	18,770
హైదరాబాద్	10,100	19,660	10,275	22,960
చెన్నై	4,050	5,510	4,755	7,290
కోల్‌కత్తా	3,900	5,650	5,400	4,290



ఇన్వెంటరీ 5 లక్షలపైనే..

ఏడు నగరాల్లో అమ్ముడుపోకుండా ఉన్న ఇళ్లు(ఇన్వెంటరీ) కాస్త తగ్గాయి. 2024 క్యూ1లో 5,80,890 యూనిట్ల ఇన్వెంటరీ ఉండగా.. 2025 క్యూ1 నాటికి 5,59,810కు క్షీణించాయి. అంటే ఏడాది కాలంతో పోలిస్తే ఇన్వెంటరీ 4 శాతం తగ్గింది. స్థిరమైన ఆర్థిక పరిస్థితి, జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణ నియంత్రణ కారణంగా దేశంలో గృహాల ధరలు ఏటేటా పెరుగుతున్నాయి. ఏడాది కాలంలో ప్రాపర్టీ ధరలు మాత్రం 17 శాతం మేర పెరిగాయి. అత్యధికంగా ఎన్‌సీఆర్‌లో 34 శాతం, బెంగళూరులో 20 శాతం వృద్ధి చెందాయి.



దేశంలోనూ సేమ్..

దేశంలోని ఇతర మెట్రో నగరాల్లోనూ స్థిరాస్తి రంగం తిరోగమనంలోనే ఉంది. ఈ ఏడాది క్యూ1లో ఏడు ప్రధాన నగరాల్లో గృహ విక్రయాలు 28 శాతం, లాంచింగ్స్ 10 శాతం క్షీణించాయి. 2025 క్యూ1లో 93,280 యూనిట్లు అమ్ముడుపోయాయి. అదే గతేడాది క్యూ1లో 1,30,170 ఇళ్లు విక్రయమయ్యాయి. ఇదే సమయంలో 7 నగరాల్లో 2025 క్యూ1లో 1,00,020 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. 2024లో 1,10,865 గృహాలు ప్రారంభమయ్యాయి. అంటే ఏడాదిలో 10 శాతం లాంచింగ్స్ క్షీణించాయి.

లగ్జరీదే హవా..

లాంచింగ్స్‌లో లగ్జరీ, అల్ట్రా లగ్జరీ గృహాలే అత్యధికం. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉండే ఈ తరహా ఇళ్ల వాటా 42 శాతం ఉన్నాయి. ఆ తర్వాత రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నర ధర ఉండే ప్రీమియం యూనిట్ల వాటా 27 శాతం, రూ.40–80 లక్షల ధర ఉండే అఫర్డబుల్ హౌసింగ్స్ వాటా 12 శాతంగా ఉన్నాయి.



విద్యార్థి గృహాలకు గిరాకీ

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల వసతి గృహాలకు డిమాండ్ పెరుగుతోంది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులకు మెట్రో నగరాలకు వలస వస్తుంటారు. ప్రభుత్వ నూతన విద్యా విధానాలు, వినూత్న సాంకేతికత కారణంగా ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థుల వలసల వృద్ధికి ప్రధాన కారణమని కొలియర్స్ ఇండియా అడ్వైజరీ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వప్నిల్ అనిల్ తెలిపారు. క్యాంపస్‌లు, హాస్టళ్లు, పీజీ గృహాలలో అపరిశుభ్రత, భద్రత కరువు, ఎక్కువ అద్దెలు వంటి రకరకాల కారణాల వల్ల స్టూడెంట్ హౌసింగ్ విభాగం ఇప్పటివరకు ఈ రంగం అసంఘటితంగా, నియంత్రణ లేకుండా ఉంది. ఒకే వయసు వ్యక్తులతో కలిసి ఉండటం, ఆధునిక సౌకర్యాలు, మెరుగైన ప్రయాణ వసతులతో సులువైన రాకపోకలు, రోజువారీ కార్యకలాపాలలో సహాయం వంటి రకరకాల కారణాలతో యువతరం వసతి గృహాలలో ఉండేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం దేశంలోని ప్రధాన నగరాలలో స్టాంజా, హౌసర్, యువర్ స్పేస్, ఓలైవ్ లివింగ్ వంటి సంస్థలు విద్యార్థి వసతి గృహాల సేవలను అందిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో 1.10 కోట్ల మంది వలస విద్యార్థులు ఉండగా.. 2036 నాటికి 3.10 కోట్లకు చేరుతుందని కొల్లియర్స్ నివేదిక అంచనా వేసింది. అయితే ఆయా విద్యార్థులకు కోసం వసతి గృహాలలో కేవలం 75 లక్షల పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపింది. కరోనా తర్వాత విద్యార్థి గృహాల అద్దెలు ఏటా 10–15 శాతం మేర పెరుగుతున్నాయి.

ఫస్ట్ ఛాయిస్.. ఓపెన్ ప్లాట్

తొలిసారి ప్రాపర్టీ కొనుగోలుదారుల అభిప్రాయమిదీ..

సాక్షి, సిటీబ్యూరో: ఓపెన్ ప్లాటా? అపార్ట్‌మెంటా? ఎందులో పెట్టుబడులకు ఆసక్తి ఉందనే ప్రశ్నకు సగానికి పైగా తొలిసారి ప్రాపర్టీ కొనుగోలుదారుల అభిప్రాయం ఓపెన్ ప్లాటనే సమాధానం. 58 శాతం మంది కస్టమర్లు స్థలం మీద పెట్టుబడులకు మొగ్గు చూపిస్తున్నారని మ్యాజిక్ బ్రిక్స్ సర్వేలో తేలింది. దీర్ఘకాలిక మూలధన లాభాలు, అధిక రాబడులే ఇందుకు ప్రధాన కారణమని వెల్లడించింది.

❖ దేశంలోని సుమారు 2,200 మంది గృహ కొనుగోలుదారులతో సర్వే నిర్వహించింది. ఇందులో 17.1 శాతం మంది కస్టమర్లు పెట్టుబడులకు రెండో ప్రాధాన్యత ఆస్తిగా వాణిజ్య స్థలాలను ఎంచుకున్నారు. ఓపెన్ ప్లాట్లలో అత్యధికంగా బెంగళూరు స్థలాలకు డిమాండ్ ఉంది. 36.5 శాతంతో గ్రీన్ సిటీ అగ్రస్థానంలో ఉండగా.. చెన్నై ప్లాట్లకు 11 శాతం, లక్నో స్థలాలకు 8.9 శాతం ఆసక్తి చూపిస్తున్నారు. 1,000–2,000 చ.అ. మధ్య తరహా ప్లాట్లకు 46.76 శాతం డిమాండ్ ఉంది.

58 శాతం మంది ప్లాట్లలో పెట్టుబడులకే ఆసక్తి

మ్యాజిక్ బ్రిక్స్ సర్వేలో వెల్లడి

రూ.50 లక్షల వరకూ..

రూ.50 లక్షల వరకు ధర ఉండే స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. 50.83 శాతం మంది ప్లాట్లలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు. గ్రేటర్‌లో షాద్‌నగర్, కడ్తాల్, సదాశివపేట వంటి ప్రాంతాలలో ప్లాట్ల సరఫరా అత్యధికంగా ఉంది. ఇక్కడ ప్లాట్ల సగటు ధర చ.అ.కు రూ.2,765గా ఉంది. లక్నోలో రూ.2,836, చెన్నైలో రూ.3,208లు పలుకుతున్నాయి. అత్యధికంగా నోయిడాలో రూ.22,523, గుర్గావ్‌లో రూ.21,901లతో ఖరీదైన మార్కెట్లుగా ఉన్నాయి.



ఇసుక, సిమెంట్ లేకుండానే.. గోడలకు ప్లాస్టరింగ్!

మినరల్ జిప్సం పన్నింగ్‌తో నిర్మాణం

కాంపోజిట్ కంటే మినరల్ జిప్సమే శ్రేష్టం



ఈ ఇళ్లలో ఉష్ణోగ్రతలు 2–3 డిగ్రీలు తగ్గుదల

సాధారణంగా మనం చూసే భవనాలన్నీ ఇసుక, సిమెంట్ కలిపిన ఆర్సీసీ కాంక్రీట్ లేదా మైవాన్ అల్యూమీనియంతో ఉంటాయి. పైకప్పు, గోడలు అన్నీ వీటితోనే నిర్మిస్తుంటారు. దీంతో ఈ ఇళ్లలో వేడి ఎక్కువగా ఉంటుంది. పైగా ఇసుక, సిమెంట్ ధరల పెరుగుదల కారణంగా గోడలు, ప్లాస్టరింగ్‌లకు అయ్యే ఖర్చు తడిసిమోపడవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా ఖనిజ జిప్సం అందుబాటులోకి వచ్చేసింది. ఇసుక, సిమెంట్ అవసరం లేకుండానే నేరుగా ఇటుకల మీదపూతలాగే పూయడమే మినరల్ జిప్సం పన్నింగ్ ప్రత్యేకత. పైగా దీనికి చుక్క నీటితో క్యూరింగ్ కూడా అవసరం లేదు. అంతేకాకుండా మినరల్ జిప్సం ఇళ్లలో గది ఉష్ణోగ్రతలు 2–3 డిగ్రీలు తక్కువగా ఉంటాయి. - సాక్షి, సిటీబ్యూరో

❖ మన దేశంలో అపారమైన నదుల కారణంగా ఇసుక లభ్యత ఎక్కువ. దీన్ని ఆసరా చేసుకొని బ్రిటీష్ రాజులు మన దేశంలో సిమెంట్ కర్మాగారాలు నెలకొల్పి, అందుబాటులో ఉన్న ఇసుకను కలిపి నిర్మాణ రంగంలో వినియోగించడం మొదలు పెట్టారు. కాలక్రమేణా నది ఇసుక కొరత ఏర్పడటంతో రోబో శాండ్ మార్కెట్‌లోకి వచ్చింది. దీనికి పట్టుత్వం తక్కువగా ఉండటంతో



ప్రత్యామ్నాయంగా జిప్సం వినియోగం పెరిగింది. భూగర్భంలో బంగారం, బొగ్గు, ఇనుము వంటి గనుల లాగే జిప్సం కూడా ఖనిజమే. మన దేశంలో రాజస్థాన్‌లోని బికానెర్, కశ్మీర్ వ్యాలీలో మాత్రమే మినరల్ జిప్సం గనులు ఉన్నాయి. మార్కెట్‌లో కాంపోజిట్, మినరల్ జిప్సం అని రెండు రకాలు ఉంటాయి. సిమెంట్ పరిశ్రమల వ్యర్థాల నుంచి వెలువడే తెల్లటి పదార్థాన్ని కాంపోజిట్ జిప్సం అంటారు. దీన్ని ఇటుక, చాక్ పీస్ తయారీలో ఎక్కువగా వినియోగిస్తుంటారు.

మినరల్ జిప్సం భూగర్భంలో నుంచి వెలికితీసే గని. దీని రసాయన నామం కాల్షియం సల్ఫేట్ డీహైడ్రేట్ (సీఏఎస్ ఓ4).

అంతర్గత గోడలు, సీలింగ్‌లకే..

ఖనిజ జిప్సంకు నిరంతరం నీరు తాకితే తేమ కారణంగా పాడైపోతాయి. అందుకే దీన్ని ఇంటి లోపల అంతర్గత గోడలు, సీలింగ్‌లకు మాత్రమే వినియోగిస్తారు. బయట గోడలకు, బాత్‌రూమ్, టాయిలెట్స్ గోడలకు వినియోగించరు. ఆర్సీసీ కాంక్రీట్‌ను తాపీతో వేయాలి లేకపోతే చేతులు, కాళ్లకు పొక్కులు వస్తాయి. అదే మినరల్ జిప్సంను నేరుగా చేతులతో కలుపుతూ గోడలకు పూత లాగా పూస్తారు. ఈ గోడలు చాలా తేలికగా ఉండటంతో ఇంటి శ్లాబ్ మీద బరువు పెద్దగా పడదు. మినరల్ జిప్సంను నివాస, వాణిజ్య, కార్యాలయ అన్ని రకాల భవన సముదాయాల నిర్మాణంలో వినియోగిస్తారు.

ఎంత ఖర్చు అవుతుందంటే..

ఆర్సీసీ కాంక్రీట్‌తో చదరపు అడుగు గోడ ప్లాస్టరింగ్ రూ.50–55 ఖర్చు అవుతుంది. అదే జిప్సం పన్నింగ్‌కు అయితే రూ.35–40తో అయిపోతుంది. అలాగే చ.అ. కాంక్రీట్ గోడ క్యూరింగ్‌కు 7 లీటర్ల నీళ్లు అవసరం కాగా.. కనిష్టంగా ఏడు రోజుల పాటు క్యూరింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక, జిప్సం గోడలకు క్యూరింగే అవసరం లేదు. ఉదాహరణకు.. త్రీ బీహెచ్‌కే ఫ్లాట్‌లో అంతర్గత గోడలు నాలుగు వైపులా కలిపితే 5 వేల చ.అ. ఉంటాయి. వీటి క్యూరింగ్‌కు 25 వేల నీళ్లు అవసరం అవుతాయి. ఈలెక్కన ఖనిజ జిప్సంతో నీళ్లు, సమయం, డబ్బు ఆదా అవుతుందన్నమాట.



ఇళ్లంతా చల్లగా..

మినరల్ జిప్సంకు వేడి, అగ్ని, ధ్వనిని నిరోధించే శక్తి ఉంటుంది. ఇందులోని థర్మల్ ప్రూఫ్ కారణంగా బయటితో పోలిస్తే ఇంటి లోపల ఉష్ణోగ్రతలు 2–3 డిగ్రీలు తక్కువగా ఉంటాయి. అలాగే ఖనిజ జిప్సంతో ఉండే ఇంట్లో చల్లదనం కోసం ఏసీ ఎక్కువ సమయం వేయాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా మినరల్ జిప్సంకు అగ్ని ప్రమాదాలను తట్టుకుంటాయి. నింతరంగా మూడు గంటల పాటు అగ్నిని నిరోధిస్తాయి. ఖనిజ జిప్సంతో కట్టే గోడలు చాలా మృదువుగా, పాల వలే తెల్లగా ఉంటాయి. దీంతో చూసేందుకు ఎంతో అందంగా ఉంటాయి.

కూల్.. హోమ్

పైకప్పులో కూల్ రూఫ్ టైల్స్

వీటికి సూర్యరశ్మిని గ్రహించే గుణం

రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. ఇంటి లోపల వేడి, ఉక్కపోత పెరిగిపోతోంది. దీంతో బయటే కాదు ఇంట్లోనూ ఉండలేని పరిస్థితి. ఇలాంటి సమయంలో ఇళ్లంతా చల్లగా ఉంటే ఆ హాయి వేరే కదూ.. అయితే పైకప్పులో కూల్ రూఫ్ టైల్స్, పెయింటింగ్స్ వేసుకుంటే సరి. సూర్యరశ్మిని గ్రహించి, ఇంట్లోకి వేడిని రాకుండా నిరోధించే శక్తి ఉండటం వీటి ప్రత్యేకత. పట్టణీకరణ, కాంక్రీట్ జంగిల్ కారణంగా నగరాలలో అర్బన్ హీట్ ఐల్యాండ్ (యూహెచ్ఐ) ప్రభావం ఏర్పడుతుంది. దీంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవి కాలంలో వేడి గాలులతో 32 కోట్ల మంది భారతీయులు అధిక ప్రమాదకర పరిస్థితులకు గురవుతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. చెట్ల పెంపకం, వేడి, కాలుష్యాన్ని తగ్గించే ఆచరణీయ పద్ధతులు ఉన్నప్పటికీ ప్రపంచ నగరాలు కూల్ రూఫ్, గ్రీన్ బిల్డింగ్ వంటి వినూత్న పరిష్కార మార్గాల వైపు దృష్టి సారిస్తున్నాయి. న్యూయార్క్, కాలిఫోర్నియా, టొరంటో వంటి అంతర్జాతీయ నగరాలు కూల్ రూఫ్ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ గణనీయమైన పర్యావరణ ప్రయోజనాలను పొందుతున్నాయి. ఇదే తరహాలో గత ప్రభుత్వం మన రాష్ట్రంలోనూ 'కూల్ రూఫ్ పాలసీ'ని అమలులోకి తీసుకొచ్చింది. -సాక్షి, సిటీబ్యూరో



కూల్ ఉంటేనే ఓసీ..

మన రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర నివాస, వాణిజ్య భవనాలకు కూల్ రూఫ్ తప్పనిసరి. 600 గజాలు, అంతకంటే ఎక్కువ స్థలంలోని నివాస భవనాలకు కూల్ రూఫ్ ఉండాల్సిందే. అంతకంటే చిన్న ఇళ్లు స్వచ్ఛందంగా స్వీకరించవచ్చు. ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతి ప్రక్రియలో కూల్ రూఫ్ విధానాన్ని మిళితం చేసింది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీ చేసేందుకు సంబంధిత అధికారులు కూల్ రూఫ్‌లను నిర్ధారించుకున్నాకే ఓసీ జారీ చేస్తారు. కూల్ రూఫ్ పాలసీ అమలుతో ఐదేళ్ల తర్వాత మన రాష్ట్రంలో ఏటా సుమారు 12 కోట్ల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతోందని ప్రభుత్వం అంచనా వేసింది.

ఎంత ఖర్చవుతుందంటే..

కూల్ రూఫ్ టైల్స్‌ను జిర్కోనియం సిలికేట్, జింక్ ఆక్సైడ్‌ల నానోమీటర్ల పరిమాణంలో ఉండే చిన్న కణాల మిశ్రమాలను అల్యూమీనియం సిలికెట్ కణాలతో కూడిన ప్రత్యేక గ్లేజ్‌తో తయారు చేస్తారు. వీటిని అధిక ఉష్ణోగ్రతల వద్ద కాలుస్తారు. దీంతో వీటికి సూర్యరశ్మిని గ్రహించి, ఇంట్లోకి వేడిని చేరనివ్వదు. కూల్ రూఫ్ ఏర్పాటుకు రకాన్ని బట్టి చ.అ.కు రూ.120–1,000 వరకు ఖర్చు అవుతుంది. ప్రత్యేకమైన పెయింటింగ్‌లు లేదా నిర్దిష్ట సిరామిక్ టైల్స్‌తో తయారైన కూల్ రూఫ్‌లు ఉన్నాయి.

ఏసీ వినియోగం తక్కువ..

సంప్రదాయ పైకప్పుతో పోలిస్తే కూల్ రూఫ్‌లు తక్కువ సౌరశక్తిని గ్రహిస్తాయి. ఇవి సూర్యరశ్మిని తక్కువగా గ్రహించి, ఇంట్లోకి వేడిని వెళ్లనివ్వదు. దీంతో ఇంట్లో ఏసీ, కూలర్ల వినియోగం తక్కువగా ఉంటుంది. సంప్రదాయ పైకప్పులతో పోలిస్తే కూల్ రూఫ్ పైకప్పు ఉన్న ఇంటిలోపల గది ఉష్ణోగ్రతలు 5–9 డిగ్రీలు తక్కువగా ఉంటాయి.

క్లుప్తంగా...

'కోడ్'తో కొత్త విద్యుత్ టారిఫ్ ఉత్తర్వుల వాయిదా

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మొదలుకానున్న నూతన ఆర్థిక సంవత్సరం (2025–26)లో వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిన విద్యుత్ చార్జీలు, క్రాస్ సబ్సిడీ వివరాలతో కూడిన రిటైల్ సప్లై టారిఫ్ ఆర్డర్ జారీ వాయిదా పడింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఉత్తర్వులను వాయిదా వేసుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) తెలిపింది. కొత్త టారిఫ్ ఆర్డర్ జారీకి ఈసీ అనుమతి కోరామని.. అనుమతి వచ్చేలోగా లేదా కోడ్ ఎత్తేసే వరకు ప్రస్తుత చార్జీలతో కూడిన టారిఫ్ ఆర్డర్ (2024–25) అమలును పొడిగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2025–26కు ప్రస్తుత చార్జీలనే కొనసాగించాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఈఆర్సీని కోరాయి. ఈ నేపథ్యంలో ఈఆర్సీ కొత్త టారిఫ్ ఆర్డర్‌లో ప్రస్తుత చార్జీలను కొనసాగించాలని ఆదేశించే అవకాశం ఉంది.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

ఏపీ ప్రభుత్వానికి కేటీఆర్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపి అనుమానాలను నివృత్తి చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ప్రవీణ్ అకాల మరణంపై క్రైస్తవ సోదరులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ కుటుంబ సభ్యులకు కేటీఆర్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

అవయవ దాతలకు దక్కిన గౌరవం ఇది..

'అవయవదాతల' సంఘం వ్యవస్థాపకురాలు సీతామహాలక్ష్మి



పంజగుట్ట (హైదరాబాద్): అవయవ దాత అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించడానికి బిల్లు ప్రవేశపెట్టడం అవయవ దాతలకు దక్కిన గౌరవం అని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. బిల్లు ప్రవేశపెట్టిన ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అవయవదానంలో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన ఉండటం సంతోషకరమని, మరింత అవగాహన పెరిగి చనిపోయిన వారి అవయవాలు బూడిద కాకుండా మరొకరి ప్రాణాలు కాపాడేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు.

హెచ్‌సీఏఏ అధ్యక్షుడిగా ఎ.జగన్ ఎన్నిక



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎ.జగన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జి.రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులుగా ఖాజా విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి నూకపల్లి, సంయుక్త కార్యదర్శిగా అనిరుధ్ నెల్లికొండ, ట్రెజరర్‌గా పాపయ్య పెద్దాకుల, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పి.రాములు విజయం సాధించారు. అలాగే 15 ఏళ్ల సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా హనుమంతరావు గుడిపాటి, మహిళా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా లావణ్య ఎన్‌టీతోపాటు జనరల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం. అంజలీదేవి, బి. శిరీష, వై. ప్రకాశ్, కె. నరేశ్ గెలుపొందారు.

ఎన్‌సీఎల్‌టీ బార్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు..

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా టి.విజయ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శిగా ఎస్.రాజశేఖర్ రావు, ట్రెజరర్‌గా సి.తులసీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎ.వి. రోహన్‌రావు, సి.రోహిణీస్మిత, కీరవాణి శ్రీరమ్య ఎన్నికయ్యారు.

'బీసీల పోరుగర్జనకు రాహుల్‌గాంధీ హాజరయ్యేలా చూడండి'



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర జరిగే బీసీల పోరు గర్జనకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరయ్యేలా చూడాలని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన్ను జాజుల బృందం కలిసింది. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బీసీల పోరుగర్జన నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

పౌర హక్కుల బాధ్యత కోర్టులు.. పోలీసులదే

భావ ప్రకటన స్వేచ్ఛ విషయంలో సుప్రీం కోర్టు కీలక తీర్పు

- స్వేచ్ఛగా అభిప్రాయాల వ్యక్తీకరణ ఆరోగ్యకర సమాజంలో భాగం
- లేదంటే గౌరవప్రద జీవితం అసాధ్యమవుతుంది
- అభిప్రాయాలతో విబేధించాలే గానీ.. వాటిని అణచివేయరాదు
- పోలీసులు రాజ్యాంగాన్ని గౌరవించాలి.. ఆదర్శాలకు కట్టుబడి ఉండాలి
- ప్రాథమిక హక్కుల పరిరక్షణలో పోలీసులు విఫలమైతే ఆ బాధ్యతను కోర్టులు తీసుకోవాలి
- కవిత పఠనం, వ్యంగ్య కళా ప్రదర్శనలు విద్వేషాలను రెచ్చగొట్టేవిగా పరిగణించరాదు
- మేం విన్న మాటలు, చూసిన రాతలు మాకు నచ్చకపోవచ్చు
- అయినా కూడా పౌరుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది
- న్యాయస్థానాలు ఎప్పుడు భావ ప్రకటన స్వేచ్ఛను ప్రోత్సహించే వైపే ఉండాలి
- కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గ్రాహి కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు
- గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేత



సాక్షి, అమరావతి: పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛ విషయంలో సుప్రీం కోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే విషయంలో పౌరుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కోర్టులు, పోలీసులపై ఉందని స్పష్టం చేసింది. వ్యక్తులు లేదా వ్యక్తుల సమూహం తమ ఆలోచనలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడమనేది ఆరోగ్యకరమైన, నాగరిక సమాజంలో అంతర్భాగమని పేర్కొంది. స్వేచ్ఛగా ఆలోచనలు, అభిప్రాయాలను వ్యక్తం చేయలేకపోతే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవమైన జీవితం గడపడం అసాధ్యమవుతుందని తేల్చి చెప్పింది. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంలో వ్యక్తులు లేదా వ్యక్తుల సమూహాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, ఆలోచనలను మరో అభిప్రాయంతో విబేధించాలేగానీ వాటిని అణచి వేయకూడదని పేర్కొంది.

పోలీసులు విఫలమైతే కోర్టులు బాధ్యత తీసుకోవాలి...

"పోలీసులు లేదా కార్యనిర్వాహక సంస్థలు రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక హక్కులను గౌరవించడం, పరిరక్షించడంలో విఫలమైతే న్యాయస్థానాలు ముందుకు వచ్చి ఆ బాధ్యతను తీసుకోవాలి. ఎందుకంటే పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించగలిగే సంస్థ మరొకటి ఏదీ లేదు. మనది గణతంత్ర రాజ్యంగా అవతరించి 75 సంవత్సరాలు పూర్తయిన తరువాత కూడా మౌలిక సూత్రాలలో మనం ఇలా అస్థిరంగా ఉండకూడదు. కేవలం ఒక కవిత పఠనం, వినోద రూపంలో కళా ప్రదర్శన చేయడం లాంటివి సమూహాల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆరోపించడం ఎంత మాత్రం సరైంది కాదు. ఇలాంటి దృక్పథాన్ని అంగీకరించడమంటే అది ప్రజాస్వామ్యంలో న్యాయసమ్మతమైన అన్ని అభిప్రాయాలను అణిచి వేయడమే అవుతుంది. పోలీసులు రాజ్యాంగాన్ని గౌరవించాలి. అలాగే అందులోని ఆదర్శాలకు కట్టుబడి ఉండాలి" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని విమర్శించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు అడ్డగోలుగా కేసులు బనాయిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్న నేపథ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పునకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఇమ్రాన్ ప్రతాప్‌గ్రాహిపై కేసు కొట్టివేత...

ఇన్‌స్టాగామ్‌లో అభ్యంతరకర పోస్టు పెట్టారంటూ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గ్రాహిపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసును సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఇమ్రాన్‌పై మోపిన నేరం ఏదీ ఆయనకు వర్తించదని తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛ గురించి తీర్పులో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

విబేధించవచ్చు.. కానీ గౌరవించాలి!

ఓ వ్యక్తి వ్యక్తం చేసే అభిప్రాయాలతో ఎంతోమంది విబేధించవచ్చునని, అయితే ఆ వ్యక్తి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కును అందరూ గౌరవించడంతో పాటు ఆ హక్కును పరిరక్షించాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. సాహిత్యం, కవిత్వం, నాటకాలు, సినిమాలు, వ్యంగ్య రచనలు, కళలు మానవ జీవితాన్ని మరింత అర్థవంతంగా మారుస్తాయని, వాటిని విద్వేషాలను రెచ్చగొట్టేవిగా పరిగణించరాదని సూచించింది. పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను పరిరక్షించడంతో పాటు అవి అమలయ్యేలా చూడటం న్యాయస్థానాల ప్రధాన కర్తవ్యమని సుప్రీం కోర్టు తెలిపింది. కొన్నిసార్లు తమకు వినబడిన, రాయబడిన మాటలను న్యాయమూర్తులుగా తాము ఇష్టపడకపోవచ్చునని, అయినప్పటికీ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అలాగే న్యాయమూర్తులుగా రాజ్యాంగాన్ని, అందులోని ఆదర్శాలను పరిరక్షించాల్సిన బాధ్యత కూడా తమపై ఉందంది. పౌరుల హక్కులను రక్షించే విషయంలో సదా ముందు ఉండటం న్యాయస్థానాల బాధ్యతని వ్యాఖ్యానించింది.

ప్రాథమిక హక్కులను కోర్టులు పరిరక్షించాలి...

ప్రధానంగా రాజ్యాంగ న్యాయస్థానాలు పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించేందుకు అగ్రభాగంలో ఉండాలని సుప్రీం సూచించింది. రాజ్యాంగం, ఆదర్శాలను అణిచివేయకుండా చూడాల్సిన ఉత్కృష్ట బాధ్యత న్యాయస్థానాలపై ఉందని పేర్కొంది. న్యాయస్థానాలు ఎప్పుడూ పౌరుల ప్రాథమిక హక్కులను ముఖ్యంగా భావ ప్రకటన స్వేచ్ఛను పరిరక్షించి, దానిని ప్రోత్సహించే వైపే ఉండాలని తెలిపింది. ఇది స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యంలో పౌరులకు ఉండే అత్యంత కీలకమైన హక్కు అని తేల్చి చెప్పింది. పౌరుల స్వేచ్ఛాయుత ఆలోచన, భావప్రకటన స్వేచ్ఛ మన రాజ్యాంగంలోని ప్రధానమైన ఆదర్శాలలో ఒకటని తెలిపింది. పోలీసులు కూడా ఈ దేశ పౌరులేనని, అందువల్ల రాజ్యాంగాన్ని అనుసరించడం, పౌరుల భావ ప్రకటన స్వేచ్ఛను పరిరక్షించడం వారి బాధ్యతని తెలిపింది. విచారణకు స్వీకరించదగ్గ నేరం చేశారన్న సమాచారం అందినప్పుడు సదరు పోలీసు అధికారి మొదట ప్రాథమిక విచారణ చేపట్టాలంది. ప్రాథమిక విచారణ తరువాత ఆ నేరం విచారణకు స్వీకరించదగ్గదని తేలితే, అప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని పేర్కొంది. విచారణకు స్వీకరించదగ్గ నేరం కాదని ప్రాథమిక విచారణలో తేలితే ఆ విషయాన్ని పోలీసులు సదరు ఫిర్యాదుదారుడికి తెలియచేయాలంది. తద్వారా ఫిర్యాదుదారు తనకున్న ఇతర ప్రత్యామ్నాయాలను చూసుకుంటారని తెలిపింది.

విమానాల రాకపోకలు ఆలస్యం

భూకంపంతో థాయ్‌లాండ్ సర్వీసులపై ప్రభావం

శంషాబాద్ (హైదరాబాద్): థాయ్‌లాండ్‌లో భూకంపం ప్రభావంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి.. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ సువర్ణభూమి విమానాశ్రయంతో పాటు ఫుకెట్ విమానాశ్రయానికి సర్వీసులున్నాయి. ఫుకెట్ నుంచి శుక్రవారం రాత్రి 8 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోవలసిన ఐఎక్స్ 909 విమానం నిర్ధారిత సమయం కంటే.. ఆలస్యంగా రానున్నట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. ఫుకెట్ నుంచి రావలసిన మరో విమానాన్ని కూడా నిర్ధారిత సమయం కంటే ఆలస్యంగా షెడ్యూల్ చేసినట్లు ఆన్‌లైన్‌లో ప్రకటించారు. దీంతో పాటు బ్యాంకాక్ సువర్ణభూమి విమానాశ్రయానికి.. షెడ్యూల్ ప్రకారం వెళ్లాల్సిన విమానాల వేళల్లో మార్పులు చేర్పులు ఉండవచ్చని ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

పెండింగ్ బిల్లులకు పోస్టుకార్డు ఉద్యమం

మాజీ సర్పంచ్‌ల నిరసన

సాక్షి, హైదరాబాద్: తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ సర్పంచుల సంఘం పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించింది. తాము సర్పంచ్‌లుగా ఉన్నప్పుడు.. సొంత నిధులు, అప్పులు చేసి చేపట్టిన అభివృద్ధి పనులకు 14 నెలలుగా బిల్లులు పెండింగ్‌లో పెట్టడంపై మాజీ సర్పంచ్‌లు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రం పోస్టాఫీసు వద్ద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మారెడ్డి.. పలువురు మాజీ సర్పంచులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పోస్టు కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. పెండింగ్ బిల్లుల కోసం శాంతియుతంగా నిరసనలు చేపడుతుంటే పోలీసులు అణచివేయడం తగదన్నారు.

భూకంప తీవ్రతకు బ్యాంకాక్ స్తంభించింది

- రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడ ఆగింది... ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించింది
- 'సాక్షి'తో అక్కడున్న తెలుగువారు



మారియట్ హోటల్ సమీపంలోని భవనం రూఫ్ టాప్ స్విమ్మింగ్స్ పూల్ నుంచి పడుతున్న నీరు

సాక్షి, హైదరాబాద్ /గోదావరిఖని : తీవ్ర భూకంపంతో బ్యాంకాక్ అంతా స్తంభించిపోయింది. ప్రజలంతా ప్రాణాలు చేతపట్టుకొని బయటకు పరుగులు తీశారు. తెలుగు రాష్ట్రాలకు–బ్యాంకాక్ మధ్య రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. శుక్రవారం భూ ప్రకంపనలు వచ్చిన సమయంలోనూ అనేక మంది తెలుగువారు ఆ దేశంలో ఉన్నారు. హైదరాబాద్ నుంచి విధి నిర్వహణలో భాగంగా ఓ సమావేశానికి వెళ్లిన ఇమ్మడిశెట్టి మహేశ్, బ్యాంకాక్‌లోనే స్థిరపడిన తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు హర్షారెడ్డి రఘురామ్ 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. అక్కడి పరిస్థితులను వివరించారు.

చాలా తీవ్రంగా వచ్చింది



స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.25 గంటలకు (భారత కాలమాన ప్రకారం 12.55 గంటలు) భూకంపం వచ్చింది. బ్యాంకాక్‌లో దీని తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. అందరూ భయపడి ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇక్కడి భవనాలన్నీ భూకంపాలను తట్టుకునే ఎర్త్‌క్వేక్ రెసిస్టెన్స్ పరిజ్ఞానంతో నిర్మించి ఉంటారు. ఈ కారణంగానే అనేక భవనాలకు పగుళ్లు వచ్చినా, సీలింగ్స్ ఊడినా కూలలేదు. వీకెండ్ ఫ్లోటింగ్ మార్కెట్‌గా పేరుగాంచిన చెటుచాక్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం కుప్పకూలింది. మీడియాలో వైరల్‌గా మారిన విజువల్స్ దానివే. అక్కడే కొంత ప్రాణనష్టం సంభవించినట్టు తెలుస్తోంది. అనేక భవనాలకు రూఫ్ టాప్ స్విమ్మింగ్ పూల్స్ ఉంటాయి. భూకంపం ధాటికి వాటిలోని నీరు బయటకు వచ్చేసింది.

– హర్షారెడ్డి రఘురామ్, బ్యాంకాక్ తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

ట్రాఫిక్ బ్లాక్... అంతా ఎమర్జెన్సీ



విధి నిర్వహణలో భాగంగా ఓ సమావేశంలో పాల్గొనడానికి గత శనివారం బ్యాంకాక్ వచ్చా. నేను బస చేసిన మారియట్ హోటల్ 21వ అంతస్తులో శుక్రవారం మధ్యాహ్నం సమావేశం జరుగుతుండగా భూకంపం వచ్చింది. మొత్తం మూడుసార్లు భూమి కంపించింది. ఏం జరుగుతోందనే ఆందోళన నెలకొంది. హోటల్ నిర్వాహకులు అప్రమత్తం చేయడంతో అంతా బయటకు వచ్చేశాం. బ్యాంకాక్ మొత్తం ట్రాఫిక్ బ్లాక్ అయ్యింది. మెట్రో సహా అన్ని రకాలైన రవాణా సేవలూ నిలిచిపోయాయి. ఇక్కడి ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించింది. ఎక్కడి వారు అక్కడే ఉండాలని, ఎవరూ మరోచోటకు ప్రయాణించొద్దని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ప్రకటించింది. శుక్రవారం రాత్రి వరకు అంతా రోడ్డు పైనే ఉన్నారు. భూకంప తీవ్రతకు మారియట్ హోటల్ చుట్టుపక్కల ఉన్న భవనాలన్నీ ఊగడం స్పష్టంగా కనిపించింది. వాటిపై ఉన్న రూఫ్ టాప్ స్విమ్మింగ్ పూల్స్ నుంచి నీరు వాటర్ ఫాల్ మాదిరిగా కిందకు పడింది. ఒక్కసారిగా అందరం ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నాం.

– ఇమ్మడిశెట్టి మహేశ్ హైదరాబాద్

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశాం

బ్యాంకాక్ నుంచి రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్



'భారీ కుదుపులతో హోటల్ భవనం మొత్తం ఊగిపోయింది.. ఏం జరుగుతుందో అర్థం కాలేదు.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అత్యవసర ద్వారం నుంచి కిందకు పరుగెత్తుకుంటూ వచ్చాం.. కొద్ది దూరం పరుగెత్తిన తర్వాత ఆ భవనం కూలిపోయింది.. దేవుని దయవల్ల బతికి బయటపడ్డాం' అని పెద్దపల్లి జిల్లా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీఠాకూర్ ఉద్వేగంతో ఫోన్ ద్వారా 'సాక్షి'కి వివరించారు. ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు పిల్లలతో సహా బ్యాంకాక్ వెళ్లామని, వేడుక పూర్తికాగానే హోటల్‌కు చేరుకొని బ్యాగ్ సర్దుకొని ఇండియాకు వచ్చేందుకు సిద్ధమయ్యామన్నారు. సరిగ్గా ఇదే సమయంలో భవనం కంపించడం మొదలై, ప్రకంపనలు భారీగా రావడంతో పిల్లలతో కలిసి ప్రాణాలు దక్కించుకునేందుకు 34వ ఫ్లోర్‌లోని గది నుంచి బయటకు వచ్చామన్నారు. భారీ భూకంపంతో బ్యాంకాక్‌లో భీతావహ పరిస్థితి ఏర్పడిందని వివరించారు. ఎక్కడ చూసినా అరుపులు, జనాలు రోడ్లపై పరుగెత్తడం కనిపించిందన్నారు. తన జీవితంలో ఇంతపెద్ద భూకంపాన్ని చూడడం ఇదే తొలిసారి అని, దేవుడి దయవల్ల తాను, తన కుటుంబం క్షేమంగా బయటపడిందని చెప్పారు. రామగుండం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదాలు కూడా తమ కుటుంబంపై ఉండటం వల్లే ప్రాణాలతో తిరిగి వస్తున్నామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు హ్యాట్సాఫ్

- మిమ్మల్ని చూసి గర్వపడుతున్నా..
- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో విజయంపై వైఎస్ జగన్ హర్షం
- రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఎదురొడ్డి ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టారు
- బెదిరింపులు, ప్రలోభాలకు లొంగక ధైర్యంగా నిలబడ్డారు
- క్లిష్ట సమయంలో మీరు చూపిన ధైర్యంతో పార్టీకి ఉత్తేజం
- అప్పుడు, ఇప్పుడు, ఎల్లప్పుడూ పార్టీకి వెన్నెముకలా నిలుస్తున్నారు
- ఈ గెలుపునకు కృషి చేసిన వారందరికీ అభినందనలు



సాక్షి, అమరావతి: స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కొని, వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగుర వేసేందుకు కారణమైన వారందరినీ ప్రశంసించారు. 'రెడ్ బుక్ రాజ్యాంగానికి పార్టీ కేడర్ ఎదురొడ్డి పోరాడింది. అక్రమ కేసులు, కిడ్నాపులు, దాడులను ఎదుర్కొని వైఎస్సార్‌సీపీ గెలిచింది. రాష్ట్రంలో గురువారం జెడ్పీ, మండల పరిషత్‌లలో పదవులకు ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో విలువలకు, విశ్వసనీయతకు పట్టం కడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులను చూసి గర్వపడుతున్నాను' అని శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ హర్షం వ్యక్తం చేశారు. 'స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఎలాంటి బలం లేకపోయినా, సీఎం చంద్రబాబు అధికార అహంకారాన్ని చూపారు. పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినా, కేసులు పెట్టినా, ఆస్తులు ధ్వంసం చేస్తామని, బంధువుల ఉద్యోగాలు తీసేస్తామని, జీవనోపాధి దెబ్బ తీస్తామని భయపెట్టినా, ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా వాటన్నింటినీ బేఖాతరు చేస్తూ మన పార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, నేతలు ధైర్యంగా నిలబడి వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకున్నారు. విలువలకు, విశ్వసనీయతకు పట్టం కడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టిన వీరిని చూసి గర్వపడుతున్నాను. క్లిష్ట సమయంలో వీరు చూపించిన ధైర్యం పార్టీకి మరింత ఉత్తేజాన్ని ఇచ్చింది. ఈ ఎన్నికలను సమన్వయ పరుస్తూ గెలుపునకు బాటలు వేసిన నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, జిల్లా అధ్యక్షులు, రీజినల్ కో ఆర్డినేటర్లు, పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది అందరినీ అభినందిస్తున్నాను. పార్టీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎల్లప్పుడూ వెన్నెముకలా నిలుస్తున్న కార్యకర్తలకు నా హ్యాట్సాఫ్' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాలనలో స్థానిక సంస్థలు కీలకం

- ఏపీలో వచ్చేది వైఎస్సార్‌సీపీనే..
- స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేస్తాం.. స్థానిక ప్రతినిధులకు పాలనలో ముఖ్య పాత్రనిస్తాం
- మంథన్ ఫౌండేషన్ కార్యక్రమంలో ఏపీ మాజీ మంత్రి బుగ్గన



ఖైరతాబాద్: ప్రభుత్వ పాలనలో స్థానిక సంస్థలు కీలకపాత్ర పోషిస్తాయని ఏపీ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏపీలో అధికారం చేపట్టేది వైఎస్సార్ సీపీయేనని, అప్పుడు స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేస్తామని.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పాలనలో ముఖ్య పాత్రను ఇస్తామని తెలిపారు. శుక్రవారం మంథన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యారణ్య పాఠశాలలో 'స్థానిక సంస్థల బలోపేతం, నిర్వహణ, ఎదుర్కొనే సవాళ్లు' అంశంపై కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ, మండల, జిల్లా వ్యవస్థ, మున్సిపల్ వ్యవస్థలను ఏ విధంగా పటిష్టపరచాలనే విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్‌లో నాడు నేడు' కార్యక్రమంపై ప్రశ్న రావడంతో అది గొప్ప కార్యక్రమమని చెప్పారు. 'నాడు నేడుతో విద్యావ్యవస్థతోపాటు వైద్య వ్యవస్థలోనూ విప్లవాత్మక మార్పులు వచ్చాయి. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతోనే ఇది సాధ్యమైంది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను, కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దారు. వీటిని నాటి సీఎం స్వయంగా మానిటర్ చేశారు' అని వివరించారు. ఆడపిల్లలకు టాయిలెట్స్‌లు లేకపోవడంతో వారు స్కూళ్లకు పోలేకపోతున్నారన్న విషయాలను వైఎస్ జగన్ తెలుసుకొని, టాయిలెట్స్ మెయింటెనెన్స్ చేసేందుకు కమిటీలనూ ఏర్పాటు చేశారని బుగ్గన గుర్తుచేశారు.

ఆర్థిక శక్తి కేంద్రంగా హైదరాబాద్

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- సీఎస్‌తో కేంద్ర పరిశ్రమల ప్రోత్సాహక శాఖ అధికారుల భేటీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వ్యాపార రంగానికి అనువైన వాతావరణం ఉండటంతో పాటు ప్రభుత్వ నిర్ణయాల కారణంగా హైదరాబాద్ ప్రధాన ఆర్థిక శక్తి కేంద్రంగా రూపుదిద్దుకుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. నాణ్యమైన ఉత్పత్తి విధానం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, వాణిజ్య, వ్యాపార రంగాన్ని మెరుగు పరిచేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగానికి (డీపీఐఐటీ) చెందిన ఉన్నతాధికారి సుకృతి లిఖి నేతృత్వంలోని అధికారుల బృందం శుక్రవారం సచివాలయంలో శాంతి కుమారి, ఇతర అధికారులతో భేటీ అయింది. సులభతర వ్యాపార విధానాన్ని (ఈఓడీబీ) అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎస్ శాంతికుమారి వారికి వివరించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో వేగవంతమైన వాణిజ్య, వ్యాపార అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తామని చెప్పారు. వాణిజ్య అవసరాలకు నిర్మించే బిల్డింగ్ ప్లాన్ అనుమతులను వేగవంతం చేయడానికి 'బిల్డ్ నౌ', భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 'భూ భారతి'వంటి కొత్త వ్యవస్థలను అమలులోకి తెచ్చామని వెల్లడించారు. కాగా, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధాన సంస్కరణలు, కార్యక్రమాల తీరు అభినందనీయమని సుకృతి లిఖి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, రవిగుప్తా, సంజయ్ కుమార్, పీసీసీఎఫ్ డోబ్రియాల్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, పురపాలక శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వరి 66.80 లక్షల ఎకరాలు.. పత్తి 50 లక్షల ఎకరాలు

- వచ్చే వానాకాలం సాగు అంచనాలను ప్రకటించిన వ్యవసాయశాఖ
- అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని విత్తన కంపెనీలకు మంత్రి తుమ్మల ఆదేశం




సాక్షి, హైదరాబాద్: వచ్చే వానాకాలం సీజన్ పంటల ప్రణాళికను రాష్ట్ర వ్యవసాయ శాఖ ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వరి అత్యధికంగా 66.80 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశమున్నట్టు అంచనా వేసింది. వరి తర్వాత 50 లక్షల ఎకరాల్లో పత్తి, 9 లక్షల ఎకరాల్లో సోయాబీన్, 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుందని, అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేసింది. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి ఈ వివరాలు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని డిమాండ్ ఉన్న అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచేలా విత్తన కంపెనీలకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఆదేశాలిచ్చారు.

ఎన్ని విత్తనాలు కావాలి.. వివరాలు సాక్షి ప్లస్(ఈ-పేపర్)లో

సేంద్రియసాగు చేసేలా పసుపు రైతులను ప్రోత్సహించాలి

పసుపుబోర్డు కార్యదర్శి భవానిశ్రీకి మంత్రి తుమ్మల సూచన

సాక్షి, హైదరాబాద్: రైతులు సేంద్రియ పద్ధతుల్లో పసుపు పండించేలా ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీకి సూచించారు. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం సచివాలయంలో మంత్రిని పసుపు బోర్డు కార్యదర్శి భవాని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్గానిక్ పద్ధతిలో పండించిన పసుపును ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు వీలు కలుగుతుందని, అందువల్ల అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా పసుపు పంటను పండించేందుకు రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించాలన్నారు. పసుపు ఎగుమతులు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పసుపు బోర్డు వల్ల పసుపు రైతులకు మరింత మేలు జరగాలని ఆకాంక్షించారు. పసుపు పండించే రైతులకు, ఎగుమతి చేసే ట్రేడర్లకు మధ్య వారధిగా పనిచేసి అంతర్జాతీయ మార్కెట్‌కు మన పసుపు ఎగుమతి అయ్యేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.





తెలుగువారి తొలి పండగ వచ్చేస్తోంది. నూతనోత్సాహంతో ఉగాదిని ఆహ్వానించడానికి సిద్ధమవుతున్న వేళ... కొత్త తరానికి పండగల అర్థం తెలుస్తోందా? అంటే... 'పెద్దవాళ్లు చెబితేనే తెలుస్తుంది' అంటున్నారు ప్రముఖ రచయితలు రామజోగయ్య శాస్త్రి, అనంత శ్రీరామ్. ఉగాది ప్రత్యేకంగా ఇంకా ఈ ఇద్దరూ చెప్పిన విశేషాలు తెలుసుకుందాం.

కొత్త తరానికి చెబుదాం

- రామజోగయ్య శాస్త్రి

పండగలు జరుపుకోవడం ఎవరూ మానేయలేదు. పిండివంటలు చేసుకోవడానికైనా పండగలు చేసుకుంటున్నాం. పండగ పూట తల స్నానం చేసి, ఉగాది పచ్చడి తిన్న తర్వాతే మిగతా పనులు చేయాలని పిల్లలకు పెద్దలు చెప్పాలి. ఎప్పటికప్పుడు కొత్త తరానికి పాత తరంవాళ్లు చెబుతుండాలి. ఎందుకంటే పండగలన్నీ ముందు తరంవాళ్లు చేసుకుంటూ వచ్చారు కాబట్టి చెప్పడం వారి బాధ్యత. కొత్త తరాన్ని పాజిటివ్‌గా స్వాగతించాలి. వారూ వెల్‌కమింగ్‌గానే ఉంటారు. మన తానులో పెరిగిన ముక్కలు వేరేలా ఎలా ఉంటారు? కొత్త తరానికి పద్ధతులన్నీ కొత్తే. పోనీ ఇవాళ్టి పాత తరం అనుకున్నవారికి ఎవరు చెప్పారు? వారి ముందు తరంవారు చెబితేనే కదా వీరికి తెలిసింది. ఇది రిలే పందెంలాంటిది. ఒక తరానికి ఒక తరానికి సక్రమంగా విషయాలను అందజేయాల్సిన బాధ్యత ముందు తరానికి ఉంటుంది.

యువతని నిందించడం సరికాదు: ప్రపంచాన్ని రెండు రకాలుగా చూడొచ్చు. మంచి కోణంలో... దుర్మార్గపు కోణంలో... ఎప్పుడూ మొదటి కోణంలో చూస్తే మంచిది. అది కాదనుకుని యువత పెడదారి పట్టిందని, ఏదేదో జరిగిపోతోందని యువతరాన్ని నిందించడం సరికాదు. ఏదీ వక్రీకరించిన కోణంలో చూడొద్దు. ఫారిన్ కల్చర్ అంటున్నాం... విదేశాలు వెళ్లి చూస్తే ఇక్కడికన్నా ఎక్కువ అక్కడ పండగలు బాగా జరుపుకుంటున్నారు. అన్నమాచార్యుల కీర్తనలు కూడా పాడుతున్నారు. ఇక్కడితో పోల్చితే అమెరికా ఫాస్ట్ ఫార్వార్డ్ అనుకోవాలి కదా. కానీ అక్కడ మన సంప్రదాయాలు బతికే ఉన్నాయి. ఇక ఎప్పటికీ ఇండియా రామని తెలిసిన కుటుంబాలు కూడా తమ పిల్లలకు తెలుగు నేర్పిస్తున్నారు... మన సంప్రదాయాల గురించి చెబుతున్నారు. పిల్లలూ నేర్చుకుంటున్నారు.

యువతరం బాధ్యతగా ఉంటోంది: సారవంతమైన నేల అది (యువతరాన్ని ఉద్దేశించి). బీజం వేయడం అనేది మన చేతుల్లో ఉంది. ముందు తరం బాధ్యతగా ఉండి, తర్వాతి తరానికి దగ్గరుండి అన్నీ నేర్పించి, అన్నీ ఆచరించేలా చేయాలి. వీళ్లు పాటిస్తూ వాళ్లు పాటించేలా చేయాలి. పొద్దున్నే వీళ్లు స్నానం చేయకుండా... పిల్లలను స్నానం చేసి, పూజలు చేయమంటే ఎందుకు చేస్తారు? నువ్వు చేయడంలేదు కదా? అంటారు. ఒకవేళ మాటల రూపంలో చెప్పకపోయినా... ముందు తరం ఆచారాలు పాటిస్తుంటే వీళ్లు చూసి, నేర్చుకుంటారు... అనుసరించడానికి ఇష్టపడతారు. బోధించే విధానం సక్రమంగా ఉండాలి. ఫైనల్‌గా చెప్పేదేంటంటే... మనం అనుకున్నంతగా యువతరం ఏమీ దిగజారిపోలేదు. చెప్పాలంటే మనకన్నా ఇంకా బాధ్యతగా ఉంటూ, పాతా కొత్తా బ్యాలెన్స్ చేసుకుంటూ వెళుతున్నారు. ఈ కాలపు పిల్లలు ఇంటికీ, బయటికీ పర్ఫెక్ట్ బ్యాలెన్స్ తెలిసిన వాళ్లు. వాళ్లలో ఏదైనా లోపం ఉందీ అంటే... చెప్పేవాళ్లదే కానీ వాళ్లది కాదు. సో... ఏ పండగని ఎందుకు జరుపుకోవాలో విడమర్చి యువతరానికి చెప్పాల్సిన బాధ్యత ముందు తరానిదే. సంవత్సరాది ఎందుకు జరుపుకుంటున్నాం? ఉగాది పచ్చడి విశిష్టత వంటివి చెప్పి, పండగ అర్థం తెలియజేయాలి.

పండగ 'రుచి' చూపాలి

- అనంత శ్రీరామ్

పండగలు జరుపుకునే తీరు మారింది. పెళ్లిళ్లలో ఎప్పుడైతే మనకు లేని రిసెప్షన్ అని మొదలుపెట్టామో అలానే పండగలు జరుపుకునే తీరులోనూ మార్పు వచ్చింది. ఉగాది గురించి చెప్పాలంటే... మా ఊరులో ఐదు రోజులు ఉగాది జాతర జరుగుతుంది. మాది వెస్ట్ గోదావరి, యలమంచిలి మండలం, దొడ్డిపట్ల గ్రామం. జాతర సందర్భంగా ఊరేగింపులు అవీ చేస్తుంటారు. ఇప్పుడూ జరుగుతున్నాయి. కానీ ఇప్పుడు జాతరలో భాగంగా మేజిక్ షోస్ అంటూ వెస్టన్ కల్చర్ మిక్స్ అయిపోయింది. ఉగాది అంటే కవి సమ్మేళనాలు విరివిగా జరిగేవి. ఇప్పుడలా లేదు. ఎవరైనా విద్యావంతులు లేదా శాంతి సమాఖ్యలు వాళ్లు ఏదో టౌన్ హాలులో కవి సమ్మేళనాలు ఏర్పాటు చేసినా ఓ ఇరవై ముప్పైమంది ఉంటున్నారు... అంతే.

ఉగాది ప్రత్యేకం అమ్మవారి జాతర: ఇక మా ఊరి ఉగాది గురించి చెప్పాలంటే... మాణిక్యాలమ్మ మా గ్రామ దేవత. ఉగాది సమయంలో మాకు ఆ అమ్మవారి జాతర ఉంటుంది. ఉగాది ప్రత్యేకం అంటే ఆ జాతరే. ఐదు రోజులు ఘనంగా చేస్తారు. ఐదో రోజు అయితే అమ్మవారిని బాగా అలంకరించి, ఊరేగించి, తెప్పోత్సవం చేస్తారు. నేను ప్రతి ఏడాది దాదాపు మిస్ కాకుండా వెళతాను. ఈసారి కుదరదు.

ఆరు రుచులను సమానంగా ఆస్వాదించాలి: ఉగాది పచ్చడిలోని షడ్రుచుల గురించి చెప్పాలంటే... నేను 'ఒక్కడున్నాడు' సినిమాలో 'ఇవ్వాళ నా పిలుపు... ఇవ్వాలి నీకు గెలుపు... సంవత్సరం వరకు ఓ లోకమా...' అని పాట రాశాను. అది పల్లవి. పాట మొదటి చరణంలో రుచుల గురించి రాశాను. 'కొంచెం తీపి... కొంచెం పులుపు పంచే ఆ ఉల్లాసమూ... కొంచెం ఉప్పు... కొంచెం కారం పెంచే ఆ ఆవేశమూ... చేదూ వగరూ చేసే మేలూ... సమానంగా ఆస్వాదించమని ఇవ్వాళ నా పిలుపు' అని రాశాను. ఆరు విభిన్నమైన రుచులను సమానంగా ఆస్వాదిస్తేనే జీవితాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలమని చెప్పడమే ఆ పాట ఉద్దేశం. అంటే... జీవితంలో ఎదురయ్యే పరిస్థితులన్నింటినీ సమానంగా స్వీకరించగలగాలి.

ఆ బాధ్యత పెద్దవాళ్లదే: ఇక నేటి తరం గురించి చెప్పాలంటే... ఇప్పుడు కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలతో హాలోవెన్ అంటూ రకరకాల వేషాలు వేయిస్తున్నారు. వేలంటైన్స్ డే అనీ ఇంకా వేరే ఎక్కడెక్కడ నుంచో తెచ్చిపెట్టుకున్న పండగలను జరుపుతున్నారు. అయితే పిల్లలకు మన పండగల గురించి చెప్పాలి. వేరే సంబరాలు ఎలా ఉన్నా కూడా మన పండగలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇలా పాత తరం ఆచరిస్తే కొత్త తరానికి అర్థం అవుతుంది. వాళ్లు మన సంస్కృతీ సంప్రదాయాలను ముందుకు తీసుకెళతారు. మా గ్రామంలో ఉగాది అంటే... ఇంట్లో పిల్లలకు వేప పూత, మామిడికాయలు, చెరుకు గడలు తెమ్మని టాస్కులు ఇచ్చేవారు. అవి తెచ్చే క్రమంలో మాకు పండగలు అర్థమయ్యేవి. అలా మా ముందు తరంవాళ్లు మాకు నేర్పించారు. కొత్త తరానికి మనం అలా నేర్పిస్తే వాళ్లు పాటిస్తారు. ముందు తరాలకు సంస్కృతీ సంప్రదాయాలను నేర్పించే బాధ్యత పెద్దవాళ్లదే.

- డి.జి. భవాని



6 రుచులు ఆరోగ్య లాభాలు

ఉగాది పచ్చడిని సేవించే ఆచారం శాలివాహన శకారంభం నుంచి మొదలైనట్లుగా చరిత్రకారులు చెబుతారు. సంప్రదాయ పద్ధతిలో ఉగాది పచ్చడిని కొత్త మట్టికుండలో తయారు చేస్తారు. ఉగాది పచ్చడిలో వేపపూత, మామిడి పిందెలు, చింతపండు, ఉప్పు, మిరియాల పొడి, బెల్లం, అరటిపండు ముక్కలు ఉపయోగిస్తారు. వీటి వల్ల ఉగాది పచ్చడి ఆరురుచుల సమ్మేళనంగా తయారవుతుంది. ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం....

బెల్లం, అరటి పండ్లు- తీపి

బెల్లం తీపిగా ఉంటుంది. ఎండ వేడిమి వల్ల కలిగే అలసటను పోగొట్టి, తక్షణ శక్తినిస్తుంది. బెల్లాన్ని అరటిపండుతో కలిపి తీసుకోవడం శ్రేష్ఠమని ఆయుర్వేదం చెబుతోంది. అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అధిక రక్తపోటు, మూత్రపిండాల సమస్యలను అరటి పండు నిరోధిస్తుంది.

చింతపండు- పులుపు

ఉగాది పచ్చడి తయారీకి పాత చింతపండు ఉపయోగించడం మంచిది. పాత చింతపండు ఉష్ణాన్ని, వాత దోషాలను తగ్గిస్తుంది. బడలికను పోగొడుతుంది. జఠరశక్తిని పెంచుతుంది. మూత్రవిసర్జన సజావుగా సాగేందుకు దోహదపడుతుంది. వేసవిలో చింతపండు రసం తీసుకోవడం వల్ల ఉష్ణదోషాలు తగ్గుతాయని ఆయుర్వేదం చెబుతోంది.

ఉప్పు

రుచులకు రారాజులాంటిది ఉప్పు. ఉప్పులేని పప్పులు, కూరలు, పచ్చళ్లు రుచించవు. ఆహారంలో అనునిత్యం ఉపయోగించే ఉప్పు త్రిదోషాలను– అంటే, వాత పిత్త కఫ దోషాలు మూడింటినీ పోగొడుతుందని ఆయుర్వేదం చెబుతోంది. అయితే, ఉప్పును మోతాదులోనే వాడాలి.

మామిడి పిందెలు- వగరు

మామిడి కాయలు ముదిరితే పులుపుగా ఉంటాయి గాని, పిందెలు వగరుగా ఉంటాయి. మామిడి పిందెల వగరుదనం లేకుంటే, ఉగాది పచ్చడికి పరిపూర్ణత రాదు. మామిడి పిందెలలో విటమిన్–సి పుష్కలంగా ఉంటుంది. మామిడి పిందెలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలోని త్రిదోషాలను హరించి, శక్తిని కలిగిస్తాయని ఆయుర్వేదం చెబుతోంది.

వేపపూలు- చేదు

వసంతారంభంలో వేపపూలను తినే ఆచారం దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. దీనిని 'నింబకుసుమ భక్షణం' అంటారు. షడ్రసోపేతమైన ఉగాది పచ్చడిలో వేపపూలను ఉపయోగించడం మన తెలుగువాళ్లకే చెల్లింది. వేపపూలు కఫదోషాన్ని, క్రిమిదోషాలను పోగొడతాయి. జీర్ణకోశ సమస్యలను నివారిస్తాయి.

మిరియాల పొడి-కారం

మిరియాలను నేరుగాను, పొడిగాను వంటకాల్లో తరచుగా వినియోగిస్తూనే ఉంటాం. మిరియాలు రుచికి కారంగా ఉన్నా, శరీరానికి చాలా మేలు చేస్తాయి. మిరియాలు కఫదోషాన్ని, విష దోషాలను హరిస్తాయి. చర్మవ్యాధులను అరికట్టడమే కాకుండా, జీర్ణశక్తిని, శరీరంలోని జీవక్రియలను పెంచుతాయి. అందుకే సంప్రదాయ ఆయుర్వేద ఔషధాల్లో మిరియాలను విరివిగా ఉపయోగిస్తారు.



ఉగాది పచ్చడి

కావలసినవి: కొత్త బెల్లం – 100 గ్రాములు, పచ్చి మామిడి – ఒకటి (మీడియం సైజు), వేప పువ్వు – ఒక టేబుల్ స్పూన్, పచ్చి మిర్చి – రెండు (తురమాలి), ఉప్పు – చిటికెడు, చింతపండు – పెద్ద నిమ్మకాయంత (కొత్త చింతకాయల నుంచి సేకరించినది).

తయారీ: ● బెల్లాన్ని తురిమి, అందులో కొద్దిగా నీటిని చిలకరించి పక్కన ఉంచాలి. ● వేప పువ్వు కాడలు లేకుండా వలిచి పువ్వు రెక్కలను సేకరించి పక్కన ఉంచాలి. ● మామిడి కాయ మొదలు (సొన కారే భాగం) తీసేయాలి. కాయను నిలువుగా కోసి లోపలి గింజను కూడా తీసేయాలి. ఇప్పుడు మామిడి కాయను తొక్కతోపాటు సన్నగా ముక్కలు తరగాలి లేదా తురిమి బెల్లం నీటిలో వేయాలి. ● చింతపండు గుజ్జును చిక్కగా రసం తీసి పై మిశ్రమంలో కలపాలి. అందులో పచ్చిమిర్చి తురుము, ఉప్పు, వేప పూత వేసి కలపాలి. ఈ మిశ్రమం చిక్కగా ఉంటుంది. మరింత రుచి కోసం చెరకు ముక్కలు, మిగుల మగ్గిన అరటి పండు గుజ్జు కలుపుకోవచ్చు.



పూర్ణాలు

కావలసినవి: పచ్చిశనగ పప్పు – అర కేజీ, బెల్లం – అర కేజీ, యాలక్కాయలు – పది, బియ్యం – రెండు కప్పులు, పొట్టుతీసిన మినప గుళ్లు – కప్పు, ఉప్పు – రుచికి సరిపడా, ఆయిల్ – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ముందుగా మినప పప్పు, బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆరుగంటల పాటు నానబెట్టుకోవాలి. శనగ పప్పుని కూడా కడిగి గంట పాటు నానబెట్టాలి ● నానిన బియ్యం మినప పప్పులని మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి ● నానిన శనగ పప్పుని కుకర్‌లో వేసి రెండు గ్లాసులు నీళ్లపోసి మూడు విజిల్స్ రానివ్వాలి ● ఉడికిన శనగ పప్పులో బెల్లం వేసి మెత్తగా గరిటతో తిప్పుతూ దగ్గర పడేంత వరకు ఉడికించి, యాలుక్కాయల పొడి వేసి తిప్పి దించేయాలి ● శనగపప్పు మిశ్రమం చల్లారాక, ఉండలుగా చుట్టుకోవాలి ● బియ్యం, మినపగుళ్ల రుబ్బులో కొద్దిగా ఉప్పు వేసి తిప్పాలి. ఇప్పుడు శనగ పప్పు ఉండలను ఈ పిండిలో ముంచి ఆయిల్‌లో డీప్ ఫ్రై చేయాలి ● మీడియం మంట మీద గోల్డెన్ బ్రౌన్ రంగులోకి మారేంత వరకు వేయిస్తే తియ్యని పూర్ణాలు రెడీ.



పరమాన్నం

కావలసినవి: బియ్యం – అర కప్పు, పాలు – కప్పు, బెల్లం తురుము – ముప్పావు కప్పు, నెయ్యి – ముప్పావు కప్పు, జీడి పప్పు పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి – అర టీస్పూను, పచ్చకర్పూరం – చిటికెడు.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని కడిగి పదిహేను నిమిషాల పాటు నానబెట్టుకోవాలి ● ఒక గిన్నెలో పాలుపోసి కాయాలి. కాగిన పాలల్లో నానబెట్టిన బియ్యం వేసి తిప్పుతూ ఉడికించాలి. అన్నం మెత్తగా ఉడికాక దించి చల్లారనివ్వాలి ● స్టవ్ మీద మరో బాణలి పెట్టుకుని నెయ్యి వేయాలి. నెయ్యి వేడెక్కిన తరువాత జీడి పప్పు పలుకులు వేసి గోల్డ్ కలర్‌లోకి మారేంత వరకు వేయించాలి ● స్టవ్ మీద మరో పాత్ర పెట్టి బెల్లం తురుము వేయాలి. దీనిలో పావుకప్పు నీళ్లపోసి సిరప్‌లా మారేవరకు ఉడికించి, చల్లారనివ్వాలి ● బెల్లం సిరప్‌లోనే యాలకుల డి, పచ్చ కర్పూరం వేసి తిప్పాలి ● బెల్లం సిరప్ చల్లారక అన్నంలో వేసి బాగా కలపాలి, దీనిలో మిగిలిన నెయ్యి, జీడిపప్పుతో గార్నిష్ చేస్తే పరమాన్నం రెడీ.



మామిడి కాయ పులిహోర

కావలసినవి: బియ్యం – కప్పు, పచ్చిమామిడి కాయ – మీడియం సైజుది ఒకటి, పచ్చికొబ్బరి తురుము – అర కప్పు, ఆవాలు – టీస్పూను, మినప పప్పు – టీస్పూను, పచ్చి శనగ పప్పు – టీ స్పూను, వేరుశనగ గుళ్ళు – రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకు – మూడు రెమ్మలు, పచ్చిమిర్చి తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, ఎండు మిర్చి – నాలుగు, మెంతులు – పావు టీస్పూను, ఆయిల్ – నాలుగు టేబుల్ స్పూన్లు, పసుపు – పావు టీస్పూను, చింతపండు ఉసిరికాయంత, బెల్లం తురుము – రెండు టీస్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అన్నం పొడి పొడిగా వచ్చేలా వండి ఆరబెట్టుకోవాలి ● మామిడి కాయ తొక్క తీసి ముక్కలుగా తరగాలి ● ఎండు మిర్చి, మెంతులు, అరటీస్పూను ఆవాలను దోరగా వేయించుకుని పొడిచేయాలి. ఈ పొడిలో పచ్చికొబ్బరి, మామిడికాయ ముక్కలు, చింతపండు, బెల్లం వేసి మెత్తగా గ్రైండ్ చేసి పక్కనపెట్టుకోవాలి ● స్టవ్ మీద బాణలి పెట్టి ఆయిల్ వేయాలి. ఆయిల్ వేడెక్కిన తరువాత ఆవాలు వేయాలి. చిటపటలాడాక మినప పప్పు, శనగ పప్పు, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేయాలి ● ఇవన్నీ వేగాక వేరుశనగ గుళ్ళు వేసి వేయించాలి. ఇవి వేగాక పసుపు, గ్రైండ్ చేసిన మామిడికాయ మిశ్రమం వేసి ఐదు నిమిషాలు వేయించాలి ● తరువాత రుచికి సరిపడా ఉప్పు వేసి, ఆరబెట్టిన అన్నాన్ని వేసి కలిపితే మామిడికాయ పులిహోర రెడీ.

వృథాని జీరో చేద్దాం

యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ... మార్చి నెల 30వ తేదీని జీరో వేస్ట్ డే గా గుర్తిస్తూ 2022, డిసెంబర్ 14వ తేదీన ఒక తీర్మానాన్ని చేసింది. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ అప్పటి నుంచి మార్చి నెల 30వ తేదీని 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో వేస్ట్'గా గుర్తిస్తూ ప్రపంచాన్ని చైతన్యవంతం చేస్తోంది. ఈ ఏడాది ఫ్యాషన్ అండ్ టెక్స్‌టైల్ రంగాల వృథా మీద దృష్టి పెట్టింది.

పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న వాయు, నీటి కాలుష్యాలతోపాటు వస్త్రాల అవశేషాలు కూడా ప్రధానమైనవి. క్లాత్‌తో డ్రెస్ కుట్టిన తర్వాత వచ్చే మిగులు నదులు, కాలువల్లోకి చేరి నీటిలో, నీటి అడుగుల మట్టిలో నిలిచిపోతోంది. కొంతకాలానికి ఆ వస్త్రానికి అద్దిన రసాయన రంగులు నేలలో, నీటిలో ఇంకుతాయి. ఇలా వేస్ట్ క్లాత్ కారణంగా కెమికల్ పొల్యూషన్ నీటిని, మట్టిని కూడా కలుషితం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా దుస్తుల తయారీ విపరీతంగా పెరిగిపోయింది. 2000 సంవత్సరంలో ఉత్పత్తి 2015నాటికి రెండింతలైంది. ఏడాదికి 92 మిలియన్ టన్నుల టెక్స్‌టైల్ వేస్ట్ లెక్క తేలుతోంది. ఇది కాలువలు, నదుల్లోకి వెళ్తోంది. దీనిని అరికట్టడం కోసమే యూఎన్ఓ (యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్) ఈ ఏడాది ఫ్యాషన్ ఇండస్ట్రీ వేస్ట్ మీద దృష్టి పెట్టింది. ఫ్యాషన్, టెక్స్‌టైల్ రంగాలను జీరో వేస్ట్ దిశగా నడిపించడానికి మార్గాలను అన్వేషించాలంటోంది యూఎన్ఓ. హైదరాబాద్‌లో ఫ్యాషన్ ఇండస్ట్రీ నిర్వహిస్తున్న సుదీప కందుల ట్రిపుల్ ఆర్ (రీ యూజ్, రీ సైకిల్, రీ పెయిర్) అనే యూఎన్ఓ థీమ్‌ను రెండు దశాబ్దాలుగా అమలు చేస్తున్నారు.



మనసుంటే మార్గం ఉంటుంది!

సుదీప కందుల... ఆలన బొటీక్ పేరుతో చిన్న పిల్లల దుస్తుల డిజైనింగ ప్రారంభించి మూడు దశాబ్దాలవుతోంది. ఫ్యాషన్ ఇండస్ట్రీలో బొటీక్ కల్చర్ మొదలైన తొలినాళ్ల నుంచి బొటీక్ నడుపుతున్నారామె. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భావించే సుదీప, ఆమె ఉద్యోగులు పాలిథిన్ కవర్ల వినియోగాన్ని తగ్గించడానికి మార్కెట్‌కెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగ్‌ను వెంట తీసుకువెళ్తారు. బొటీక్‌లో ఉత్పన్నమయ్యే వేస్ట్ క్లాత్‌ను పునర్వినియోగంలోకి తీసుకురావడానికి అనేక మార్గాలనెంచుకున్నారు సుదీప. చిన్న ముక్కలతో నవజాత శిశువులకు, ఏడాది లోపు పిల్లలు ధరించడానికి వీలుగా కుట్టించి ఆర్ఫనేజ్‌కు ఇచ్చారు. అలా కుదరని వాటిని నగరంలోని ఒక ఎన్‌జీవోకి ఇస్తుంటారు. ఆ ఎన్‌జీవోలో అల్పాదాయ వర్గాల మహిళలకు ఆ క్లాత్‌తో చిన్న చిన్న పోట్లీ బ్యాగ్‌లు, పర్సులు తయారు చేసుకుంటారు. అలా కూడా పనికి రాని సన్నగా పొడవుగా రిబ్బన్ ముక్కల్లాంటి క్లాత్‌ని ఒక స్కూల్‌కి ఇస్తే వాళ్లు పిల్లల చేత డోర్‌మ్యాట్ మేకింగ్ వంటి క్రాఫ్ట్ ప్రాక్టీస్‌కి ఉపయోగిస్తున్నారు. ఇక ఎందుకూ పనికిరావనిపించే ముక్కలను ఒక కవర్‌లో జమ చేసి ఆ బొటీక్‌లో పని చేసే వాళ్లు దిండులో స్టఫింగ్‌గా నింపుకుంటారు. వ్యర్థాన్ని అర్థవంతంగా మారుస్తున్న సుదీప తన బొటీక్‌లో చిన్న ముక్క కూడా నేల పాలు కాకుండా ప్రయత్నం చేస్తున్నారు.

షాపింగ్ వ్యసనం



ఈ తరానికి షాపింగ్ ఒక వ్యసనంగా మారింది. యూఎస్, యూరప్‌ల నుంచి వాడిన దుస్తులు మూడవ ప్రపంచదేశాలకు డంప్ అవుతున్నాయి. అరేబియా షిప్పుల్లో గుజరాత్ తీరం నుంచి దేశంలోకి వస్తుంటాయవి. మన దగ్గర తయారయ్యే పాలియెస్టర్ వస్త్రాలకు తోడు ఆయాఖండాల నుంచి వచ్చిపడుతున్న దుస్తులు కూడా కలిసి డంప్ పెరిగిపోతోంది. పాలియెస్టర్ వస్త్రాలను ఫైబర్‌గా మార్చి కొత్త దుస్తులు తయారు చేసే క్రమంలో విడుదలయ్యే వ్యర్థాలు సముద్రాల్లోకి చేరి మైక్రోప్లాస్టిక్‌గా మారి తిరిగి మన మీదనే దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. అలాగే పారేస్తున్న దుస్తులతో కాలువలు నిండిపోతున్నాయి.

- డాక్టర్ దొంతి నరసింహారెడ్డి,
పర్యావరణ నిపుణులు

ఉత్పత్తి- కొనుగోలు పెరిగాయి

మనం కొంతకాలం వాడి ఇక పనికి రావని పారేస్తున్న వస్తువులు నిజానికి పనికిరానివి కాదు, వాటిని మరొక రకంగా మలుచుకుని ఉపయోగించుకోవడం మనకు చేతకాకపోవడమే. రీయూజ్ చేయడం నేర్చుకోవాలి. నాచురల్ ఫైబర్‌తో వస్త్రాలు తయారుచేసినన్ని రోజులు వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల వ్యర్థాల గురించి మాట్లాడాల్సిన అవసరం రాలేదు. మ్యాన్‌మేడ్ ఫైబర్ ప్రవేశించిన తర్వాత ఎదురవుతున్న సమస్యలివన్నీ. నిజానికి వ్యర్థాల ఉత్పత్తి మనదేశంలోకంటే యూఎస్, యూరప్‌దేశాల్లో చాలా ఎక్కువ. అవసరానికి మించి ఉత్పత్తి చేయడం, అవసరానికి మించి కొనడం రెండూ పెరిగాయి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

జీరో వేస్ట్‌తో ద బెస్ట్

మార్చి 30 జీరో వేస్ట్ డే

ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాల వేస్ట్‌తో ఏటా ప్రపంచ వ్యాప్తంగా రెండు వందల కోట్ల టన్నుల చెత్త జమవుతోంది. ఇది పెరుగుతూ భూగ్రహాన్ని ముంచేసినా ఆశ్చర్యం లేదు. ఈ ప్రమాదాన్ని మన దేశంలో ముందుగా గ్రహించి అప్రమత్తమైన ప్రాంతం ఢిల్లీ, మాల్వీయ నగర్‌లోని నవజీవన్ విహార్ రెసిడెన్షియల్ సొసైటీ. రీయూజ్, రీసైకిల్‌ను ఫాలో అవుతూ జీరో వేస్ట్‌తో పర్యావరణప్రియమైన ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది.



● కంపోస్ట్ తయారీలో సొసైటీ సభ్యులు

దాదాపు ఏడేళ్ల కిందట... ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ మాల్వీయనగర్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మీద ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. అందులో పాల్గొన్న నవజీవన్ విహార్ రెసిడెన్షియల్ సొసైటీ సభ్యులు ఆ వర్క్‌షాప్‌లో చెప్పినవి, చూపించినవి తమ కాలనీలో అమలు చేయడం మొదలుపెట్టారు. అక్కడ 250 ఇళ్లున్నాయి. ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను ఎలా వేరుచేయాలో వివరించి, కొన్నాళ్లపాటు పర్యవేక్షించారు సొసైటీ సెక్రటరీ, కంటివైద్యులు డాక్టర్ రూబీ మఖీజా. తతిమా సభ్యుల సహాయసహకారాలతో తడిచెత్తతో కాలనీలోనే కంపోస్ట్ తయారుచేయడం మొదలుపెట్టారు. ఆ ఎరువుతో కిచెన్, బాల్కనీ, రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహించారు. ఒక షెడ్డు లాంటిదీ ఏర్పాటు చేశారు.. ఇళ్లల్లో పాతపుస్తకాలు, దుస్తులు, ఆటబొమ్మలు, ఉపయోగంలో లేని వస్తువుల కోసం. ఆ కాలనీలో ఎవరికైనా ఏ వస్తువైనా అవసరం ఉంటే ముందు ఈ షెడ్డుకొచ్చి చూసి, అందులో తమకు కావలసింది లేకపోతేనే కొత్తది కొనుక్కోవాలి. అలా కాలనీ వాసులు తీసుకున్నవి పోనూ మిగిలినవి స్వచ్ఛంద సంస్థలకు ఇస్తారు అవసరమైన వాళ్లకు పంచేందుకు! ఈ కాలనీలో ప్లాస్టిక్ బ్యాన్. గుడ్డ సంచులనే వాడుతారు. నీటి వృథా, ఆదానూ సమర్థవంతంగా నిర్వహించుకుంటున్నారు. పిల్లలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడానికి వారానికోసారి క్యాంప్ పెడతారు. అందులో పిల్లలను ఆడిస్తూ, పాడిస్తూ వాళ్లు ఎలక్ట్రానిక్ పరికరాలకు బానిసలు కాకుండా జాగ్రత్తపడుతున్నారు. వీళ్లో బ్రాడ్‌కాస్ట్ సిస్టమ్‌నూ ఏర్పాటు చేసుకున్నారు. ప్రతిరోజూ కాలనీలో జరిగే పర్యావరణపరిరక్షణ కార్యక్రమాలను వీడియోలుగా తీసి వాటిని సాయంకాలం ప్రసారం చేస్తారు. ఈ ప్రయత్నాలతో జీరో వేస్ట్‌లో దేశానికే స్ఫూర్తిగా నిలిచింది నవజీవన్ విహార్.

● అవిశ్రాంతం



యాప్ కా బాప్

ఏజ్-70 12 యాప్స్ గేమ్స్‌లో ఫస్ట్

ఖాళీ టైమ్ దొరికితే టీవీ లేదా ఫోన్ స్క్రీన్‌కి కళ్లప్పగించేస్తారు చాలా మంది. నేర్చుకోవాలనే తపన ఏ వయసులో ఉన్నా ఎంచుకున్న దాంట్లో నెంబర్ 1 స్థాయికి చేరుకోవచ్చు అని నిరూపిస్తారు అతి కొద్దిమంది. అలాంటి జాబితాలో మొదటివరసలో ఉన్నారు మల్లు సుధీర్ రెడ్డి. డెబ్బై ఏళ్ల వయసులో ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలనే ఆలోచనతో వొకాబిలరీ యాప్స్ ద్వారా ప్రాక్టీస్ చేస్తూ ప్రపంచవ్యాప్తంగా పేరొందిన 12 యాప్స్‌లో వరల్డ్ నెంబర్ 1 ప్లేస్ దక్కించుకున్నారు. హైదరాబాద్‌లోని మణికొండలో ఉంటున్న ఈ విశ్రాంత ఉద్యోగి విజయం ఎంతో మందిలో స్ఫూర్తిని నింపుతుంది.


మల్లు సుధీర్ రెడ్డి



''ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మెన్‌గా చేశాను. ఆ తర్వాత ఆర్టీసీలో రీజనల్ మేనేజర్‌గా చేసి, రిటైర్ అయ్యాను. ఇంటర్మీడియెట్ వరకు తెలుగు బాషలో చదువుకున్నాను కాబట్టి, నాకు ఇంగ్లిషులో మంచి ప్రావీణ్యం సాధించాలనే ఆలోచన ఉండేది. స్మార్ట్ ఫోన్‌కి రెండు వైపులా పదును ఉంటుంది. కాలక్షేపానికి ఉపయోగించవచ్చు, కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికీ వాడచ్చు.

నాలుగేళ్ల క్రితం ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో స్కిల్స్ ఇంప్రూవ్ చేసుకోవడానికి టాప్ జాబితా ఏముందో గూగుల్‌లో వెతికాను. అప్పుడు వచ్చిన యాప్స్‌ని ఒక్కోటి డౌన్‌లోడ్ చేసుకుని, లాగిన్ అయ్యాను. రోజూ ఓ అరగంట సమయం ఆ యాప్స్‌లలో సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటర్, గ్రామర్, సినినమ్స్, లెర్నింగ్, వర్డ్ రేస్ ... వాటిలో పాల్గొంటూ వచ్చాను. మనకు పోటీగా ప్రపంచవ్యాప్తంగా పాల్గొనేవారుంటారు. చాలా మంది ఐదు, పది రోజులు ఈ గేమింగ్‌లో పాల్గొని వదిలేస్తారు. అందుకు వారికి బోర్‌గా అనిపించవచ్చు. టైమ్ లేకపోవడం, ఎందుకది అనుకోవడం.. లాంటి రకరకాల కారణాలు ఉండవచ్చు. కానీ, నేను ఒక లక్ష్యంతో ప్రతి రోజూ ప్రాక్టీస్ చేస్తూనే వచ్చాను. దీనివల్ల ఎన్నో పదాలు తెలిశాయి. మొత్తంగా 12 యాప్ గేమ్స్‌లో ఫస్ట్ ప్లేస్‌లో వచ్చాను. ఇండియన్‌గా వరల్డ్ రికార్డ్ రావడం చాలా సంతోషం అనిపించింది.

కృషికి తగిన ఫలితం...

ఈ యాప్స్‌లలో ఇంగ్లిష్‌కి ఇతర దేశాల భాషను కూడా అర్థం చేసుకోవాలి. పోటీ అంటే వెంటనే రియాక్ట్ అవ్వాలి. ఒక గేమ్‌లో టాప్ లెవల్‌కి రీచ్ అవడానికి ఏడాది పట్టింది. మరొకటి ఎనిమిది నెలల సమయం పట్టింది. ఒక్కో పోటీ దారును ఓవర్ టేక్ చేయడానికి నిమిషాల నుంచి గంటల సమయం పడుతుంది. సినినమ్స్‌లో రష్యన్‌తో పోటీ పడాల్సి వచ్చింది. అతడిని ఓవర్ టేక్ చేయడానికి 2 గంటలకు పైగా పట్టింది. ఏదైనా సాధించాలంటే ఆ పని పూర్తయ్యేవరకు పట్టు వదలకూడదు. అప్పుడే అనుకున్నది సాధించగలం. నేనొక తెలుగు మీడియం వ్యక్తిని. కానీ, ఇతర దేశాల అభ్యర్థులను దాటుకొని ఇంగ్లిష్ స్కిల్స్‌లో నెంబర్ వన్ స్థాయికి చేరుకోగలిగాను. నాలుగేళ్లుగా చేసిన కృషికి ఇప్పుడు రిజల్ట్ వచ్చింది. సాధించాలనే పట్టుదల ఉంటే వయసుతో సంబంధం లేకుండా తాము ఎంచుకున్న పనిలో లక్ష్యాన్ని చేరుకోగలరు' అని వివరించారు ఈ అవిశ్రాంత యోధుడు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి





రేపటి కోసం... ఎగ్ ఫ్రీజింగ్

చదువు, కెరీర్‌ను దృష్టిలో పెట్టుకొని....'ఇప్పుడు పెళ్లెందుకు?' అనే వాళ్లు యువతరంలో చాలామంది ఉన్నారు. పెళ్లయిన వారిలో కూడా.... 'ఇప్పుడే పిల్లలు ఎందుకు?' అనే వాళ్ల సంఖ్య తక్కువేమీ కాదు. ఇప్పుడు సరే....రేపటి మాటేమిటి? పుట్టబోయే పిల్లల్లో శారీరక, మానసిక సమస్యలు తలెత్తితే? భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సాధారణ మహిళల నుంచి సెలబ్రిటీల వరకు 'ఎగ్ ఫ్రీజింగ్' టెక్నాలజీని అనుసరిస్తున్నారు...

ఎగ్ ఫ్రీజ్ అంటే?

ఎగ్ ఫ్రీజింగ్ ప్రక్రియలో మహిళల అండాలను సేకరించి సుదీర్ఘ కాలం పాటు భద్రపరిచే అవకాశం ఉంటుంది. అండాలను ప్రత్యేకమైన లిక్విడ్ నైట్రోజన్‌లో –196సి ఉష్ణోగ్రత వద్ద ఫ్రీజ్ చేస్తారు. భవిష్యత్తులో గర్భధారణ కోసం అవసరమైన సమయంలో వీటిని కరిగించి పురుషుల వీర్యంతో ఫర్టిలైజ్ చేసి ఎంబ్రియోగా మార్చి గర్భాశయంలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది.

ఎగ్ ఫ్రీజింగ్ ఎందుకు?

- వయస్సు పెరిగేకొద్దీ మహిళల్లో ఫెర్టిలిటీ సామర్థ్యం తగ్గిపోతుంది. సాధారణంగా 20–30 సంవత్సరాల వయస్సులో అండాలు అత్యంత ఆరోగ్యంగా ఉంటాయి. కానీ 35 ఏళ్ల దాటిన తర్వాత అండాల నాణ్యత క్షీణిస్తుంది. ఎగ్ ఫ్రీజింగ్ ద్వారా ఆరోగ్యంగా ఉన్న సమయంలో అండాలను భద్రపరచుకోవచ్చు.
- క్యాన్సర్, ఎండోమెట్రియోసిస్, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ వంటి ఆరోగ్య సమస్యలు ఫెర్టిలిటీపై ప్రభావం చూపుతాయి. క్యాన్సర్ చికిత్సలైన రేడియేషన్, కీమోథెరపీ వంటివి మహిళల అండాలను నాశనం చేసే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో ముందుగానే అండాలను భద్రపరిచితే తర్వాత ఆరోగ్యంగా ఉన్న సమయంలో గర్భధారణకు అవకాశం ఉంటుంది.
- పెళ్లి ఆలస్యం అయినా సరే ఎగ్ ఫ్రీజింగ్ ద్వారా ఆరోగ్యమైన అండాలతో భవిష్యత్తులో తల్లిగా మారవచ్చు.
- కొంతమందికి 40 ఏళ్లకు ముందే మెనోపాజ్ వస్తుంది. అలాంటివారు ముందుగా అండాలను భద్రపరుచుకోవడం ద్వారా మెనోపాజ్ అయినా తల్లి అయ్యే అవకాశాన్ని కోల్పోకుండా ఉండవచ్చు.

ఎగ్ ఫ్రీజింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుంది?

హార్మోన్ స్టిమ్యులేషన్...

మహిళల శరీరంలో ఒకేసారి అనేక అండాలు విడుదల కావడానికి హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తారు. 10–12 రోజులపాటు డాక్టర్లు అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా అండాల వృద్ధిని పరిశీలిస్తారు.

అండాల సేకరణ...

అండాలు పరిపక్వమైన తర్వాత ఫోలిక్యులర్ ఆస్పిరేషన్ అనే చిన్న శస్త్రచికిత్స ద్వారా అండాలను సేకరిస్తారు. ఇది 10–15 నిమిషాల్లో పూర్తవుతుంది.

ఎగ్ ఫ్రీజింగ్...

సేకరించిన అండాలను –196సి ఉష్ణోగ్రత వద్ద లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరుస్తారు. అండాల వినియోగం అవసరమైనప్పుడు ఫ్రీజ్ చేసిన అండాలను కరిగించి ఐవీఎఫ్ ప్రాసెస్ ద్వారా పురుషుల వీర్యంతో ఫెర్టిలైజ్ చేస్తారు.

– శిరీష చల్లపల్లి

● పేరెంటింగ్

పిల్లలు స్కూల్ నుంచి రాగానే.. వారికి ఏం నేర్పిస్తున్నారు?





పిల్లలు జీవితంలో సక్సెస్ సాధించాలంటే.. వారికి చిన్న వయసులోనే మంచి విలువలు అందించాలి. బాల్యంలో నేర్పించిన విలువలు వారిని జీవితంలో ఉన్నత స్థానంలో నిలబెడతాయి. స్కూల్ నుంచి వచ్చిన తర్వాత పిల్లలకు కచ్చితంగా నేర్పించాల్సిన అలవాట్లు కొన్ని ఉన్నాయి. వాటిని నేర్పిస్తే పిల్లలు పెద్దయ్యాక కూడా మంచి విలువలతో బతుకుతారు. ఆ అలవాట్లు ఏంటో తెలుసుకుందాం.

పిల్లలు స్కూల్ నుంచి రాగానే వారి బ్యాగుల్ని, వస్తువుల్ని చక్కగా సర్దుకునే అలవాటు నేర్పించాలి. చక్కగా సర్దుకోవడం నేర్చుకుంటే వారి వస్తువుల్ని ఎక్కడ పెట్టారో అన్న క్లారిటీ వారికి ఉంటుంది. మార్నింగ్ స్కూల్ వెళ్లే టైమ్‌లో హడావిడి పడకుండా తమ వస్తువుల్ని సులభంగా కనుగొంటారు. అంతేకాకుండా వారి పనుల్ని స్వయంగా చేసుకోవడం అలవాటు చేసుకుంటారు. రేపు భవిష్యత్తులో దూరప్రాంతాలకు వెళ్లి అక్కడ ఉండాల్సినప్పుడు ఈ అలవాటు ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకే పిల్లలు స్కూల్ నుంచి రాగానే బ్యాగు, వారి వస్తువులను సరైన స్థలంలో పెట్టేలా వారికి నేర్పండి.

కాళ్లు, చేతులు, ముఖం కడుక్కోవడం...

పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యం. పిల్లలు స్కూల్ నుంచి వచ్చిన వెంటనే చేతులు, ముఖం కడుక్కోవడం గురించి చెప్పండి. ఇది వారిని ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా వ్యాధులను దూరంగా ఉంచుతుంది. పిల్లలు స్కూల్ నుంచి రాగానే వారి యూనిఫామ్ తీసివేయమని చెప్పండి. ఆ తర్వాత చేతులు, ముఖం వాష్ చేసుకోమని వారికి చెప్పండి. ఈ అలవాటు నేర్చుకోవడం వల్ల పరిశుభ్రత ఎంతో కీలకమని తెలుసుకుంటారు. ఈ అలవాటు వారిని భవిష్యత్తులో మంచి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతుంది.

ఇంటి పనుల్లో సాయం...

పిల్లలకు వారు పనులే వారే చేసుకునేలా అలవాటు చేయాలి. పిల్లలు పాఠశాల నుంచి వచ్చినప్పుడు స్కూల్ బ్యాగ్ నుంచి లంచ్ బాక్స్ తీయమని చెప్పండి. ఆ తర్వాత దానిని శుభ్రపరిచేలా పిల్లలకు అలవాటు చేయండి. చిన్న చిన్న పనులతో పిల్లలకు క్రమశిక్షణ నేర్పించవచ్చు. అంతేకాకుండా ఇంటి పనుల్లో సాయం చేసే అలవాటును నేర్చుకుంటారు. ఈ అలవాటు ఇతరులతో కలిసి పనిచేయడానికి వారికి భవిష్యత్తులో ఉపయోగపడుతుంది.

చదువు, హోం వర్క్...

స్కూల్ నుంచి వచ్చిన తర్వాత కాసేపు పిల్లల్ని ఆడుకోనివ్వండి. ఆటల తర్వాత స్నానం చేసేలా ప్రోత్సహించండి. ఆ తర్వాత హోం వర్క్, చదువుకు టైం కేటాయించేలా వారికి అలవాటు చేయండి. ఆటలతో పాటు చదువు ప్రాముఖ్యత వారికి తెలపండి. సబ్జెక్ట్‌ల్లో ఏమైనా డౌట్లు ఉంటే దగ్గరుండి హెల్ప్ చేయండి. హోం వర్క్ పెండింగ్ పెట్టకుండా పూర్తిగా ఫినిష్ చేసేలా ప్లాన్ చేయండి. ఈ అలవాటు వల్ల వారు చదువుల్లో మెరుగ్గా రాణిస్తారు.


సమయాన్ని తెలివిగా ఉపయోగించడం...

పిల్లలకు తమ సమయాన్ని సరిగ్గా ఉపయోగించుకునే అలవాటును నేర్పించండి. టైమ్ మేనేజ్‌మెంట్ స్కిల్ వారికి ఎంతగానో సాయపడుతుంది. సకాలంలో వారి పనులు చేసుకోవడం, ఆటలు ఆడుకోవడం, చదువు, హోం వర్క్ వంటి పనులు చేయడం నేర్పించండి. దానికి తగ్గ టైమ్ టేబుల్ వేసి దాని ఫాలో అయ్యేలా ప్లాన్ చేయండి. దీంతో.. వారు సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకుంటారు.

సాక్షి సినిమా

స్టార్ట్ కెమేరా... యాక్షన్

చిత్ర పరిశ్రమలో సాధారణంగా కథానాయకులు నిర్మాతలుగా మారడం ఎక్కువగా జరుగుతుంటుంది. కానీ దర్శకులుగా మారే హీరోలు చాలా తక్కువ. ఈ జాబితాలోకి తాజాగా హృతిక్ రోషన్ చేరారు. ఇప్పటివరకూ స్టార్ట్ కెమేరా... యాక్షన్ అని డైరెక్టర్స్ చెప్పగానే తన పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసిన హృతిక్... ఇకపై తాను మెగాఫోన్ పట్టి స్టార్ట్ కెమేరా.. యాక్షన్ చెప్పనున్నారు. 'క్రిష్ 4' సినిమాతో హృతిక్ రోషన్ దర్శకునిగా మారనున్నారు. ఈ విషయాన్ని ఆయన తండ్రి, ప్రముఖ దర్శక–నిర్మాత రాకేశ్ రోషన్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఓ ట్వీట్ చేశారు. ''25 ఏళ్ల క్రితం నిన్ను (హృతిక్) నటుడిగా పరిచయం చేశాను. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత ఆదిత్య చోప్రా, నేను కలిసి నిన్ను దర్శకునిగా పరిచయం చేస్తున్నాం. డైరెక్టర్‌గా నువ్వు ఎన్నో విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నాను. ప్రతిష్టాత్మకమైన 'క్రిష్ 4'కు నువ్వు దర్శకత్వం వహించనుండటం హ్యాపీగా ఉంది'' అంటూ హృతిక్‌తో కలిసి ఉన్న ఫొటోని షేర్ చేశారు రాకేశ్. ప్రస్తుతం 'వార్ 2' సినిమాలో నటిస్తున్నారు హృతిక్. ఈ చిత్రం తర్వాత 'క్రిష్ 4' షూట్ ఆరంభిస్తారట. ఈ చిత్రానికి సంబంధించిన మూడు భాగాలకు రాకేశ్ రోషన్ దర్శకత్వం వహించారనే సంగతి తెలిసిందే.


● హృతిక్ రోషన్, రాకేశ్ రోషన్

ప్రతి షోకి వసూళ్లు పెరుగుతున్నాయి

– వై. రవిశంకర్


● వెంకీ కుడుముల, వై. రవిశంకర్

''రాబిన్ హుడ్ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ. మేం థియేటర్స్‌కి వెళ్లి చూశాం. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడం చాలా హ్యాపీగా ఉంది. డిస్ట్రిబ్యూటర్స్ అందరూ ఫోన్ చేసి, సినిమా చాలా బాగుందని చెబుతున్నారు. ప్రతి షోకి వసూళ్లు పెరుగుతున్నాయి'' అన్నారు నిర్మాత యలమంచిలి రవిశంకర్. నితిన్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'రాబిన్ హుడ్'. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్, ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఇతర పాత్రలు పోషించారు. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో యలమంచిలి రవిశంకర్ మాట్లాడుతూ– ''రాబిన్ హుడ్‌లో మంచి కథతో పాటు వినోదం, ఫైట్స్ అన్నీ ఉన్నాయి. ఫ్యామిలీతో పాటు యువత వెళ్లి ఎంజాయ్ చేసే సినిమా ఇది'' అన్నారు. ''మేము రెండు థియేటర్స్‌ని విజిట్ చేశాం. పెద్దలతో పాటు పిల్లలు కూడా ఎంజాయ్ చేస్తుండటం సంతోషంగా అనిపించింది. ఈ ఉగాదికి మా సినిమా మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అవుతుంది'' అన్నారు వెంకీ కుడుముల.

సినిమా చూస్తూ నవ్వుతూనే ఉన్నారు

– హారిక సూర్యదేవర

'మ్యాడ్ స్క్వేర్'ని కాలేజ్ స్టూడెంట్స్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్ కూడా చూస్తూ నవ్వుతూనే ఉన్నారు. ఇలా మా కష్టానికి తగ్గ ఫలితం దక్కడం హ్యాపీగా ఉంది'' అని హారిక సూర్యదేవర తెలిపారు. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సూర్యదేవర


● రామ్ నితిన్, సంగీత్ శోభన్, నార్నే నితిన్, కళ్యాణ్ శంకర్, హారిక, నాగవంశీ

నాగవంశీ మాట్లాడుతూ– ''మ్యాడ్ స్క్వేర్' సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. అన్ని షోలు హౌస్ ఫుల్ అవుతున్నాయి. కొన్ని ఏరియాల్లో 'మ్యాడ్' మూవీ క్లోజింగ్ కలెక్షన్స్ 'మ్యాడ్ స్క్వేర్'కి మాత్రం మొదటి రోజే వచ్చే అవకాశం ఉంది'' అన్నారు. ''థియేటర్లో ప్రేక్షకులంతా ఎంజాయ్ చేస్తుంటే... దీనికోసమే కదా మనం సినిమా తీసింది అనే అనుభూతి కలిగింది'' అని కళ్యాణ్ శంకర్ పేర్కొన్నారు. ''థియేటర్‌లో ప్రేక్షకులు గోల చేసుకుంటూ సినిమా చూస్తుంటే మాటల్లో చెప్పలేనంత ఆనందం కలిగింది'' అన్నారు నార్నే నితిన్. ''మా సినిమాపై ఇంతటి ప్రేమ కురిపిస్తున్న ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అని రామ్ నితిన్ చెప్పారు. ''ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన పట్ల చాలా ఆనందంగా ఉన్నాం'' అన్నారు సంగీత్ శోభన్. ''ఇలాంటి విజయవంతమైన సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది'' అని ప్రియాంక జవాల్కర్ తెలిపారు.

ఇది కదా అసలు నిజం!

టైటిల్: హత్య; **నటీనటులు:** ధన్యా బాలకృష్ణ, రవివర్మ, పూజా రామచంద్రన్, రఘు, భరత్ తదితరులు.
నిర్మాత: ప్రశాంత్ రెడ్డి; **కథ–స్క్రీన్‌ప్లే–దర్శకత్వం:** శ్రీవిద్య బసవ; **సంగీతం:** నరేశ్ కుమరన్ .పి
సినిమాటోగ్రఫీ: అభిరాజ్ నాయర్; **ఎడిటర్:** అనిల్ కుమార్ .పి; **ఓటీటీ:** అమెజాన్ ప్రైమ్ వీడియో.

అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న 'హత్య' సినిమా ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇది కల్పిత కథ అని మేకర్స్ ప్రకటించినప్పటికీ... ఈ సినిమాలోని పాత్రలు, స్థలాలు, హత్య ఘటన, కేసు దర్యాప్తు ప్రక్రియ అన్నీ కూడా సంచలనం అయిన ప్రముఖ రాజకీయ నాయకుడు వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును పోలి ఉన్నాయి. ఈ కేసుకి సంబంధించి దర్శక–నిర్మాతలు లోతైన పరిశోధన చేసి, దాగి ఉన్న పలు విషయాలను సేకరించినట్లుగా సినిమా చూసినవారికి అనిపించడం సహజం. ఈ హత్యకు సంబంధించిన అసలు నిజాలు చెప్పేలా కథ ఉండటంతో ఈ చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన వెంటనే పాపులర్ అయింది... నిజంగా ఏం జరిగింది? అనేదానికి ఈ సినిమా నిజమైన నమూనానా? హత్య వెనక ఉన్న నిజమైన హంతకులను ఈ సినిమా బయటపెట్టిందా? జరిగిన విషయాన్ని ఎలా తారుమారు చేసి, ప్రచారం చేస్తున్నారో ఈ సినిమా చూపించిందా? 'హత్య' సినిమా బయటపెట్టిన నిజాలు ఏంటి? ఇంతకీ ఈ సినిమా కథేంటి? ఎలా ఉంది? క్రైమ్ థ్రిల్లర్ మూవీస్‌ని ఇష్టపడేవారు, వివేకానంద రెడ్డి హత్య కేసుని ఫాలో అవుతున్నవారు చూడాల్సిన చిత్రం ఇది.



ఇంతకీ ఈ చిత్ర కథేంటంటే...

ఇల్లందులో రాజకీయ నాయకుడు ధర్మేంద్ర రెడ్డి (రవి వర్మ) దారుణ హత్యకు గురవుతాడు. అయితే తొలుత ఆయన మరణం గుండెపోటు వల్ల జరిగిందని వార్తలు వస్తాయి. కానీ ధర్మేంద్ర గొడ్డలి వేటుతో హత్యకు గురయ్యాడని నిర్ధారణ అవుతుంది. ఈ కేసును రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్ రెడ్డి (భరత్) నిజాయితీ గల ఐపీఎస్ అధికారి సుధ (ధన్యా బాలకృష్ణ)కి అప్పగిస్తాడు. ఆమె తన టీమ్‌తో కలిసి ధర్మేంద్ర రెడ్డి హత్య కేసు విచారణ మొదలుపెడుతుంది. అజాత శత్రువు అయిన ధర్మేంద్ర రెడ్డిని అంత దారుణంగా నరికి చంపింది ఎవరు? ధర్మేంద్రకు, సలీమా (పూజా రామచంద్రన్)కు ఉన్న సంబంధం ఏంటి? పొలిటికల్ ఎజెండాతో ఈ హత్య చేశారా? ఆర్థిక సమస్యలే కారణమా? ధర్మేంద్ర కుమార్తె కవితమ్మ (హిమబిందు)ను తప్పుదోవ పట్టించింది ఎవరు? చిన్నాన్న హత్య కేసులో నిజాలను నిగ్గు తేల్చడానికి సీఎం కిరణ్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు? గత ప్రభుత్వం దగ్గర అమ్ముడుపోయిన కొంతమంది అధికారులు ఈ కేసును ఎలా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు? అనేక ఒత్తిడిలను తట్టుకొని ఐపీఎస్ అధికారి సుధ ఈ మర్డర్ మిస్టరీని ఎలా ఛేదించింది? కేసు విచారణ చివరి దశలో ఉన్న సమయంలో ఏం జరిగింది? అనేది తెలియాలంటే అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'హత్య' సినిమా చూడాల్సిందే.

ఎలా ఉందంటే..

ఈ సినిమా కథంతా కల్పితమే అని చిత్రబృందం పేర్కొన్నప్పటికీ.. సినిమా ప్రారంభంలోనే ఇది వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించిన కథ అని అర్థమవుతుంది. దర్శకురాలు శ్రీవిద్య బసవ ఎంతో రీసెర్చ్ చేసి ఈ సినిమాను తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఆమె రాసుకున్న కథ, స్క్రీన్‌ప్లే అద్భుతంగా ఉన్నాయి. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. జేసీ ధర్మేంద్ర ఎవరన్నది చెబుతూ కథను మొదలుపెట్టారు దర్శకురాలు. ధర్మేంద్ర హత్య, ఆ తర్వాత జరిగిన పరిణామాలను చూపించారు. సుధ విచారణలో ఒక్కో కొత్త విషయం బయటకు వస్తుంటే.. 'ఇది కదా అసలు నిజం' అనిపిస్తుంది. సెకండాఫ్‌లో వచ్చే సలీమా, ధర్మేంద్రల మధ్య లవ్‌స్టోరీ సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయి. దర్శకురాలు ఎంతో పకడ్బందీగా రీసెర్చ్ చేసి, లవ్‌స్టోరీ చెప్పినట్లు అనిపిస్తుంది. క్లైమాక్స్‌లో మంచి ఎమోషన్ పండించారు.

ఎవరెలా చేశారంటే..

ధర్మేంద్ర రెడ్డి పాత్రలో రవి వర్మ ఒదిగిపోయారు. ఐపీఎస్ ఆఫీసర్‌గా ధన్యా బాలకృష్ణ తన పాత్రకు న్యాయం చేశారు. సలీమాగా ఓ డిఫరెంట్ క్యారెక్టర్‌లో పూజా రామచంద్రన్ మెప్పించారు. భరత్, బిందు చంద్రమౌళి, శ్రీకాంత్ అయ్యంగార్... మిగిలిన నటీనటులు వారి పాత్రల్లో మెప్పించారు. సాంకేతికంగా సినిమా చాలా బాగుంది. నరేశ్ కుమరన్ .పి అందించిన నేపథ్య సంగీతం, పాటలు సినిమాకు ప్లస్ అయ్యాయి. అభిరాజ్ నాయర్ సినిమాటోగ్రఫీ బాగుంది. ఎడిటింగ్ ఫర్వాలేదు. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్లు ఉన్నతంగా ఉన్నాయి.

సాక్షి బిజినెస్

శనివారం 29-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
191	73
77,415	23,519

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,311	▽	494
డోజోన్స్	41,559	▽	740
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,659	▽	7
డాక్స్	22,462	▽	217
షాంఘై	3,351	▽	22
నికాయ్	37,120	▽	680

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
89164	△	747
బంగారం (99.5 స్వచ్ఛత)		
88,063	△	744
వెండి (కిలో)		
1,00,892	△	1,117,

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటి	85.25	86.27
£	బ్రిటన్ పౌండ్	ఎకటి	109.60	112.48
€	యూరో	ఎకటి	91.25	93.90
¥	జపాన్ ఎన్ (100)	ఎకటి	56.14	57.57
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటి	52.80	55.02
S$	సింగపూర్ డాలర్	ఖాతాచెక్కు	61.42	66.10
SAR	సౌదీ రియాల్	ఖాతాచెక్కు	21.89	23.53
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాచెక్కు	22.46	24.25
¥	చైనా యువాన్	ఖాతాచెక్కు	10.93	12.75

ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాల షాపింగ్



- ఇతర సంస్థల కొనుగోలులో జోరు
- జాబితాలో హెచ్‌యూఎల్, గోద్రెజ్
- ఐటీసీ, ఇమామీ, టాటా కన్జ్యూమర్

ముంబై: ఇటీవల కొద్ది నెలలుగా ఎఫ్‌ఎంసీజీ రంగ దిగ్గజాలు షాపింగ్‌లో బిజీగా కనిపిస్తున్నాయి. ఇతర సంస్థల కొనుగోళ్లకు తెరతీస్తున్నాయి. ప్రధానంగా ఆధునికతరం డిజిటల్ బ్రాండ్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్న చిన్నతరహా కంపెనీలు లక్ష్యంగా షాపింగ్‌ను చేపడుతున్నాయి. జెన్‌జెడ్ వినియోగదారులకు చేరువ అవుతున్నాయి. డైరెక్టు టు కన్జ్యూమర్ బ్రాండ్స్ సోషల్ మీడియా, డిజిటల్ మార్కెటింగ్ ద్వారా వినియోగదారులను వేగంగా ఆకట్టుకుంటున్నాయి. అయితే పరిమిత పంపిణీ వ్యవస్థ, నిధులలేమి కారణంగా పలు కంపెనీలు కార్యకలాపాలను విస్తరించలేకపోతున్నాయి.

కొనుగోళ్ల బాటలో

దీంతో ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు హెచ్‌యూఎల్, గోద్రెజ్ అగ్రోవెట్, ఐటీసీ చిన్న సంస్థలను సొంతం చేసుకుంటున్నాయి. దీంతో చిన్నతరహా సంస్థలు తమ ప్రొడక్టులను విస్తారిత మార్కెట్‌లో పరిచయం చేసేందుకు వీలు కలుగుతోంది. ఇటీవల స్కిన్‌కేర్ బ్రాండ్ మినిమలిస్ట్‌ను హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) సొంతం చేసుకోగా.. గోద్రెజ్ అగ్రోవెట్.. క్రీమ్‌లైన్ డెయిరీను కొనుగోలు చేసింది. హెచ్‌యూఎల్ తెలంగాణలో పామాయిల్ క్షేత్రాన్ని కొనుగోలు చేసింది. తద్వారా సబ్బులు తదితర ప్రొడక్టుల తయారీలో పామాయిల్ అవసరాలను సర్దుబాటుచేసుకోనుంది. ఈ బాటలో తాజాగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ సంస్థ.. లుక్రో ప్లాస్టిసైకిల్‌లో వాటా కొనుగోలు చేసింది. తద్వారా భవిష్యత్‌లో ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు తప్పనిసరికానున్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ నిబంధనల అమలుకు హెచ్‌యూఎల్ దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు విశ్లేషకులు వివరించారు.

> ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాలు కొంతకాలంగా ప్రత్యేక తరహా చిన్నకంపెనీలపై దృష్టి పెట్టాయి. డిజిటల్ బ్రాండ్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్న సంస్థల కొనుగోలుకి ఆసక్తి చూపుతున్నాయి. తద్వారా జెన్‌జెడ్ వినియోగదారులకూ చేరువ అవుతున్నాయి.

మామాఎర్త్ లిస్టింగ్..

దశలవారీగా 100 శాతం వాటా కొనుగోలు చేస్తున్న డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ గూటికి.. ఫ్రోజెన్, రెడీటు ఈట్ ఆహార ప్రొడక్టుల కంపెనీ ప్రసుమ చేరనుంది. తొలుత 43.8 శాతం వాటాతో ప్రారంభించి మూడేళ్లలో పూర్తి వాటాను ఐటీసీ సొంతం చేసుకోనుంది. ఇప్పటికే మరో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఇమామీ.. పురుషుల సౌందర్య పోషక సంస్థ హీలియోస్ లైఫ్‌స్టైల్(ద మ్యాన్ కంపెనీ)ను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇదేవిధంగా చింగ్స్ సీక్రెట్, స్మిత్ అండ్ జోన్స్ బ్రాండ్ల కంపెనీ క్యాపిటల్ ఫుడ్స్‌ను టాటా గ్రూప్ దిగ్గజం టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ చేజిక్కించుకుంది. తద్వారా ఆర్గానిక్, హెల్త్ ఫుడ్ విభాగంలో కార్యకలాపాలు విస్తరిస్తోంది. కాగా.. మామాఎర్త్ బ్రాండ్ ప్రొడక్టుల డీటూసీ కంపెనీ హోనసా కన్జ్యూమర్ డిజిటల్ మార్గంలో వినియోగదారులను ఆకట్టుకుంటున్నప్పటికీ ఆఫ్‌లైన్‌లో విస్తరించడంలో సవాళ్ల కారణంగా వృద్ధి పరిమితమవుతున్నట్లు విశ్లేషకులు వివరించారు. వెరసి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ కంటే ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాల ద్వారా అధిక నిధులు, విస్తరణకు వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ప్రీమియం ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ బ్రాండ్ ఇందులేఖను హెచ్‌యూఎల్ కొనుగోలు చేయడంతో పరిమితస్థాయి నుంచి బయటపడి భారీ స్థాయిలో అమ్మకాలు సాధిస్తుండటాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ బాటలో మినిమలిస్ట్ ప్రొడక్టులు సైతం వేగవంత వృద్ధి సాధించే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు. **- సాక్షి, బిజినెస్ డెస్క్**

పండుగముందు పసిడి జోష్

- రూ.1,100 పెరుగుదలతో కొత్త రికార్డ్
- ఢిల్లీలో 10 గ్రాముల ధర రూ.92,150
- 2024–25లో ఇన్వెస్టర్లకు 35% రాబడి



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ ప్రకటనలతో అంతర్జాతీయంగా మరోసారి బంగారానికి డిమాండ్ ఏర్పడింది. అనిశ్చితుల్లో సురక్షిత సాధనంగా భావించే బంగారం శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో రూ.1,100 ఎగిసి 10 గ్రాములకు (99.9 స్వచ్ఛత) రూ.92,150 వద్ద ముగిసింది. ఇది నూతన గరిష్ట స్థాయి కావడం గమనార్హం. వెరసి 2024–25 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద బంగారం 35 శాతం ర్యాలీ చేసింది. 2024 ఏప్రిల్ 1న బగారం ధర రూ.68,420 స్థాయిలో ఉంది. అక్కడి నుంచి రూ.23,730 లాభపడింది. ఒకవైపు ఈక్విటీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటుంటే, మరో వైపు పసిడి ఇన్వెస్టర్లకు కాసులు కురిపించింది. ఢిల్లీ మార్కెట్లో 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.1,100 పెరిగి రూ.91,700 స్థాయికి చేరుకుంది. వెండి ఒకే రోజు రూ.1,300 పెరిగి.. కిలో ధర రూ.1,03,000కు చేరింది. మార్చి 19న గత రికార్డు రూ.1,03,500 సమీపానికి చేరుకుంది. ''బంగారం మరో కొత్త రికార్డు గరిష్టాన్ని నమోదు చేసింది. అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధం, ఆర్థిక వృద్ధిపై పడే ప్రభావం నేపథ్యంలో బంగారానికి డిమాండ్ ఏర్పడింది''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

ఏటీఎం చార్జీల పెంపునకు ఆర్‌బీఐ ఓకే..

మే 1 నుంచి అమల్లోకి



ముంబై: నెలవారీ ఉచిత యూసేజీ లావాదేవీల పరిమితిని దాటిన తర్వాత ఏటీఎంల ద్వారా జరిపే నగదు విత్‌డ్రాయల్స్‌పై చార్జీలను పెంచుకునేందుకు బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతించింది. దీంతో ఈ చార్జీలు రూ. 2 చొప్పున పెరిగి రూ. 23కి చేరతాయి. మే 1 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం మెట్రో నగరాల్లో యూజర్లకు సొంత బ్యాంకుల ఏటీఎంలలో అయిదు, ఇతర బ్యాంకుల ఏటీఎంలలో మూడు లావాదేవీలు ఉచితంగా ఉంటున్నాయి. ఉచిత పరిమితి దాటిన తర్వాత ప్రతి లావాదేవీకి రూ. 21 చార్జీ వర్తిస్తోంది.

రూ.26 లక్షల కోట్లు

2024-25లో పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

- ఆటుపోట్ల మధ్య మార్కెట్లు 5%అప్
- 3,764 పాయింట్లు బలపడిన సెన్సెక్స్
- సెప్టెంబర్‌లో 85,978 వద్ద కొత్త రికార్డ్

ముంబై: దలాల్ స్ట్రీట్ ఇన్వెస్టర్ల సంపద మార్చి 28తో ముగిసిన తాజా ఆర్థిక సంవత్సరం(2024–25)లో రూ. 25.9 లక్షల కోట్లమేర ఎగసింది. దీంతో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 4,12,87,647 కోట్ల(4.82 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. సెన్సెక్స్ సెప్టెంబర్ చివర్లో సరికొత్త రికార్డు 85,978 పాయింట్లకు చేరినప్పటికీ తదుపరి అక్టోబర్ నుంచీ డీలా పడింది. చివరికి 77,415 వద్ద ముగిసింది. ఈ బాటలో ఎన్‌ఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ సైతం తాజా ఆర్థిక సంవత్సరంలో నికరంగా 1,192 పాయింట్లు(5.3 శాతం) జమ చేసుకుంది. 23,519 వద్ద నిలిచింది. అయితే సెప్టెంబర్‌లో 26,277 పాయింట్ల వద్ద ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకిన తదుపరి దిద్దుబాటుకు లోనైన సంగతి తెలిసిందే.

దిద్దుబాటు బాటలో

గతేడాది(2023–24)లో భారీ ర్యాలీ చేసిన దేశీ స్టాక్ మార్కెట్లు 2024–25లో పలు కారణాలతో ఆటుపోట్లను చవిచూశాయి. ఒక్క అక్టోబర్‌లోనే సెన్సెక్స్ 4,911 పాయింట్లు(5.8 శాతం) పతనమైంది. ప్రధానంగా అంతర్జాతీయ అనిశ్చితులు, యూఎస్ కొత్త ప్రెసిడెంట్ ట్రంప్ విధానాలపై ఆందోళనలు మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలకు దారి తీశాయి. నిర్మాణాత్మక బుల్ ట్రెండ్ నేపథ్యంలో లాభాల స్వీకరణ సైతం ఇందుకు కారణమైనట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మరోవైపు దేశీ కార్పొరేట్ ఫలితాలు నిరాశపరచడం, భవిష్యత్ అంచనాలు తగ్గడం వంటి అంశాలు వీటికి జత కలిసినట్లు వివరించారు. అయితే దేశీయంగా పలువురు కొత్త రిటైల్ ఇన్వెస్టర్లు మార్కెట్లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతూ వచ్చినట్లు నిపుణులు తెలియజేశారు. దీంతో మ్యూచువల్ ఫండ్స్‌కు సైతం భారీగా పెట్టుబడులు సమకూరినట్లు ప్రస్తావించారు. దీంతో ఐపీవో మార్కెట్లు కళకళలాడటంతోపాటు.. సెకండరీ మార్కెట్లు భారీ పతనాల నుంచి రికవరీ అయినట్లు వెల్లడించారు.

2024-25కు నష్టాలతో వీడ్కోలు



ముంబై: ఆర్థిక సంవత్సరం 2024–25కు దలాల్ స్ట్రీట్ నష్టాలతో వీడ్కోలు పలికింది. ట్రంప్ సుంకాల మోతతో ఈక్విటీ మార్కెట్లు డీలాపడ్డాయి. ఐటీ, ఆటో షేర్ల పతనంతో శుక్రవారం సెన్సెక్స్ 191 పాయింట్లు నష్టపోయి 77,415 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 73 పాయింట్లు క్షీణించి 23,519 వద్ద నిలిచింది. ఉదయమే బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. బ్యాంకులు, ఆయిల్‌అండ్‌గ్యాస్ మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 421 పాయింట్లు క్షీణించి 77,186 వద్ద, నిఫ్టీ 142 పాయింట్లు పతనమై 23,450 వద్ద కనిష్టాన్ని తాకాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ సూచీ 0.68%, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.35% పెరిగాయి. రంగాల వారీగా ఐటీ ఇండెక్స్ 2%, రియల్టీ 1.50%, యుటిలిటీ, ఆటో సూచీలు 1 శాతం నష్టపోయాయి.

మార్కెట్లో మరిన్ని విశేషాలు..

- బీఎస్‌ఈ షేరు 16% పెరగ్గా, ఎంఅండ్‌ఎం 3 3%, మారుతీ సుజుకీ, అశోక్‌లేలాండ్ 2% నష్టపోయాయి.
- హ్యుందాయ్ మోటార్స్‌కు కీలక సూచీల్లో చోటు లభించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

టీవీని దాటేసిన డిజిటల్ మీడియా	కాంట్రాక్ట్ మహిళా టెకీలకు సవాళ్లు

సాక్షి స్పోర్ట్స్


నిత్య

అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో నిత్య, జ్యోతి మెరుపులు

బెంగళూరు: ఇండియన్ అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిలో తెలుగు అథ్లెట్లు నిత్య గంధే, జ్యోతి యర్రాజి సత్తా చాటారు. ఇద్దరూ చెరో 2 ఈవెంట్లలో విజయం సాధించి పోడియంపై నిలిచారు. మహిళల 100 మీటర్ల పరుగులో తెలంగాణ అమ్మాయి నిత్య గంధే అగ్రస్థానం దక్కించుకోగా... మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజి టాప్ 'ప్లేస్' చేజిక్కించుకుంది. శుక్రవారం జరిగిన 100 మీటర్ల రేసులో నిత్య గంధే 11.41 సెకన్లలో గమ్యాన్ని చేరి తొలి స్థానంలో నిలవగా... హర్డిల్స్‌లో రిలయన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న జ్యోతి 13.07 సెకన్లలో అందరికంటే ముందుగా లక్ష్యాన్ని చేరింది. మహిళల 200 మీటర్ల పరుగులో ఆంధ్ర, తెలంగాణ అథ్లెట్ల మధ్యే ప్రధానంగా పోటీ సాగింది. వాయువేగంతో పరుగు తీసిన నిత్య 23.36 సెకన్లతో తొలి స్థానం కైవసం చేసుకోగా... 23.55 సెకన్ల టైమింగ్‌తో జ్యోతి యర్రాజి రెండో ప్లేస్‌లో నిలిచింది.


జ్యోతి

చెన్నైని గెలిచారు...

17 ఏళ్ల తర్వాత చెపాక్‌లో ఆర్‌సీబీ విజయం

ఎప్పుడో 2008లో తొలి ఐపీఎల్‌లో చెపాక్ మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్‌పై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు గెలిచింది. ఆ తర్వాత ఈ మైదానంలో తలపడిన ఎనిమిది మ్యాచుల్లోనూ చెన్నై చేతిలో ఓటమిపాలైంది. ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత ఎట్టకేలకు చెన్నై గడ్డపై సీఎస్‌కేపై ఆర్‌సీబీ పైచేయి సాధించింది. ముందుగా బ్యాటింగ్‌లో మెరుగైన స్కోరు సాధించిన బెంగళూరు, ఆపై పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని పూర్తిగా కట్టిపడేసింది. స్పిన్నర్ల రాజ్యం సాగే నెమ్మదైన తన సొంత మైదానంలో చెన్నై జట్టు ప్రభావం చూపించ లేకపోగా... స్ఫూర్తిదాయక బౌలింగ్ ప్రదర్శనతో ఆర్‌సీబీ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది.

- 50 పరుగులతో ఓడిన సూపర్ కింగ్స్
- పాటీదార్ అర్ధసెంచరీ, రాణించిన బౌలర్లు




పాటీదార్

చెన్నై: ఐపీఎల్ సీజన్‌లో బెంగళూరు వరుసగా రెండు ప్రత్యర్థి వేదికలపై వరుస విజయాలు అందుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 50 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాయల్ చాలెంజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రజత్ పాటీదార్ (32 బంతుల్లో 51; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా...ఫిల్ సాల్ట్ (16 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్), విరాట్ కోహ్లి (30 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులకే పరిమితమైంది. రచిన్ రవీంద్ర (31 బంతుల్లో 41; 5 ఫోర్లు), ఎమ్మెస్ ధోని (16 బంతుల్లో 30 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు.

పాటీదార్ అర్ధ సెంచరీ...

ఓపెనర్ సాల్ట్ దూకుడుగా ఇన్నింగ్స్ ప్రారంభించగా, మరో ఎండ్‌లో కోహ్లి మాత్రం కాస్త తడబడ్డాడు. తన స్థాయికి తగినట్లుగా వేగంగా ఆడలేకపోయాడు. ఖలీల్ వేసిన తొలి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన సాల్ట్...అశ్విన్ వేసిన తర్వాత ఓవర్లో సిక్స్, 2 ఫోర్లు బాదాడు. అయితే ధోని అద్భుత స్టంపింగ్‌కు సాల్ట్ వెనుదిరగ్గా, దేవ్‌దత్ పడిక్కల్ (14 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజ్‌లో ఉన్నంత సేపు దాటిని ప్రదర్శించాడు. జడేజా ఓవర్లోనే అతను 2 ఫోర్లు, సిక్స్ కొట్టాడు. ఎట్టకేలకు పతిరణ ఓవర్లో కోహ్లి వరుసగా సిక్స్, ఫోర్ కొట్టినా...నూర్ బౌలింగ్‌లో అవుటై నిరాశగానే వెనుదిరిగాడు. మరో వైపు జడేజా ఓవర్లో సిక్స్, 2 ఫోర్లతో పాటీదార్ తన జోరును కొనసాగించాడు. ఈ క్రమంలో 30 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. ఇలాంటి స్థితిలో ఐదు పరుగుల వ్యవధిలో జితేశ్ శర్మ (12), పాటీదార్, కృనాల్ పాండ్యా (0) వికెట్లు తీసి బెంగళూరును కొద్ది సేపు చెన్నై నిలువరించగలిగింది. అయితే స్యామ్ కరన్ వేసిన ఆఖరి ఓవర్లో టిమ్ డేవిడ్ (8 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) వరుసగా మూడు సిక్సర్లు బాది స్కోరును 200కు చేరువగా తీసుకొచ్చాడు.

ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

సమష్టి వైఫల్యం...

ఛేదనలో చెన్నై తీవ్రంగా ఇబ్బంది పడింది. రచిన్ కొన్ని చక్కటి షాట్లు ఆడటం మినహా ఒక్క బ్యాటర్ కూడా కనీస ప్రదర్శన ఇవ్వలేదు. చెప్పుకోదగ్గ భాగస్వామ్యం కూడా లేకుండా తక్కువ వ్యవధిలో సీఎస్‌కే వరుసగా వికెట్లు కోల్పోయింది. ఒకే స్కోరు వద్ద రాహుల్ త్రిపాఠి (5), రుతురాజ్ గైక్వాడ్ (0) వెనుదిరగ్గా, దీపక్ హుడా (4), స్యామ్ కరన్ (8) పూర్తిగా విఫలమయ్యారు. శివమ్ దూబే (15 బంతుల్లో 19; 2 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (19 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్) కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. ఆర్‌సీబీ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ చెన్నైపై ఒత్తిడిని కొనసాగించారు. ఆరంభంలో పవర్‌ప్లే ముగిసే సరికి 3 వికెట్లు కోల్పోయి 30 పరుగులు మాత్రమే చేసిన చెన్నై ఆ తర్వాత కోలుకోలేకపోయింది. ఆఖర్లో 28 బంతుల్లో 98 పరుగులు చేయాల్సిన స్థితిలో బరిలోకి దిగిన ధోని అభిమానులను అలరించే కొన్ని షాట్లు కొట్టడం మినహా అవి జట్టుకు ఏమాత్రం ఉపయోగపడలేదు. కృనాల్ వేసిన చివరి ఓవర్లో ధోని 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టడానికి చాలా ముందే ఓటమి ఖాయమైపోయింది!

స్కోరు వివరాలు:

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (స్టంప్డ్) ధోని (బి) నూర్ 32; కోహ్లి (సి) రచిన్ (బి) నూర్ 31; పడిక్కల్ (సి) గైక్వాడ్ (బి) అశ్విన్ 27; పాటీదార్ (సి) కరన్ (బి) పతిరణ 51; లివింగ్‌స్టోన్ (బి) నూర్ 10; జితేశ్ (సి) జడేజా (బి) అహ్మద్ 12; డేవిడ్ (నాటౌట్) 22; కృనాల్ (సి) హుడా (బి) పతిరణ 0; భువనేశ్వర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1–45, 2–76, 3–117, 4–145, 5–172, 6–176, 7–177. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–0–28–1, రవిచంద్రన్ అశ్విన్ 2–0–22–1, స్యామ్ కరన్ 3–0–34–0, నూర్ అహ్మద్ 4–0–36–3, రవీంద్ర జడేజా 3–0–37–0, పతిరణ 4–0–36–2.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ రవీంద్ర (బి) దయాళ్ 41; త్రిపాఠి (సి) సాల్ట్ (బి) హాజల్‌వుడ్ 5; గైక్వాడ్ (సి) (సబ్) భాండగే (బి) హాజల్‌వుడ్ 0; హుడా (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 4; స్యామ్ కరన్ (సి) కృనాల్ (బి) లివింగ్‌స్టోన్ 8; శివమ్ దూబే (బి) దయాళ్ 19; జడేజా (సి) సాల్ట్ (బి) హాజల్‌వుడ్ 25; అశ్విన్ (సి) సాల్ట్ (బి) లివింగ్‌స్టోన్ 11; ధోని (నాటౌట్) 30; నూర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 146. **వికెట్ల పతనం:** 1–8, 2–8, 3–26, 4–52, 5–75, 6–80, 7–99, 8–130. **బౌలింగ్:** భువనేశ్వర్ 3–0–20–1, హాజల్‌వుడ్ 4–0–21–3, యశ్ దయాళ్ 3–0–18–2, లివింగ్‌స్టోన్ 4–0–28–2, సుయాశ్ శర్మ 4–0–32–0, కృనాల్ పాండ్యా 2–0–26–0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
బెంగళూరు	2	2	0	4	2.266
లక్నో	2	1	1	2	0.963
పంజాబ్	1	1	0	2	0.550
ఢిల్లీ	1	1	0	2	0.371
హైదరాబాద్	2	1	1	2	-0.128
కోల్‌కతా	2	1	1	2	-0.308
చెన్నై	2	1	1	2	-1.013
ముంబై	1	0	1	0	-0.493
గుజరాత్	1	0	1	0	-0.550
రాజస్తాన్	2	0	2	0	-1.882

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ X ముంబై

వేదిక: అహ్మదాబాద్

రాత్రి 7:30 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


మనీషా

మనీషాకు స్వర్ణం

- అంతిమ్‌కు కాంస్య పతకం
- ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత రెజ్లర్ మనీషా భన్వాల్ పసిడి పతకంతో మెరిసింది. హోరాహోరీగా సాగిన మహిళల 62 కేజీల విభాగం ఫైనల్లో శుక్రవారం మనీషా 8–7 పాయింట్ల తేడాతో ఓక్ జే కిమ్ (కొరియా)పై విజయం సాధించింది. ఒక దశలో 2–7తో వెనుకంజలో నిలిచిన మనీషా... ఆఖరి నిమిషంలో అసమాన పోరాటంతో వరుసగా 6 పాయింట్లు సాధించి స్వర్ణం కైవసం చేసుకుంది. ఆసియా చాంపియన్‌షిప్‌లో 3 కాంస్యాలు గెలిచిన మనీషాకు ఇదే తొలి స్వర్ణం కాగా... సెమీఫైనల్లో మనీషా 5–1తో బిలిమ్‌బెక్ కై జీపై విజయం సాధించింది. అంతకుముందు టైనిస్ డుబెక్ (కజకిస్తాన్), హన్‌బిట్ లీ (కొరియా)పై ఏకపక్ష విజయాలతో మనీషా సెమీస్‌కు చేరింది. 2021 ఆసియా చాంపియన్‌షిప్ తర్వాత ఈ పోటీల్లో భారత్‌కు ఇదే తొలి పసిడి పతకం. ఆ పోటీల్లో భారత్ తరపున వినేశ్ ఫొగాట్, సరితా మోర్ భారత్ తరపున స్వర్ణాలు గెలిచారు. మరోవైపు యువ రెజ్లర్ అంతిమ్ పంఘాల్ మహిళల 53 కేజీల విభాగంలో కాంస్యం కైవసం చేసుకుంది. సెమీఫైనల్లో జపాన్‌కు చెందిన మోయో కియోకా చేతిలో ఓడిన అంతిమ్... కాస్య పతక పోరులో సత్తా చాటింది. నేహ శర్మ (57 కేజీలు), మోనిక (65 కేజీలు), జ్యోతి బెరివాల్ (72 కేజీలు) మెడల్ రౌండ్స్‌కు అర్హత సాధించలేకపోయారు. ఈ టోర్నీలో భారత్ 1 స్వర్ణం, 1 రజతం, 6 కాంస్యాలతో మొత్తం 8 పతకాలు సాధించగా... పురుషుల ఫ్రీస్టయిల్ పోటీలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి.





Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వరాహరూపం..
దైవ వరిష్టం

వర దేవుడు ఆదివరాహస్వామి


వరాహస్వామి ఆలయం

- కమాన్‌పూర్‌లో గుడిలేని క్షేత్రం
- అన్నదానాలు..ముడుపులకు ప్రత్యేకం
- ఉగాది సందర్భంగా ఉత్సవాలకు ఏర్పాట్లు



కమాన్‌పూర్(మంథని):

దశావతారాల్లో వరాహావతారం ప్రసిద్ధి గాంచింది. జలప్రళయంలో చిక్కుకున్న భూ మండలాన్ని ఆదిదేవుడు వరాహావతారమెత్తి రక్షించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. అలాంటి ఆది వరాహావతారం తెలంగాణ రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఉంది. ఆది దేవునికి ఏటా శ్రావణ మాసంలో పుట్టిన రోజు, ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం, ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా ఉత్సవ వేడుకలు, మాస కల్యాణాలు నిర్వహిస్తారు.


రాతిబండపై ఆదివరాహస్వామి రూపం

40 ఏళ్లుగా నిత్యపూజలు

సుమారు 40 ఏళ్లగా ఏటా స్వామివారికి భక్తులు నిత్యపూజలతో పాటు అభిషేకాలు చేస్తుంటారు. కోరిన కోర్కెలు తీర్చే ఆదిదేవుడు వరాహస్వామిగా భక్తులు కొలుస్తుంటారు. స్వామివారికి భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎంతోమంది ప్రముఖులు స్వామి దర్శనం కోసం వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

పాదాలకు పూజలు

గతంలో ఆలయం చుట్టూ డోజర్‌తో చదును చేస్తుండగా బండరాయిపై స్వామివారి పాదాలు దర్శనమిచ్చాయి. అప్పటినుంచి స్వామి వారు నడిచి వచ్చిన పాదాలుగా భక్తులు పేర్కొంటున్నారు. ఇక్కడ కూడా భక్తులు పూజలు చేస్తుంటారు.

గుడి లేని క్షేత్రంగా..

కమాన్‌పూర్ గ్రామానికి తూర్పున ఒక బండరాయిపై ఆదివరాహ స్వామి విగ్రహం ఉంది. స్వామివారు గుడి లేకుండా వరాహావతారంలో భక్తులకు దర్శనమిస్తారు.

కోరిక నెరవేరేందుకు ముడుపులు


స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు.. తమ కోరికలు నెరవేరాలని ముడుపులు కట్టి అన్నదానాలు చేయడం ఇక్కడ ప్రత్యేకం. ఆదివరాహస్వామి ఆలయంలో ఈనెల 30న ఉగాది పర్వదినం సందర్భంగా ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇలా చేరుకోవాలి

కమాన్‌పూర్ మండల కేంద్రంలో కొలువుదీరిన ఆదివరాహస్వామి దేవాలయానికి వచ్చే భక్తులు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి మంథని, కాళేశ్వరం వెళ్లే ప్రధాన రహదారి కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బస్సు దిగాలి. అక్కడి నుంచి ఆటోలో నాలుగు కిలోమీటర్ల దూరంలో స్వామివారి దేవాలయానికి చేరుకోవాలి.

తెలంగాణలో రూ. 3,148.7 కోట్లతో 'ఆయుష్మాన్'

కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో 2021–22 నుంచి ఆయుష్మాన్ భారత్ ప్రధాన్‌మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి రూ.3,148.7 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. తెలంగాణలో 82.66 లక్షల ఆయుష్మాన్ కార్డులను జారీ చేసినట్లు.. శుక్రవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి తెలిపారు.

రక్షణ శాఖ భూమిలో పనులకు అనుమతి

2022 జనవరి 1వ తేదీ నుంచి.. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ మధ్యకాలంలో.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేదా ప్రభుత్వ నియంత్రణలోని సంస్థల నుంచి 13 మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రక్షణశాఖ భూమిలో పనుల అనుమతికి అభ్యర్థనలు స్వీకరించామని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్‌సేథ్ తెలిపారు. వీటిలో 7 ప్రాజెక్టుల్లో కేంద్ర రక్షణ శాఖ ఇప్పటికే అనుమతులు మంజూరు చేసిందని కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్‌లు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి బదులిచ్చారు. మరో రెండు ప్రాజెక్టుల విషయంలో, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి దరఖాస్తులు రద్దు చేసినట్లు వెల్లడించారు.

16.70 లక్షల వరి విత్తనాలు అవసరం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా వరిసాగుకు 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని తేల్చినట్లు శుక్రవారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి తెలిపారు. 89 లక్షల పత్తి ప్యాకెట్లు, 1.35 లక్షల క్వింటాళ్ల సోయా చిక్కుడు విత్తనాలు, 48 వేల క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు అవసరం అని అంచనా వేసినట్లు చెప్పారు. వరిలో సన్న బియ్యం సాగు ఈసారి ఇంకా పెరిగే అవకాశమున్నందున సన్నరకాల విత్తనాలను అధికమొత్తంలో అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. 2.4 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. జిల్లాలు, ప్రాంతాల వారీగా డిమాండ్ ఉన్న పత్తి రకాలను అవసరం కంటే అధికమొత్తంలో తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచేందుకు కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. పచ్చిరొట్టకు సంబంధించి ఏప్రిల్ నెలలోనే విత్తనాలు తెప్పించి అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే టీజీ సీడ్స్ వారికి 1.94 లక్షల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు ప్రతిపాదనలు పంపించామని, వీటి సరఫరాలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

డిమాండ్ ఉన్న విత్తనాలు అందుబాటులో : మంత్రి తుమ్మల

వరిసాగు చేస్తున్న రైతుల నుంచి బెరుకులు ఎక్కువగా రావడం, తొందరగా కంకి వెయ్యడం వంటి ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని సరిదిద్ది, నాణ్యమైన విత్తనాన్ని రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు నష్టపోయిన సందర్భాలు ప్రభుత్వం దృష్టికి వస్తున్నాయని, విత్తన కంపెనీలకు రైతులకు మధ్య వారధిగా ఉన్న ఆర్గనైజర్లలో కొంతమంది రైతులకు దక్కాల్సిన ధర, చెల్లించాల్సిన డబ్బుల విషయంలో కానీ వారిని ఇవ్వడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయని మంత్రి తెలిపారు. కూరగాయల విత్తనాల లభ్యత, దిగుబడులపై కూడా కంపెనీ ప్రతినిధులతో ఆరా తీసిన మంత్రి, కూరగాయల విస్తీర్ణాన్ని పెంచేందుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, టీజీ సీడ్స్ చైర్మన్ అన్వేశ్ రెడ్డి, సీడ్స్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, సీడ్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ సచివాలయంలో మాక్‌డ్రిల్

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదాలపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన చర్యలపై అగ్నిమాపక శాఖాధికారులు వివరించారు. తెలంగాణ సచివాలయ సీఎస్‌వో దేవీదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, సచివాలయ రక్షణ సిబ్బంది పాల్గొన్నారు. ఎండాకాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని, వీటిని ముందుగానే ఎలా ఎదుర్కొనాలి, తక్షణమే తీసుకోవాల్సిన చర్యలను అధికారులు క్షుణ్ణంగా వివరించారు. దీనిపై అగ్నిమాపక శాఖ అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించి.. సచివాలయ రక్షణ సిబ్బందికి అవగాహన కల్పించారు.

కార్యదర్శులకు ప్రొబేషన్ ప్రకటించండి

పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని.. గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శిగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచే.. క్రమబద్ధీకరణ సహా ప్రొబేషన్ అమలు చేయాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2019లో జేపీఎస్‌లుగా నియమితులై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులకు కామన్ ఎఫెక్టివ్ డేట్ ఉత్తర్వులు జారీ చేసిన సీఎం రేవంత్ రెడ్డి, పీఆర్‌శాఖ మంత్రి సీతక్క, పీఆర్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ సృజనకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

41ఏ నోటీసులిచ్చి విచారణ చేపట్టండి

యాంకర్ విష్ణుప్రియ పిటిషన్‌పై పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: యాంకర్ విష్ణుప్రియపై దాఖలైన కేసులో చట్టప్రకారం సీఆర్‌పీసీ 41ఏ కింద నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలని పంజగుట్ట, మియాపూర్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని ఆమెకు సూచిస్తూ, విచారణను ముగించింది. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌పై మియాపూర్, పంజగుట్ట పీఎస్‌ల్లో కేసులను కొట్టివేయాలంటూ హైకోర్టులో యాంకర్ విష్ణుప్రియ రెండు పిటిషన్లు దాఖలు చేశారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ చేశారంటూ పంజగుట్ట స్టేషన్‌లో వినయ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, ఇదే అంశంపై ఫణీంద్రశర్మ ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కూడా ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారు. ఈ కేసులను కొట్టివేయాలని, తనపై ఫిర్యాదుదారులు ఎలాంటి ఆరోపణలు చేయలేదని, ప్రధానంగా వారు ఫిర్యాదు చేసింది బెట్టింగ్ యాప్‌లపైనేనని విష్ణుప్రియ పేర్కొన్నారు.

రీఅపాయింటెడ్ ఆఫీసర్లు, సిబ్బంది సర్వీస్ రద్దుచేయండి

- పీఆర్ విభాగాలకు పీఆర్‌ఆర్‌డీ కార్యదర్శి లోకేశ్‌కుమార్ మెమో జారీ
- అందర్నీ తొలగిస్తారా? లేదా మినహాయింపులుంటాయా? అని ఉద్యోగుల్లో సందేహాలు

సాక్షి, హైదరాబాద్: తమ శాఖలో సచివాలయ శాఖలు, హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్, కార్పొరేషన్లు, బోర్డులు, అన్ని ప్రభుత్వ ఏజెన్సీల్లో (రాష్ట్రస్థాయి ఆఫీసులలో) రీ–అపాయింట్‌మెంట్ అయిన రిటైర్డ్ ఆఫీసర్లు, సిబ్బంది సర్వీసులను రద్దుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పీఆర్ ఆర్‌డీ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఆయా స్థాయిల అధికారులు, సిబ్బంది (పదవీ విరమణ అనంతరం పనిచేస్తున్న వారు) తొలగింపునకు సంబంధించిన నివేదికలను శనివారంలోగా ఇవ్వాలని ఆదేశించింది. శుక్రవారం ఈ మేరకు ఓ మెమో ద్వారా పీఆర్ ఆర్‌డీ డైరెక్టర్‌కు, పీఆర్ ఈఎన్‌సీ, మిషన్‌భగీరథ ఈఎన్‌సీ, టీఎస్ ఐఆర్‌డీ కమిషనర్, సెర్ప్ సీఈవో, స్త్రీనిధి క్రెడిట్ డైరెక్టర్, స్టేట్‌ఫైనాన్స్ కమిషన్ కార్యాలయాలకు పీఆర్ ఆర్‌డీ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ సమాచారం తెలిపారు.

45 మంది రీ అపాయింట్‌మెంట్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో 45 మంది ఉన్నతాధికారులు రీ అపాయింట్‌మెంట్ అయి పనిచేస్తున్నారు. ఇక వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది పెద్దసంఖ్యలోనే ఉంటారని తెలుస్తోంది. అయితే వారు నిర్వహిస్తున్న బాధ్యతలు, అనుభవం దృష్ట్యా వీరిలో కొందరిని మళ్లీ కొత్తగా పునర్ నియమించే అవకాశం ప్రభుత్వ ఉత్వర్వుల్లో సీఎస్ కల్పించారు. దీంతో పీఆర్‌శాఖలో పనిచేస్తున్న రీఅపాయింటెడ్ అధికారులు, ఉద్యోగుల్లో ఎంతమందిని తొలగిస్తారు? ఎవరెవరిని పునర్ నియమిస్తారనే చర్చ ఆ శాఖ ఉద్యోగుల్లో సాగుతోంది. 30 ఏళ్ల కాలంలో ఆయా హోదాల్లో రిటైరై మళ్లీ పనిచేస్తున్న అధికారుల్లో కొందరు కమిషనర్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈఎన్‌సీగా పనిచేసిన ఆర్.కొండల్‌రావు 1995, అక్టోబర్ 31న రిటైర్ కాగా.. 2019, నవంబర్ 11 నుంచి ఇప్పటిదాకా టెక్నికల్ అడ్వైజర్‌గా కొనసాగుతున్నారు. అదనపు కార్యదర్శిగా 2019, ఆగస్టులో రిటైరైన ఎ.వీరభద్రరావు 2021, జనవరి నుంచి హెచ్‌ఆర్–2గా, 2012 సెప్టెంబర్‌లో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా పదవీవిరమణ చేసిన నర్సింహారెడ్డిని 2013, ఫిబ్రవరి నుంచి స్టేట్ మేనేజర్–విజిలెన్స్ అఫీ ల్స్‌గా రీఅపాయింట్‌మెంట్ ఇచ్చి కొనసాగిస్తున్నారు. ఆర్‌డీ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా 2013, జనవరిలో రిటైరైన బి.ఈశ్వర్‌ప్రసాద్ 2013, మార్చి నుంచి స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. కమిషనర్ కార్యాలయంలో చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా 2013, ఆగస్టులో పదవీవిరమణ చేసిన సీహెచ్ సుబ్బారావు స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా కొనసాగుతున్నారు. పీఆర్‌ఆర్‌డీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా 2016, నవంబర్‌లో రిటైరైన పి.రామారావు డిప్యూటీ కమిషనర్ హోదాలోనే రీఅపాయింట్‌మెట్ అయి కొనసాగుతున్నారు. నాబార్డ్ జీఎం (ముంబై హెడ్‌క్వార్టర్స్)గా 2018లో రిటైరైన వై.నర్సింహారెడ్డి సెర్ప్ సీఈవో కార్యాలయంలో కన్సల్టెంట్ డైరెక్టర్‌గా రీఅపాయింట్‌మెంట్‌పై పనిచేస్తున్నారు. 2009, మార్చి 31న నాబార్డ్ ఏజీఎంగా పదవీ విరమణ చేసిన జి.విద్యాసాగర్‌రెడ్డి 2011 సెప్టెంబర్ నుంచి స్త్రీనిధి క్రెడిట్ కార్పొరేషన్ ఫెడరేషన్ ఎండీగా కొనసాగుతున్నారు. మిషన్ భగీరథలో చీఫ్ ఇంజనీర్‌గా 2017, అక్టోబర్ 31న పదవీవిరమణ చేసిన జి.కృపాకర్‌రెడ్డి ఆ మరుసటిరోజు అంటే సెప్టెంబర్ 1 నుంచి మిషన్ భగీరథ ఈఎన్‌సీగా రీఅపాయింట్‌మెంట్ అయి విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే పలువురు చీఫ్ ఇంజనీర్లుగా రిటైరైన వారు మిషన్‌భగీరథలో పనిచేస్తున్నారు. పీఆర్ శాఖ పరిధిలోకి వచ్చే రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శిగా 2017, జులై 31న రిటైరైన ఎం.అశోక్‌కుమార్ ఆ మరుసటి రోజు నుంచే రీ అపాయింట్‌మెంట్ అయి (మధ్యలో కొంతకాలం గ్యాప్‌తో) అవే బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఎస్ఈసీలోనే జాయింట్ సెక్రటరీగా 2020, డిసెంబర్ 31న రిటైరైన ఎస్.జయసింహారెడ్డి అక్కడే ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు.

తెలంగాణ కేబినెట్‌లో మాకు చోటివ్వండి

రాహుల్, కేసీ, మీనాక్షిలకు బంజారా సంఘాల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో తమ సామాజిక వర్గానికి చోటు కల్పించాలని బంజారా నేతలు కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లను కలిసి వినతిపత్రాలను అందజేశారు. బంజారా సమాజం మొత్తం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీతోనే ఉందని వివరించారు. కాంగ్రెస్ పెద్దలను కలిసిన వారిలో గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్ చౌహాన్, గిరిజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు అశోక్ రాథోడ్, లక్పతి నాయక్, శివ నాయక్ తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో హరీశ్, కేటీఆర్‌లు మాజీలవుతారు

రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ముఖ్య నేతలు హరీశ్‌రావు, కేటీఆర్‌లు మాజీలవుతారని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేటీఆర్, సిద్దిపేటలో హరీశ్‌రావుల ఓటమి ఈసారి ఖాయమని చెప్పారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అంటేనే ఆ ఇద్దరికి కడుపు మంటన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఆ ఇద్దరు అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. రైతులకు సంకెళ్లు వేసిన బీఆర్ఎస్ చరిత్రను ఎవరూ మార్చలేరన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఇబ్బంది పెట్టి, పదేళ్ల పాటు ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు మీసాలు మెలేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతల దుర్మార్గాలను ప్రజలు ముందే గమనించి.. వందడుగుల గోతిలో ఆ పార్టీని పూడ్చి పెట్టారని సాయి కుమార్ ఎద్దేవా చేశారు.

2న బీసీ చలో ఢిల్లీకి తరలిరండి

కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్



సాక్షి, న్యూఢిల్లీ: హక్కుల సాధన కోసం ఏప్రిల్ 2న నిర్వహించనున్న 'బీసీ చలో ఢిల్లీ' కార్యక్రమానికి బీసీలంతా తరలిరావాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు కోరారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. పెద్దఎత్తున నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు అమలు జరిగితే.. రానున్న రోజుల్లో ఆ సామాజిక వర్గాలకు లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. తనకు పార్టీలో ఏ బాధ్యత అప్పగించినా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆలోచనలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు.

అప్పు చేసినా.. తప్పు చేసినా చెబుతాం

కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అమీర్ అలీఖాన్





సాక్షి, హైదరాబాద్: మమ్మల్ని నమ్మి గెలిపించిన ప్రజలను మోసం చేయబోమని, అప్పు చేసినా.. తప్పు చేసినా చెబుతామని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అమీర్ అలీఖాన్ అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు.. 15 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో బీఆర్ఎస్ నేతలు ఉన్నారని, లిక్కర్ లెక్కలతో బడ్జెట్ లెక్కలపై ఎమ్మెల్సీ కవిత కన్ఫ్యూజ్ అవుతున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు చరిత్రాత్మకమని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఓడీ వంటి చేబదులుతో నడిచిందని, తాము అలా చేయమని ఉన్నది ఉన్నట్లుగా ప్రజలకు వాస్తవ పరిస్థితి చెబుతామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కవిత మాట్లాడే ముందే కేసీఆర్ మాటలను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు.

కుల హత్యలను నివారించాలి: పీఎస్‌యూ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వరస కుల హత్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, హత్యల నివారణకు సిట్టింగ్ జడ్జితో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని పీఎస్‌యూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కులోన్మాద, పరువు హత్యలు పెరుగుతున్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను పటిష్టపరచడంతో పాటు.. శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్‌ను కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

కార్మిక సంక్షేమం పట్టని కాంగ్రెస్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, బీఆర్ఎస్ భవన్ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులను అన్ని విధాలుగా బీఆర్ఎస్ ఆదుకుందని, కాంగ్రెస్ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

పంటలు ఎండిపోతుంటే కాపాడలేని స్థితిలో ప్రభుత్వం

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



సాక్షి, హైదరాబాద్: పంటలు ఎండిపోతుంటే కాపాడలేని స్థితిలో ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. 30 టీఎంసీల నీళ్లు వృథా చేయకుండా రిజర్వాయర్లు నింపితే 9 టీఎంసీల నీళ్లు ఉండేవన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలకు నోబెల్ ప్రైజ్‌లు అవసరం లేదని, ప్రజల అవసరాలు అర్థం చేసుకుంటే చాలని హితవు పలికారు. బడ్జెట్ వాస్తవాలను ప్రభుత్వం బయటకు రానివ్వడం లేదని, అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేసిందని పొన్నాల ధ్వజమెత్తారు. దేవాదుల టన్నెల్ 2024లోనే పూర్తయిందని, మోటార్లు ఆన్ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి 15 నెలల సమయం పట్టిందా? అని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రభుత్వం టెయిల్‌పాండ్ నుంచి నీళ్లు తీసుకెళ్తుంటే ఇరిగేషన్ మంత్రి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు.



మండుటెండలో బతుకు బండి

నాలుగు వేళ్లు నోట్లోకి వెళ్లాలంటే నాలుగు రాళ్లు సంపాదించాల్సిందే.. ఆకలికి ఎండ, వాన, చలితో పని ఉండదు. బుట్టలు తయారుచేసి అమ్ముకుని జీవించే ఈ వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం మండుటెండలో ఇలా తలపై బుట్టలు పెట్టుకుని వీధి వీధి తిరుగుతూ అమ్ముకుంటున్నాడు. శ్రీకాకుళం నగరంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



లాలి జో.. లాలీ జో

రెక్కాడితే కాని డొక్కాడని ఈ కూలీలు ఇంట్లో తమ బిడ్డను చూసే వారు లేక తమతోపాటు తీసుకువచ్చి ఇలా జామాయిల్ తోటలో ఊయల కట్టి నిద్రపుచ్చారు. చల్ల గాలికి చిన్నారి ఆదమరచి నిద్రపోగా వారు తమపనిలో నిమగ్నమయ్యారు. ప్రకాశం జిల్లా యరజర్ల గ్రామ సమీపంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు



జలకాలాటలలో..

మండు వేసవిలో కాసిని నీళ్లు కనిపించడంతో ఈ బాతులకు ఎంత సంబరమో.. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం రఘుదేవపురం, కోటి కేశవరం గ్రామాల మధ్య ఉన్న చెరువులో శుక్రవారం మధ్యాహ్నం బాతులు ఇలా సేదతీరుతుండగా సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

డిజిటల్ చెల్లింపులు.. 'ఖాతా'కు చిల్లులు!

డబ్బులు ఏట్లో పారేసినా లెక్క పెట్టి పారేయాలన్నది పెద్దల మాట. అంటే చేతితో డబ్బులు లెక్క పెట్టి పారేస్తూ ఉంటే దాని విలువ తెలుస్తుందని భావన. అలాగే మనం ఖర్చు పెట్టే ప్రతి రూపాయినీ ఏదైనా పుస్తకంలో రాసుకుంటే నెల చివరలో దేనికెంత ఖర్చు పెట్టాము.. ఎక్కడ అనవసరంగా ఖర్చు చేస్తున్నాము.. ఏ ఖర్చులు తగ్గించుకోవాలి.. ఎక్కడ మిగిలించాలనే విషయాలు తెలుస్తాయి. దీన్ని బట్టే ఫ్యామిలీ బడ్జెట్ రూపొందించుకోవచ్చు. కానీ ఇటీవల డిజిటల్ పేమెంట్స్, ఆన్‌లైన్ కొనుగోళ్ల పుణ్యమా అని ఎంత డబ్బు వస్తున్నా ఇట్టే అయిపోతోంది. లెక్క పెట్టకుండా ఖర్చు చేయడం వల్లే ఈ సమస్య వస్తోందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.



పెరిగిన అనవసర ఖర్చు

- ధర తెలుసుకోవడం దాదాపుగా మానేశారు
- రూ.5 మొదలు వేల రూపాయల లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే..
- తలకిందులవుతున్న ఫ్యామిలీ బడ్జెట్
- ఎంత సంపాదిస్తున్నా ఇట్టే అయిపోతుందనే భావన
- కోవిడ్ తర్వాత అన్నీ డిజిటల్ చెల్లింపులే..
- చిల్లర కొరత నేపథ్యంలోనూ మారిన తీరు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లాలో ప్రస్తుతం అన్ని రకాల వ్యాపారాలు ఎక్కువగా డిజిటల్ పేమెంట్స్ ద్వారానే సాగుతున్నాయి. ఒకప్పుడు ఫోన్ పే, గూగుల్ పే లాంటివి ఉపయోగించాలంటే భయపడే జనం ఇప్పుడు అవలీలగా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎంతగా అంటే రూ.5 నుంచి వేల రూపాయల వరకు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేస్తున్నారు. ఏదైనా కొనుగోలు చేసినా, ఎవరికైనా డబ్బు పంపాలన్నా, అప్పు ఇవ్వాలన్నా, తీసుకున్న రుణం తీర్చాలన్నా, ఇతర ఎలాంటి లావాదేవీలైనా సరే డిజిటల్ పేమెంట్ తప్పనిసరి అవుతోంది. అయితే పెట్టే ఖర్చు మొత్తం బ్యాంకు ఖాతా ద్వారానే జరుగుతోంది. దీన్ని బట్టి ఎవరికి ఎంత డబ్బులు వస్తున్నా యి, ఎంత ఖర్చు చేస్తున్నారు, ఎంత ఏఏ ఖాతాలకు మళ్లిస్తున్నారు, ఎవరెవరికి చెల్లిస్తున్నారు, వీరికి ఎవరి నుంచి డబ్బులు వస్తున్నాయనే విషయాలన్నీ బ్యాంకుల వారికి తెలిసిపోతోంది. అది చిన్న మొత్తమైనా, పెద్ద మొత్తమైనా సరే అన్ని వివరాలు ఆన్‌లైన్ పేమెంట్స్ ద్వారా మనకు తెలియకుండానే బ్యాంకులకు/ప్రభుత్వానికి చెప్పేస్తున్నాయన్న మాట.

కోవిడ్ తర్వాత ఊపందుకున్న పేమెంట్స్

డిజిటల్ పేమెంట్స్ రూపంలో పదేళ్ల క్రితం డెబిట్, క్రెడిట్‌కార్డులు, గిఫ్ట్‌కార్డులు వచ్చాయి. కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసి వాటిని వ్యాపార దుకాణాల్లో స్వ్రాచ్ చేసి డబ్బులు చెల్లించేవారు. కొంత కాలం తర్వాత ఇవే కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లోనే వస్తువులను కొనుగోలు చేసే అవకాశం వచ్చింది. కోవిడ్ అనంతరం వ్యాపార లావాదేవీల్లో మరింత సరళతరం వచ్చింది. అప్పటి వరకు స్తబ్దుగా ఉన్న ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా జనం డబ్బు చెల్లించడం, తీసుకోవడం ప్రారంభించారు. ఎంతగా అంటే రూ.5ల కొనుగోలుకు సైతం ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లిస్తున్నారు. మొదట్లో ఇలా డబ్బులు తీసుకోవడానికి ఇష్టపడని వ్యాపారులు సైతం క్రమంగా అంగీకరించక తప్పని పరిస్థితి. చిల్లర కొరత కారణంగా కూడా డిజిటల్ పేమెంట్స్ ఊపందుకున్నాయి.

➤ కర్నూలు నగరంలోని ఎ.క్యాంపునకు చెందిన వెంకట్ ఓ ప్రైవేటు కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఆయన జీతం నెలకు రూ.60వేలు. వచ్చిన జీతంతో ఇంట్లోని నలుగురు కుటుంబసభ్యులతో హాయిగా జీవిస్తున్నాడు. అయితే ఇటీవల కాలంలో నెలాఖరుకు అకౌంట్‌లో డబ్బులన్నీ అయిపోయినట్లు గమనిస్తున్నాడు. ఇంత డబ్బు ఏమైందని పరిశీలిస్తే అదంతా డిజిటల్ పేమెంట్స్ ద్వారా తానే ఖర్చు చేసినట్లు నిర్ధారించుకున్నాడు.



➤ ఆదోనికి చెందిన నాగేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. చిరుద్యోగమే అయినా 20 ఏళ్లకు పైగా సీనియారిటీ ఉండటంతో జీతం రూ.లక్షకు పైగా వస్తోంది. మొదట్లో తాను ఖర్చుచేసిన ప్రతిదీ ఓ పుస్తకంలో రాసుకునే అలవాటు ఉండేది. అన్ని ఖర్చులు పోను నెలకు 30శాతం దాకా మిగిలేది. కానీ ఇటీవల డిజిటల్ అకౌంట్‌లో ఖర్చు పెడుతూ లెక్క రాసుకోవడం మానేశాడు. నెల తిరిగేసరికి బ్యాంకు ఖాతా ఖాళీ అవుతోంది. ఎందుకిలా అని ప్రశ్నించుకుంటే ఆన్‌లైన్‌లో తెలియకుండానే తానే ఖర్చు చేస్తున్నట్లు తెలుసుకున్నాడు.

లెక్కలేకుండా ఖర్చు పెట్టేస్తున్నారు



ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యేవరకు మనం ఎంత ఖర్చు పెట్టామో తెలియని పరిస్థితి. దీనికితోడు ఏ వస్తువును ఎంతకు కొనుగోలు చేస్తున్నారో కూడా తెలియకుండా, బేరమాడకుండా కొనేస్తున్నారు. సాధారణంగా మనం కిరాణా దుకాణానికి వెళ్తే సరుకులకు దేనికి ఎంత బిల్లు వేశాడో చూస్తాము. కానీ డిజిటల్ పేమెంట్స్ కారణంగా ఇవేమీ పట్టించుకోవడం లేదు. షాపువారు ఎంత చెబితే అంత చెల్లించి వచ్చేస్తున్నారు. దీనివల్ల డబ్బు విలువ చాలా మందికి తెలియకుండా పోతోంది. ముఖ్యంగా ఈ తరం యువతకు అస్సలు తెలియడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బ్యాంకుల్లోనూ పలుచబడిన జనం



ఒకప్పుడు బ్యాంకులకు వెళ్తే అక్కడ పనిపూర్తి చేసుకుని తిరిగి రావడానికి గంట నుంచి రెండు గంటల సమయం పట్టేది. కోవిడ్ తర్వాత ఈ పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చింది. అప్పటి వరకు వివిధ రకాల పథకాల సొమ్ము అకౌంట్‌లో ప్రభుత్వం వేస్తే దానిని తీసుకోవడానికైనా బ్యాంకులకు, ఏటీఎంలకు వెళ్లేవారు. ఇప్పుడు డిజిటల్ పేమెంట్స్ కారణంగా డబ్బు ఎలా వస్తుందో, ఎలా పోతుందో కూడా తెలుసుకోలేకపోతున్నారు. దాదాపుగా అన్ని చోట్లా ఏటీఎంలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. రుణాలను సైతం బ్యాంకు యాప్‌ల ద్వారానే నిమిషాల్లో తీసుకునే సౌలభ్యం వచ్చింది. కేవలం కరెంట్ బ్యాంకు ఖాతాలు ఉన్న కొద్ది మంది వ్యాపారులు మాత్రమే పెద్ద మొత్తంలో డబ్బులు వేయడానికి, డ్రా చేయడానికి మాత్రమే బ్యాంకులకు వెళ్తుండటం గమనార్హం. ఖాతాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి, అనుమానాలు తీర్చుకోవడానికి మాత్రమే బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు.

ఎంత ఖర్చు చేస్తున్నామో తెలియట్లేదు



గతంలో డబ్బు చేతిలో ఉంటే చూసి ఖర్చు పెట్టేవారం. నగదు రూపంలో డబ్బులు ఉండటం వల్ల దేనికెంత ఖర్చు చేస్తున్నామో తెలిసేది. కానీ ఇప్పుడంతా డిజిటల్ పేమెంట్స్ కావడంతో ఎంత ఖర్చు చేస్తున్నామో అర్థంకాని పరిస్థితి. తెలియకుండానే నెలలో 20 నుంచి 30 శాతం ఎక్కువ ఖర్చు పెట్టేస్తున్నాం.
– సాయిరామ్, ప్రభుత్వ ఉద్యోగి, కర్నూలు

క్లుప్తంగా...

అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

సీఎస్‌తో బాధితుల సంఘం సమావేశం



సాక్షి, అమరావతి: అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హామీ ఇచ్చినట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. విజయానంద్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఎస్పీ ఈశ్వర్, ఫైనాన్స్ అడ్వైజర్ సి.కుటుంబరావులు శుక్రవారం అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నేతలతో రాష్ట్ర సచివాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం వివరాలను ముప్పాళ్ల నాగేశ్వరరావు మీడియాకు విడుదల చేశారు. లక్షలమంది అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎస్ వివరించినట్లు తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తుల స్వాధీనం- పరిరక్షణ, వాటి మార్కెట్ విలువ, కోర్టు విచారణ తదితరాలపై రవిశంకర్ అయ్యన్నార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న ఆర్థిక, మానసిక సమస్యలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈవీ నాయుడు, వి.తిరుపతిరావు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, సూర్యనారాయణ, జగన్ తదితరులు వివరించినట్లు ముప్పాళ్ల పేర్కొన్నారు.

సమ్మెలోనూ నిరంతర ఎల్పీజీ సరఫరా

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల హామీ

సాక్షి, అమరావతి: బల్క్ ఎల్పీజీ రవాణాదారుల సమ్మె నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్) తమ వినియోగదారులకు తగినంత సిలిండర్ల సరఫరాకు హామీ ఇచ్చాయి. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నాయి. సదరన్ రీజియన్ బల్క్ ఎల్పీజీ ట్రాన్స్‌పోర్ట్ ఓనర్స్ అసోసియేషన్‌కు చెందిన బల్క్ ఎల్పీజీ రవాణాదారుల సమ్మెకు దిగినా.. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల బాట్లింగ్ ప్లాంట్లలో బల్క్ ఎల్పీజీ నిల్వలు తగినంత ఉన్నాయని, పంపిణీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని చెప్పాయి.

రూ.557.22 కోట్లతో 1202.66 కి.మీ. రోడ్లు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ2.0 కార్యక్రమాల్లో భాగంగా రూ.557.22 కోట్ల నాబార్డు నిధులతో 402 రోడ్ల పనులు చేపట్టనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 1202.66 కిలోమీటర్ల మేర గ్రామీణ అనుసంధాన రోడ్లను పునర్ నిర్మించబోతున్నట్లు చెప్పారు. పారదర్శకంగా నాణ్యతతో సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

9 జిల్లాలకు మత్స్యశాఖ జేడీలు నియామకం

సాక్షి, అమరావతి: మత్స్యశాఖలో 9 మంది డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పిస్తూ మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారికి జిల్లా జాయింట్ డైరెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు.

కుమారస్వామి పిటిషన్ తిరస్కృతి

దొడ్డబళ్లాపురం: కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి సుప్రీం కోర్టులో చుక్కెదురయింది. బెంగళూరు సమీపంలోని బిడది కేతిగానహళ్లిలోని భూములు కుమారస్వామి ఆక్రమించారని కర్ణాటక ప్రభుత్వం సర్వే చేయించి సదరు భూములను గుర్తించి స్వాధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఆక్రమణల తొలగింపుపై స్టే ఇవ్వాలని కుమారస్వామి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆయన పెట్టుకున్న పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

దేశంలో 10 లక్షల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్

- 100 శాతం లక్ష్యాలను చేరుకున్న చండీగఢ్, డామన్, దయ్యూ
- ముందు వరుసలో రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు
- ఏపీలో లక్ష్యాన్ని చేరుకోని విద్యుత్ పంపిణీ సంస్థలు



సాక్షి, అమరావతి : దేశ వ్యాప్తంగా పది లక్షల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌లు ఏర్పాటు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద ఈ నెల 10వ తేదీ నాటికి 10 లక్షల రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు ఏర్పాటుచేశారు. 2024 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ పథకం కింద 2027 నాటికి రూ.75,021 కోట్లతో రూఫ్‌టాప్ సోలార్‌ను కోటి ఇళ్లకు అమర్చాలన్నది లక్ష్యం. 2024–25 కోసం రూ.13,175.33 కోట్లను కేంద్రం కేటాయించింది. మార్చి 2027 నాటికి 30 గిగావాట్ల సోలార్ రూఫ్ టాప్ సామర్థ్యాన్ని సాధించాలనేది లక్ష్యం కాగా, ప్రస్తుతం 3 గిగావాట్లను సాధించింది. ఈ పథకానికి ఇప్పటి వరకూ 4.73 మిలియన్ల దరఖాస్తులొచ్చాయి. 6,13,000 మంది లబ్ధిదారులు రూ.4,770 కోట్ల రాయితీలు పొందారు. ఇప్పటివరకు, 3,10,000 రుణ దరఖాస్తులందగా.. 1, 58,000 రుణాలు మంజూరయ్యాయి. చండీగఢ్, డామన్, దయ్యూ ఈ పథకంలో 100 శాతం వృద్ధిని సాధించాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు వంటి రాష్ట్రాలూ ముందు వరుసలో ఉన్నాయి. సోలార్ మార్కెట్‌పై మెర్‌కామ్ నివేదిక ప్రకారం.. రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టాలేషన్‌లు 2024లో 86 శాతం పెరిగి 3.2 గిగావాట్లకు చేరాయి. ఇందులో 74 శాతం నివాస వినియోగదారులున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా దాదాపు 1.2 మిలియన్ ఇన్‌స్టాలేషన్‌ల లక్ష్యాన్ని అధిగమించాలని కేంద్రం భావిస్తోంది.

కేంద్రం ఇచ్చే కమీషన్ కోసం ఏపీలో హడావుడి

ఈ పథకాన్ని అమలు చేస్తే ప్రతి సిస్టమ్‌పై 10 శాతం నుంచి 15 శాతం వరకూ కమీషన్‌ను కేంద్రం ఇస్తుంది. దానిని పొందడం కోసం రాష్ట్రంలో వినియోగదారులకు సరైన అవగాహన కల్పించకుండా, ఎలాంటి సర్వీసు గ్యారెంటీలు ఇవ్వకుండా రూఫ్ టాప్ పెట్టించాల్సిందేనంటూ కూటమి ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తోంది. వినియోగదారులకు ఇష్టంలేకున్నా సరే.. వారు అంగీకరించేలా చేసి వారి పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సిందిగా లక్ష్యాలను నిర్దేశిస్తోంది. దీంతో వారంతా క్షేత్ర స్థాయి సిబ్బందిపై ఒత్తిళ్లు తెస్తున్నారు. రిజిస్ట్రేషన్‌లు చేయిస్తూ వినియోదారుల నుంచి రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజు దాదాపు రూ.6 వేల వరకూ ఉండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు ఈ పథకానికి విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు వ్యతిరేకంగా ఉన్నాయి. తాము విద్యుత్ సరఫరా చేసే అవసరం లేకపోతే.. తమ సర్వీసులు తగ్గిపోతాయని, ఆర్థికంగా నష్టపోతామని భావిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఎంతగా ఒత్తిడి చేసినా పథకాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లడం లేదు. ఫలితంగా 11.56 లక్షల దరఖాస్తులొచ్చినా 14,086 ఇళ్లకే రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు.

సృజనాత్మక సంబరం

తిరుపతి సిటీ: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీడమమే ప్రధాన లక్ష్యంగా జాతీయ స్థాయి టాలెంట్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం రెండో రోజు జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సంస్కృత విద్యార్థుల టాలెంట్ ఫెస్ట్‌లో పలు విభాగాలకు సంబంధించి పోటీలను నిర్వహించారు.

అన్ని రంగాల్లో 'రాణి'ంచాలి!

తిరుపతి సిటీ: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పిలుపునిచ్చారు. శుక్రవారం పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల 73వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పద్మావతి కళాశాల విద్యార్థినులు అకడమిక్ విద్యతో పాటు కోకరికులమ్ యాక్టివిటీస్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీ.నారాయణమ్మ మాట్లాడారు. అకడమిక్ విద్యలో బీఏ విద్యార్థులు 94 శాతం, బీకాం 98 శాతం, బీఎస్సీ 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వంగా ఉందన్నారు. స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జ్ డాక్టర్ బీ.జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ జీ.భద్రమణి, విశ్రాంత ప్రిన్సిపల్స్ సీ.స్వరాజ్యలక్ష్మి, కే.మహదేవమ్మ పాల్గొన్నారు.

ఎస్వీయూ ఈసీ సమావేశం

తిరుపతి సిటీ : ఎస్వీయూ వీసీ అప్పారావు అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ క్రమంలో వర్సిటీ ఆర్థిక కమిటీ తీసుకున్న పలు నిర్ణయాలకు ఈసీ ఆమోద ముద్ర వేసింది. ప్రధానంగా జీతభత్యాలు, పెన్షన్లకు సంబంధించి రూ. 226 కోట్లు, వర్సిటీలో చేపట్టిన రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు గాను రెండవ స్టేజ్ నిధుల కేటాయింపునకు అనుమతులు మంజూరు చేశారు. అలాగే వర్సిటీలో ఫార్మసీ కళాశాల నిర్మాణం, కొన్ని అత్యవసర ఇంజినీరింగ్ పనులు, పరీక్ష పేపర్ల మూల్యాంకనం రెమ్యూనరేషన్ పెంపునకు ఈసీ ఆమోదం తెలిపింది. కళాశాలలకు సాధారణంగా మంజూరు చేసే అఫిలియేషన్‌కు అనుమతించింది.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 64,279 మంది స్వామివారిని దర్శించుకోగా 24,482 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరించారు. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు.



రాయంచపై రామచంద్రమూర్తి




తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం రాత్రి హంస వాహనంపై శ్రీరామచంద్రమూర్తి విహరించారు. గజరాజులు ముందు కదులుతుండగా, భక్తజన బృందాల భజనలు, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కనుల పండువగా సాగింది. ఈ క్రమంలోనే ఉదయం స్వామివారు చిన్నశేష వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం దేవదేవేరులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

శ్రీరామ పట్టాభిషేక అలంకారం



మంగళగిరి టౌన్ : మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి భక్తులకు శ్రీరామ పట్టాభిషేకం అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్సవ కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన కారుమంచి మురళీసాయి, సోదరులు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరిపట్టణానికి చెందిన యేనుగ కిషోర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

మహానంది కిటకిట



మహానంది: శ్రీశైలం భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి దర్శనం అనంతరం కన్నడిగులు మహానందికి తరలివస్తున్నారు. స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామి, అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

• చరిత్ర






50 వేల ఏళ్ల నాటి పిల్ల మమొత్

పిల్లలూ... ఇక్కడ మీరు టేబుల్ మీద చూస్తున్నది ఏమిటో తెలుసా? ఏనుగు. కాని ఏనుగు కాదు. పూర్వకాలపు ఏనుగు. ఐస్‌ఏజ్ కాలం నాటిది. ఇప్పటి ఏనుగులా కాక ఒంటి నిండా రోమాలతో ఉండేది. దానిని 'మమొత్' అంటారు. డైనోసార్లలాగానే ఇది కూడా భారీ ఆకారంతో ఉండేది. దీనికి పెద్ద పెద్ద దంతాలు ఉండేవి. కాని డైనోసార్లలాగానే 4000 ఏళ్ల క్రితం మమొత్‌లు కూడా అంతరించి పోయాయి. దానికి కారణం ఏమిటో అంతుపట్టలేదు కాని ఏదైనా మహమ్మారి కావచ్చని శాస్త్రవేత్తల ఊహ. అయితే వీటి కళేబరాలు రష్యాలోని సైబీరియా మంచు ఎడారిలో దొరుకుతూనే ఉన్నాయి. ఇక్కడ మీరు చూస్తున్నది రష్యాలోని 'ఎకుషియా' అనే చోట మంచు పొరల కింద దొరికిన పిల్ల మమొత్ కళేబరం. ఇది పిల్ల ఏనుగే అయినా దీని బరువు 180 కిలోలు ఉంది. ఇది 50 వేల ఏళ్ల క్రితం నాటిదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఆ కళేబరానికి 'నెక్రోప్సీ' చేస్తున్న ఫొటోలు ఇవి. మనిషి మృతదేహాన్ని కోసి పరీక్ష చేస్తే 'అటాప్సీ'. జంతువులను కోసి పరీక్ష చేస్తే 'నెక్రోప్సీ'. ఈ పరీక్షల వల్ల మమొత్‌లకు సంబంధించిన మరిన్ని జీవన రహస్యాలు తెలుస్తాయని శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తుంటారు.

• సినిమా

ముఫాసా
ది లయన్ కింగ్ ఈజ్ బ్యాక్



కిడ్స్... లయన్ కింగ్ సిరీస్‌లో మరో పార్ట్ వచ్చేసింది. అదే ముఫాసా. ఇది పూర్తిగా జంతువులు నిండిన ఫాంటసీ యానిమేటెడ్ మూవీ. మీకు తెలుసా.... నిజమైన జంతువులని ఉపయోగించి మన తెలుగులో దాదాపు 40 ఏళ్ల క్రితం ఓ మూవీ వచ్చింది. దాని పేరే 'మాకూ స్వాతంత్రం కావాలి'. ఈ సినిమాలో మొత్తం నటీనటులు అంతా కోతులే. అలా మొత్తం జంతవులున్న యానిమేషన్ సినిమాలు హాలీవుడ్‌లో చాలా ఉన్నాయి. 2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' సినిమా కూడా అలాంటిదే. ఆ సిరీస్‌లో సెకండ్ పార్ట్ 'ముఫాసా'. ఈ సినిమాకి తెలుగులో మహేష్ బాబు, బ్రహ్మానందం, ఆలీ లాంటి వాళ్ళు డబ్బింగ్ చెప్పారు. ముఫాసా స్టోరీ ఏంటంటే ముఫాసా అనే పిల్ల సింహం ఓ తుఫానులో చిక్కుకుని తన తల్లిదండ్రుల నుండి విడిపోతుంది. అలా నీళ్ళలో కొట్టుకుపోతూ టాకా అనే మరో సింహం పిల్లను కలుస్తుంది. టాకా తల్లిదండ్రులు ఒబాసీ, ఇషా. వీళ్ళిద్దరూ వారి ప్రాంతంలో రాజు, రాణి. టాకాని యువరాజును చేయాలనుకుంటారు. ఇంతలో తెల్ల సింహాల గుంపు వీరి రాజ్యం మీద దాడి చేస్తుంది. వాటి నుండి ముఫాసా, టాకా తప్పించుకుంటారు. ముఫాసా తన తల్లిదండ్రులను వెతుక్కుంటూ మిలేలే అనే ప్లేస్‌కి వెళ్ళాలనుకుంటాడు. తరువాత సినిమా అంతా ముఫాసా తన తల్లిదండ్రులను చేరుకుంటాడా లేదా అన్నదే. సినిమా చాలా బావుంటుంది. మీ పేరెంట్స్ కూడా ఈ మూవీని ఎంజాయ్ చేస్తారు. ఇంకెందుకు ఆలస్యం గ్రాబ్ ది రిమోట్ అండ్ ట్యూన్ టు జియో హాట్‌స్టార్ ఫర్ మీటింగ్ ముఫాసా. వర్తఫుల్ మూవీ ఫర్ ఫ్యామిలీ.

- ఇంటూరు హరికృష్ణ

యుద్ధంలో చిన్నారి జర్నలిస్టు

• వండర్ కిడ్స్


చిన్నారి జర్నలిస్టు సుమయ్యా



జర్నలిస్టు అంటే ఎవరు? ప్రపంచానికి వార్తలు అందించేవాడు. ప్రజలకు కీడు చేసే విషయాలను తెలిపి చైతన్యపరిచేవాడు. ప్రభుత్వాల దుర్మార్గాలను ఎండగట్టేవాడు. రాజకీయ నేతలు తమ స్వార్థం కోసం చేసే యుద్ధాలలో ఎంత విధ్వంసం జరుగుతుందో చూపేవాడు. జర్నలిస్టులు కొందరు ఆఫీసులో కూచుని పని చేస్తే మరికొందరు ఫీల్డులో ఉంటారు. ఆ ఫీల్డు యుద్ధ క్షేత్రమైతే ప్రాణాలకే ప్రమాదం. అయినా సరే జర్నలిస్టులు ప్రాణాలకు తెగించి పని చేస్తారు.

ఇప్పుడు ఇజ్రాయిల్ గాజాపై యుద్ధదాడులు చేస్తోంది. ఇది టీవీల్లో మీరూ చూసి ఉంటారు. ఇజ్రాయిల్-గాజా మధ్య జరుగుతున్న ఈ యుద్ధం కారణంగా ఎన్నో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సమయంలో గాజాకు చెందిన 12 ఏళ్ల సుమయ్యా జర్నలిస్టు అవతారం ఎత్తింది. స్థానికంగా జరుగుతున్న అంశాల గురించి రిపోర్ట్ చేస్తూ అందరి దృష్టినీ ఆకర్షించింది.

'షిరీన్ అబూ' అనే మహిళా జర్నలిస్టు కొంతకాలంగా గాజాపై జరుగుతున్న దాడుల గురించి అల్ జజీరా అనే ఛానెల్‌లో రిపోర్టింగ్ చేస్తూ ఉండేది. అయితే ఆమె మరణించింది. క్షేత్రస్థాయిలో ఆమె చెప్పే వార్తలు వింటూ ఉన్న సుమయ్యాకు ఆమె మరణం తీరని బాధను మిగిల్చింది. ఆమె ఆపిన పనని తాను పూర్తి చేయాలని భావించింది. వెంటనే ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. ముందుగా వారు భయపడ్డారు. అప్పటికే వందమంది దాకా జర్నలిస్టులు యుద్ధాన్ని రిపోర్ట్ చేస్తూ ప్రాణాలు వదిలారు. అంత అనుభవం ఉన్నవారికే అలా జరిగినప్పుడు తమ కూతురు యుద్ధరంగంలో ఏమవుతుందోనని వారు ఆందోళన చెందారు. అయితే సుమయ్యా వారికి ధైర్యం చెప్పింది. స్థానికంగా జరుగుతున్న విషయాలను ప్రపంచానికి చూపించడం తన బాధ్యత అని వారికి వివరించింది. వారి అనుమతితో జర్నలిస్టుగా మారింది. అల్ జజీరా ఛానెల్లో అతి చిన్న జర్నలిస్టుగా మారింది. గాజాపై జరుగుతున్న దాడులు, అక్కడి ప్రజల స్థితిగతుల్ని ప్రపంచానికి వివరించింది. ఏమాత్రం బెరుకు లేకుండా తను చెప్పే విషయాలు అందర్నీ ఆలోచింపజేశాయి.

ప్రపంచంలో యుద్ధాలన్నీ ఆగిపోవాలని, అంతా శాంతి నెలకొనాలని అంటోంది. అదే తన లక్ష్యమని, అందుకే ఈ రంగంలోకి వచ్చానని వివరిస్తోంది. తన ధైర్యానికి, ఆలోచనలకీ అందరూ శెభాష్ అంటున్నారు.

• మహనీయులు

తెలుగువారికి ఉన్నత సేవలందించిన 'ఉన్నవ'







పిల్లలూ! ఇవాళ మనం ఇంత సుఖంగా, సంతోషంగా ఉన్నామంటే కారణం మన పెద్దలు చేసిన కృషి, పోరాటాలే కారణం. వారినే మనం మహనీయులు అని పిలుస్తాం. అలాంటి ఓ మహనీయుని గురించి ఇవాళ తెలుసుకుందాం. ఆయన పేరు ఉన్నవ లక్ష్మీనారాయణ. 1877 డిసెంబర్ 4న గుంటూరు జిల్లా వేములూరుపాడులో పుట్టారు. అమ్మానాన్నలు శ్రీరాములు, శేషమ్మ. శ్రీరాములుకు కులాల మీద నమ్మకం లేదు. సాంఘిక దురాచారాలను వ్యతిరేకించేవారు. అలాంటి తండ్రి పెంపకంలో పెరిగిన లక్ష్మీనారాయణ ఆ భావాలను పుణికిపుచ్చుకున్నారు. గుంటూరులో మెట్రిక్యులేషన్ చదివాక రాజమండ్రిలో టీచర్ ట్రైనింగ్ కోర్సులో చేరారు. గుంటూరులో టీచరు ఉద్యోగంలో చేరి, ఆ తర్వాత అక్కడే లాయరుగా మారారు. 1917లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు.

దేశంలో స్వాతంత్రోద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ఆయన కూడా అందులో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చేరినందుకు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష అనుభవించారు. అయినా బ్రిటిష్ అధికారులకు భయపడకుండా స్వాతంత్ర్యం కోసం పోరాడేవారు. ఆయన భార్య లక్ష్మీబాయి సైతం ఆయనకు చేదోడుగా నిలిచి, ఉద్యమాల్లో పాల్గొనేవారు.

వారిద్దరూ కలిసి ఎన్నో సంస్థలు స్థాపించి, సమాజంలో పేదల మంచికి కృషి చేశారు. గుంటూరులో వితంతు శరణాలయాన్ని స్థాపించి కందుకూరి వీరేశలింగం అధ్యక్షతన తొలి వితంతు వివాహం జరిపించారు. గుంటూరు శారదానికేతన్ స్థాపించి బాలికల విద్యకు కృషి చేశారు. 'మాలపల్లి' అనే విప్లవాత్మక నవల రాసి తెలుగువారికి అందించారు. సమాజంలో కులాల అడ్డుగోడలు ఉండకూడదని, ఎవరూ ఎవర్నీ తక్కువగా చూడకూడదనే సందేశాన్ని ఈ నవల ద్వారా అందించారు. దీంతోపాటు మరికొన్ని రచనలు చేసి సాహిత్య లోకంలో కీర్తిపొందారు. 1958 సెప్టెంబర్ 25న ఉన్నవ లక్ష్మీనారాయణ మరణించారు. నేటికీ తెలుగు ప్రజలు ఆయన చేసిన సేవల్ని తల్చుకుంటారు.

• బాలగేయం

ఆరు రుచులు

ఆరు రుచులు మనకి
ఆరు రుతువుల మనకి
ఆనందం ఈ జగతికి
సంబరం మన అందరికీ

తీపి తింటే ఉల్లాసం
మనసులో తరగని ఉత్సాహం
మిరపకాయల ఘాటు కారం
అతిగా వద్దని ఆపేద్దాం



ఉప్పు లేని పదార్థం
కాదది నోటికి హితం
పులుపు రుచికి పట్టం
లేత మావిచిగురు చుట్టం

వగరు రుచిని వద్దనలేం
కాస్త తినొచ్చులే లేదు భయం
చేదు తగిలితే కలుగు ఆరోగ్యం
వేపను చూడలేదా ఇస్తుంది అభయం
ఆరు రుచులకూ ఉగాది మణిహారం

• ఎందుకు? ఏమిటి? ఎలా?

మన బెస్ట్ ఫ్రెండ్స్ బెలూన్స్



రంగురంగుల బెలూన్లను పిల్లలు ఎంతగానో ఇష్టపడతారు. గాలి ఊది, దారం చుట్టి, గాల్లోకి ఎగిరేస్తూ కేరింతలు కొడతారు. ఆడుకుంటారు. పుట్టినరోజు వేడుకలు జరుగుతున్నాయంటే బెలూన్లు తప్పనిసరిగా ఉండాల్సిందే. మరి ఈ బెలూన్ల చరిత్రేమిటో తెలుసా మీకు?

వేల ఏళ్ల క్రితం ఆటవికులు జంతువుల చర్మాలను శుభ్రం చేసి వాటిలో గాలిని ఊదేవారు. చరిత్రలో ఇవే తొలి బెలూన్లని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఆ తర్వాత వస్త్రాన్ని గట్టిగా చుట్టి అందులో గాలి ఊదేవారు. అయితే ఇవేవీ ఇవాళ్టి బెలూన్లలా ఉండేవి కాదు.తర్వాత ఎన్నో ఏళ్లకు అంటే 1824లో మైకేల్ ఫారడే అనే ఆయన తొలిసారి రబ్బర్‌తో బెలూన్లను తయారు చేశాడు. వాటిలో హైడ్రోజన్ గ్యాస్ నింపి, ప్రయోగాల కోసం ఉపయోగించాడు. 1825లో థామస్ హాన్‌కుక్ కూడా అలాంటి బెలూన్లే తయారు చేశాడు. అమెరికాలో తొలిసారి బెలూన్లను అమ్మడం ప్రారంభించారు. జనం వాటిని కొని, నోటితో గాలి ఊది వినోదించేవారు. కాలక్రమేణా రకరకాల రంగులు, ఆకృతుల్లో బెలూన్ల తయారీ మొదలైంది.

పిల్లలు ఆడుకునే బెలూన్లే కాకుండా అనేక రకాలున్నాయి. పార్టీ బెలూన్లు, నీటి బెలూన్లు, అలంకారం కోసం వాడే బెలూన్లు, ప్రయోగాల కోసం వాడే బెలూన్లు అంటూ అనేక రకాలుగా బెలూన్లను వినియోగిస్తున్నారు. కొన్ని రకాల చికిత్సలకు కూడా బెలూన్లను వాడతారు.

అయితే బెలూన్ల తయారీలో వాడే కొన్ని పదార్థాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు వాటిని నోటిలో పెట్టుకొని గాలి ఊదడం కూడా ప్రమాదమని అంటున్నారు. గాలి నిండిన బెలూన్లు పగిలి, శబ్దం చేస్తే కొందరు పిల్లలు ఉలిక్కిపడి, భయంతో జ్వరం తెచ్చుకుంటారు. భారీ సైజు గాలి బెలూన్లు ఎగురుతూ వెళ్లి అడవుల్లో పడతాయి. జంతువులు తాకితే ఢామ్మున సౌండ్ చేస్తూ పగులుతాయి. దాని వల్ల జంతువులు బెదురుతాయి. కాబట్టి బెలూన్లను వీలైనంత తక్కువగా వాడాలని సూచిస్తున్నారు.

• కథ

కాకి మంచిదే కాని...



అడవిలో పెద్ద వేపచెట్టు ఉండేది. దాని మీద పక్షులు గూళ్లు కట్టుకొని వుండేవి. వాటిలో కాకి వుండేది. దానికి చాలా పొగరు. దాంతో దాన్ని ఏవీ పలకరించేవి కాదు. మాటలు కలిపేవీ కాదు. దూరదూరంగా వుండేవి.

వానాకాలం దగ్గర పడింది. పక్షులన్నీ తమ ఇళ్లను ఎంత గాలి వీచినా, ఎంత వాన పడినా చెక్కు చెదరకుండా గట్టిగా కట్టుకోసాగాయి. కానీ కాకి సోమరిపోతు. రేపు, ఎల్లుండి అనుకుంటూ రోజులు దాటేయసాగింది. వానాకాలం రానే వచ్చింది. పెద్ద గాలివాన వచ్చింది. వేపచెట్టు ఆ గాలికి తట్టుకోలేక అటూ ఇటూ ఊగిపోసాగింది. పక్షులన్నీ భయంతో గబగబా వాటి గూళ్లలోనికి పోయి తలుపులు వేసుకొని గొళ్లెం పెట్టేసుకున్నాయి.

కాకిది పుల్లల ఇల్లు కదా.. చెల్లాచెదరై పోయి కింద పడిపోయింది. దానికి రెండు చిన్న పిల్లలు వున్నాయి. వాటి మీద వాన పడకుండా రెక్కలు కప్పింది. కానీ వాన పెద్దదవుతూ వచ్చింది. పిల్లలు నెమ్మదిగా తడిసిపోతూ వున్నాయి. ఇలాగే వుంటే పిల్లలకి ఏమన్నా అవుతుందేమోనని భయపడి చిలుక ఇంటికి పోయి 'చిలుకా.. చిలుకా.. కొంచెం తలుపు తీయవా. నేనూ నా పిల్లలు గాలివానకు చచ్చిపోయేట్టు వున్నాం' అని వేడుకొంది. కానీ ఆ చిలుక లోపల నుంచే 'మాకే ఈ ఇల్లు సరిపోవడం లేదు. పోయి వేరే వాళ్లని అడుగు' అంది.

కాకి పక్కనే వున్న పావురం ఇంటికి పోయి 'పావురమా.. పావురమా.. ఈ ఒక్కరోజు నీ ఇంటిలో కొంచెం చోటియ్యవా.. నా పిల్లలు ఏమైపోతారోనని భయంగా ఉంది' అంది ఏడుపుగొంతుతో. దానికి పావురం 'పోపో.. అనవసరంగా అందరితో గొడవపడే నీలాంటి వాళ్లతో ఒక్క పూట కాదు కదా.. ఒక్క నిమిషం కలిసి వున్నా తప్పే' అంది తలుపు తీయకుండా.

అంతలో ఒక గూటి తలుపు తెరచుకుంది. అందులోంచి ఒక చిన్న పిట్ట బైటకు వచ్చింది. దానిని చూసి కాకి తల దించుకుంది. ఎందుకంటే గతంలో చాలాసార్లు ఆ పిట్టను కాకి ఏడిపించింది. వానకు వణికిపోతున్న కాకి పిల్లలను చూసిన పిట్ట అయ్యో పాపం అనుకొని 'తొందరగా రా.. ఈ రోజు నా గూటిలో వెచ్చగా పడుకొందువుగాని' అంది.

కాకి వెంటనే తన పిల్లలను తీసుకొని ఆ ఇంటిలోకి వెళ్లింది. ఇల్లు చిన్నదైనా చాలా గట్టిగా, బలంగా ఉంది. పిట్ట తాను ఎక్కడెక్కడి నుంచో సేకరించి తెచ్చుకున్న గింజలు తెచ్చి కాకికి, పిల్లలకు కడుపు నిండా పెట్టింది. అది చూసి కాకి కళ్లనీళ్లు పెట్టుకొని 'సోదరీ.. నిన్ను అనవసరంగా ఇంతకాలం బాధపెట్టాను. కానీ దాన్ని నువ్వు కొంచెం కూడా మనసులో పెట్టుకోకుండా సొంత బంధువులా ఆదుకున్నావు. నీ మేలు ఎప్పటికీ మరచిపోలేను' అంది.

పిట్ట కిచకిచా నవ్వి 'అంత మాటలు వద్దు.. తప్పు చేయని వాళ్లు ఎవరుంటారు చెప్పు ఈ లోకంలో. కానీ ఆ తప్పు తెలుసుకొని సరిదిద్దుకున్న వాళ్లే గొప్పవాళ్లు అవుతారు. పదిమందితో కలిసి బతకడంలో వున్న ఆనందం ఒంటరిగా వుంటే ఎప్పటికీ రాదు. అది తెలుసుకో చాలు' అంది.

ఆ తరువాత నుంచీ కాకి చాలా మారిపోయింది. కనపడిన వాటినల్లా పలకరించసాగింది. మాటలు కలపసాగింది. పనుల్లో సాయం చేయసాగింది.

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో విస్తరణపై పోపయిస్ దృష్టి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జూబిలెంట్ ఫుడ్స్‌లో భాగమైన ఫ్రైడ్ చికెన్ బ్రాండ్ పోపయిస్ హైదరాబాద్ మార్కెట్లో మరింతగా కార్యకలాపాలు విస్తరించనుంది. ప్రాంతం, డిమాండ్‌ను బట్టి వచ్చే రెండేళ్లలో స్టోర్స్ సంఖ్యను పదికి పెంచుకునే ప్రణాళికలు ఉన్నట్లు పోపయిస్ ఇండియా బిజినెస్ హెడ్ గౌరవ్ పాండా తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో మూడో స్టోర్ ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. వైజాగ్, విజయవాడలో కూడా స్టోర్స్ యోచన ఉన్నట్లు పేర్కొన్నారు. జూబిలెంట్ ఫుడ్స్ సంస్థ డొమినోస్ పిజ్జా, డంకిన్ డోనట్స్ తదితర బ్రాండ్స్‌ని దేశీయంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

స్మాల్‌కేస్ 50 మిలియన్ డాలర్ల సమీకరణ



ముంబై: మోడల్ పోర్ట్‌ఫోలియోల ప్లాట్‌ఫామ్ స్మాల్‌కేస్ కొత్తగా 50 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. ఎలివ్8 వెంచర్ పార్ట్‌నర్స్ సారథ్యంలో స్టేట్ స్ట్రీట్ గ్లోబల్ అడ్వైజర్స్, నివేషాయ్ ఏఐఎఫ్, ఫేరింగ్‌క్యాపిటల్, అర్కమ్ వెంచర్స్ తదితర సంస్థలు ఈ మేరకు ఇన్వెస్ట్ చేశాయి. కొత్తగా సమీకరించిన నిధులను వివిధ అసెట్స్‌వ్యాప్తంగా పెట్టుబడి సాధనాలను ప్రవేశపెట్టేందుకు, రిటైల్ ఇన్వెస్టర్లతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. 2016లో ప్రారంభమైన ఈ ప్లాట్‌ఫాం ద్వారా రూ. 1.2 లక్షల కోట్ల మేర లావాదేవీలు జరిగాయి.

కర్నూలు రెన్యువబుల్స్‌లో లారస్‌కు వాటాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎకోరెన్ ఎనర్జీ ఇండియా అనుబంధ సంస్థ కర్నూలు రెన్యువబుల్స్‌లో 26 శాతం వరకు వాటాలను కొనుగోలు చేసేందుకు తమ బోర్డు ఆమోదం తెలిపినట్లు లారస్ ల్యాబ్స్ వెల్లడించింది. ఇందు కోసం రూ. 35 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. దీనితో 25.53 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్, సౌర విద్యుత్ తమకు అందుబాటులోకి వస్తుందని కంపెనీ వివరించింది. ఫలితంగా విద్యుత్ వ్యయాలు తగ్గుతాయని పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-3-2025

విశాఖ	445-00
చిత్తూరు	510-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	460-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,001.90	2.91
KOTAKBANK	2,174.00	2.13
APOLLOHOSP	6,614.00	1.88
ONGC	246.5	1.79
ICICIBANK	1,348.00	0.85

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	649.05	-3.64
WIPRO	262.5	-3.56
SHRIRAMFIN	656.25	-3.28
CIPLA	1,441.00	-2.83
M&M	2,661.15	-2.63

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,499
ఎన్ఎస్ఈ	1,04,168
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,72,276
ఎఫ్ఐఐ	- 4,353
డీఐఐ	+ 7,646

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.33 (రాత్రి 11.30కు)	$ 69.92 (క్రితం ముగింపు)
బ్రెంట్	72.70 (రాత్రి 11.30కు)	$ 73.34 (క్రితం ముగింపు)

టీవీని దాటేసిన డిజిటల్ మీడియా

- 'ఎంఅండ్ఈ' మొత్తం ఆదాయాల్లో 32 శాతం వాటా
- 2024పై ఫిక్కీ–ఈవై నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా డిజిటల్ మీడియా జోరుగా వృద్ధి చెందుతోంది. 2024లో సాంప్రదాయ టీవీ మాధ్యమాన్ని కూడా దాటేసి మీడియా, వినోద రంగంలో (ఎంఅండ్ఈ) అతి పెద్ద సెగ్మెంట్‌గా ఆవిర్భవించింది. మొత్తం ఆదాయాల్లో 32 శాతం వాటాను దక్కించుకుంది. పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ–ఈవై నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2026లో ప్రకటనలపై ఆదాయాలపరంగా రూ. 1 లక్ష కోట్ల మార్కును అధిగమించే తొలి ఎంఅండ్ఈ విభాగంగా డిజిటల్ మీడియా నిలవనుంది. దేశీ ఎంఅండ్ఈ రంగం వచ్చే మూడేళ్లలో 7 శాతం వృద్ధితో రూ. 3 లక్షల కోట్ల స్థాయిని దాటుతుందని నివేదిక వివరించింది. 2024లో దేశీ ఎంఅండ్ఈ రంగం రూ. 2.5 లక్షల కోట్ల స్థాయికి చేరుకోగా, స్థూల దేశీయోత్పత్తిలో 0.73 శాతం వాటాను దక్కించుకుంది. 'ఈ పరిశ్రమ 2025లో 7.2 శాతం వృద్ధి చెంది రూ. 2.7 లక్షల కోట్లకు, ఆ తర్వాత 7 శాతం వార్షిక వృద్ధి రేటుతో 2027 నాటికి రూ. 3.1 లక్షల కోట్ల స్థాయికి చేరుకుంటుంది' అని నివేదిక వివరించింది.

వినూత్న వ్యాపార విధానాల దన్ను..

ఈ భారీ వృద్ధికి వినూత్న వ్యాపార విధానాలు, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, పరిశ్రమలో స్థిరీకరణ తదితర అంశాలు తోడ్పడనున్నాయి. దేశీ ఎంఅండ్ఈ రంగం 2023లో 8.3 శాతం పెరగ్గా గతేడాది 3.3 శాతం (సుమారు రూ. 8,100 కోట్లు) వృద్ధి చెందింది. సబ్‌స్క్రిప్షన్ ఆదాయాలు తగ్గడం, భారత్‌కి యానిమేషన్.. వీఎఫ్ఎక్స్ ఔట్‌సోర్సింగ్ వర్క్ తగ్గిపోవడం వంటి అంశాలు ఇందుకు కారణం. మరోవైపు, ఈ–కామర్స్ వెబ్‌సైట్లు సహా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై ప్రకటనలు, ప్రీమియం.. డిజిటల్ అవుటాఫ్ హోమ్ (ఓఓహెచ్) మీడియాకు డిమాండ్ పెరగడంతో పరిశ్రమ అడ్వర్టైజింగ్ ఆదాయాలు 8.1 శాతం పెరిగాయి. డిజిటల్ మీడియా (17 శాతం) లైవ్ ఈవెంట్లు (15 శాతం), ఓఓహెచ్ మీడియా (10 శాతం) ఈ వృద్ధికి దోహదపడ్డాయి. డిజిటల్ వినియోగం వేగవంతమవుతుండటం, వినియోగదారుల ప్రాధాన్యతలు మారుతుండటం తదితర అంశాల నేపథ్యంలో భారతీయ మీడియా, వినోద రంగం కీలక పరివర్తన దశలో ఉందని ఫిక్కీ చైర్మన్ (మీడియా, ఎంటర్టైన్‌మెంట్ కమిటీ) కెవిన్ వాజ్ చెప్పారు. దీనితో కంటెంట్ క్రియేటర్లు, ప్రకటనకర్తలు, టెక్నాలజీ ఆవిష్కర్తలకు అపార అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు.

రియల్టీ లావాదేవీల్లో సీబీఆర్ఈ టాప్



న్యూఢిల్లీ: గతేడాది అత్యధిక స్థాయిలో కమర్షియల్ రియల్ ఎస్టేట్ లావాదేవీల నిర్వహణతో సీబీఆర్ఈ అగ్రస్థానంలో నిల్చింది. ఎంఎస్‌సీఐ రియల్ అసెట్స్ ప్రకారం 2024లో 63.4 శాతం మార్కెట్ వాటా దక్కించుకుంది. కీలకమైన పారిశ్రామిక (68.7 శాతం), రిటైల్ (64.1 శాతం) తదితర విభాగాల్లోనూ అగ్రగామిగా నిల్చింది. పెట్టుబడులకు సంబంధించి ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్ టాప్ హబ్‌లుగా (చెరి 23 శాతం) నిలవగా, బెంగళూరు (18 శాతం), చెన్నై (10 శాతం), హైదరాబాద్ (8 శాతం) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. మార్కెట్ ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉండటంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు గతంలో ఎన్నడూ లేని విధంగా భారతీయ రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు సీబీఆర్ఈ ఇండియా ఎండీ (క్యాపిటల్ మార్కెట్స్, ల్యాండ్) గౌరవ్ కుమార్ తెలిపారు. మరోవైపు అంతర్జాతీయంగానూ కమర్షియల్ రియల్ ఎస్టేట్ పెట్టుబడులు విక్రయాల్లో 22 శాతం మార్కెట్ వాటాతో సీబీఆర్ఈ నంబర్ 1 ర్యాంకులో కొనసాగుతోంది. ఆదాయాన్ని అందించే ప్రాపర్టీలను కొనుగోలు చేసి విక్రయించే ప్రక్రియను రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ సేల్స్‌గా వ్యవహరిస్తారు. ఆఫీస్ బిల్డింగ్‌లు, రిటైల్ స్పేస్‌లు, హోటళ్లు, స్థలం లాంటి రియల్ ఎస్టేట్ అసెట్లు అద్దె రూపంలో ఆదాయాన్ని అందిస్తాయి. అలాగే వాటి విలువ కూడా పెరుగుతుంది. సీబీఆర్ఈ లాంటి సంస్థలు ఈ మార్కెట్లో ఇన్వెస్టర్లకు సలహాలివ్వడం, లావాదేవీలను నిర్వహించడం, కొనుగోలుదారులు–విక్రేతలను అనుసంధానించడం ద్వారా పెట్టుబడులు, విక్రయాల్లాంటి విషయాల్లో తోడ్పాటు అందిస్తాయి.

ఆర్‌డీ ఇంజినీరింగ్ ఐపీవోకు

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



హైదరాబాద్: ఇంజినీరింగ్ సంబంధ సేవలందించే హైదరాబాద్ కంపెనీ ఆర్‌డీ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 80 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లలో ఒకరైన చంద్ర శేఖర్ మోటూరు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ సమీకృత డిజైన్, ఇంజినీరింగ్, మ్యాన్యుఫాక్చరింగ్ సర్వీసులు సమకూర్చుతోంది. ప్రధానంగా ప్రీఇంజినీర్డ్ బిల్డింగ్స్(పీఈబీ), మెటీరియల్ హ్యాండ్లింగ్ సిస్టమ్స్(ఎంహెచ్ఎస్), ఇంజినీరింగ్ సర్వీసెస్ పేరుతో మూడు విభాగాలలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 280 కోట్లు తెలంగాణలో కొత్తగా రెండు తయారీ యూనిట్ల ఏర్పాటుకు, మరో రూ. 45 కోట్లు ఆంధ్రప్రదేశ్‌లోని పరవాడలో సమీకృత తయారీ యూనిట్ ఏర్పాటుకు వెచ్చించనుంది. రుణ చెల్లింపులకు రూ. 65 కోట్లు వినియోగించనుంది. 2008లో ఏర్పాటైన కంపెనీ క్లయింట్లలో ఆర్సెలర్‌మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా(ఏఎంఎన్ఎస్), జేకే సిమెంట్, నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ, ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్ తదితరాలున్నాయి. గతేడాది(2023–24) రూ. 620 కోట్ల ఆదాయం, రూ. 29 కోట్ల నికర లాభం ఆర్జించింది.

కాంట్రాక్ట్ మహిళా టెకీలకు సవాళ్లు



- కెరియర్ పురోగతిలో అవరోధాలు
- టీమ్‌లీజ్ డిజిటల్ నివేదిక

ముంబై: కాంట్రాక్టు ప్రాతిపదికన టెక్నాలజీ ఉద్యోగాలు చేసే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నప్పటికీ వారు ఎక్కువగా ఎంట్రీ స్థాయికే పరిమితమవుతున్నారే తప్ప కెరియర్‌లో పెద్దగా ముందుకెళ్లలేకపోతున్నారు. అలాగే పురుషులతో పోలిస్తే వేతనాల్లోనూ వ్యత్యాసాలు ఉంటున్నాయి. టీమ్‌లీజ్ డిజిటల్ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం డిజిటల్ మౌలిక సదుపాయాలు మెరుగుపడటం, రిమోట్ వర్క్ అవకాశాలు, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే (డీఈఐ) విధానాలు గత నాలుగేళ్లలో మహిళా టెకీల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. 2020లో కాంట్రాక్టు టెక్ ఉద్యోగాల్లో మహిళల సంఖ్య 9.51 శాతంగా ఉండగా, 2024లో ఇది 27.98 శాతానికి పెరిగింది. ఐటీ సర్వీసుల రంగంలో మహిళా సిబ్బంది వాటా 7.8 శాతం నుంచి 21.2 శాతానికి పెరిగింది. అయితే, ఇది చెప్పుకోతగ్గ స్థాయిలో కెరియర్ పురోగతికి దారితీయడం లేదు. మధ్య స్థాయి ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం 4.13 శాతం నుంచి 8.93 శాతానికి మాత్రమే పెరగడం ఇందుకు నిదర్శనం. ఎంట్రీ స్థాయిని దాటి పురోగమించేందుకు మహిళలకు గణనీయంగా అవరోధాలు ఉండటాన్ని ఈ గణాంకాలు సూచిస్తున్నట్లు నివేదిక వివరించింది. 2020–2024 మధ్య టీమ్‌లీజ్ డిజిటల్ టెక్ కాంట్రాక్ట్ సిబ్బందిలోని 13,000 మంది అసోసియేట్స్ గణాంకాల విశ్లేషణ ఆధారంగా ఈ నివేదిక రూపొందింది.

వేతనాల్లోనూ వ్యత్యాసాలు..

వేతనాల విషయానికొస్తే పురుషులు, మహిళల మధ్య ఎంట్రీ స్థాయి కొలువుల్లో 6 శాతం, మధ్య స్థాయి ఉద్యోగాల్లో 19 శాతం వరకు వ్యత్యాసం ఉంటోంది. అయితే, సీనియర్ స్థాయిలో మాత్రం 13 శాతంగా ఉంటోంది. 'కాంట్రాక్ట్ టెక్ ఉద్యోగాల్లో మహిళల సంఖ్య పెరుగుతుండటం హర్షణీయమే అయినప్పటికీ, లింగ సమానత సాధించాలంటే నియామకాల పరిధికి మించి బహుముఖ విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. లీడర్‌షిప్ స్థానాల్లో మహిళలకు ప్రాతినిధ్యం అంతగా లేకపోవడం, పురుషులతో పోలిస్తే వేతనాల మధ్య వ్యత్యాసాలు అలాగే కొనసాగుతుండటమనేది వ్యవస్థలో దీర్ఘకాలిక మార్పులను చేయాల్సిన ఆవశ్యకతను సూచిస్తోంది. మహిళలు ఉద్యోగాల్లో చేరడమే కాకుండా, కెరియర్‌లో పురోగమించేందుకు, సారథ్య బాధ్యతల్లో రాణించేందుకు అవసరమైన పరిస్థితులను కల్పించే దిశగా కంపెనీలు కృషి చేయాలి' అని టీమ్‌లీజ్ డిజిటల్ సీఈవో నీతి శర్మ తెలిపారు.

రూపాయికి ఎఫ్ఐఐల కొనుగోళ్ల దన్ను

- 24 పైసలు బలపడి 85.50 వద్ద ముగింపు
- ఎఫ్‌వై 2024–25లో 2 శాతం క్షీణత



ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల తిరిగి కొనుగోళ్లు చేపట్టడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 24 పైసలు బలపడి 85.50 వద్ద ముగిసింది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 85.64 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 34 పైసలు బలపడి వద్ద గరిష్టాన్ని తాకింది. నెలాఖరు కావడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, దిగుమతిదారులను నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, క్రూడాయిల్ ధరలు అనూహ్య పెరుగుదలతో లాభాలు కొంత తగ్గాయి.

- 2024–25 ఆర్థిక సంవత్సరంలో డాలర్ మారకంలో రూపాయి విలువ 2% క్షీణించింది. కాగా ఈ మార్చిలో 2.17% బలపడింది. 2018 నవంబర్ తర్వాత (5%) ఒక నెలలో దేశీయ కరెన్సీకిదే అతిపెద్ద ర్యాలీ.

ఏసీల విక్రయాల్లో 50 శాతం వృద్ధి

- 2025–26లో గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ లక్ష్యం
- కమర్షియల్ ఏసీల సెగ్మెంట్లోకి ఎంట్రీ



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎయిర్ కండీషనర్ల విక్రయాల్లో 50 శాతం వృద్ధి సాధించాలని గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. భారీ డిమాండ్‌తో పాటు స్మార్ట్ ఏసీలతో పాటు కొత్తగా ప్రవేశపెట్టిన వివిధ ఉత్పత్తులు ఇందుకు దోహదపడగలవని అంచనా వేస్తున్నట్లు బిజినెస్ హెడ్ కమల్ నంది తెలిపారు. క్యాసెట్ ఏసీలు, టవర్ ఏసీలతో కమర్షియల్ ఏసీల సెగ్మెంట్లోకి ప్రవేశించడంతో పాటు కొత్త స్మార్ట్ ఏసీలను కూడా ప్రవేశపెట్టిన సందర్భంగా సందర్భంగా నంది ఈ విషయాలు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 14 లక్షల యూనిట్ల స్థాయిలో రెట్టింపు అమ్మకాల పరిమాణంతో, సుమారు 10 శాతం మార్కెట్ వాటాను దక్కించుకోగలమని ధీమా వ్యక్తం చేశారు. కొత్త స్మార్ట్ ఏసీల ధరలు రూ. 42,900 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈసారి పరిశ్రమ స్థాయిలో ఏసీల అమ్మకాలు 1.4 కోట్ల స్థాయికి చేరతాయని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 30 శాతం వృద్ధితో 1.8 కోట్లకు చేరవచ్చని అంచనా వేస్తున్నట్లు నంది చెప్పారు.

జేపీ కొనుగోలుకి వేదాంతా సై

- ఆసక్తి వ్యక్తీకరణ బిడ్ దాఖలు
- ఇప్పటికే రేసులో అదానీ గ్రూప్



న్యూఢిల్లీ: మౌలిక రంగ సంస్థ జేపీ అసోసియేట్స్(జేఏఎల్)పై తాజాగా డైవర్సిఫైడ్ గ్రూప్ వేదాంతా దృష్టి పెట్టింది. దివాల పరిష్కార ప్రక్రియలో భాగంగా జేపీ గ్రూప్ సంస్థ జేఏఎల్‌ను కొనుగోలు చేయాలని చూస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 2024 జూన్ 3న జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) అలహాబాద్ బెంచ్ ఆదేశాల ప్రకారం జేఏఎల్ దివాల చట్ట పరిధిలోకి చేరింది. దీంతో దివాలా పరిష్కరా చర్యలకు తెరలేచింది. ఈ నేపథ్యంలో వేదాంతా గ్రూప్ ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అదానీ గ్రూప్ సైతం ఈవోఐ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. బిజినెస్‌లను విడదీయకుండా ఏకమొత్తంగా కంపెనీ(జేఏఎల్)పై దివాల పరిష్కార ప్రక్రియను చేపట్టేందుకు ఎన్‌సీఎల్‌టీ ఈ నెల మొదట్లో ఆదేశించింది.

రుణాల బదిలీ

2025 ఫిబ్రవరి 20కల్లా జేఏఎల్ చెల్లించవలసిన రుణాల విలువ రూ. 55,493 కోట్లను దాటింది. చెల్లించవలసిన రుణాలను జాతీయ ఆస్తుల పునర్‌నిర్మాణ కంపెనీ(ఎన్ఏఆర్‌సీఎల్)కు రుణదాతల కన్సార్షియం బదిలీ చేసినట్లు ఇటీవల జేఏఎల్ వెల్లడించింది. రుణదాతల కన్సార్షియంలో బ్యాంకింగ్ దిగ్గజాలు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, ఐడీబీఐ, యాక్సిస్, కెనరా, పీఎన్‌బీ, యుకో, బీవోఎం, కరూర్ వైశ్యా, బీవోఐ, ఇండస్ఇండ్, బీవోబీ, ఎగ్జిమ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ తదితరాలున్నాయి. అయితే ఎన్ఏఆర్‌సీఎల్‌కు బదిలీ చేసిన రుణాల విలువ వెల్లడికాలేదు. జేఏఎల్ దివాల పరిష్కార ప్రక్రియను నిర్వహించేందుకు భువన్ మదన్ ఎంపికయ్యారు. కాగా.. జేపీ గ్రూప్ సంస్థ జేపీ ఇన్‌ఫ్రాటెక్‌ను దివాల ప్రక్రియ ద్వారా ఇంతక్రితం ముంబైకి చెందిన సురక్షా గ్రూప్ సొంతం చేసుకున్న విషయం విదితమే.

లక్ష్యంలో 86 శాతానికి ద్రవ్యలోటు

- ఫిబ్రవరి చివరికి చేరిక
- 11 నెలల్లో రూ.13,46,852 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024–25) ఫిబ్రవరి చివరికి ద్రవ్యలోటు రూ.13,46,852 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో నిర్దేశించుకున్న మొత్తం ద్రవ్యలోటు లక్ష్యంలో 11 నెలల్లో 85.8 శాతానికి చేరుకుంది. వ్యయాలు–ఆదాయాల మధ్య అంతరాన్ని ద్రవ్యలోటుగా చెబుతారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు రూ.15.69 లక్షల కోట్లుగా ఉంటుందని బడ్జెట్ అంచనా. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ఈ గణాంకాలను శుక్రవారం విడుదల చేసింది. ఫిబ్రవరి చివరికి నికర పన్నుల ఆదాయం రూ.20 లక్షల కోట్లుగా ఉంది. 2024–25 సవరించిన అంచనాల్లో ఇది 78.8 శాతానికి సమానం. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 79.6 శాతంగా ఉండడం గమనార్హం. మొత్తం వ్యయాలు రూ.38.93 లక్షల కోట్లుగా ఉన్నాయి. సవరించిన బడ్జెట్ అంచనాల్లో ఇది 82.5 శాతానికి సమానం. జీడీపీలో ద్రవ్యలోటు 4.8 శాతంగా 2024–25 బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొనడం గమనార్హం. 2025–26 సంవత్సరానికి దీన్ని 4.4 శాతంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది. మొత్తం రెవెన్యూ వ్యయాల్లో 9.52 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులు కాగా, 3.63 లక్షల కోట్లు సబ్సిడీలకు ఖర్చు అయింది. 11.80 లక్షల కోట్లను రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేసినట్టు సీజీఏ తెలిపింది. గతేడాది ఇదే కాలంతో పోల్చితే రాష్ట్రాలకు బదిలీ చేసిన మొత్తం రూ.1.47 లక్షల కోట్ల మేర పెరిగింది.

సువెన్ ఫార్మా, కోహ్యాన్స్ విలీనానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కోహ్యాన్స్ లైఫ్‌సైన్సెస్‌ను తమ సంస్థలో విలీనం చేసుకునే ప్రతిపాదనకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదముద్ర వేసినట్లు సువెన్ ఫార్మా వెల్లడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో విలీన ప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. దీనితో తమ ఉత్పత్తి సామర్థ్యాలు మరింతగా మెరుగుపడతాయని సువెన్ ఫార్మా చైర్మన్ వివేక్ శర్మ చెప్పారు. ఉమ్మడి సామర్థ్యాల దన్నుతో వచ్చే అయిదేళ్లలో 1 బిలియన్ డాలర్ల ఆదాయం స్థాయికి చేరుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇందులో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ సేవల వాటా గణనీయంగా ఉంటుందని పేర్కొన్నారు.

రెస్టారెంట్ సర్వీసుల్లో జీఎస్‌టీపై స్పష్టత



న్యూఢిల్లీ: హోటళ్లలోని రెస్టారెంట్లలో సర్వీసులపై విధించే జీఎస్‌టీపై కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) స్పష్టతనిచ్చింది. రోజుకు రూ. 7,500 పైగా గది అద్దెను వసూలు చేసే హోటళ్లలో, రెస్టారెంటు సర్వీసులపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌తో (ఐటీసీ) 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుందని తెలిపింది. అంతకన్నా తక్కువ అద్దె ఉండే హోటళ్లలో ఐటీసీ లేకుండా 5 శాతం జీఎస్‌టీ యథాతథంగా కొనసాగుతుందని వివరించింది. దీనికి క్రితం ఆర్థిక సంవత్సరం వసూలు చేసిన అద్దె ప్రాతిపదికగా ఉంటుంది.

మొబైల్‌వేర్ టెక్నాలజీస్‌లో జాగిల్‌కు వాటాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొబైల్‌వేర్ టెక్నాలజీస్‌లో వ్యూహాత్మక ఇన్వెస్ట్‌మెంట్ చేసినట్లు జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ వెల్లడించింది. రూ. 15.60 కోట్లతో 26 శాతం వాటాలు దక్కించుకున్నట్లు వివరించింది. అలాగే రూ. 7.25 కోట్లతో ప్రమోటర్ల నుంచి మరో 12.34 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు పేర్కొంది. దీనితో మొబైల్‌వేర్ టెక్నాలజీస్‌లో జాగిల్ మొత్తం షేర్‌హోల్డింగ్ 38.34 శాతానికి చేరినట్లవుతుంది. పేమెంట్ సొల్యూషన్స్‌ను మెరుగుపర్చుకునేందుకు, కొత్త వాటిని రూపొందించేందుకు మొబైల్‌వేర్ మౌలిక సదుపాయాలు జాగిల్‌కు ఉపయోగపడనున్నాయి.

ఫిబ్రవరిలో నిదానించిన మౌలిక రంగం

- ఎనిమిది కీలక రంగాల్లో వృద్ధి 2.9 శాతం
- ఇది ఐదు నెలల కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: ఫిబ్రవరిలో మౌలిక రంగం నిదానించింది. ఎనిమిది మౌలిక రంగాల్లో ఉత్పత్తి 2.9 శాతం మేర పెరిగింది. క్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 7.1 శాతంతో పోల్చి చూస్తే గణనీయంగా తగ్గింది. అంతే కాదు ఇది ఐదు నెలల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఈ ఏడాది జనవరిలోనూ కీలక మౌలిక రంగాల్లో 5.1 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన 2.4 శాతం వృద్ధి చివరి కనిష్ఠ స్థాయిగా ఉంది. ముఖ్యంగా ఫిబ్రవరిలో ముడిచమురు, సహజ వాయువు రంగాల్లో ప్రతికూల వృద్ధి (క్షీణత) కనిపించింది. బొగ్గు ఉత్పత్తి 1.7 శాతం వృద్ధి చెందింది. గతేడాది ఫిబ్రవరిలో ఈ రంగంలో 11.6 శాతం వృద్ధి నమోదు కావడం గమనించొచ్చు. రిఫైనరీ ఉత్పత్తుల్లో వృద్ధి క్రితం ఏడాది ఇదే నెలలో ఉన్న 2.6 శాతం నుంచి 0.8 శాతానికి తగ్గిపోయింది. స్టీల్ ఉత్పత్తి 9.4 శాతం నుంచి 5.6 శాతానికి.. విద్యుదుత్పత్తి 7.6 శాతం నుంచి 2.8 శాతానికి తగ్గిపోవడం గమనార్హం. ఎరువుల ఉత్పత్తి 10.2 శాతం, సిమెంట్ ఉత్పత్తి 10.5 శాతం చొప్పున వృద్ధి చెందడం కొంత కలిసొచ్చింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకు మొత్తం 11 నెలల్లో ఈ ఎనిమిది మౌలిక రంగాల్లో వృద్ధి 4.4 శాతంగా ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వృద్ధి 7.8 శాతంగా ఉంది. పారిశ్రామికోత్పత్తి సూచీలో (ఐఐపీ) ఈ ఎనిమిది మౌలిక రంగాల వాటా 40.27 శాతంగా ఉంది.

వద్దనుకున్నవాడే... ఆపద్బాంధవుడయ్యాడు!

జహీర్ ఫోన్ కాల్‌తో..



ఐపీఎల్ వేలంలో ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసుకోకపోవడంతో... శార్దుల్ దేశవాళీల్లో మరింత పట్టుదలగా ఆడాడు. 2024-25 రంజీ సీజన్‌లో ముంబై జట్టు తరఫున ఈ ఆల్‌రౌండర్ 35 వికెట్లు తీయడంతో పాటు లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి 500 పైచిలుకు పరుగులు చేశాడు. 'రంజీ నాకౌట్ మ్యాచ్‌ల సమయంలో జహీర్ ఖాన్ నుంచి ఫోన్ వచ్చింది. దీంతో సాధన కొనసాగించా. వేరే జట్లు కూడా సంప్రదించినప్పటికీ... జహీర్ ముందు ఫోన్ చేయడంతో అతడి మాటకు విలువ ఇచ్చి లక్నో జట్టులో చేరేందుకు అంగీకరించా' అని శార్దుల్ చెప్పాడు. ఐపీఎల్ వేలంలో కొనుగోలు ఏ జట్టు కొనుగోలు చేసుకోక పోవడంతో ఏమాత్రం నిరుత్సాహానికి గురికాని శార్దుల్... మరింత క్రమశిక్షణతో తన బౌలింగ్ అస్త్రాలను పెంచుకొని ఫలితాలు రాబడుతున్నాడు.



శార్దుల్

ఐపీఎల్ వేలంలో అమ్ముడుపోని శార్దుల్ ఠాకూర్

మొహసిన్ ఖాన్‌కు గాయంతో అనూహ్య అవకాశం

లక్నో సూపర్ జెయింట్స్ తరఫున సత్తా చాటుతున్న ఆల్‌రౌండర్

ఐపీఎల్ 2024లో భాగంగా హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను అభిమానులు అంత త్వరగా మరచిపోలేరు. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేస్తే... ఛేదనలో చెలరేగిపోయిన రైజర్స్ 9.4 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా 167 పరుగులు చేసి విజయం సాధించింది!

దూకుడే మంత్రంగా సాగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్... ఈ సీజన్‌లో రాజస్తాన్‌తో ఆడిన తొలి మ్యాచ్‌లోనూ 286 పరుగులతో విజృంభించింది. రెండో మ్యాచ్‌లో లక్నోతో తలపడాల్సి రావడంతో మరింత భారీ స్కోరు ఖాయమే అని అభిమానులంతా అంచనాకు వచ్చేశారు. అందుకు తగ్గట్లే రైజర్స్‌కు మొదట బ్యాటింగ్ చేసే అవకాశం దక్కింది. ఇంకేముంది మరోసారి పరుగుల వరద ఖాయం అనుకుంటే... ఒకే ఒక్కడు హైదరాబాద్ జోరుకు అడ్డుకట్ట వేశాడు!!

ఐపీఎల్ వేలంలో ఏ జట్టు కొనుగోలు చేయని ఆ ప్లేయర్... అందివచ్చిన అవకాశాన్ని రెండు చేతులతో ఒడిసిపట్టుకున్నాడు. సొంతగడ్డపై ఆకాశమే హద్దుగా చెలరేగుతున్న రైజర్స్ జోరుకు కళ్లెం వేశాడు. ప్రమాదకర ఓపెనర్ అభిషేక్ శర్మతో పాటు క్రితం మ్యాచ్ సెంచరీ హీరో ఇషాన్ కిషన్‌ను వరుస బంతుల్లో పెవిలియన్‌కు పంపి ఆరెంజ్ ఆర్మీని నిలువరించాడు. చివర్లో మరో రెండు వికెట్లు తీసిన అతడే భారత సీనియర్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్. అనూహ్య అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకుంటున్న శార్దుల్‌పై ప్రత్యేక కథనం...

జాతీయ జట్టు తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి 80కి పైగా మ్యాచ్‌లు ఆడిన అనుభవం... మీడియం పేస్‌తో పాటు లోయర్ ఆర్డర్‌లో విలువైన పరుగులు చేయగల నైపుణ్యం... తాజా రంజీ ట్రోఫీలో అటు బంతితో పాటు ఇటు బ్యాట్‌తో చక్కటి ప్రదర్శన చేసినప్పటికీ... శార్దుల్ ఠాకూర్‌ను ఐపీఎల్ వేలంలో ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేసుకోలేదు. రూ. 2 కోట్ల కనీస ధరతో వేలంలోకి వచ్చిన శార్దుల్‌పై ఏ జట్టు ఆసక్తి కనబర్చలేదు. దీంతో కౌంటీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్న ఈ ఆల్‌రౌండర్‌కు... భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ నుంచి పిలుపు వచ్చింది. 'ప్రయత్నాలు విడిచిపెట్టకు. నిన్ను జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. రిప్లేస్‌మెంట్‌గా నువ్వు టీమ్‌లో చేరితే తొలి మ్యాచ్ నుంచే బరిలోకి దిగాల్సి ఉంటుంది' అని లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్ జహీర్ ఖాన్ చెప్పిన మాటలతో శార్దుల్ తనను తాను టి20 ఫార్మాట్‌కు సిద్ధం చేసుకున్నాడు. లక్నో పేసర్ మొహసిన్ ఖాన్ గాయంతో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌కు దూరం కావడంతో... అతడి స్థానంలో ప్రత్యామ్నాయంగా శార్దుల్‌ను జట్టులోకి తీసుకున్నారు. అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్న శార్దుల్ తొలి మ్యాచ్ నుంచే తనదైన ముద్ర వేశాడు.

తొలి మ్యాచ్‌లో 2 ఓవర్లే...

విశాఖ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన పోరులో శార్దుల్ తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారీ స్కోర్లు నమోదైన ఆ మ్యాచ్‌లో తొలి ఓవర్‌లోనే శార్దుల్ 2 వికెట్లు పడగొట్టి జట్టుకు అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఇన్నింగ్స్ మూడో బంతికి మెక్‌గుర్క్‌ను ఔట్ చేసిన ఈ ముంబైకర్... ఐదో బంతికి అభిషేక్ పొరెల్‌ను బుట్టలో వేసుకున్నాడు. దీంతో భారీ ఛేదనలో ఢిల్లీ ఆరంభంలోనే తడబడింది. అయితే ఆ మ్యాచ్‌లో లక్నో కెప్టెన్ రిషబ్ పంత్... శార్దుల్‌ను సరిగ్గా వినియోగించుకోలేదు. 2 ఓవర్ల తర్వాత అతడికి అసలు తిరిగి బౌలింగే ఇవ్వలేదు. దీంతో పంత్ సారథ్యంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం కాగా... రెండో మ్యాచ్‌లో హైదరాబాద్‌పై దాన్ని పునరావృతం కానివ్వకుండా చూసుకున్నాడు. దాని ఫలితమే శార్దుల్ ఐపీఎల్లో తన అత్యుత్తమ గణాంకాలు (4/34) నమోదు చేసుకోవడంతో పాటు లీగ్‌లో 100 వికెట్ల మైలు రాయిని సైతం దాటాడు. షార్ట్‌బాల్‌తో అబిషేక్‌కు బైబై చెప్పిన శార్దుల్... తదుపరి బంతికే ఇషాన్‌ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ బాట పట్టించాడు. చివర్లో మరోసారి బౌలింగ్‌కు వచ్చిన అతడు... అభినవ్ మనోహర్, మొహమ్మద్ షమీని ఔట్ చేశాడు.

రైజర్స్‌కు కళ్లెం...

హిట్టర్లతో దట్టంగా ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌కు ముందు పక్కా ప్రణాళికతో బరిలోకి దిగినట్లు శార్దుల్ వెల్లడించాడు. 'రైజర్స్ బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లపై తీవ్ర ఒత్తిడి పెంచి భారీ షాట్లు ఆడుతూ మ్యాచ్‌ను లాగేసుకుంటున్నారు. అలాంటిది వారిపై ఒత్తిడి పెంచితే ఫలితాలు రాబట్టవచ్చు అని ముందే అనుకున్నా. చాన్స్ తీసుకోవాలనుకున్నా. ఫ్లాట్ పిచ్‌పై ఆరంభంలోనే ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను లాగేసుకోవడం సన్‌రైజర్స్ ప్లేయర్లకు అలవాటు. అలాంటిది వారిని భారీ స్కోరు చేయకుండా మొదట్లోనే అడ్డుకోవాలని భావించా. నా ప్రణాళికలకు తగ్గట్లే బౌలింగ్ చేశాను. మెరుగైన ఫలితాలు రావడం ఆనందంగా ఉంది. నేనెప్పుడు వ్యక్తిగత ప్రదర్శనను పట్టించుకోను. జట్టు విజయంలో నా వంతు పాత్ర ఉండాలని భావిస్తా' అని శార్దుల్ అన్నాడు. ఐపీఎల్‌లోని అన్నీ జట్లలో బౌలింగ్ లైనప్ బలహీనంగా ఉందని విమర్శలు మూటగట్టుకున్న లక్నో... ఇప్పుడు శార్దుల్ మ్యాజిక్‌తో ముందుకు సాగుతోంది. లీగ్‌లో ముున్ముందు కూడా ఇదే ప్రదర్శన కొనసాగించాలనుకుంటున్నట్లు ఈ ఆల్‌రౌండర్ వెల్లడించాడు.

-సాక్షి, క్రీడావిభాగం

గురీందర్‌వీర్ సింగ్ జాతీయ రికార్డు



బెంగళూరు: భారత యువ అథ్లెట్ గురీందర్‌వీర్ సింగ్ 100 మీటర్ల పరుగులో జాతీయ రికార్డు నెలకొల్పాడు. పంజాబ్‌కు చెందిన 24 ఏళ్ల గురీందర్ వీర్ సింగ్.. ఇండియన్ గ్రాండ్ ప్రిలో ఈ ఘనత సాధించాడు. శుక్రవారం జరిగిన పోటీల్లో అతను10.20 సెకన్లలో లక్ష్యాన్ని చేరాడు. గతంలో ఈ రికార్డు మణికంఠ హోబ్లిధార్ (10.23 సెకన్లు) పేరిట ఉండగా... తాజాగా గురీందర్ ఆ రికార్డును బద్దలు కొట్టాడు. 2021లో 10.27 సెకన్లలో వంద మీటర్లు పరిగెత్తిన ఈ పంజాబ్ స్ప్రింటర్... ఇప్పుడు దాన్ని సరిచేశాడు. ఇదే పోటీల్లో మణికంఠ 10.21 సెకన్లలో గమ్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచాడు. అతడికిదే వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన. గత కొంతకాలంగా ఈ ఇద్దరి మధ్య రసవత్తర పోరు సాగుతోంది. అమ్లన్ బొర్గోహై (10.43 సెకన్లు) మూడో స్థానంతో రేసును ముగించాడు. గురీందర్‌వీర్ సింగ్ 2021, 2024లో ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్‌లలో పసిడి పతకాలు సాధించాడు.

చెన్నై, మధురైలో జూనియర్ హాకీ వరల్డ్‌కప్

చెన్నై: ఈ ఏడాది భారత్ వేదికగా జరగనున్న ఎఫ్‌ఐహెచ్ జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్‌నకు సంబంధించిన వేదికలు ఖరారయ్యాయి. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు జరగనున్న ఈ టోర్నీని చెన్నై, మధురై నగరాల్లో నిర్వహించనున్నట్లు హాకీ ఇండియా (హెచ్‌ఐ) శుక్రవారం వెల్లడించింది. 24 జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనుండటం ఇది మూడోసారి. 2016లో లక్నో వేదికగా, 2021లో భువనేశ్వర్‌లో జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్ జరిగింది. 'చెన్నై, మధురై నగరాల్లో పోటీలు నిర్వహిస్తాం. వరల్డ్‌కప్‌లో మొత్తం 24 జట్లు పాల్గొంటున్నాయి. మధురైలో అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగడం ఇదే తొలిసారి. భిన్నమైన నగరాలకు ఆటను విస్తరించాలనే ఉద్దేశంతోనే మధురైను వేదికగా ఎంపిక చేశాం' అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేర్కొన్నాడు. భారత్‌లో చివరిసారిగా 2021లో జరిగిన ప్రపంచకప్‌లో అర్జెంటీనా జట్టు విజేతగా నిలవగా... 2023లో కౌలాలంపూర్‌లో జరిగిన వరల్డ్‌కప్‌లో జర్మనీ చాంపియన్‌గా నిలిచింది. సెమీఫైనల్లో ఓడిన భారత్ నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. మరి ఈసారి స్వదేశంలో జరగనున్న టోర్నీలో అయినా యువభారత్ విజేతగా నిలుస్తుందా చూడాలి.



హంపి

పుణేలో మహిళల చెస్ గ్రాండ్ ప్రి

పుణే: ఫిడే మహిళల గ్రాండ్ ప్రి ఐదో అంచె పోటీలకు పుణే ఆతిథ్యమివ్వనుంది. వచ్చే నెల 13 నుంచి 24 వరకు జరగనున్న ఈ టోర్నీలో ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్ కోనేరు హంపి, ఒలింపియాడ్ స్వర్ణ పతక విజేతలు ద్రోణవల్లి హారిక, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొననున్నారు. మహారాష్ట్ర చెస్ సంఘం నిర్వహించనున్న ఈ టోర్నీలో చైనా గ్రాండ్‌మాస్టర్ జూ జినెర్, పొలినా షువలోవా (రష్యా), అలీనా కష్లిన్‌స్కా (పోలాండ్), నలిమోవా నుర్గల్ (బల్గేరియా), బక్తుయాగ్ (మంగోలియా), మెలియా సలోమె (జార్జియా) పాల్గొననున్నారు. ఫిడే గ్రాండ్ ప్రి సిరీస్‌లో 14 మంది టాప్ ప్లేయర్లతో పాటు... ఆరుగురు ప్లేయర్లు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా పాల్గొంటారు. గత సిరీస్‌ల ఆధారంగా ప్లేయర్ల ఎంపిక జరుగుతుంది. భారత్ యువ ప్లేయర్ ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా ఈ టోర్నీలో పోటీపడనుంది.



అనాహత్‌కు టైటిల్

ముంబై: జేఎస్‌డబ్ల్యూ ఇండియన్ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో యువ క్రీడాకారిణి అనాహత్ సింగ్ చాంపియన్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో భారత నంబర్‌వన్ ర్యాంకర్ అనాహత్ సింగ్ 3-0 (11-9, 11-5, 11-8)తో హెలెన్ టాంగ్ (హాంకాంగ్)పై విజయం సాధించింది. ఈ విజయంతో అనాహత్ 300 ర్యాంకింగ్ పాయింట్లు ఖాతాలో వేసుకుంది. 17 ఏళ్ల అనాహత్‌కు ఇది వరుసగా ఆరో టైటిల్ కాగా... ఓవరాల్‌గా 11వది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ ప్లేయర్ అభయ్ సింగ్ రన్నరప్‌గా నిలిచాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో అభయ్ సింగ్ 1-3 (10-12, 4-11, 11-7, 10-12)తో కరీమ్ (ఈజిప్ట్) చేతిలో ఓటమి పాలయ్యాడు.



శరత్ కమల్ జోరు

- ప్రిక్వార్టర్స్‌కు చేరిన దిగ్గజ ప్యాడ్లర్
- డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీ

చెన్నై: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) దిగ్గజం ఆచంట శరత్ కమల్... తన చివరి టోర్నీలో చక్కటి విజయాలతో దూసుకెళ్తున్నాడు. చెన్నై వేదికగా జరుగుతున్న డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నమెంట్‌లో శరత్ కమల్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో శరత్ 3-0 (11-8, 11-8, 11-9)తో పదో సీడ్ నికోలస్ లుమ్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. 42 ఏళ్ల శరత్... తనకంటే 23 సంవత్సరాలు చిన్నవాడైన ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం కనబర్చాడు. దేశం తరఫున ఐదుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న శరత్ కమల్ బ్యాక్‌హ్యాండ్, ఫోర్ హ్యాండ్ షాట్లతో ఆకట్టుకొని వరుస గేమ్‌ల్లో విజయం సాధించాడు. శరత్‌తో పాటు పురుషుల విభాగంలో భారత్ నుంచి తెలంగాణ ప్యాడ్లర్ స్నేహిత్ సురావజ్జుల, మానవ్ ఠక్కర్ ప్రిక్వార్టర్స్‌కు చేరగా... మహిళల విభాగంలో కృత్విక రాయ్ ముందంజ వేసింది. స్నేహిత్ 3-2 (8-11, 11-13, 11-9, 11-7, 12-10)తో యుకియా ఉడా (జపాన్)పై, మానవ్ 3-1 (11-4, 7-11, 11-5, 11-8)తో పిన్ లూ (ఆస్ట్రేలియా)పై గెలిచారు. మహిళల విభాగంలో పదో సీడ్ తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ 2-3 (6-11, 9-11, 11-6, 11-4, 7-11)తేడాతో కృత్విక రాయ్ చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో శరత్-స్నేహిత్ జంట 1-3 (11-9, 8-11, 9-11, 6-11)తో ఆస్ట్రేలియా జోడీ చేతిలో ఓడింది.



జొకోవిచ్ అరుదైన రికార్డు

- ఏటీపీ మాస్టర్స్-1000 టోర్నీ సెమీస్ చేరిన పెద్ద వయస్కుడిగా నొవాక్
- క్వార్టర్ ఫైనల్లో కొర్డాపై అలవోక విజయం

ఫ్లోరిడా: సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ అరుదైన రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. మయామి ఓపెన్ ఏటీపీ-1000 మాస్టర్స్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరాడు. తద్వారా ఏటీపీ మాస్టర్స్-1000 టోర్నీ సెమీఫైనల్‌కు చేరిన పెద్ద వయస్కుడిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డు రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్) పేరిట ఉంది. 37 ఏళ్ల జొకోవిచ్ శుక్రవారం పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో 6-3, 7-6 (7/4)తో సెబాస్టియన్ కొర్డా (అమెరికా)పై విజయం సాధించాడు. 1 గంట 24 నిమిషాల పాటు సాగిన పోరులో నాలుగో సీడ్ జొకోవిచ్ 11 ఏస్‌లు కొట్టగా... కొర్డా ఏడు ఏస్‌లకు పరిమితమయ్యాడు. సెర్బియా వీరుడు రెండు బ్రేక్ పాయింట్లు కాచుకోవడంతో పాటు ఒక దశలో వరుసగా 12 పాయింట్లు సాధించి ఆధిక్యం కనబర్చాడు. ఇప్పటికే ఆరుసార్లు మయామి ఓపెన్ టైటిల్ చేజిక్కించుకున్న జొకోవిచ్ ఏడోసారి చాంపియన్‌గా నిలిచేందుకు రెండడుగుల దూరంలో ఉన్నాడు. సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ మధ్యలో గాయం కారణంగా తప్పుకున్న జొకోవిచ్... ఇటీవల ఇండియన్ వెల్స్ టోర్నీ తొలి రౌండ్‌లో పరాజయం పాలయ్యాడు. గ్రాండ్‌స్లామ్ చాంపియన్ పీటర్ కొర్డా కుమారుడైన సెబాస్టియన్ కొర్డా... రెండో సెట్ ఆరంభంలో 4-1తో ఆధిక్యంలో నిలిచినా... దాన్ని చివరి వరకు కొనసాగించలేకపోయాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంక (బెలారస్) 6-2, 6-2తో జాస్మిన్ పావోలిని (ఇటలీ)పై గెలుపొందింది. తద్వారా తొలిసారి మయామి ఓపెన్ ఫైనల్లో అడుగుపెట్టింది.

ప్రజాధనం దుర్వినియోగం కేసులో

కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ: 2019లో దేశ రాజధాని ఢిల్లీలో ప్రజా ధనం దుర్వినియోగం చేసి భారీ హోర్డింగులను ఏర్పాటు చేయించారన్న ఆరోపణలపై మాజీ సీఎం కేజ్రీవాల్‌పై కేసు నమోదు చేసినట్లు ద్వారకా పోలీస్ స్టేషన్ పోలీసులు శుక్రవారం ఢిల్లీ కోర్టుకు తెలిపారు. ఈ మేరకు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నేహా మిట్టల్‌కు నివేదిక అందించారు. కేసు నమోదు కాపీని ఫిర్యాదుదారు శివకుమార్ సక్సేనాకు పంపించామని తెలిపారు. ఈ కేసు దర్యాప్తునకు పోలీసులు సమయం కోరడంతో తదుపరి విచారణను ఏప్రిల్ 18వ తేదీకి మేజిస్ట్రేట్ నేహా మిట్టల్ వాయిదా వేశారు. దర్యాప్తు పురోగతి నివేదికను అప్పటికి సిద్ధం చేయాలన్నారు. కాగా, కేజ్రీవాల్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ కౌన్సిలర్ నితికా శర్మలపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. భారీ హోర్డింగులను ఏర్పాటు చేయడం డిఫేస్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ప్రాపర్టీ చట్టంలోని సెక్షన్–3ను ఉల్లంఘించినట్లేనని మేజిస్ట్రేట్ మార్చి 11న ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

వైట్ హౌస్‌లో ట్రంప్ ఇఫ్తార్ విందు



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంజాన్ సందర్భంగా గురువారం వైట్ హౌస్‌లో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వర్గం నేతలు, దౌత్య సిబ్బంది, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ ముస్లిం సోదరులకు రంజాన్ ముబారక్ తెలిపారు. 2024 ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన లక్షలాది మంది అమెరికన్ ముస్లింలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చారిత్రక అబ్రహాం ఒడంబడికల ప్రాతిపదికగా పశ్చిమాసియాలో శాశ్వత శాంతిని నెలకొల్పేందుకు అవిశ్రాంతంగా పనిచేస్తున్నామని చెప్పారు. గత బైడెన్ ప్రభుత్వం ఈ విషయంలో ఏమీ చేయలేకపోయిందని విమర్శించారు. ఇజ్రాయెల్, ఏడు అరబ్ దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చే లక్ష్యంతో గతంలో ట్రంప్ ప్రభుత్వం హయాంలో కుదిరిన అబ్రహాం ఒప్పందాలను ఆయన సందర్భంగా గుర్తు చేశారు. కాగా, అమెరికా, ఖతార్, ఈజిప్టు మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ప్రశ్నార్థకంగా మారడం, గాజాపై మళ్లీ ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడుతున్న వేళ ట్రంప్ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం గమనార్హం.

రాజ్యసభలో

‘రాణా సంగా’ రగడ

న్యూఢిల్లీ: రాజ్‌పుత్ పాలకుడు రాణా సంగాపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్‌జీలాల్ సుమన్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం రాజ్యసభలో గందరగోళం నెలకొంది. ఇబ్రహీం లోడీని ఓడించడానికి మొఘల్ పాలకుడు బాబర్‌ను రాణా సంగా భారత్‌కు రప్పించారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ సభ్యులు మండిపడ్డారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సైతం దీనిపై స్పందించారు. రామ్‌జీలాల్ సుమన్ వ్యాఖ్యలు అభ్యంతకరమని, అవి తనను బాధించాయని అన్నారు. అయితే, తన వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పులేదని రామ్‌జీలాల్ సుమన్ తేల్చిచెప్పారు. క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. దీంతో అధికారపక్ష సభ్యులు తమ స్థానాల్లో నిల్చొని పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో సభలో తీవ్ర అలజడి నెలకొంది. సభను వాయిదా వేస్తున్నట్లు జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. సభ పునఃప్రారంభమైన తర్వాత రామ్‌జీలాల్ సుమన్ వ్యాఖ్యలపై మాట్లాడేందుకు చైర్మన్ అవకాశం ఇవ్వకపోవడంతో బీజేపీ ఎంపీలు వాకౌట్ చేశారు.

విమాన చార్జీలను క్రమబద్ధీకరించాలి

విమానయాన చార్జీలను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సందీప్ కుమార్ పాఠక్ కోరారు. ఇటీవల మహాకుంభమేళా సమయంలో విమానయాన సంస్థలు చార్జీలను విచ్చలవిడిగా పెంచేశాయని గుర్తుచేశారు. సాధారణంగా రూ.5 వేలు ఉండే టిక్కెట్‌ను రూ.లక్షకు విక్రయించాయని అన్నారు. శుక్రవారం సభలో ‘ప్రొటెక్షన్ ఆఫ్ ఇంటరెస్ట్ ఇన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆబ్జెక్ట్స్ బిల్లు–2025పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. విమాన చార్జీలను రెగ్యులేట్ చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టంచేశారు. లోక్‌సభలోనూ ఇదే అంశంపై పార్టీలకు అతీతంగా ఎంపీలు గళం విప్పారు. విమానయాన చార్జీలను తగ్గించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తిచేశారు.

ఎయిమ్స్ వైద్య సేవల్లో రాజీలేదు: నడ్డా

దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా శుక్రవారం లోక్‌సభలో ప్రకటించారు. ఎయిమ్స్ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన(ఏబీ–పీఎంజేఏవై) కింద 62 కోట్ల మంది ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఏటా రూ.5 లక్షల ఆరోగ్య బీమా కవరేజీ లభిస్తోందని పేర్కొన్నారు. కేవలం పశ్చిమ బెంగాల్ మినహా దేశమంతటా ఏబీ–పీఎంజేఏవై అమలవుతోందని నడ్డా వివరించారు.

లోక్‌సభలో ఇండియన్ పోర్ట్స్ బిల్లు

క్యారియేజ్ ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లు–2024 శుక్రవారం లోక్‌సభలో ఆమోదం పొందింది. బ్రిటిష్ వలస పాలన కాలం నాటి చట్టాలను రద్దు చేయడంలో భాగంగా ఈ బిల్లును తీసుకొచ్చినట్లు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ చెప్పారు. అలాగే ఇండియన్ పోర్ట్స్ బిల్లు–2025ను ఆయన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మారిటైమ్ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఏర్పాటుతోపాటు కొన్ని ఓడరేవులను మెగా పోర్టులుగా గుర్తించడానికి కేంద్రం ఈ బిల్లును రూపొందించింది. ఇండియన్ పోర్ట్స్ యాక్ట్–1908ను రద్దుచేస్తూ ఈ కొత్త బిల్లును తీసుకొచ్చారు.

బీఏసీ సమావేశం నుంచి ధన్‌ఖడ్ వాకౌట్

సభా వ్యవహారాల సలహా కమిటీ(బీఏసీ) సమావేశం నుంచి రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ శుక్రవారం వాకౌట్ చేశారు. ఈ సమావేశం నిర్వహించడానికి కోరం లేకపోవడమే ఇందుకు కారణమని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, సభలో చర్చించాల్సిన అంశాలపై అధికార పక్ష సభ్యులతో తమకు జరిగిన వాగ్వాదం వల్లే ధన్‌ఖడ్ బయటకు వెళ్లిపోయారని విపక్ష ఎంపీలు చెప్పారు.

డ్రగ్స్ బెడద ప్రమాదకరంగా మారింది: రాహుల్

న్యూఢిల్లీ: మన యువత మాదకద్రవ్యాలకు బలైపోతున్నా, ఒక తరాన్ని నాశనం చేసే ఈ సంక్షోభ పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మరిన్ని జీవితాలు నాశనమవక మునుపే ప్రజలంతా కలిసి కట్టుగా ఈ మహమ్మారిని పారదోలాల్సిన అవసరం ఎంతో ఉందని శుక్రవారం ఆయన ‘ఎక్స్’లో తెలిపారు. కేరళకు చెందిన వైద్యులు, ఇన్‌ఫ్లూయెన్సర్లతో కూడిన బృందం శుక్రవారం ఆయనతో సమావేశమైంది. కేరళలో డ్రగ్స్ బెడద తీవ్రరూపం దాల్చిందని, యువతరాన్ని నాశనం చేస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం రాహుల్ ‘ఎక్స్’పలు పోస్టులు చేశారు. నిరుద్యోగం, నిరాశం, సామాజికంగా ఎదురవుతున్న ఒత్తిళ్లే యువతను డ్రగ్స్ వైపు మళ్లేలా చేస్తున్నాయన్నారు. ‘దేశంలో నల్లమందుకు సుమారు 2.3 కోట్ల మంది బానిసలవ్వగా మరో కోటి మంది పొగరూపంలో పీలుస్తున్నారు. ఇది హరియాణా రాష్ట్ర జనాభాతో సమానం. ఇంతటి తీవ్రమైన ఈ సమస్యను పరిష్కరించే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదు’ అని తెలిపారు.

2026లో టీవీకే, డీఎంకే మధ్యే పోటీ

- పార్టీ మొట్టమొదటి జనరల్ బాడీ సమావేశంలో విజయ్
- బీజేపీ, డీఎంకేలది ఫాసిస్ట్ వైఖరంటూ మండిపాటు

చెన్నై: తమిళనాడు అసెంబ్లీకి 2026లో జరిగే ఎన్నికలు వేరే విధంగా ఉండబోతున్నాయని సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ చీఫ్ విజయ్ వ్యాఖ్యానించారు. ఈసారి టీఎంకే, అధికార డీఎంకే మధ్యనే పోటీ ఉండనుందన్నారు. శుక్రవారం చెన్నైలో జరిగిన పార్టీ ప్రప్రథమ జనరల్ కౌన్సిల్ సమావేశంలో విజయ్ మాట్లాడారు. సీఎం ఎంకే స్టాలిన్‌ను గౌరవనీయులైన రాచరిక ముఖ్యమంత్రిగా అభివర్ణించిన విజయ్.. డీఎంకే కుటుంబ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్ అంటూ పూర్తి పేరును ఘనంగా చెప్పుకుంటే సరిపోదు, అది చేతల్లో, పాలనలో కనిపించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఫాసిస్ట్ అంటూ తిట్టిపోసే డీఎంకే కూడా అంతకంటే తక్కువేం కాదు, అదే ఫాసిస్ట్ వైఖరిని అనుసరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు, కార్యకర్తలను కలుసుకోకుండా నన్ను ఆపడానికి మీరెవరు? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా తనపై విధించిన ఆంక్షలను అనుసరించానన్నారు. సహజ వనరులు, వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం కలుగజేసే ప్రాజెక్టులను మాత్రమే తన పార్టీ వ్యతిరేకిస్తుందంటూ ఉద్యోగులు, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులకు మద్దతుగా ఉంటామన్నారు. రాబోయే టీవీకే ప్రభుత్వంలో ప్రజలే పాలకులుగా ఉంటారని, మిత్రపక్షాలతో అధికారాన్ని పంచుకుంటామని స్పష్టం చేశారు. అదే సమయంలో విజయ్ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు నుంచి జీఎస్టీ రూపంలో పన్నులు వసూలు చేస్తూ రాష్ట్రానికి తగు విధంగా నిధులను కేటాయించడం లేదని ఆరోపించారు. త్రిభాషా విధానాన్ని రాష్ట్రంపై రుద్ద వద్దని, పార్లమెంట్‌లో ప్రాతినిథ్యాన్ని తగ్గించే డీలిమిటేషన్ అమలును ఆపాలని కోరారు. జమిలి ఎన్నికల విధానం వద్దన్నారు. ముస్లింల హక్కులను లాగేసుకునేలా ఉన్న వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలని కేంద్రాన్ని విజయ్ కోరారు. ఎన్నికల సంబంధ అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని విజయ్‌కు కట్టబెడుతూ ఈ సమావేశం ఒక తీర్మానం చేసింది. అదే సమయంలో, 543 లోక్‌సభ నియోజకవర్గాలను ఎప్పటికీ కొనసాగించాలన్నదే టీవీకే విధానమని పేర్కొంది. ఈ సందర్భంగా విజయ్‌ను దళపతికి బదులుగా ‘వెట్రి తలైవార్’అని సంబోధించాలంటూ సీనియర్ నేత ఆధవ్ అర్జున ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆమోదం తెలిపింది.

డీసీసీ చీఫ్‌లు మూడేళ్లపాటు

ఎన్నికల్లో పోటీకి దూరమే!

వారికి పార్టీ పూర్తి బాధ్యతలు కట్టబెట్టే యోచనలో ఏఐసీసీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో వరుస భేటీలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. జిల్లాల్లో పార్టీకి మూల స్తంభాలైన డీసీసీ అధ్యక్షులు పార్టీ కార్యలాపాలపై పూర్తి దృష్టి పెట్టేందుకు వీలుగా నియమితులైన మొదటి మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడాన్ని నిషేధించే విషయాన్ని పరిశీలించనున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ఏఐసీసీ నియమించిన ముకుల్ వాస్నిక్ కమిటీ చేసిన మూడేళ్ల నిషేధం ప్రతిపాదనను పార్టీ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. వాస్నిక్ కమిటీ సిఫార్సుల ప్రకారం డీసీసీ అధ్యక్షులు తమ ఐదేళ్ల పదవీ కాలంలో తొలి మూడేళ్ల పాటు ఎలాంటి ఎన్నికల్లో పోటీకి అనుమతించరు. వీరంతా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ఓటర్ల జాబితాలను నిర్ధారించడం, ఎన్నికల ప్రచారాన్ని నిశితంగా పరిశీలించడం, సామాజిక ఇంజనీరింగ్, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను ఎదుర్కోవడం, పార్టీ అనుకూల కథనాలను రూపొందించడం, జిల్లాల్లోని అన్ని స్థాయిలలో మీడియా, సోషల్ మీడియా కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం వంటి పనులకు నాయకత్వం వహిస్తారు. అభ్యర్థుల ఎంపికలో, వివిధ పదవులకు నామినీల పరిశీలనలో వీరే క్రియాశీలంగా ఉంటారు. ఎన్నికల్లో గెలుపోటములకు బాధ్యత వహిస్తారు. ఈ మూడేళ్ల తర్వాత పదవుల ఎంపికలో డీసీసీలకు ప్రాధాన్యమిస్తారు. మూడేళ్ల ప్రతిపాదనపై వచ్చే నెలలో గుజరాత్‌లో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.

3 నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకల్లో

మోదీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 3 నుంచి 6వ తేదీ వరకు థాయ్‌లాండ్, శ్రీలంక దేశాల్లో పర్యటించనున్నారు. ప్రాంతీయ సహకారానికి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ‘మహాసాగర్ విధానం’అమలే ఈ పర్యటన లక్ష్యమని విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. మొదటగా ఆయన థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ 3, 4 తేదీల్లో జరిగే బిమ్‌స్టెక్ ఆరో శిఖరాగ్రంలో పాల్గొంటారు. 3న థాయ్ ప్రధానితో భేటీ అవుతారు. అనంతరం శ్రీలంకకు వెళతారని తెలిపింది. శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసనాయకేతో చర్చలు జరుపుతారంది. మారిషస్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ ‘మహాసాగర్’ను ప్రకటించినట్లు విదేశాంగ శాఖ గుర్తు చేసింది. భారత్‌తోపాటు బంగాళాఖాత తీరప్రాంత దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, భూటాన్‌లతో ఏర్పాటైనదే బిమ్‌స్టెక్ కూటమి.

యూకేలో మమతకు నిరసనల సెగ

- ఆక్స్‌ఫర్డ్‌లో ప్రసంగాన్ని అడ్డుకున్న విద్యార్థులు
- ‘ఆర్‌జీ కర్’పై ప్రశ్నలు, గో బ్యాక్ నినాదాలు



1990ల్లో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నప్పటి దృశ్యాన్ని ప్రదర్శిస్తున్న మమత

లండన్: బ్రిటన్ పర్యటనలో ఉన్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదరైంది. శుక్రవారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని కెల్లాగ్ కాలేజీలో మమత ప్రసంగాన్ని విద్యార్థులు అడ్డుకున్నారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారోదంతంలో మమత సర్కారు వ్యవహార శైలిని సూటి ప్రశ్నలతో నిలదీశారు. ఆమె ప్రసంగంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెద్దపెట్టున నినాదాలకు దిగారు. అవాంతరాల మధ్యనే మమత ప్రసంగాన్ని కొనసాగించారు. ‘‘ఎన్ని అవాంతరాలు ఎదురైనా ‘దీదీ’పట్టించుకోదు. రాయల్ బెంగాల్ టైగర్‌లా పోరాడుతుంది’’అని ప్రకటించారు. ప్రజలకు మాత్రమే తలొంచుతానన్నారు. అయినా విద్యార్థులు తనను ఎద్దేవా చేస్తుండటంతో అనూహ్యంగా తలకు బ్యాండేజీతో ఉన్న 1990ల నాటి తన ఫొటోను బయటికి తీసి వారి ముందు ప్రదర్శించారు. ‘‘అప్పట్లో విపక్షంలో ఉన్న నాపై హత్యాయత్నాలే జరిగాయి. అయినా బెదరలేదు నేను. పోరాటాలు నాకు కొత్తేమీ కాదు’’అని నాటకీయంగా చెప్పుకొచ్చారు. కెల్లాగ్ కాలేజీకి అతిథిగా వెళ్లిన మమత బెంగాల్లో అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాల గురించి మాట్లాడుతుండగా నిరసన ప్రారంభమైంది. రాష్ట్రానికి వచ్చిన లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్న వ్యాఖ్యలపై ఒక విద్యార్థి అభ్యంతరం లేవనెత్తాడు. ఏమేం పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది ప్రెస్ కాన్ఫరెన్స్ కాదంటూ ఇతరులు అతన్ని వారించారు. అయినా ప్రశ్నలాగలేదు. సంచలనం సృష్టించిన ఆర్జీ కర్ హత్యాచారంపై పలు ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనిపై మమత ఘాటుగా స్పందించారు. ‘‘వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. కేసు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది. ఈ వేదిక రాజకీయాల కోసం కాదు. ఇక్కడ రాజకీయాలు చేయొద్దు’’అని హితవు పలికారు. ప్రశ్నించే వారికి రాజకీయ ఎజెండా ఉందని ఆరోపించారు. బెంగాల్లో హిందువుల పట్ల మమత సర్కారు తీరుపై మరొకరు నిలదీశారు. తాను అందరి పక్షాన ఉన్నానని ఆమె బదులిస్తుండగానే ‘గో బ్యాక్’అంటూ నినాదాలు చేశారు. మమత ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని, ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తోందని ఆరోపించారు. వామపక్ష విద్యార్థి సంస్థ ఎస్ఎఫ్ఐ (యూకే) సభ్యులు ఈ నిరసనలకు నేతృత్వం వహించారు. దాంతో విసుగుచెందిన మమత, ‘‘మీరు అవమానిస్తోంది నన్ను కాదు. మీ సంస్థనే అగౌరవపరుస్తున్నారు. ప్రేక్షకుల్లో ఒక వర్గం తీవ్ర వామపక్ష, మతతత్వ మిత్రులు. నేనెక్కడికి వెళ్లినా ఇలాంటి అడ్డంకులే సృష్టిస్తున్నారు. నేను ప్రతి మతాన్నీ సమర్థిస్తాను. అన్ని మతాల వారికీ మద్దతిస్తాను’’అన్నారు. తర్వాత ఆమె ప్రసంగం కొనసాగింది. నిరసనలకు బాధ్యత వహిస్తూ ఎస్ఎఫ్ఐ (యూకే) ప్రకటన విడుదల చేసింది. ‘‘బెంగాల్లో మమత అవినీతి, అప్రజాస్వామిక పాలనను వ్యతిరేకిస్తున్నాం. రాష్ట్రంలో ఆరేళ్లుగా విద్యార్థి ఎన్నికల్లేవు. బాలికల్లో స్కూల్ డ్రాపౌట్స్ పెరిగాయి. జాదవ్‌పూర్ వర్సిటీలో విద్యార్థుల నిరసనలను అణచేశారు. వీటిపై మమతను ప్రశ్నించాం. ఆమె ప్రజాస్వామ్య వ్యతిరేకి’’అని విమర్శించింది.

అమెరికా తిప్పి పంపిన

అక్రమ వలసదారులు 636 మంది

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 636 మంది భారతీయులను అమెరికా వెనక్కి పంపించింది. వీరిలో 341 మంది చార్టెర్డ్ విమానాల్లో, 55 మంది పనామా నుంచి వాణిజ్య విమానాల్లో, మిగతా 240 మంది వేర్వేరు వాణిజ్య విమానాల్లో చేరుకున్నారని లోక్‌సభలో విదేశాంగ శాఖసహాయ మంత్రి కృతి వర్ధన్ సింగ్ ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. అమెరికాలో ఉంటున్న 18 వేల మంది భారతీయ అక్రమ వలసదారులను వాపసు తీసుకునేందుకు కేంద్రం అంగీకరించిందంటూ వచ్చిన వార్తలపై టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ ప్రశ్నించగా..విదేశాల్లో ఉండే అక్రమ వలసదారులను వెనక్కి తీసుకెళ్లాల్సిన బాధ్యత సంబంధిత దేశాలదేనని మంత్రి చెప్పారు. భారత్ ఒక్కటే కాదు..అంతర్జాతీయ సంబంధాల్లో అందరూ అంగీకరించిన సూత్రమని చెప్పారు. తమ నిర్బంధంలో ఉన్న మరో 295 మంది వ్యక్తుల సమాచారాన్ని యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మన అధికారులకు అందజేసిందని మంత్రి చెప్పారు. వీరు మన జాతీయులేనా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అమెరికా ప్రభుత్వం తిప్పి పంపేవారికి అవసరమైన సాయాన్ని అందజేస్తామని స్పష్టం చేశారు.

అసలైన రైతు నేత దలీవాల్: సుప్రీం

న్యూఢిల్లీ: రైతు సంఘం నాయకుడు జగ్జీత్ సింగ్ దలీవాల్ అసలు సిసలైన రైతు నాయకుడని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆయనకు రాజకీయ అజెండా లేదని వెల్లడించింది. రైతుల సమస్యల పరిష్కారం కోసం దలీవాల్ నాలుగు నెలలపాటు నిరాహార దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఇటీవలే ఆయన దీక్ష విరమించారు. ఎలాంటి రాజకీయ అజెండా లేకుండా రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న నిజమైన నేత దలీవాల్ అని సుప్రీంకోర్టు ప్రశంసించింది. పంజాబ్– హరియాణా సరిహద్దులోని ఖనౌరీ, శంభులో రైతుల నిరసన శిబిరాలు ఇటీవల మూతపడ్డాయి. రహదారులపై రాకపోకలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పంజాబ్ అడ్వొకేట్ జనరల్ గుర్మీందర్‌సింగ్ శుక్రవారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో దలీవాల్‌పై న్యాయస్థానం ప్రశంసల వర్షం కురిపించింది. రైతు సమస్యల పరిష్కారానికి ఆయన నిజాయతీగా కృషి చేస్తున్నారని, మరికొందరు నాయకులు మాత్రం సమస్యలు పరిష్కారం కావొద్దని కోరుకుంటున్నారని ఆక్షేపించింది. ఈ నెల 19వ తేదీన అరెస్టయిన రైతు సంఘం నేతలు పాంధర్, కోహర్, కోట్రాతో పాటు ఇతర నాయకులు శుక్రవారం జైళ్ల నుంచి విడుదలయ్యారు.

ఛత్తీస్‌గఢ్‌లో 45 కిలోల భారీ మందుపాతర గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు పెను ప్రమాదం తప్పింది. బీజాపూర్ జిల్లా పల్నార్‌లో భారీ మందుపాతరను గుర్తించారు. సీఆర్‌పీఎఫ్ 222 బెటాలియన్ బలగాలు శుక్రవారం ఉదయం చెర్పాల్– పల్నార్ మార్గంలో తనిఖీలు చేపట్టాయి. రోడ్డుపై ఏర్పాటు చేసిన 45 కిలోల శక్తిమంతమైన మందుపాతరను గుర్తించారు. దాన్ని అత్యంత జాగ్రత్తగా బయటకు తీసి నిర్వీర్యం చేశారు. దీంతో బలగాలకు పెను ప్రమాదం తప్పినట్లయింది. ఇది పేలితే ఒక మినీ ట్రక్కు తుత్తునియలు కావడంతోపాటు ఆ ప్రాంతంలో 15 అడుగుల లోతైన గొయ్యి ఏర్పడుతుందని చెబుతున్నారు. భద్రతా బలగాల వాహనాలే లక్ష్యంగా కమాండ్ స్విచ్ విధానంలో పనిచేసేలా దీనిని మావోయిస్టులు అమర్చారని అంటున్నారు.

సర్వీస్ చార్జీ స్వచ్ఛందమే

- రెస్టారెంట్లు బలవంతంగా వసూలు చేయరాదు
- ఢిల్లీ హైకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ: హోటళ్లు, రెస్టారెంట్లు సర్వీస్ చార్జీల పేరుతో అదనంగా వసూలు చేయడాన్ని ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తప్పుబట్టింది. వినియోగదారులు సర్వీస్ చార్జీలను స్వచ్ఛందంగా ఇవ్వాల్సిందే తప్ప వారి నుంచి బలవంతంగా వసూలు చేయజాలవని స్పష్టం చేసింది. బిల్లుపై అదనంగా సర్వీస్ చార్జీలంటూ వసూలు చేయరాదన్న సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) నిబంధనలను సవాల్ చేస్తూ రెస్టారెంట్ల సంఘాలు వేసిన పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ ప్రతిభా ఎం.సింగ్ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ‘‘కస్టమర్లకు ఇష్టమైతే టిప్ ఇవ్వొచ్చు. అంతేతప్ప సర్వీస్ చార్జీలంటూ వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. అసలు బిల్లులో కలపని ఈ మొత్తాన్ని జీఎస్టీ లేదా సర్వీస్ ట్యాక్స్ అని కస్టమర్లు భావించే అవకాశముంది. ఇది మోసమే అవుతుంది’’ అని జడ్జి పేర్కొన్నారు. పిటిషన్‌దారులైన ఫెడరేషన్ ఆఫ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌హెచ్ఆర్ఏఐ), నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్ఆర్ఏఐ)లకు చెరో రూ.లక్ష చొప్పున జరిమానా సైతం విధించారు. వినియోగదారుల సంక్షేమానికి ఉపయోగపడేలా ఈ మొత్తాన్ని సీసీపీఏ ఖాతాలో జమ చేయాలన్నారు. రెస్టారెంట్ల హక్కుల కంటే వినియోగదారుల హక్కులకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని తేల్చి చెప్పారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు..

పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: లోక్‌సభ, అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు కనీసం రెండు శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ‘‘ఉద్యోగాల్లో, మరొకటో అయితే జోక్యం చేసుకున్నేవాళ్లం. కానీ విధానపరమైన ఈ అంశంపై మేమెలా ఆదేశాలివ్వగలం?’’ అని ప్రశ్నించింది. ప్రభుత్వ కార్యాలయాల్లోకి దివ్యాంగులు సులువుగా వచ్చి వెళ్లగలిగేలా ఏర్పాట్లు చేయాలన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఈ సందర్భంగా పిటిషనర్ ప్రస్తావించారు. ‘‘ఇలాంటి సమస్యలు పరిష్కారమయ్యేలా జోక్యం చేసుకోగలం. లేనట్లయితే పిటిషన్‌ను విచారించలేం’’ అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీహ్ ధర్మాసనం పేర్కొంది. పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు తెలిపింది.

విదేశీ జైళ్లలోని

10వేల మంది భారతీయులకు స్వేచ్ఛ

న్యూఢిల్లీ: వివిధ దేశాల్లో జైళ్లలో ఉన్న 10 మందికి పైగా భారతీయ ఖైదీలను మోదీ ప్రభుత్వం స్వదేశానికి తీసుకువచ్చిందని అధికారులు శుక్రవారం తెలిపారు. ఆయా దేశాలతో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో ఖైదీల్లో చాలా మందికి గణనీయంగా శిక్షలను తగ్గించగలిగిందని చెప్పారు. 2014 నుంచి మోదీ ప్రభుత్వం విదేశాల్లోని భారతీయుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దౌత్యపరమైన చర్చలు, ఉన్నత స్థాయి జోక్యాల ఫలితంగా వివిధ ఆరోపణలపై విదేశాల్లోని జైళ్లలో ఉన్న 10 వేల మందికి పైగా మన వాళ్లను విడుదల చేయించిందన్నారు. రంజాన్ మాసం సందర్భంగా 500 మంది భారతీయ ఖైదీలను ఇటీవలే యూఏఈ ప్రభుత్వం విడిచిపెట్టిందని చెప్పారు. రెండు దేశాల మధ్య బలీయంగా ఉన్న సంబంధాలకు ఇదే నిదర్శనమని చెప్పారు. దౌత్యపరమైన ప్రయత్నాల ఫలితంగా 2022 నుంచి యూఏఈ 2,783 మంది భారతీయ ఖైదీలకు స్వేచ్ఛను ప్రసాదించింది. 2019లో ప్రధాని మోదీ సౌదీ అరేబియాలో పర్యటన అనంతరం యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ సుమారు 850 మంది భారతీయ ఖైదీల విడుదలకు ఆదేశాలిచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా మరణ శిక్ష ఎదుర్కొంటున్న 8 మంది మాజీ నేవీ అధికారులను ఖతార్ విడుదల చేసిందని చెప్పారు. ఇరాన్ 77 మందిని, బహ్రెయిన్ 250 మందిని, కువాయిట్ 22 మందిని ప్రధాని మోదీ జోక్యంతో వదిలిపెట్టాయని అధికారులు వివరించారు. శ్రీలంక కూడా అక్రమంగా చేపలు పడుతున్నారనే ఆరోపణలపై నిర్బంధించిన మత్స్యకారులను 2014 నుంచి ఇప్పటి వరకు 3,697 మందిని వదిలేసిందని వెల్లడించారు. ఇదే సమయంలో పాకిస్తాన్ 2,639 మంది జాలర్లను, 71 మంది పౌరులను విడుదల చేసిందన్నారు.



ఈ రోబో పేరు నియా. చైనా రాజధాని బీజింగ్‌లోని ఝొంగ్‌గ్వాన్‌కున్ ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన ఝొంగ్‌గ్వాన్‌కున్ ఫోరంలో సందర్శకులను పలకరిస్తూ సందడి చేసింది.



ఈ కార్యక్రమంలో మరో ఆకర్షణ. టీ1 అనే రోబో. ఇది ఫుట్‌బాల్ ఆడేయగలదు. ఫుట్‌బాల్‌ను కిక్ చేసేందుకు సిద్ధమవుతున్న పోజిచ్చి కార్యక్రమానికి వచ్చిన వారికి ఆశ్చర్యానికి గురి చేసింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థించిన కమిషన్?

రాష్ట్రాల ఏర్పాటు

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఫజల్ అలీ కమిషన్

భాషాప్రయుక్త ప్రాతిపదికన ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. దీంతో దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా ప్రస్తావనకు వచ్చింది. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌ను నియమించింది. కె.ఎం.ఫణిక్కర్, హెచ్.ఎం.కుంజ్రు సభ్యులుగా ఉన్న ఈ కమిషన్‌కు ఫజల్ అలీ నేతృత్వం వహించారు. 1955 సెప్టెంబర్‌లో ఈ కమిషన్ నివేదిక సమర్పించింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటును ఫజల్ అలీ కమిషన్ సమర్థించింది. కానీ ఒక భాష-ఒక రాష్ట్రం అనే డిమాండ్‌ను తిరస్కరించింది.

ఫజల్ అలీ కమిషన్ ప్రతిపాదనలు..

- రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో దేశ ఐక్యతను, రక్షణను బలోపేతం చేసేలా చర్యలు ఉండాలి.
- భాష, సాంస్కృతికపరమైన సజాతీయత ఉండాలి.
- ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.
- జాతీయాభివృద్ధితోపాటు రాష్ట్రాల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

దీనికి అనుగుణంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం, ఏడో రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పార్ట్-ఎ, పార్ట్-బి, పార్ట్-సి అనే వ్యత్యాసాలను రద్దు చేసి రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించింది. ఫలితంగా 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలతో నూతన వ్యవస్థ అమల్లోకి వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ - పెద్ద మనుషుల ఒప్పందం

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

1948లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర సంస్థను స్థాపించారు. తెలుగు మాట్లాడే వారందరినీ కలిపి ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనేది విశాలాంధ్ర ప్రధాన నినాదం. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విషయంలో నిర్ణయాన్ని హైదరాబాద్ రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి వదిలిపెట్టారు. హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీలో విశాలాంధ్ర ఏర్పాటు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, 103 మంది సభ్యులు అనుకూలంగా ఓటేశారు. 1956 ఫిబ్రవరి 20న తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన 8 మంది నాయకుల మధ్య ఢిల్లీలో ఒక ఒప్పందం కుదిరింది. దీన్నే 'పెద్ద మనుషుల ఒప్పందం' అంటారు. ఈ ఒప్పందంపై బూర్గుల రామకృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, జె.వి.నరసింగరావు, మర్రి చెన్నారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ, నీలం సంజీవరెడ్డి, సర్దార్ గౌతు లచ్చన్న సంతకాలు చేశారు.

1956 తర్వాత ఏర్పాటైన రాష్ట్రాలు

గుజరాత్ (1 మే, 1960): బొంబాయి రాష్ట్రాన్ని విడగొట్టి గుజరాత్‌ను 15వ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. బొంబాయి రాష్ట్రం పేరును మహారాష్ట్రగా మార్చారు.

నాగాలాండ్ (1 డిసెంబర్, 1963): అస్సాం రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించి నాగా కొండ ప్రాంతాలు, ట్యూన్‌సాంగ్ ప్రాంతాలతో నాగాలాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇది 16వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

హర్యానా(1 నవంబర్, 1966): పంజాబ్‌ను పునర్వ్యవస్థీకరించి హిందీ మాట్లాడే ప్రాంతాన్ని హర్యానా రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. షా కమిషన్ సూచన మేరకు చండీగఢ్‌ను పంజాబ్, హర్యానా రాష్ట్రాల ఉమ్మడి రాజధాని చేశారు. దీంతోపాటు చండీగఢ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా గుర్తించారు.

హిమాచల్ ప్రదేశ్ (25 జనవరి, 1971): పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలతో కలిపి కేంద్రపాలిత ప్రాంతమైన హిమాచల్‌కు రాష్ట్ర హోదా కల్పించారు. ఇది 18వ రాష్ట్రం.

మణిపూర్ (21 జనవరి, 1972): ఈశాన్య రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా మూడు కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రపాలిత ప్రాంతమైన మణిపూర్‌ను 19వ రాష్ట్రంగా మార్చారు.

త్రిపుర (21 జనవరి, 1972): కేంద్రపాలిత ప్రాంతమైన త్రిపురను 20వ రాష్ట్రంగా మార్చారు.

మేఘాలయ (21 జనవరి, 1972): అస్సాంలో ఉపరాష్ట్రంగా ఉన్న మేఘాలయను పూర్తి రాష్ట్రంగా మార్చారు. 1969లో మేఘాలయకు ఉపరాష్ట్ర హోదా కల్పించారు.

సిక్కిం (16 మే, 1975): 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింకు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక చరిత్ర ఉంది. 1947 వరకు సిక్కిం ఛోగ్యాల్ రాజవంశ పాలనలో ఉండేది. 1974లో 35వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింకు అసోసియేట్ రాష్ట్ర పతిపత్తి కల్పించారు. 10వ షెడ్యూల్‌లో నూతన ప్రకరణ 2ఎను చేర్చారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను సంపూర్ణ రాష్ట్రంగా గుర్తించారు. ఈ విధంగా సిక్కిం 22వ రాష్ట్రంగా ఏర్పాటైంది. 1974లో చేసిన 35వ రాజ్యాంగ సవరణను రద్దుచేశారు. ప్రకరణ 2ఎను, 10వ షెడ్యూల్‌లోని ప్రత్యేకతను తొలగించారు. ప్రకరణ 371ఎఫ్ ద్వారా సిక్కిం రాష్ట్రానికి ప్రత్యేక రక్షణ కల్పించారు.

మిజోరాం (20 ఫిబ్రవరి, 1987): కేంద్రపాలిత ప్రాంతమైన మిజోరాంకు 53వ రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్ర హోదా కల్పించారు. ఇది 23వ రాష్ట్రంగా ఏర్పాటైంది.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

అరుణాచల్ ప్రదేశ్ (20 ఫిబ్రవరి, 1987): 55వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన అరుణాచల్ ప్రదేశ్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదాను కల్పించారు. అరుణాచల్ ప్రదేశ్‌ను నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజెన్సీ (ఎన్‌ఈఎఫ్‌ఏ) అని పిలిచేవారు.

గోవా (30 మే, 1987): 56వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రపాలిత ప్రాంతమైన గోవాకు సంపూర్ణ రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. 1961లో పోర్చుగీసువారు గోవాను భారతదేశానికి అప్పగించారు. గోవా, డయ్యూ, డామన్‌లను కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేశారు. ఇందు కోసం 1962లో 12వ రాజ్యాంగ సవరణ చేశారు.

ఛత్తీస్‌గఢ్(1 నవంబర్, 2000): మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించి ఛత్తీస్‌గఢ్‌ను 26వ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు.

ఉత్తరాఖండ్ (9 నవంబర్, 2000): ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించారు. ఉత్తరాఖండ్ 27వ రాష్ట్రంగా ఏర్పాటైంది.

జార్ఖండ్ (15 నవంబర్, 2000): బిహార్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించి 28వ రాష్ట్రంగా జార్ఖండ్‌ను ఏర్పాటు చేశారు.

తెలంగాణ (2 జూన్, 2014): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్వ్యవస్థీకరించి 10 జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

వివరణ: 1954లో ఫ్రెంచివారు పాండిచ్చేరిని భారత్‌కు అప్పగించారు. 1962లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా పాండిచ్చేరిలో 4 జిల్లాల(పాండిచ్చేరి, కరైకల్, మహే, యానాం)ను కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటు చేశారు.

కేంద్రపాలిత ప్రాంతాలు- ఏర్పాట్లు

దాద్రానగర్ హవేలి: 1954 వరకు ఈ ప్రాంతం పోర్చుగీసు వారి ఆధీనంలో ఉండేది. 1961లో పదో రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు.

దామన్ – దయ్యూ: భారత ప్రభుత్వం 1961లో సైనిక చర్య ద్వారా ఈ ప్రాంతాలను పోర్చుగీసు వారి నుంచి స్వాధీనం చేసుకుంది. 12వ రాజ్యాంగ సవరణ ద్వారా 1962లో కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు. 1987లో గోవా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా కొనసాగించారు.

పాండిచ్చేరి: ఇది పుదుచ్చేరి, కరైకల్, మహే, యానాం అనే నాలుగు ప్రాంతాల కలయిక. 1964లో ఫ్రెంచివారు ఈ ప్రాంతాలను భారత్‌కు అప్పగించారు. 1962లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ప్రాంతాలకు కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.

చండీగఢ్: 1966లో పంజాబ్ పునర్వ్యవస్థీకరణ ద్వారా హర్యానా, పంజాబ్‌లకు ఉమ్మడి రాజధాని అయిన చండీగఢ్‌కు కేంద్రపాలిత ప్రాంత హోదా కల్పించారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు - పాత పేర్లు - నూతన పేర్లు

సం.	పాత పేరు	కొత్తపేరు
1950	యునైటెడ్ ప్రావిన్స్	ఉత్తరప్రదేశ్
1956	ట్రావెన్‌కోర్	కొచ్చిన్ కేరళ
1959	మధ్యభారత్	మధ్యప్రదేశ్
1960	బొంబాయి	మహారాష్ట్ర
1968	మద్రాసు	తమిళనాడు
1973	మైసూరు	కర్ణాటక
1973	లక్కదీవి, మినికాయ్ అమినదీవి	లక్షదీవులు
2006	ఉత్తరాంచల్	ఉత్తరాఖండ్
2006	పాండిచ్చేరి	పుదుచ్చేరి
2007	అస్సాం	అసోం
2011	ఒరిస్సా	ఒడిశా
2011	పశ్చిమ బెంగాల్	పశ్చిమ బంగ

రాష్ట్రాలు - ప్రత్యేక హోదా

ప్రత్యేక హోదా – చరిత్ర: అయిదో ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించే పద్ధతిని 1969లో ప్రవేశపెట్టారు. మొదట్లో అస్సాం, నాగాలాండ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాలకు మాత్రమే ప్రత్యేక హోదా ఉండేది. తర్వాత అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కూడా వర్తింపజేశారు.

ప్రాతిపదిక: ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించేందుకు వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అవి...

- పర్వత ప్రాంతాలు, రవాణాకు కష్టతరమైనవి
- తక్కువ జనసాంద్రత, అధిక గిరిజనులు ఉన్న ప్రాంతాలు
- సరైన మౌలిక సదుపాయాలు లేని ప్రాంతాలు
- ఆర్థికంగా పటిష్టంగా లేని రాష్ట్రాలు
- విదేశాలతో సరిహద్దులు ఉండి, వ్యూహాత్మకంగా ప్రాధాన్యమున్న రాష్ట్రాలు.

ప్రత్యేక హోదాను నిర్ణయించేది: ప్రధానమంత్రి అధ్యక్షుడిగా ఉన్న జాతీయాభివృద్ధి మండలి, ప్రణాళికా సంఘం(ప్రస్తుతం నీతి ఆయోగ్) సలహా మేరకు ప్రత్యేక హోదాపై నిర్ణయం తీసుకుంటారు. ప్రత్యేక హోదాకు నిధుల కేటాయింపులతో సంబంధం ఉండటం వల్ల కేంద్ర ఆర్థిక సంఘాన్ని కూడా సంప్రదించాలి.

ప్రయోజనాలు

- కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహాయాన్ని గ్రాంట్ల రూపంలో అందిస్తుంది.
- కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధుల్లో 30 శాతం నిధులను తొలుత ఈ రాష్ట్రాలకు కేటాయిస్తారు. మిగతా వాటాను ఇతర రాష్ట్రాలకు ఇస్తారు.
- కేంద్ర ప్రభుత్వ పథకాల్లో 90 శాతం నిధులను గ్రాంట్ల రూపంలో, 10 శాతం నిధులను రుణంగా ఇస్తారు.
- పన్నుల్లో మినహాయింపు ఉంటుంది.
- రుణాలు చెల్లింపును వాయిదా వేయడం, పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తారు.

గాడ్గిల్ - ముఖర్జీ ఫార్ములా

ప్రత్యేక హోదా లేని రాష్ట్రాలకు గాడ్గిల్ – ముఖర్జీ ఫార్ములా ప్రకారం నిధులను కేటాయిస్తారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డి.ఆర్. గాడ్గిల్ 1969లో ఈ ప్రతిపాదన చేశారు. 1990లో ప్రణాళికా సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీ మరికొన్ని మార్పులు సూచించారు. అందుకే దీన్ని గాడ్గిల్-ముఖర్జీ ఫార్ములా అంటారు. దీనికి అనుగుణంగా జాతీయాభివృద్ధి మండలి నూతన పద్ధతిని నిర్ణయించింది. దీని ప్రకారం రాష్ట్రాలకు ఈ కింది అంశాల ఆధారంగా నిధులను కేటాయిస్తారు.

ప్రాతిపదిక	శాతం
జనాభా	60 శాతం
తలసరి ఆదాయం	25 శాతం
ఆర్థిక నిర్వహణ	7.5 శాతం
ప్రత్యేక సమస్యలు	7.5 శాతం
మొత్తం	100 శాతం

దేశవ్యాప్తంగా ప్రత్యేక రాష్ట్రాల కోసం జరుగుతున్న ఉద్యమాలు

- అసోం – బోడోలాండ్, కర్బి, అంగ్లాంగ్
- కర్ణాటక – కొడగు (కూర్గ్)
- మహారాష్ట్ర – విదర్భ
- గుజరాత్ – సౌరాష్ట్ర
- ఉత్తరప్రదేశ్ – హరితప్రదేశ్, పశ్చిమ ప్రదేశ్, అవధ్ ప్రదేశ్, పూర్వాంచల్
- మధ్యప్రదేశ్ – వింధ్యప్రదేశ్, అవధ్
- బిహార్, జార్ఖండ్– మిథిలాంచల్, కోసల్
- కేరళ, కర్ణాటక సరిహద్దుల్లో – తుళునాడు
- పశ్చిమ బెంగాల్– గూర్ఖాలాండ్
- ఒడిశా – కోసల్
- జమ్మూ కశ్మీర్ – లడక్
- మేఘాలయ – గారోలాండ్
- మణిపూర్ – కుకీలాండ్

'ధైవారాధన' పదంలోని సంధి ఏది?

వ్యాకరణాంశాలు - సంధులు

డీఈఈసెట్‌లో సంధులకు సంబంధించి కనీసం రెండు మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. సంధులను ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1) సంస్కృత సంధులు, 2) తెలుగు సంధులు.

సవర్ణదీర్ఘ సంధి, గుణ సంధి, వృద్ధి సంధి, యణాదేశ సంధి, విసర్గ సంధి, జశ్త్వ సంధి, శ్చుత్వ సంధి లాంటివి సంస్కృత సంధులు. త్రిక సంధి, అత్వ సంధి, ఇత్వ సంధి, ఉత్వ సంధి, ప్రాతాది సంధి, రుగాగమ సంధి, నుగాగమ సంధి, పడ్వాది సంధి, లు, ల, నల సంధి, ఆమ్రేడిత సంధి, ద్విరుక్తటకార సంధి, సరళా దేశ సంధి, గ, స, డ, ద, వా దేశ సంధి మొదలైనవి తెలుగు సంధులు. పాఠ్యాంశాల ఆధారంగా వీటిపై ప్రశ్నలు అడుగుతారు.

సంధులపై ప్రశ్నలను ప్రధానంగా మూడు రకాలుగా ఇస్తారు. రెండు పదాలు ఇచ్చి అవి ఏ సంధికి సంబంధించినవో గుర్తించమంటారు. కొన్ని సంధి రూపాలను విడగొట్టి సరైన రూపమేదో గుర్తించమంటారు. కొన్ని విడగొట్టిన రూపాలను సరైన రీతిలో కలిపిన పదం గుర్తించమని అడుగుతారు. అందువల్ల అభ్యర్థులు సంధులపై సరైన అవగాహన ఏర్పరచుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

1. 'అత్యంత' పదంలోని సంధి ఏది?
   1) సవర్ణదీర్ఘ సంధి
   2) యణాదేశ సంధి
   3) యడాగమ సంధి
   4) వృద్ధి సంధి
2. 'అభ్యుత్థానం' పదాన్ని విడదీసి రాస్తే..?
   1) అభ్య + ఉత్థానం
   2) అభ్యు + ఉత్థానం
   3) అభి + ఉత్థానం
   4) అభి + యుత్థానం
3. 'బసవేశ్వరుడు' పదంలోని సంధి ఏది?
   1) గుణ సంధి 2) వృద్ధి సంధి
   3) ఇత్వ సంధి 4) అత్వ సంధి
4. కుల + ఉచితం = ...?
   1) కులాచితం 2) కులోచితం
   3) కులౌచితం 4) కులీచితం
5. 'దైవారాధన' పదంలోని సంధి ఏది?
   1) సవర్ణదీర్ఘ సంధి 2) గుణసంధి
   3) అత్వ సంధి 4) వృద్ధి సంధి
6. 'ఏ-ఓ-అర్'లను ఏమంటారు?
   1) సవర్ణాలు 2) గుణాలు
   3) వృద్ధులు 4) యణ్ణులు
7. 'మదోన్మాదము' పదంలో ఉన్న సంధి?
   1) వృద్ధి సంధి 2) జశ్త్వ సంధి
   3) గుణ సంధి 4) యణాదేశ సంధి
8. మృట్ + మయం = ...?
   1) మృడ్మయం 2) మృణ్మయం
   3) మృట్మయం 4) మృట్‌మయం
9. 'వాఙ్మయము' పదాన్ని విడదీసి రాస్తే ..?
   1) వాజ్ + మయము
   2) వాగ్ + మయము
   3) వాక్ + మయము
   4) వాజ్ + మయము
10. 'జగన్నాథుడు' పదంలోని సంధి ఏది?
    1) జశ్త్వ సంధి 2) అనునాసిక సంధి
    3) నుగాగమ సంధి 4) శ్చుత్వ సంధి
11. ఫణాగ్రము పదాన్ని విడదీసి రాస్తే..?
    1) ఫణి + అగ్రము 2) ఫణా + అగ్రము
    3) ఫణ + అగ్రము 4) ఫణీ + ఆగ్రము
12. 'రసైక స్థితి' పదంలో ఉన్న సంధి ఏది?
    1) సవర్ణదీర్ఘ సంధి 2) యణాదేశ సంధి
    3) గుణ సంధి 4) వృద్ధి సంధి
13. 'య-వ-ర'లను ఏమంటారు?
    1) ఇక్కులు 2) యణ్ణులు
    3) గుణాలు 4) సవర్ణాలు
14. 'ధర్మమేల' పదంలో ఉన్న సంధి ఏది?
    1) అత్వ సంధి 2) ఇత్వ సంధి
    3) ఉత్వ సంధి 4) గుణ సంధి
15. 'అవ్విధంబు' పదంలో ఉన్న సంధి ఏది?
    1) ఇత్వ సంధి 2) అత్వ సంధి
    3) త్రిక సంధి 4) యణాదేశ సంధి
16. 'సరసపుమాట' విడదీసి రాస్తే?
    1) సరసపు + మాట
    2) సరసము + మాట
    3) సరసం + మాట
    4) సరసంపు + మాట
17. 'ముత్తెపుసరులు' పదంలోని సంధి ఏది?
    1) సరళాదేశ సంధి
    2) గ, స, డ, దవా దేశ సంధి
    3) ప్రాతాది సంధి
    4) పుంప్వాదేశ సంధి
18. 'బిరుదాంకితులు' పదాన్ని విడదీసి రాస్తే?
    1) బిరుదు + అంకితులు
    2) బిరుదా + అంకితులు
    3) బిరుద + అంకితులు
    4) బిరుద + ఆంకితులు
19. యడాగమ సంధికి ఉదాహరణ?
    1) అత్యంత 2) పల్కకయుండు
    3) నాకేల 4) కవీశ్వరుడు
20. 'పిత్రార్జితం' పదాన్ని విడదీసి రాస్తే..?
    1) పిత్ర + ఆర్జితం 2) పిత్రా + అర్జితం
    3) పితృ + ఆర్జితం 4) పిత్రు + ఆర్జితం
21. 'దిగ్ర్యాంతి' పదంలోని సంధి ఏది?
    1) శ్చుత్వ సంధి 2) సరళాదేశ సంధి
    3) జశ్త్వ సంధి 4) యణాదేశ సంధి



22. 'విద్యుచ్ఛక్తి' పదాన్ని విడదీసి రాస్తే?
    1) విద్యుత్ + చక్తి 2) విద్యుత్ + శక్తి
    3) విద్యుస్ + శక్తి 4) విద్యుత్ + ఛక్తి
23. 'సజ్జనుడు' పదంలో ఉన్న సంధి?
    1) జశ్త్వ సంధి 2) అనునాసిక సంధి
    3) విసర్గ సంధి 4) శ్చుత్వ సంధి
24. 'గుణౌద్ధత్యం' పదాన్ని విడదీసి రాస్తే..?
    1) గుణ + ఓద్ధత్యం
    2) గుణౌ + ఉద్ధత్యం
    3) గుణ + ఔద్ధత్యం
    4) గుణా + ఉద్ధత్యం
25. 'బాలెంతరాలు' పదంలో ఉన్న సంధి?
    1) అత్వ సంధి 2) ఇత్వ సంధి
    3) ఉత్వ సంధి 4) రుగాగమ సంధి
26. జవ + ఆలు = ...?
    1) జవాలు 2) జవరాలు
    3) జవ్వరాలు 4) జవ్వాలు
27. 'గుణవంతురాలు' పదాన్ని విడదీసి రాస్తే?
    1) గణవంత + రాలు
    2) గుణవంత + ఆలు
    3) గుణవంతు + ఆలు
    4) గుణవంతు + రాలు
28. 'కెందామర' పదంలో ఉన్న సంధి?
    1) 'గ, స, డ, ద వా దేశ సంధి
    2) సరళాదేశ సంధి
    3) ప్రాతాది సంధి 4) నుగాగమ సంధి
29. 'మీఁగడ' పదాన్ని విడదీసి రాస్తే..?
    1) మీ + గడ 2) మీ + కడ
    3) మీదు + కడ 4) మీదు + గడ
30. 'చతుష్షష్టి' పదంలోని ఉన్న సంధి?
    1) ప్రాతాది సంధి 2) విసర్గ సంధి
    3) శ్చుత్వ సంధి 4) జశ్త్వ సంధి
31. 'తపః + ఫలము' పదాన్ని కలిపితే..?
    1) తపోఫలము 2) తపస్ ఫలము
    3) తపః ఫలము 4) తపప్ఫలము
32. 'అంతరాత్మ' పదాన్ని విడదీసి రాస్తే?
    1) అంతర + ఆత్మ 2) అంతరా + ఆత్మ
    3) అంతః + ఆత్మ 4) అంతరౌ + ఆత్మ
33. 'నృత్యాలు' పదంలో ఉన్న సంధి?
    1) ప్రాతాది సంధి
    2) లు, ల, న, ల సంధి
    3) పడ్వాది సంధి 4) నుగాగమ సంధి
34. 'చెందొవ' – పదాన్ని విడదీసి రాస్తే..?
    1) చెందు + ఒవ 2) చెందు + ఉవ
    3) చెన్ను + తొవ 4) చెన్ను + దొవ
35. 'క్రొక్కారు' పదంలోని సంధి ఏది?
    1) ప్రాతాది సంధి 2) క్రొత్తాది సంధి
    3) ద్విత్వ సంధి 4) నుగాగమ సంధి
36. 'కెందామరలు' పదాన్ని విడదీసి రాస్తే?
    1) కెం + తామరలు
    2) కెం + దామరలు
    3) కెంద + అమరలు
    4) కెంపు + తామరలు
37. పగలు + పగలు = ...?
    1) పగపగలు 2) పట్టపగలు
    3) పగపగాలు 4) పట్టాపగాలు
38. 'అమ్మహాత్ములు' పదంలో ఉన్న సంధి?
    1) అత్వ సంధి 2) ప్రాతాది సంధి
    3) త్రిక సంధి 4) సవర్ణదీర్ఘ సంధి
39. 'త్రికాలు' అంటే?
    1) ఆ-ఈ-ఓ 2) ఆ-ఈ-ఏ
    3) అ-ఇ-ఎ 4) ఆ-ఈ-ఐ
40. ముత్యము + లు = ...?
    1) ముత్యములు 2) ముత్యంబులు
    3) ముత్యాలు 4) ముత్తెములు
41. 'రాజర్షి' పదాన్ని విడదీసి రాస్తే..?
    1) రాజు + ఋషి 2) రాజ + ఋషి
    3) రాజర్ + షి 4) రాజ + అర్షి
42. వీడు + చక్రపాణి = ...?
    1) వీడు జక్రపాణి 2) వీడు సక్రపాణి
    3) వీడు చక్రపాణి 4) వీడు సెక్రపాణి
43. 'స్వరూపౌచిత్యం' పదంలో ఉన్న సంధి?
    1) గుణ సంధి 2) వృద్ధి సంధి
    3) యణాదేశ సంధి 4) యడాగమ సంధి
44. 'అయోమయం' పదాన్ని విడదీసి రాస్తే?
    1) అయో + మయం
    2) అయ + ఉమయం
    3) అయః + మయం
    4) అయం + మయం
45. 'భయంపడు' పదంలో ఉన్న సంధి?
    1) ముల్లోప సంధి 2) పడ్వాది సంధి
    3) సరళా దేశ సంధి 4) ఉత్వ సంధి
46. కిందివాటిలో గుణ సంధి ఏది?
    1) సహస్రాబ్ది 2) నిరాశ
    3) జీవనోపాధి 4) మేమంతా
47. 'అజంతం' పదంలో ఉన్న సంధి ఏది?
    1) శ్చుత్వ సంధి 2) జశ్త్వ సంధి
    3) సరళాదేశ సంధి 4) అత్వ సంధి
48. 'కకుబంతం' పదాన్ని విడదీసి రాస్తే..?
    1) కకుబ్ + అంతం
    2) కకుబ + అంతం
    3) కకుప్ + అంతం
    4) కకుప + అంతం
49. 'కట్టెదుట' – పదంలో ఉన్న సంధి?
    1) ఆమ్రేడిత సంధి
    2) ద్విరుక్తటకార సంధి
    3) ఉత్వ సంధి 4) అత్వ సంధి
50. 'ముద్దుటుంగరం' పదాన్ని విడదీస్తే..?
    1) ముద్దుట + ఉంగరం
    2) ముద్దుటు + ఉంగరం
    3) ముద్దు + ఉంగరం
    4) ముద్దుల + ఉంగరం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 2; 5) 1; 6) 2; 7) 3; 8) 2; 9) 3; 10) 2; 11) 3; 12) 4; 13) 2; 14) 3; 15) 3; 16) 2; 17) 4; 18) 3; 19) 2; 20) 3; 21) 3; 22) 2; 23) 4; 24) 3; 25) 4; 26) 2; 27) 2; 28) 3; 29) 3; 30) 2; 31) 3; 32) 3; 33) 2; 34) 3; 35) 1; 36) 4; 37) 2; 38) 3; 39) 2; 40) 3; 41) 2; 42) 3; 43) 2; 44) 3; 45) 2; 46) 3; 47) 2; 48) 3; 49) 2; 50) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

బీఈఎల్, హైదరాబాద్‌లో 32 పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 32.
- **పోస్టుల వివరాలు:** ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ (ఈఏటీ)-08, టెక్నీషియన్ సీ-21, జూనియర్ అసిస్టెంట్-03.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 01.03.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.21,500 నుంచి రూ.82,000, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీకి రూ.24,500 నుంచి రూ.90,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 09.04.2025.
- **వెబ్‌సైట్:** https://bel-india.in

ఎయిమ్స్ మంగళగిరి, ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) మంగళగిరిలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- **పోస్టుల వివరాలు:** కౌన్సిలర్-01, ప్రాజెక్ట్ అసిస్టెంట్-01, ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్-02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ ఎంఎస్‌డబ్ల్యూలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** కౌన్సిలర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్‌కు 40 నుంచి 45 ఏళ్ల లోపు ఉండాలి.
- **వేతనం:** నెలకు కౌన్సిలర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.23,815, ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్‌కు రూ.26,500.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఈమెయిల్:** community.medicine@aiimsmangalagiri.edu.in
- **దరఖాస్తులకు చివరితేది:** 31.03.2025.
- **ఇంటర్వ్యూ తేది:** 01.04.2025.
- **వెబ్‌సైట్:** www.aiimsmangalagiri.edu.in/

‘చమత్కార చంద్రిక’ రచయిత ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. రాజుకు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ అవసరాల కోసం ‘నాయంకర సైన్యం’ అనే వ్యవస్థను రూపొందించిన రాజ్యం ఏది?
   1) విజయనగర రాజులు
   2) చాళుక్యులు
   3) శాతవాహనులు 4) కాకతీయులు
2. సంస్కృతంలో ‘సంగీత చింతామణి’ గ్రంథాన్ని రాసిన రెడ్డిరాజు ఎవరు? (గ్రూప్-2, 2011)
   1) పెదకోమటి వేమారెడ్డి
   2) రాచవేమారెడ్డి
   3) కాటయ వేమారెడ్డి 4) కుమారగిరి రెడ్డి
3. రేచర్ల వెలమలు ఎక్కువగా ఆదరించిన మతం ఏది?
   1) శైవం 2) వైష్ణవం
   3) బౌద్ధం 4) క్రైస్తవం
4. రెడ్డిరాజుల ప్రధాన మతం ఏది?
   1) శైవం 2) వైష్ణవం
   3) బౌద్ధం 4) జైనం
5. పల్నాడు, వినుకొండ సీమల్లో ‘రంభయైన ఏకులు వడుకున్’ అని వర్ణించిన కవి?
   1) పోతనామాత్యుడు
   2) పాల్కురికి సోమనాథుడు
   3) శ్రీనాథమహాకవి 4) డిండిమభట్టు
6. దేశీయ-విదేశీ వర్తకుల సంరక్షణార్థం క్రీ.శ 1358లో మోటుపల్లి రేవు అభయ శాసనాన్ని సంస్కరించిన రెడ్డి రాజెవరు?
   1) కుమారగిరి రెడ్డి 2) అనపోతారెడ్డి
   3) పెదకోమటి వేమారెడ్డి
   4) కాటయ వేమారెడ్డి
7. కాకతీయ తోరణాన్ని తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంగా ఎంచుకున్నారు. ఓరుగల్లులోని స్వయంభూ దేవాలయానికి నాలుగు వైపులా రాతితో ఈ తోరణాలను ఏ కాకతీయ రాజు నిర్మించాడు?
   1) రెండో ప్రోలరాజు 2) ప్రతాపరుద్రుడు
   3) గణపతి దేవుడు 4) మహాదేవుడు
8. ‘ఆంధ్రదేశాధీశ్వరుడు’గా ఖ్యాతిగాంచిన కాకతీయ రాజు ఎవరు?
   1) ప్రతాపరుద్రుడు 2) రుద్రమదేవి
   3) ప్రోలరాజు 4) గణపతి దేవుడు
9. ‘రంగనాథ రామాయణం’ ఎవరు రచించారు?
   1) పోతన 2) శ్రీనాథుడు
   3) పండితారాధ్యుడు 4) గోన బుద్దారెడ్డి
10. ‘అవక్రవిక్రమ యశస్య సంభావ్య బాహార్గలుడు’ అనే బిరుదు ఎవరికి ఉంది?
    1) ముసునూరి ప్రోలయనాయకుడు
    2) ముసునూరి కాపయనాయకుడు
    3) ముసునూరి పోచయనాయకుడు
    4) ముసునూరి దేవయనాయకుడు
11. ముసునూరి కాపయనాయకునికి ‘అరుమనగంటి పురవరాధీశ్వరుడు’ (ఆమనగల్లు) అనే బిరుదు ఉన్నట్లు ఏ శాసనంలో పేర్కొన్నారు?
    1) కలువచేరు శాసనం
    2) పిల్లలమర్రి శాసనం
    3) ఆర్యావట శాసనం
    4) గణపేశ్వర శాసనం
12. ముసునూరి కాపయనాయకుడు, రేచర్ల అనపోతా నాయకుడి మధ్య క్రీ.శ 1367-68లో భీకర యుద్ధం ఎక్కడ జరిగింది?
    1) ఓరుగల్లు 2) భీమవరం
    3) నల్గొండ 4) పానగల్లు
13. రాచకొండ, దేవరకొండ రాజధానులుగా త్రిలింగ దేశాన్ని ఎవరు పాలించారు?
    1) కాకతీయులు
    2) రేచర్ల పద్మనాయకులు
    3) రెడ్డిరాజులు
    4) విజయనగర రాజులు
14. రేచర్ల వంశ మూలపురుషుడెవరు?
    1) రేచర్ల ప్రసాదిత్యుడు
    2) రేచర్లరుద్రుడు 3) బేతాళ రెడ్డి
    4) సర్వజ్ఞ సింగభూపాలుడు
15. రేచర్ల పద్మనాయకుల వంశచరిత్రను తెలిపే గ్రంథం పేరేమిటి?
    1) ప్రతాపరుద్ర చరిత్ర
    2) పండితారాధ్య చరిత్ర
    3) చమత్కార చంద్రిక
    4) వెలుగోటి వారి వంశావళి
16. ‘కాకతీయ రాజ్యస్థాపనాచార్య’ అనే బిరుదు ఉన్న రేచర్ల నాయకుడెవరు?
    1) రేచర్ల రుద్రుడు
    2) రేచర్ల ప్రసాదిత్యుడు
    3) బేతాళ రెడ్డి 4) సింగమనేడు
17. ‘సర్వజ్ఞ’ అనే బిరుదున్న రేచర్ల పద్మ నాయకుడెవరు?
    1) అనపోతానాయకుడు
    2) మాదానాయకుడు
    3) కుమారసింగభూపాలుడు
    4) దాచానాయకుడు
18. రెడ్డి-వెలమ రాజుల మధ్య అనుసంధానకర్తగా ఎవరు వ్యవహరించారు?
    1) పోతనామాత్యుడు 2) గౌరన
    3) కొరవి గోపరాజు 4) శ్రీనాథుడు
19. హన్మకొండలో పద్మాక్షి, సిద్ధేశ్వరాలయాలను నిర్మించిన కాకతీయ రాజెవరు?
    1) గణపతి దేవుడు 2) ప్రోలరాజు
    3) మహాదేవుడు 4) రుద్రమదేవి
20. తెలంగాణలో భారీ నీటి పారుదల సౌకర్యాల కల్పన చేపట్టిన తొలి రాజవంశం?
    1) కుతుబ్‌షాహీలు
    2) విజయనగర రాజులు
    3) కాకతీయులు
    4) రేచర్ల పద్మనాయకులు
21. కిందివాటిలో భిన్నమైంది ఏది?
    1) క్షీరారామం 2) ద్రాక్షారామం
    3) కాళేశ్వరం 4) శ్రీశైలం
22. శత్రువుల రక్తాన్ని శరీరమంతా పూసుకునే పూజా విధానమైన ‘రణము కుడుపు’ అనే భైరవ తాంత్రిక పద్ధతిని ఏ రాజవంశం ఆచరించింది?
    1) రేచర్ల పద్మనాయకులు
    2) రెడ్డిరాజులు 3) కాకతీయులు
    4) విజయనగర రాజులు
23. ‘గజ సాహిణీ’ అనే బిరుదు ఎవరిది?
    1) విద్యానాథుడు 2) రుద్రమదేవి
    3) జాయపసేనాని 4) గణపతి దేవుడు
24. ‘ప్రతాపరుద్ర యశోభూషణం’ రచయిత ఎవరు?
    1) శ్రీనాథుడు 2) విద్యానాథుడు
    3) పోతన 4) అచితేంద్రుడు
25. ‘చమత్కార చంద్రిక’ రచయిత ఎవరు?
    1) బొమ్మకంటి అప్పయామాత్యుడు
    2) శ్రీనాథుడు 3) పోతన
    4) విశ్వేశ్వరుడు
26. పుర్రిటిసుంకం, పొయ్యిలపై పన్ను విధించిన రెడ్డి రాజెవరు?
    1) పెదకోమటి వేమారెడ్డి
    2) సింగభూపాలుడు
    3) రాచవేమారెడ్డి 4) కుమారగిరిరెడ్డి
27. ‘కైఫీయతులు’ అంటే ఏమిటి?
    1) స్థానిక చరిత్రలు
    2) రాజవంశ చరిత్రలు
    3) పొగడ్తలు 4) నాణేలు
28. కాళిదాసు రాసిన అభిజ్ఞాన శాకుంతలం, విక్రమోర్వశీయం, మాళవికాగ్నిమిత్రం నాటకాలపై ‘కుమారగిరి రాజీయం’ పేరుతో సంస్కృతంలో వ్యాఖ్యానం రాసిన రెడ్డిరాజు ఎవరు?
    1) పెదకోమటి వేమారెడ్డి
    2) కుమారగిరి రెడ్డి
    3) రాచవేమారెడ్డి
    4) కాటయవేమారెడ్డి
29. శ్రీశైలంలో ‘వీర శిరోమండపం’ నిర్మించిన రెడ్డిరాజెవరు?



    1) రాచవేమారెడ్డి 2) కుమారగిరి రెడ్డి
    3) అనవేమారెడ్డి
    4) పెదకోమటి వేమారెడ్డి
30. అహోబిలం, శ్రీశైలం పాతాళ గంగకు సోపానాలు (మెట్లు) నిర్మించిన రెడ్డి రాజు?
    1) అనపోతారెడ్డి
    2) పెదకోమటి వేమారెడ్డి
    3) ప్రోలయవేమారెడ్డి
    4) రాచవేమారెడ్డి
31. ‘కర్పూర వసంతరాయుడు’ అనే బిరుదు ఉన్న రెడ్డిరాజు ఎవరు?
    1) అనవేమారెడ్డి
    2) కొమరగిరి (కుమారగిరి) రెడ్డి
    3) ప్రోలయవేమారెడ్డి
    4) పెదకోమటి వేమారెడ్డి
32. సంస్కృతంలో ‘సాహిత్య చింతామణి’, ‘సంగీత చింతామణి’ రాసిన రెడ్డిరాజు?
    1) పెదకోమటి వేమారెడ్డి
    2) రాచవేమారెడ్డి
    3) ప్రోలయ వేమారెడ్డి
    4) కాటయ వేమారెడ్డి
33. రెడ్డి రాజుల కాలంలో విదేశాలతో నౌకా వ్యాపారాన్ని నిర్వహించినవారు?
    1) వామన భట్టబాణుడు
    2) వెన్నెలకంటి సూరన
    3) అవచి తిప్పయశెట్టి 4) శ్రీనాథుడు
34. రెడ్డిరాజుల కులదేవత పేరేమిటి?
    1) విద్యాదేవి 2) మూల గూరమ్మ
    3) కాకతి 4) దుర్గాదేవి
35. శ్రీనాథ మహాకవి ఏ రెడ్డిరాజు ఆస్థానంలో ‘విద్యాధికారిగా’ పనిచేశాడు?
    1) ప్రోలయవేమారెడ్డి
    2) పెదకోమటి వేమారెడ్డి
    3) రాచవేమారెడ్డి 4) కాటయ వేమారెడ్డి
36. ‘లకుమాదేవి’ అనే నాట్యగత్తె ఏ రెడ్డిరాజు కొలువులో ఉండేది? (గ్రూప్-2, 2011)
    1) పెదకోమటి వేమారెడ్డి
    2) కుమారగిరి రెడ్డి
    3) కాటయ వేమారెడ్డి
    4) రాచ వేమారెడ్డి
37. ‘వేమభూపాల చరితం’ అనే చారిత్రక గ్రంథ రచయిత ఎవరు?
    1) వామన భట్టబాణుడు
    2) శ్రీనాథుడు
    3) పోతన 4) గౌరన
38. ‘సింహాసన ద్వాత్రింశిక’ రచయిత ఎవరు?
    1) అనంతామాత్యుడు 2) మల్లన
    3) కొరవి గోపరాజు 4) కొమ్మన
39. ‘భోగినీ దండకం’, ‘వీరభద్ర విజయం’ గ్రంథాల రచయిత ఎవరు? (గ్రూప్-2, 2011)
    1) పోతనామాత్యుడు 2) శ్రీనాథుడు
    3) విశ్వేశ్వర కవి 4) ఎర్రాప్రెగడ
40. రెడ్డిరాజుల కాలంలో ‘భూమిని’ దేనితో కొలిచేవారు?
    1) దారం 2) కేసరపాటి గడ
    3) ఇనుప గొలుసు 4) కాళ్ల అడుగులు
41. తెలంగాణలో అనపోత సముద్రం, రాయ సముద్రం, నాగ సముద్రం అనే చెరువులను ఎవరికాలంలో తవ్వించారు?
    1) రేచర్ల పద్మనాయకులు
    2) కాకతీయులు 3) రెడ్డి రాజులు
    4) విజయనగర రాజులు
42. నీటి పారుదల సౌకర్యార్థం ‘సంతాన సాగరం’ అనే పెద్ద తటాకం, జగనొబ్బగండ కాల్వలను ఎవరు నిర్మించారు?
    1) కాకతీయులు
    2) విజయనగర రాజులు
    3) కుతుబ్‌షాహీలు 4) రెడ్డిరాజులు
43. ‘సర్వమాన్యములు’ అంటే ఏమిటి?
    1) రాచభూములు
    2) పన్నులు లేని భూములు
    3) దేవాలయ భూములు
    4) సామంతుల భూములు
44. ‘మాచల్దేవి’ ఏ తెలుగు సాహిత్య గ్రంథంలోని పాత్ర? (గ్రూప్-1, 1995)
    1) భాగవతం 2) క్రీడాభిరామం
    3) రంగనాథ రామాయణం
    4) హరివంశం
45. ‘జైమినీ భారతం’ గ్రంథకర్త ఎవరు? (గ్రూప్-2, 2000)
    1) తిక్కన 2) ఎర్రాప్రెగడ
    3) శ్రీనాథుడు
    4) పిల్లలమర్రి పినవీరభద్రుడు
46. తెలంగాణలో ‘నవబ్రహ్మ ఆలయాలు’ ఎక్కడ ఉన్నాయి? (గ్రూప్-1, 2003)
    1) పానగల్లు 2) వేములవాడ
    3) యాదగిరి గుట్ట 4) అలంపురం
47. పశ్చిమ చాళుక్యులు నిర్మించిన దేవాలయాలు తెలంగాణలో ఎక్కడ ఉన్నాయి? (గ్రూప్-1, 2004)
    1) వేములవాడ 2) ఓరుగల్లు
    3) అలంపురం 4) పిల్లలమర్రి
48. కిందివాటిలో సరికాని జత ఏది? (గ్రూప్-1, 2004)
    1) నన్నెచోడుడు-కుమార సంభవం
    2) సోమనాథుడు-పండితారాధ్య చరిత్ర
    3) వేములవాడ భీమకవి-బసవ పురాణం
    4) మల్లికార్జున పండితారాధ్యుడు-శివతత్వసారం
49. 1182లో జరిగిన పల్నాటి యుద్ధంలో నలగాముడికి సహాయంగా పల్నాడుకు సైన్యాన్ని పంపిన కాకతీయ చక్రవర్తి?
    1) రుద్రమదేవి 2) ప్రతాపరుద్రుడు
    3) రుద్రదేవుడు 4) గణపతిదేవుడు
50. ‘ఆంధ్ర సురత్రాణ’ అనేది ఎవరి సుప్రసిద్ధ బిరుదు? (గ్రూప్-2, 2011)
    1) ప్రోలయనాయకుడు
    2) అనవేమారెడ్డి
    3) కాపయనాయకుడు 4) గన్నయ
51. ఎర్రాప్రెగడ ఎవరి ఆస్థానంలో విద్యాధి కారి? (గ్రూప్-2, 2011)
    1) అల్లాడరెడ్డి 2) అనవేమారెడ్డి
    3) ప్రోలయవేమారెడ్డి 4) అనపోతారెడ్డి
52. కాకతీయ రాజ్యంలో ముఖ్యమైన ఓడరేవు ఏది? (గ్రూప్-2, 2011)
    1) నెల్లూరు 2) మచిలీపట్నం
    3) మోటుపల్లి 4) ధరణికోట
53. రుద్రమదేవి పాలనాకాలంలో ఆంధ్రదేశాన్ని సందర్శించిన విదేశీ యాత్రికుడు? (గ్రూప్-2, 2011)
    1) డొమింగో పేస్ 2) నికోలోకోంటి
    3) మార్కోపోలో 4) జోర్దానస్
54. హన్మకొండలోని వేయిస్తంభాల గుడి ఎవరి పోషణలో నిర్మితమైంది? (గ్రూప్-2, 2011)
    1) రుద్రదేవుడు 2) రుద్రమదేవి
    3) గణపతి దేవుడు 4) ప్రతాపరుద్రుడు
55. తొలితరం కాకతీయ పాలకులు పోషించిన మతం ఏది? (గ్రూప్-2, 2011)
    1) జైనం 2) శైవం
    3) బౌద్ధం 4) వైష్ణవం
56. హన్మకొండ వేయి స్తంభాలగుడి, ఓరుగల్లు దుర్గం, ఏకశిలానగరాలకు పునాది వేసిన కాకతీయ రాజు ఎవరు?
    1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
    3) రుద్రమదేవి 4) రుద్రదేవుడు
57. సేనాధిపతి రేచర్ల రుద్రుడు ప్రసిద్ధిగాంచిన ‘రామప్ప దేవాలయాన్ని’ ఏ కాకతీయ రాజు కాలంలో నిర్మించాడు?
    1) ప్రోలరాజు 2) గణపతిదేవుడు
    3) ప్రతాపరుద్రుడు 4) రుద్రదేవుడు
58. రాజధానిని హన్మకొండ నుంచి ఓరుగల్లుకు మార్చిన కాకతీయ రాజు ఎవరు?
    1) ప్రతాపరుద్రుడు 2) రుద్ర దేవుడు
    3) గణపతిదేవుడు 4) రుద్రమదేవి

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2; 4) 1; 5) 3; 6) 2; 7) 3; 8) 4; 9) 4; 10) 2; 11) 4; 12) 2; 13) 2; 14) 3; 15) 4; 16) 2; 17) 3; 18) 4; 19) 2; 20) 3; 21) 1; 22) 1; 23) 3; 24) 2; 25) 4; 26) 3; 27) 1; 28) 4; 29) 3; 30) 3; 31) 2; 32) 1; 33) 3; 34) 2; 35) 2; 36) 2; 37) 1; 38) 3; 39) 1; 40) 2; 41) 1; 42) 4; 43) 2; 44) 2; 45) 4; 46) 4; 47) 3; 48) 3; 49) 3; 50) 3; 51) 3; 52) 3; 53) 3; 54) 1; 55) 1; 56) 4; 57) 2; 58) 3.

Number of messages used per person?



BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The number of people (1)/ who fail each year (2)/ is now in (3)/ single figure. (4)/ no error (5)
2. The experiments (1)/ were carried out (2)/ under simulation (3)/ examination conditions. (4)/ no error (5)
3. The game will be (1)/ broadcasted (2)/ simultaneously (3)/ on TV and radio. (4)/ no error (5)
4. He seemed sincere (1)/ enough when (2)/ he said he (3)/ wants to help. (4)/ no error (5)
5. My teaching style (1)/ is similar (2)/ to that of most (3)/ other teacher. (4)/ no error (5)
6. A report showing (1)/ the company's current situation shows (2)/ how people are influenced by (3)/ TV advertisements. (4)/ no error (5)
7. Market research has shown (1)/ us people want quality, (2)/ not just (3)/ low prices. (4)/ no error (5)
8. Candidates which are (1)/ shortlisted for interview (2)/ will be contacted by the end (3)/ of the week. (4)/ no error (5)
9. If I was asked (1)/ to work (2)/ on Sundays, (3)/ I should resign. (4)/ no error (5)
10. Though many companies know the fact (1)/ that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ no error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. In order that training should be ______ it must be planned ______.
    1) affected…thoroughly
    2) affective…periodically
    3) executed…properly
    4) effective…systematically
    5) complete…beforehand
12. Terrorist groups ______ responsibility for the shootings and bomb ______.
    1) charged…blasts
    2) levied…plants
    3) claimed…attacks
    4) withdraw…pits
    5) involved…calls
13. She is very ______ to other people's feelings.
    1) sensible 2) sensibility
    3) sensation 4) sensitive
    5) sensitize
14. Paying children too much ______ when they misbehave can be self ______.
    1) pampering…appealing
    2) negligence…destruction
    3) attention…defeating
    4) care…appease
    5) love…developing
15. Market researches often segment the population on the ______ of age and ______ class.
    1) grade…economy
    2) rate…affluent
    3) unit…security
    4) track…wealthy
    5) basis…social

Directions (Q. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) If you knew the improved card deal is better than other cards you have, you may want to consider keeping it and cancelling the other card instead. Otherwise, cancel the card that you had decided to give up.

B) The first step in cancelling a card is to contact the card issuer. Some issuers let you cancel an account by phone. You may be transferred to a customer care officer who will try to convince you to keep the card.

C) Be sure to ask your issuer to record that the account was "closed at customer's request."

D) Make a note of the day and time you called and the person you talked to for your records. A written confirmation that an account has been closed should be sent to you from the card issuer.

E) Go ahead and listen. They may be willing to lower your interest rate, waive an annual fee or upgrade your card. Some issues have been known to offer plane tickets or travel vouchers to customers who want to cancel a card.

F) Keep this notice carefully for your records. If anything goes wrong with the account at a later date, you've got proof that you closed it.

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions: (Q. 21 - 25): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. We are concrete seeking new ways of expanding our membership.
    1) evidence 2) fastly
    3) purposely 4) currently
    5) no correction required
22. Rumours that he have flown from the country were promptly scotched by his wife.
    1) had to flow 2) had been flew
    3) had fled
    4) had been flowing
    5) no correction required
23. Coal is a natural resource, which constitutes approximately 85% of the total fossil fuel reservation in the world.
    1) reserves 2) reserved
    3) reserve 4) reserving
    5) no correction required
24. Even among the native users of English, plain and direct language is regarded as a virtue in communication.
    1) between a native
    2) between an native
    3) among a native
    4) among nativity
    5) no correction required
25. Professional person at the work place frequently dealing in material which he must understand and also remember for future use.
    1) dealt with material
    2) deal in material
    3) deals with materials
    4) deal among materials
    5) no correction required

Directions (Q. 26 - 30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

The first commercial SMS message was sent over the Vodafone GSM network in the United Kingdom on 3 December 1992, from Neil Papworth of Sema Group to Richard Jarvis of Vodafone. The text of the message was "Merry Christmas." The first SMS typed on a GSM phone is claimed to have been sent by Riku Pihkonen, an engineer student at Nokia in 1993.

Initial growth was slow, with customers in 1995 sending on an average only 0.4 messages per GSM customer per month. By the end of 2000, the average number of messages per user reached 35.

Short message services are developing very rapidly throughout the world. In 2000, just 17 billion SMS messages were sent; in 2001 the number was up to 250 billion and 500 billion SMS messages in 2004. At an average cost of USD 0.10 per message, this generates revenues in excess of $50 billion for mobile telephone operators and represents close to 100 text messages for every person in the world.

SMS is particularly popular in Europe, Asia - excluding Japan, Australia and New Zealand. Popularity has grown to a sufficient extent that the term texting has entered the common **lexicon.** In China, SMS is very popular, and has brought service providers significant profit; it is also a very influential and powerful tool in the Philippines, where the average user sends 10-12 text messages a day. The Philippines alone sends on the average 400 million text messages a day, more than the annual average SMS volume of countries in Europe, and even China. SMS is hugely popular in India, where youngsters often exchange lots of text messages, and companies provide alerts, infotainment, news, cricket scores, railway/airline booking, mobile billing and banking services on SMS. In India, metropolitan media outlets often take real-time polls and audience opinion through SMS, via reserved 4-digit numbers that redirect the information to the respective aforementioned outlets based on designated prefix codes.

26. The Asian country where SMS is not very popular is
    1) Philippines 2) Japan
    3) Australia 4) China
    5) Europe
27. The number of messages that an average user sends in the Philippines is
    1) more than the annual average SMS volume of countries in Europe, and even China
    2) more than the annual average SMS volume of countries in India, and even China
    3) more than the annual average SMS volume of countries in Europe, Australia and even China
    4) more than or equal to the annual average SMS volume of countries in Europe, and even China
    5) less than the annual average SMS volume of countries in Europe, and even China
28. Services provided by SMS to Indian users include
    1) emergency services
    2) fire services 3) mobile billing
    4) 108 services 5) counseling
29. Average number of messages used per person
    1) 10-12 messages a day
    2) 400 million text messages a day
    3) 100 text messages
    4) 500 messages
    5) 2000 messages per day
30. Lexicon means
    1) glossary 2) glossy
    3) lustrous 4) inventory
    5) catalog

Key

1) 4	2) 3	3) 2	4) 4
5) 4	6) 5	7) 2	8) 1
9) 1	10) 3	11) 4	12) 3
13) 4	14) 3	15) 5	16) 5
17) 5	18) 2	19) 1	20) 1
21) 4	22) 3	23) 1	24) 5
25) 3	26) 2	27) 1	28) 3
29) 1	30) 1		